# గొల్లపూడి కాలమ్ 2011

## – గొల్లపూడి మారుతీరావు



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 94

# Index

(Jan 03,2011) Three Stories మూడుకథలు ........ 4
(Jan 10,2011) Manavudu..మానవుడు... మానవుడు.... ........ 6
(Jan 17,2011) NR Chandur చందూర్ స్మృత........ 8
(Jan 24,2011) Adarsa Avineethi ఆదర్శ అవినీతి ........ 10
(Jan 31, 2011) Padma Trayam 'పద్మ 'త్రయం........ 12
(Feb 07,2011) Ayyo Magallu **అయ్యో మగాళ్ళు** ........ 14
(Feb 14,2011) Neecha Naayakulu నీచనాయకులు ........ 16
(Feb 21, 2011) Peda Melodrama **పేద మెలోడ్రామా** ........ 18
(Feb 28,2011) Iddaru peddalu – Oka nivali ఇద్దరు పెద్దలు ఒక నివాళి........ 20
(March 07, 2011) Chaavu Hakku – 'చావు' హక్కు........ 22
(March 14,2011) Neethi Avineethi నీతి – అవినీతి ........ 25
(March 21, 2011) Cell is hell సెల్ ఈజ్ హెల్ ........ 27
(March 28,2011) Desa Seva దేశసేవ ........ 31
(April 04, 2011) Kaalam gurinchina kaalam కాలం గురించి ' కాలమ్'........ 33
(April 11, 2011) Anna..Aha.Ahaha..అన్నా..ఆహా..ఆహాహా. ........ 35
(April 18,2011) O Gundayya Katha ఓ గుండయ్య కథ........ 37
(April 25,2011) Avineethiki Godugu అవినీతికి గొడుగు ........ 39
(May 02, 2011) Kukkamuthi Pindelu కుక్కమూతి పిందెలు ........ 41

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

(May 09, 2011) Thotikodalu Navvimdi తోటికోడలు నవ్వింది ........ 43

(May 16,2011) Cheekatloki Prayanam చీకట్లోకి ప్రయాణం ........ 45

(May 23,2011) Paapam పాపం ........ 47

(May 30,2011) Bhaktimaargalu భక్తిమార్గాలు ........ 49

(June 06, 2011) Kalmadiki Borukodutondi కల్మాడీకి బోరుకొడుతోంది ........ 51

(June 08, 2011) Brahma Muhurtam బ్రహ్మముహూర్తం ........ 53

(June 13, 2011) Vayassuni Jayimchina Vallu వయస్సుని జయించినవాళ్ళు ........ 55

(June 20, 2011) Punya Dongalu పుణ్య దొంగలు ........ 57

(June 27,2011) Asupatriki Trova Etu ఆసుపత్రికి తోవ ఎటు? ........ 59

(July 04, 2011) Devudiki Jvaramoccimdi దేవుడికి జ్వరమొచ్చింది ........ 61

(July 11,2011) A Rare Evening ఓ అరుదయిన సాయంకాలం ........ 64

(July 18, 2011)America Karma Siddhantam అమెరికా కర్మ సిద్ధాంతం ........ 68

(July 25,2011) Dourjanyakaraulaku Lekha దౌర్జన్యకారులకు లేఖ ........ 71

(August 1, 2011) Dementia డిమెన్షియా ........ 73

(August 8,2011) Sense of Humor సెన్స్ ఆఫ్ హ్యూమర్ ........ 75

(August 15,2011) Mushti Pettanam ముష్టి పెత్తనం ........ 77

(August 22, 2011) Anna Venuka Manishi అన్నా వెనుక మనిషి ........ 79

(August 29,2011) Maro Leader Katha మరో 'లీడర్'కథ ........ 81

(September 5, 2011) Chaavu Telivi, 'చావు'తెలివి ........ 84

(September 12, 2011) Mayapradesh , 'మాయా' ప్రదేశ్ ........ 86

(September 19, 2011) Adhikaram Ahankaram అధికారం అహంకారం ........ 88





(September 26,2011) Oka Keerthi Seshuralu ఒక 'కీర్తి ' శేషురాలు ........ 90

(October 03, 2011) Chttaniki Gajulu చట్టానికి గాజులు ........ 92

(October 10,2011) Mexico Mark Pellillu మెక్సికో మార్కు పెళ్ళిళ్ళు ........ 94

(October 17,2011) Majority Raajakeeyalu మెజారిటీ రాజకీయాలు ........ 96

(October 24,2011) Cheppudu Maata చెప్పుడు మాట ........ 99

(October 31,2011) Mitrulu Avasarala మిత్రులు అవసరాల ........ 101

(November 07,2011) Karnuni Parivedana **కర్ణుని పరివేదన** ........ 103

(November 14,2011) Kadupu Chinchukunte కడుపు చించుకుంటే ........ 105

(November 21, 2011) Devadutalaku Ahvanam దేవదూతలకు ఆహ్వానం ........ 107

(November 28,2011) Nijam Vaddu-Abaddham Muddu నిజం వద్దు – అబద్ధం ముద్దు ........ 109

(December 05,2011) Oka Edupu Katha ఒక 'ఏడుపు ' కథ ........ 111

(December 12,2011) Swecha స్వేచ్ఛ ........ 113

(December 19,2011) Mulla Periyar Bhagotam 'ముల్ల' పెరియార్ భాగోతం ........ 115

(December 26,2011) Vyakti Vyavastha వ్యక్తి – వ్యవస్థ ........ 117





# (Jan 03,2011) Three Stories మూడుకథలు

ప్రతీ ఏడూ ఆఖరి రోజుల్లో పత్రికలకీ, టీవీ ఛానళ్ళకీ ఓ వార్షికం ఉంది. ఈ సంవత్సరంలో జరిగిన గొప్ప విషయాలూ, గొప్ప అరిష్టాలూ, గొప్ప అవినీతులూ, గొప్ప హత్యలూ, గొప్ప మోసాలూ – ఇలా మరోసారి అన్నిటినీ తలుచుకుని 'అయ్యో ' అనో 'ఆహా! ' అనుకుని కొత్త సంవత్సరంలోకి అడుగు పెట్టడం రివాజు.

నాకేమో మూడే మూడు కథలు చెప్పాలని ఉంది. కెనడాలో 24 ఏళ్ళ చక్కని క్రీడాకారిణి ఉంది. పేరు జోన్ రోసెట్. ఐస్ మీద స్కేటింగ్ చేస్తుంది. ఈ పిల్ల వాంకోవర్ (కెనడా)లో జరిగే చలికాలపు ఒలంపిక్ పోటీల్లో పాల్గొననుంది. వారం రోజుల ముందు వాళ్ళమ్మకి ఫోన్ చేసింది. "నువ్వు తప్పకుండా బహుమతి గెలుస్తావు. వేదిక ఎక్కి గర్వంగా పతకాన్ని పుచ్చుకుంటావు" అంది తల్లి. పీటీ నాలుగు రోజులుందనగా 55 ఏళ్ళ తల్లి గుండెనొప్పితో కన్ను మూసింది. రోసెట్ గుండె పగిలింది. కళ్ళ ముందు కల చెదిరింది. కాని వేలమంది అభిమానులూ, మిత్రులూ ఆమె భుజం తట్టారు. "మీ అమ్మ దీవెన నిజం చెయ్యి" అని. రోసెట్ పీటీలో పాల్గొంది. మూడో బహుమతి – కంచు పతకం గెలుచుకుంది. ఒక టీవీ ఛానల్ అన్నది – నిజానికి అది కంచు కాదు – ప్లాటినం అని.

గుండెని ఛిన్నాభిన్నం చేయగల అంతటి విషాదంలోంచి ప్రపంచ స్థాయిలో పోటీ చేసి ఏకాగ్రతతో, విశ్వాసంతో, ఆత్మస్థైర్యంతో మూడో స్థానంలో నిలబడగలగడమే ఏ దేశపు భగవద్గీత అయినా చెప్పగలిగేది. మానవ చిత్తశుద్ధి, కార్యదక్షతలో ఔన్నత్యానికి ఈ విజయం ప్రతీక. ఒక గొప్ప విషాదాన్ని ఒక గొప్ప విజయానికి సంధించగల గుండె దిటవు మానవాళి ఆదర్శాన్ని పతాక స్థాయిలో నిలుపుతుంది. అది రోసెట్ సాధించిన విజయం. జోన్ రోసెట్ సౌందర్యాన్ని మీరు కంప్యూటర్లో చూడవచ్చు. అద్భుతమైన శారీరక సౌందర్యాన్ని ధిక్కరించే పారమార్థిక ఔన్నత్యం ఆ అమ్మాయిలో ద్యోతకమౌతుంది.

★★★★★★★★★★★★

రెండో కథ ఆకాశం మీదనుంచి నేలమీదకి – ఇంకా చెప్పాలంటే పాతాళానికి జారిపోయే కథ. ఈ దేశంలో ఘనత వహించిన అవినీతి కథ. ఈ మధ్య ప్రభుత్వాల కంటే టీవీ ఛానళ్ళు – నిజమైన కారణాలకే – అవినీతికి జుత్తు పీక్కుంటున్నాయి. అలా పీకగా పీకగా – రుజువులతో, దాడులతో ముందుకు సాగిన రెండు అవినీతులున్నాయి. ఒకటి చిన్న చేప – సురేష్ కల్మాడీ గారిది ('చిన్న ' అనడానికి కారణం – పక్కనున్న పెద్ద గీత). ఈయనది 17 వేల కోట్ల అవినీతి. పెద్ద చేప – రాజాగారిది లక్షా డెబ్బై ఆరు వేల కోట్ల అవినీతిది. మొన్న రాత్రి అన్ని పత్రికలూ, ఛానళ్ళూ ఈ కథల్ని ఉదారంగా వక్కాణించాయి. కాని నాకు అర్ధంకాని విషయమేమిటంటే – కల్మాడీగారు చేసింది నిజంగా అవినీతి అయితే, ఆయన చుట్టూ ఉన్న ఉద్యోగులూ, సహచరులూ జైళ్ళకు వెళితే కల్మాడీగారు ఎందుకు వెళ్ళలేదా అని. అలాగే 2జీ స్కాంలో అందరూ దాదాపు వీధిన పడితే – రాజాగారు మాత్రం మద్రాసు ఆసుపత్రిలో థైరాయిడ్ చికిత్స చేసుకుంటూ సుఖపడుతున్నారెందుకని?



మన దేశంలో ఎందరో సీజరు పెళ్ళాలున్నారు. పార్టీకో సీజరు. మద్రాసులో ఓ సీజరు, బొంబాయిలో ఓ సీజరు, ఢిల్లీలో ఓ సీజరు. వారి వారి పెళ్ళాల వీరంగం, చిరునవ్వులు చూసి మురిసిపోయే 'అలవాటు 'ని చేసుకోవడమే ఈ పాత సంవత్సరం మనకు చేసిన గొప్ప అలవాటు.

★★★★★★★★★★★★★

మూడో కథ – నాకు మరింత ఇష్టమయినది. వికీలీక్స్ ఈ మధ్య ప్రపంచమంతా ప్రాచుర్యాన్ని, సంచలనాన్నీ సృష్టించింది కాని – నేను ఆ విధమయిన బట్టబయలుని వ్యతిరేకిస్తున్నాను. నేనెప్పుడో రాసిన 'నిజం నిద్రపోయింది ' నాటిక ఇతివృత్తం ఇదే. మనసు లోతుల్ని విప్పితే – విప్పిన సందర్భాలు బట్టబయలయితే – పెళ్ళాం పిప్పి పన్ను, స్నేహితుడి బద్దకం కారణాలుగా మనుషులు విడిపోతారు. ఈ ప్రపంచంలో సహజమయిన బాంధవ్యాలు ఉండవు – అని. నలుగురూ అర్థం చేసుకునే, అంగీకరించే నిర్ణయాలు తీసుకునే ముందు ఏకాంతంగా నాయకులు 'లజ్జు గుజ్జులు ' పడడాన్ని వీధ్ధిన పెట్టడం అన్యాయం. అనవసరం. గాంధీగారి రోజుల్లో వికీలీక్స్ ఉంటే "ఈ ముసలాడు (గాంధీ) మన దుంపతెంచుతున్నాడయ్యా – మాట్లాడితే నిరాహార దీక్ష అంటాడు. అసలు పనులు మానేసి ఆయన వెనుక నిమ్మరసం పట్టుకు తిరగాల్సి వస్తోంది" అని నెహ్రూగారు, పటేల్గారూ ఏ బలహీనమయిన క్షణంలోనో ఏకాంతంగానయినా అనుకుని ఉంటారు. శ్రీకృష్ణుడు అవతార పురుషుడు అనే కాలంలోని ఆయన్ని రోజూ బండబూతులు తిట్టే శిశుపాలుడు, చంపాలనుకున్న కంసుడూ ఉన్నారు. గాంధీగారిని ఒకాయన చంపనే చంపాడు.

ఇంతకీ నన్నాకర్షించిన కథ. మన యువరాజుగారు – ముందు ముందు ఈ దేశానికి ప్రధాని కావడానికి అన్ని హంగుల్నీ సంతరించుకుంటున్న రాహుల్ గారు అమెరికా రాయబారితో మాట్లాడుతూ "ఈ దేశంలో ముస్లిం దౌర్జన్యకారులకంటే హిందూ దౌర్జన్యకారులవల్ల వల్ల ఎక్కువ ప్రమాదం ఉంద"నడం. అయితే అంతకు ముందు యువరాజుగారు హిందూ వైభవాన్నీ, స్వామి వివేకానంద, అరవిందుల గురించి మాట్లాడేవుంటారు. అసాంజేకి ఆ పేర్లు అర్థంగాక రాసి ఉండడు.

ఏతావాతా 'ఇటలీ ' రక్తం ఉంది. వారి అమ్మ స్థాయిలో 'హిందూ ' నేపథ్యానికి అవగాహన పెరిగి ఉండదు. యువరాజుగారన్నారుగాని, ఇన్ని అనర్థాలు మనచుట్టూ జరుగుతున్నా ఈ దేశంలో ఒక్కరు – ఒక్కరు – 'ముస్లిం ' దౌర్జన్యం అంటూ విమర్శించలేదు. కాగా ఒక అబ్దుల్ కలాం, ఒక ఉస్తాద్ అంజాద్ అలీఖాన్, ఒక జహీర్ ఖాన్, ఒక దిలీప్ కుమార్ లను చూసి మనం గర్వపడతాం. ఇంకా ఆఫ్ఘనిస్థాన్లో, ఇంగ్లండులో, పాకిస్థాన్లో, పార్లమెంటు బయట, అక్షరధాం దగ్గర గోద్రాలో, బొంబాయిలో జరిగిన ఉదంతాల 'కథ 'కి ప్రత్యేకమయిన వ్యాఖ్యానాలు ఎవరూ చెయ్యనక్కరలేదు.

ఒక్కటే భయం. ఈ దేశం ఆలోచనా సరళి మీద, సంస్కృతి వైభవం మీద, విశాల దృక్పథం మీద సరైన అవగాహన లేని యువరాజుగారు – కేవలం మెజారిటీ పుణ్యమా అంటూ ఈ దేశపు ప్రధాని అయితే బొత్తిగా పరిపాలన అనుభవమూ, అన్వయమూ చాలని చేతుల్లోకి – ఈ దేశపు భవిష్యత్తు ఇరుక్కుంటుందేమోనని – ఈ సంవత్సరంలో నాకనిపించిన భయం. (ఈ వాక్యాలు రాసినప్పుడు – నా ఆలోచనల్ని కామెర్లరోగి రంగులాగ చాలామంది తోసిపారేయవచ్చు. నేను భారతీయ జనతా పార్టీ సభ్యుడినీ, విశ్వహిందూ పరిషత్ సభ్యుడినీ, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సభ్యుడిని కానని, ఆ సంస్థలతో నాకేమీ సంబంధం లేదని చెప్పడం వల్ల నా భయానికి కాస్త బరువుంటుందని మనవి చేస్తున్నాను.)

(జనవరి 3, 2011)




# (Jan 10,2011) Manavudu..మానవుడు... మానవుడు....

ఈ మధ్య నన్నో మిత్రుడు అడిగాడు: ఏమండీ, ఈ సృష్టిలోంచి త్వరలో పులి మాయమవుతోంది కదా? అలాంటి పరిస్థితి మనిషికి వస్తుందా? అని. సమాధానమే ఈ కాలం. "వస్తుంది బాబూ వస్తుంది" అనాలో "వస్తోంది బాబూ వస్తోంది" అనాలో "వచ్చేసింది బాబూ వచ్చేసింది" అనాలో తెలియడం లేదు. అంతే తేడా. అయితే 'ఈ ప్రకృతి ఊహించినంత ఆలశ్యంగా కాదు.' మానవుడి చేతలకు 'ఊహించనంత తొందరగా ' అని చెప్పుకోవాలి.

ప్రకృతి పరిణామాలను గురించి మాట్లాడేటప్పుడు సంవత్సరాలు చాలా అర్ధం లేని కొలతలు. కొన్ని కోట్ల సంవత్సరాల కిందట ఈ గ్రహం అగ్నిపర్వతాలతో, లావాతో, పగుళ్ళు చూపిన భూమితో, బొగ్గుపులుసు వాయువుతో నిండి ఉండేది. 'ప్రాణి ' అన్న ఆలోచన ప్రమేయమే లేదు. ఎక్కడా ప్రాణవాయువు లేదు. మనిషి మనుగడ దాదాపు రెండు లక్షల సంవత్సరాల కిందటి కథ. కొన్ని వేల సంవత్సరాలు సూర్యరశ్మికి ఈ భూమి ఉపరితలం రగిలి – అక్కడా అక్కడా ఉన్న నీటి తేమ కరిగి – సూర్యుని వేడికి ఆవిరి అయి, వర్షించి భూమి పొరల్లో ఎక్కడో విచిత్రంగా ఆక్సిజన్ చాయలు బయటపడి– ఇలా – ఈ గ్రహం మీద ప్రాణి ఉనికి ఓ అద్భుతం. (యాన్ ఆర్ధస్ బెర్రాటండ్ అద్భుతమైన చిత్రాన్ని 'హోం ' అనే పేరిట నిర్మించాడు.)

వటపత్రశాయి, నోవా ఆర్క్ కథల్ని ఒక్క క్షణం పక్కన పెట్టి సహేతుకంగా ఈ సృష్టిని అర్ధం చేసుకోడానికి ప్రయత్నిస్తే – ఈ సృష్టిలో ఏ ప్రాణికీ స్వతంత్రమైన ప్రతిపత్తిలేదు. ప్రతీ ప్రాణీ మరొక ప్రాణితో సహజీవనం చెయ్యడమే ఈ సృష్టి రహస్యం. (ఈ సత్యాన్ని మన మతమూ,వేదమూ చెపుతుంది – తెలుసుకోగోరిన వారికి – అది వేరే విషయం.)

గాలిలో ఎగిరే పక్షికీ, నేలలో పాకే సూక్ష్మజీవికీ, మనకీ అద్భుతమైన సయోధ్య ఉంది. స్వామి పార్ధసారధి ఓ చక్కని మాటని చెపుతారు. ఈ సృష్టిలో ప్రతీ ప్రాణికీ వివేచన (intellect) ఉంటుంది. కాని మానవుడు అభ్యాసంతో అలవరచుకునేది ఒకటుంది. వివేకం (intelligence). పులిని చూడగానే లేడిపిల్ల ఆగిపోతుంది – ప్రాణభయం ఉన్నదని, తప్పించుకునే ప్రయత్నం చేస్తుంది. వివేచన, మనిషికి వివేకం ఉంది. తుపాకీ తీస్తాడా, పరుగున వెళ్ళి జీపు ఎక్కుతాడా? వేసిన 'మాటు ' వేపుకి పులిని మళ్ళిస్తాడా? ఏమో. అడివిలో సింహం దున్నని చంపుతుంది. తినగా మిగిలిన అవశేషాల్ని నక్కలు, దుమ్ముల గొండి జంతువులు తింటాయి. మిగిలిన అవశేషాల్ని రాబందులు తింటాయి. ఇంకా మిగిలిన దాన్ని భూమిలో సూక్ష్మ క్రిములు భుజిస్తాయి. కొంతకాలానికి ఆ దున్న అవశేషం కనిపించదు. కొన్ని జంతువుల్ని Scavengers అన్నారు. అక్కరలేని వస్తువులోంచి తమకి కావలసినది వెదుక్కునే ప్రాణులు. అడివిలో ఏ సింహం – ఆకలి లేనప్పుడు – సరదాకి – కేవలం సరదాకి పదిలేళ్ళని చంపదు. ఆ పని 'వేట ' రూపేణా మనిషి చేస్తాడు. అది చరిత్ర. అది మనిషికి వినోదం. అంటే ఊసుపోవడానికి పరాయి ప్రాణిని హింసించే క్రీడ. అడివిలో ఏ జంతువూ ఏనుగు జోలికి పోదు. నిజానికి పోలేదు. "గ్రాసం లేక స్రుక్కిన జరాకృశమైన.." అని ఏనుగు కుంభస్థలాన్ని కొట్టి సింహం భుజిస్తుందన్నది – సాధారణంగా ఉత్ప్రేక్ష. ఏ జంతువూ ఏనుగు జోలికి పోవడానికి సాహసించవు. కాని వాటిని చంపి – దంతాన్ని వాడుకోవచ్చుననే ప్రలోభం, దుర్మార్గమయిన ఆలోచన ఉన్న ప్రాణి ఏది? మానవుడు. మంచి ఉదాహరణ వీరప్పన్. కొన్ని వందల ఏనుగుల్ని చంపిన వీరుడు మన వీరప్పన్. సృష్టిలో ప్రతి జంతువుకీ – కేవలం వివేచన కారణంగా – ఒక అద్భుతమైన క్రమశిక్షణ ఉంది. ఇది కోట్ల సంవత్సరాలలో వరస తప్పకుండా ఈ సృష్టిలో జరిగే అద్భుతమైన పరిభ్రమణం. "నెలకి మూడు వర్షమ్ములు కురియుచున్నవా?" అన్న కవుల పాట పాత రోజుల మాట. ఇప్పుడు

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

మూడు సంవత్సరాలకి ఒక్కసారయినా వర్షం కురియదు. కరువు కాటకాలు, త్సునామీలు మనకి మామూలు సంఘటనలు. హిమాలయాలు కరిగిపోతున్నాయి. ఉత్తర ధ్రువంలో మంచు నీరయిపోతోంది. సముద్ర మట్టం పెరుగుతోంది. రుతువుల క్రమశిక్షణ మృగ్యమయింది. విచిత్రమేమిటంటే – లక్షల సంవత్సరాలుగా పుట్టి చస్తున్న పురుగులకీ, జంతువులకీ ఈ విషయం తెలీదు. వాటికి విచిత్రమైన క్రమశిక్షణతో బ్రతకడమే తెలుసు. విశేషం – మానవుడికి తెలుసు. అతనికి ఆలోచన ఉంది. అవగాహన ఉంది. చంద్రమండలానికి దూకే మేధస్సు ఉంది. కొన్ని వందల సంవత్సరాలుగా సముద్రంలోని ప్రాణులను కాపాడే 'రీఫ్ 'లను ధ్వంసం చేస్తే ఏమవుతుందో తెలుసుకునే తెలివితేటలున్నాయి. కాని తెలిసి తెలిసి ధ్వంసం చేసే ఆత్మవంచన ఉంది.

తన ఉనికి ఈ సృష్టిలో అంతం కాబోతోందని పులికి తెలియదు. కాని తన ఉనికిని ప్రతీ క్షణం కురుచ చేసుకుంటున్న విషయం మానవుడికి తెలుసు. ఎంత విచిత్రం! భస్మాసురుడి కథ మనం పురాణాల్లో చదివాం. తన చేతిని తన నెత్తిమీదే పెట్టి నాశనమయిన 'అసురుడి ' కథ. ఇప్పుడు మానవుడు అక్షరాలా 'తెలిసి ' ఆ పనే చేస్తున్నాడు.

ప్రస్తుతం మానవుడి మేధస్సు కారణంగా – ఇంకా చెప్పాలంటే ఆత్మవంచన, స్వార్ధం, మూర్ఖత్వం కారణంగా పులి మాత్రమే కాదు – సాలీనా 50 వేల రకాల ప్రాణులు ఈ సృష్టిలో మాయమవుతున్నాయి. కాస్త ఊపిరి బిగపట్టండి. రోజుకి 137 రకాల ప్రాణులు సమసిపోతున్నాయి. ఈ వేగం – మామూలు ధోరణికన్నా వెయ్యి రెట్ల వేగం. ఈ లెక్కన – పులి దారిలోనే మానవుడి వెళ్ళడానికి 'తెలిసి తెలిసి ' వేగాన్ని పెంచుకుంటున్నాడు. తన మానాన తనని వదిలితే పులి మరో 20 లక్షల ఏళ్ళు బతికేదేమో. తెలియదు. కాని ఒక్కటి మాత్రం తెలుసు. ఈ సృష్టికి పట్టిన పెద్ద చీడ – మానవుడు – కేవలం తన మేధస్సు, విజ్ఞానం, స్వార్ధపరత్వం కారణంగా ఈ గ్రహాన్ని అతి త్వరగా తొలినాటి భయంకరమైన స్థితికి లాక్కుపోతున్నాడు.

పులి వెళ్ళిపోతోంది. కనుచూపు దూరంలో – బహుశా కొన్ని తరాల దూరంలో మానవుడూ ఆ దారినే పోబోతున్నాడు. మరిచిపోవద్దు – భూమి పరిణామ క్రమంలో సంవత్సరం చాలా హాస్యాస్పదమైన కొలత.

(జనవరి 10, 2011)

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

# (Jan 17,2011) NR Chandur చందూర్ స్మృత

చెన్నైలో ఆగస్టు 7న సవేరాలో ఆనాటి ముఖ్యమంత్రి రోశయ్యగారికి కొందరు తెలుగు మిత్రులు విందు చేశారు. ఇలాంటి కార్యక్రమాలలో సాధారణంగా అందరు తెలుగు ప్రముఖులు హాజరుకావడం రివాజు. ఆనాడు చందూరు దంపతులు (ఎ.ఆర్.చందూర్, మాలతీ చందూర్) వచ్చారు. భోజనాలయాక హోటల్ ప్రాంగణంలో అతి అందమయిన కారెక్కారు ఎన్.ఆర్.చందూర్ గారు. "కారు చాలా ముద్దుగా ఉంది" అన్నాను ఆయనతో. వెనకనే వస్తున్న మాలతీ చందూర్ గారు అందుకుని "నేను లేనా? దుర్మార్గుడా! అన్నారు. చేతులు జోడించి "80 ఏళ్ళ మీ గురించి 94 ఏళ్ళ మీ ఆయనకి ఏం చెప్పనమ్మా" అన్నాను. కారు వెళ్ళిపోయింది. అదీ నేను చందూర్ గారిని ఆఖరుసారి చూడడం. అదీ ఆ దంపతులూ సెన్సాఫ్ హ్యూమర్కి, అన్ని సంవత్సరాల జీవితంలో సరసత్వానికీ మచ్చుతునక.



మాలతీ చందూర్‌ను పరామర్శిస్తున్న ముళ్లపూడి వెంకట రమణ

నేను రచనలు చేయడం ప్రారంభించిన రోజుల్నుంచీ – అంటే దాదాపు 56 సంవత్సరాల నుంచీ చందూర్ గారిని వింటున్నాను. ఆయన కథలు చదువుతున్నాను. "వాళ్ళు నలుగురూ..", "సీతతో సినిమాకి" వంటి కథలు తేలికగా అర్థశతాబ్దపు పాతవి. ఆయన సంపాదకత్వం వహించే 'జగతి' పత్రిక కూడా అంతే పాతది. నాకు తరచుగా వచ్చే ఎన్నో పత్రికల మధ్య విధిగా 'జగతి'ని ఏరుకుంటాను. కారణం – నెలనెలా తెలుగు సాహితీ ప్రపంచాన్ని పరిచయం చేసే పెద్దమనిషి 'జగతి'. నిజానికి ఈమాట చందూర్ గారికే వర్తిస్తుంది. దాదాపు 40 ఏళ్ళ పై చిలుకు ఆయనతో నాకు వ్యక్తిగతమైన పరిచయం. ఏనాడూ, ఎవరినీ ఆయన మాటతో, విమర్శతో నొప్పించగా నేనెరగను. ఆయన పత్రికా అంతే. అత్యంత ఉదారంగా, గంభీరంగా జీవితంలో మంచి చెడుల్ని సమతుల్యంగా బేరీజు వేసే పెద్దమనిషి చందూర్. సాహితీ ప్రపంచంలో ఎందరో ప్రముఖులకు ఆయనతో ప్రాణస్నేహం. చలం గారు, బెజవాడ గోపాలరెడ్డి, శ్రీ శ్రీ, ఆరుద్ర – ఎవరయినా సరే – విశ్వనాథవారన్నట్టు – చెన్నైలో చందూర్ దంపతుల సౌహార్ధాన్ని చవి చూడనివారు అరుదు. చందూర్ గారిదీ, మాలతిగారిదీ అపురూపమైన బంధుత్వం. ఆయన మాలతీ చందూర్ గారికి భర్త, సఖుడు, సెక్రటరీ – అన్నీ. మాలతీ చందూర్ ఆయనకి ఒక ఉద్యమం. ఆమె వ్యాసాంగాన్నీ, అభిరుచినీ, వ్యాపకాల్నీ, సారస్వత కృషినీ చేయూత నిచ్చి నిలిపిన, నడిపిన వ్యక్తి ఆయన. ఆమె ప్రతిభ ఉద్దీపనకు పూర్తి వాటా ఆయనదే. నాకు తెలిసి – జీవితంలో ఇద్దరినే ఇలాంటి వ్యక్తుల్ని చూశాను. ఎం.ఎస్ సుబ్బలక్ష్మి గారి భర్త సదాశివంగారు, చందూర్ గారు. చందూర్ గారిది నిస్వార్థమైన, నిరంతనమైన సహకారం. ఆమె నాతో ఒకసారి అన్నారు. రచన పూర్తి చేశాక తీసుకొచ్చి ఆయన టేబులు మీద పారేస్తాను – అని. దానిని సవరించి, కవరులో పెట్టి, అడ్రసు రాసి, స్టాంపులు



బెజవాడ గోపాలరెడ్డితో చందూర్ (పాత చిత్రం)




అంటించి పంపండం – అన్నీ ఆయన బాధ్యతే. చందూర్, మాలతిగారి సారస్వత సేవకి దక్కిన అదృష్టం.

అభిప్రాయం బేధం, విమర్శకి తావున్న ఏ పనికీ ఆయన పూనుకోరు. ఆమెని పూనుకోనివ్వరు. ఒకానొక కథల పోటీకి ఆమెని న్యాయనిర్ణేతగా ఉండమని కోరాను. మేమిద్దరం కలిసినప్పుడు "ఎందుకూ – అనవసర స్పర్ధలకి చోటు? వద్దులెండి" అన్నారు పాజిటివ్ థికింగ్ ని జీవితంలో నమ్మి, పత్రికలో పాటించి, జీవనంలో భాగంగా, ఉద్యమంగా చేసుకున్న వ్యక్తి చందూర్ గారు.

మనిషి ఆరోగ్యానికి ముఖ్యకారణం – జీవితంలో గంభీరమైన ఆదర్శం ఉండడం, జీవించడానికి ఆరోగ్యకరమైన లక్ష్యం ఉండడం. ఈ రెండూ పుష్కలంగా ఉన్న వ్యక్తి చందూర్ గారని 95 ఏళ్ళ ఆయన జీవితం చెపుతుంది. కర్తవ్య దీక్ష, క్రమశిక్షణ తననుంచి 'తన 'ని దూరంగా పెట్టగల, విచక్షణ ఆత్మవిశ్వాసం, అందరిలో మంచిని మాత్రమే చూడాలన్న, చూపాలన్న నిబద్ధతా – చందూర్ గారి జీవితానికి మూలస్థంభాలు. చెన్నైలో తెలుగువారికి చెదిరిపోని ఓ జ్ఞాపకం – ఏ సభలో, ఏ సమావేశంలో ఎన్.ఆర్.చందూర్ గారు తారసపడ్డా పక్కనే వెదికితే మాలతీ చందూర్ కనిపిస్తారు. మాలతీ చందూర్ గారు ఎక్కడ కనిపించినా పక్కనే ఉన్న వ్యక్తి పేరు ఎన్.ఆర్.చందూర్. కొన్ని దశాబ్దాలపాటు అస్మదాదులు అలవాటు పడిన ఈ తైలవర్ణ చిత్రంలో సగభాగం ఇక ముందు కనిపించదు మా అందరికీ. మైలాపూర్ లోని కచ్చేరీ రోడ్డు చందూర్ దంపతుల వీధి. ఇప్పుడది సగం కళావిహీనమయి కనిపిస్తుంది.

కొందరు విద్యుద్దీపంలాగ జిగేలుమనిపించరు. దేవుని ముందు ప్రమిదె లాగ పవిత్రంగా నిలకడగా వెలుగుతారు. సాహితీ ప్రపంచంలో, స్నేహ ప్రపంచంలో అలాంటి నమ్మకమయిన, విభిన్నమయిన వెలుగు – చందూర్.

(జనవరి 17, 2011)

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

# (Jan 24,2011) Adarsa Avineethi ఆదర్శ అవినీతి

ముంబైలో 'ఆదర్శ ' హౌసింగ్ సొసైటీ కుంభకోణం 31 అంతస్థుల భవనాన్ని కూలద్రోయాలని కేంద్రప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మంత్రి జైరాం రమేష్ గారు ఈ నిర్ణయాన్ని కుండబద్దలు కొట్టి మరీ చెప్పారు. ఇది మరీ పెద్ద అవినీతి అని నా ఉద్దేశం. ఒక రొట్టెముక్క ఉంది. వెంకయ్య తినాలా రామయ్య తినాలా అన్నది తగువు. మధ్యవర్తి వచ్చి ఎవరూ తినకూడదు అంటూ తను నోట్లో వేసుకోవడం ఫక్తు 'కాంగ్రెసు' తీర్పు. దీనికే పాతకాలం సామెత ఒకటుంది – పిల్లీ పిల్లి తగువు కోతి తీర్చిందని. కాని ఎవరూ తినకూడదు అంటూ సముద్రంలోకి గిరాటు వెయ్యడం – జైరాం రమేష్ గారు ఇవ్వవలసిన తీర్పు కాదు.

ఆ అపార్టుమెంటుని పడగొడితే అసలు సిసలైన కార్గిల్ వీరులం మా మాటేమిటని ఒకాయన వాపోయాడు. ఖర్చయిన సిమెంటు, ఇసుక, సరంజామా మాటేమిటని మరొకాయన బుగ్గలు నొక్కుకున్నాడు. అసలు అవినీతిపరులు కిక్కురుమనకుండా ఉన్నారు. ఇవన్నీ సముచితమైన నిర్ణయాలు కావని నా ఉద్దేశం. నాదొక సలహా ఉంది. దీనిని ప్రభుత్వమూ, పెద్దలూ పరిశీలించి ఒక నిర్ణయానికి రావాలని మనవి చేస్తున్నాను. ఇంగ్లీషులో "స్కాండ్రల్స్, రోగ్స్" కథల పుస్తకాలున్నాయి. దగుల్బాజీలు, దగాకోర్ల కృత్రిమ మేధాసంపత్తిని, అనూహ్యమైన తెలివితేటల్ని ఉటంకించే కథలవి. ఇంగ్లీషు వాడికి గొప్ప సెన్సాఫ్ హ్యూమర్ ఉంది.వాళ్ళ దేశంలో అగాథా క్రిస్టీకి ఉన్నట్టే, చార్లెస్ శోభరాజ్ వంటి వారికీ సముచిత స్థానం ఉంది.

ఇప్పుడు నా సలహా ఇది. ఆదర్శ్ అపార్ట్ మెంట్స్ ని కూలదోయడం అన్యాయం. అవాస్తవం. తెలివితక్కువతనం. మనదేశంలో 64 కళలలోనూ దొంగతనాన్ని కూడా ఒక కళగా పేర్కొన్న సంస్కృతి మనది. దాన్ని పరాకాష్టకు చేర్చిన తరం మనది. సైనికాధికారులూ, మంత్రులూ, మంత్రుల తొత్తులూ, బంధువులూ, చిల్లర మల్లర ఆఫీసర్లూ – అంతా ఏకమయి ఆరు అంతస్తుల భవనాన్ని 32 అంతస్థులకు సాగదీయడం అద్భుతమైన కథ. ఈ 'ఆదర్శ' భవనాన్ని మన దేశంలో అవినీతికి ఆదర్శంగా ఒక మ్యూజియంగా మార్చాలని నా సలహా. ఇంగ్లీషువాడిలాగే మనకీ మనల్ని చూసి మనమే నవ్వుకుని అభినందించే విచక్షణ మనకీ ఉన్నదని చాటి చెప్పాలి. ఈ దేశంలో రకరకాల స్థాయిల్లో అవినీతికి పాల్పడిన వారి ఫోటోలూ, కథలూ అక్కడ ప్రదర్శించాలి. చూసేవారికి ఒక పక్క కితకితలు పెట్టినట్టు సరదా కలగాలి. కొందరికి ఆశ్చర్యం, కొందరికి కోపం, కొందరికి కనువిప్పు – ఇలా రకరకాల అనుభూతులు కలగాలి. ఇది 'ఆదర్శ' అవినీతికి ఆదర్శంగా నిలవాలి. అదిగో, మీలో కొందరికి తప్పనిసరిగా నవ్వు వస్తోందని నాకు తెలుసు. ఈ భవనంలో లల్లూగారూ, వారు తిన్న గడ్డీ, ఏ.రాజాగారూ, కల్మాడీగారూ, దర్బారీగారూ, మహేంద్రూగారూ, ఖత్రోచీగారూ, హర్షద్ మెహతాగారూ, రామలింగరాజుగారూ, కేతన్ పారిఖ్ గారూ, పండిత సుఖ్ రాం గారూ, మనూశర్మగారూ, సంతోష్ సింగ్ గారూ మొన్న పెళ్ళాన్ని చావగొట్టి రక్తం మడుగులో వదిలేసిన అనిల్ వర్మగారూ, నీరా రాడియాగారూ, పి.జె. థామస్ గారూ, రాజా భయ్యాగారూ, రాథోడ్ గారూ, తెల్గీ గారూ, బంగారు లక్ష్మణ్ గారూ, షిబూ సోరేన్ గారి, గాలి సోదరులు, ఎడ్యూరప్ప గారూ, మధుకోడాగారూ – ఇలా ఇంకా ఎందరికో స్థానం ఉంటుంది. అందరికన్నా ముందు గదిలో మహాత్మా గాంధీ ఫోటో – ఆయనే స్వయంగా చెప్పుకున్న అవినీతి – ఆఫ్రికాలో పెళ్ళాన్ని చెంపదెబ్బ కొట్టిన సందర్భం – ఉటంకించడం జరుగుతుంది.

31 అంతస్థులూ తిరిగి వచ్చిన వాడికి – నిన్న మొన్నటి రెవిన్యూ గుమాస్తా వెయ్యి రూపాయల అవినీతి ఏనుగు ముందు చలిచీమలాగా కనిపిస్తుంది. మానవ స్వభావం ఎన్ని రకాలయిన పుంతలు తొక్కగలదో, మేధస్సు ఎన్ని రకాలయిన వక్రమార్గాలు తొక్క గలదో అర్థమవుతుంది.

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ
కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

ఆస్కార్ లకు దీటుగా అమెరికాలో ఉత్తమ చెత్త చిత్రం, ఉత్తమ దరిద్ర కళా దర్శకుడు, ఉత్తమ ఛండాలపు నటుడూ – ఇలా బహుమతిలిచ్చే సంస్థ ఉంది. వారి సెన్సాఫ్ హ్యూమర్ కి జోహార్లు. ఈ దేశంలో అవినీతి కథలకు ఆదర్శంగా 'ఆదర్శ' మ్యూజియం నిలవాలని, అపూర్వమయిన విజయాలు సాధించిన వారి చరిత్ర గిన్నీస్ బుక్ లోకి ఎక్కినట్టు 'ఈ మధ్య ఫలానా ఆయన పేరు ఆదర్శ మ్యూజియం చేరింది ' అని చెప్పుకోవడం ఒక కొలబద్దలాగ నిలుస్తుంది.

ఈ సొసైటీకి బారసాల చేసి 'ఆదర్శ' అని పేరు పెట్టిన మహాత్ముడెవరో ఆయనకి జోహార్. ఇది నిజమైన 'ఆదర్శ' ప్రదర్శన. ఇందులో తామందరికీ చోటుంది. పెళ్ళాన్ని కొట్టారా? పక్కవాడి జేబు కొట్టారా? సిగరెట్టు దొంగతనం చేశారా? గడ్డి తిన్నారా? పొరుగాయన పెళ్ళాన్ని లేపుకుపోయారా? మంత్రిగా ఉంటూ ఓ గిరిజన అమ్మాయిని మానభంగం చేసి జైలుకి పంపారా? కక్కుర్తిపడి కారాకిళ్ళీ డబ్బివ్వకుండా నోట్లో వేసుకున్నారా? రండి. మీకు ఈ ఆదర్శ ప్రదర్శనలో చోటుంది. తమ ఫోటో, తమ కథ, ఇలాంటి ఆలోచనలు తమ కెప్పటినుంచీ వస్తున్నాయి? అన్నీ సెలవివ్వండి. ముందు తరాలు మిమ్మల్ని గుర్తుంచుకుంటాయి.

అయితే, ఈ దేశపు పాలనా వ్యవస్థకి, మంత్రులకు ఇంత ఆబ్జెక్టివ్ గా ఒక మ్యూజియం ఏర్పరచి నవ్వుకునే దమ్ము, సెన్సాఫ్ హ్యూమర్ ఉన్నదా అని.మరొక్కసారి – ఇది నవ్వుకుని మరిచిపోయే కాలం కాదు. ప్రాచీన కాలం నుంచీ – అంటే మృచ్ఛకటికలో చారుదత్తుడి కాలం నుంచీ నేటి మధుకోడా దాకా అవినీతి ఎన్ని రకాలయిన పరిణామాలను పొందింది, మానవ స్వభావం ఎంతగా దిగజారిపోయింది – ముఖ్యంగా భారతదేశంలో – తెలియజెప్పే ప్రదర్శన శాల ఇది.

చివరగా ఈ ప్రదర్శన శాలలో ఒక భగవద్గీత శ్లోకం ఉంచాలి:

> యద్యదాచరతి శ్రేష్టః తత్తదేవేతరోజనః|
> సయత్ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే||

పెద్దలు ఏం చేస్తారో వారి వెనుక ఉన్నవారూ అదే చేస్తారు. ఎవరు ఏ ఆదర్శాన్ని నిర్దేశిస్తారో దానినే సమాజం అనుసరిస్తుంది. పర్యవసానం: 'ఆదర్శ' సొసైటీ ప్రదర్శన శాల.

(జనవరి *24,* 2011)

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

# (Jan 31, 2011) Padma Trayam 'పద్మ 'త్రయం

ఒకరు పద్మశ్రీ. మరొకరు పద్మ భూషణ్. ఇంకొకరు పద్మవిభూషణ్ . ఆటా పాటా నటనలకు పెద్ద పీట – వి.వి.యస్. లక్ష్మణ్, ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం, అక్కినేని నాగేశ్వరరావు.

లక్ష్మణ్ అంతర్జాతీయంగా ప్రసిద్ధుడు. మిగతా ఇద్దరూ తొలిదశలో పద్మశ్రీ. తరువాత పద్మభూషణ్. ఇప్పుడు అక్కినేనికి మరొక ఉన్నత గౌరవం – పద్మవిభూషణ్. జీవితమంతా దేశం గుర్తించి సత్కరించే ఉద్ధతికి నిదర్శనాలు.

లక్ష్మణ్ అలుపెరగని వీరుడు. ఊహించని సందర్భాలలో ఆశలు వదులుకున్న ఆటల్లో, ఊహించనంత ఎత్తున నిలిచి, ఊహించని విజయాలని దేశానికి సమకూర్చిన ధీరుడు. విన్ స్టన్ క్రికెట్ ఆల్మనాక్ లో చోటు చేసుకున్నవాడు. 2001 కలకత్తాలో ఆస్ట్రేలియా మాచ్ లో 201 పరుగులు ప్రపంచం నివ్వెరపోయి చూసిన చరిత్ర. కలకత్తాలో 143 పరుగులతో దక్షిణాఫ్రికా జట్టుని విజయానికి అవతలి గడపలోనే నిలిపి దేశాన్ని పులకితం చేసిన సందర్భం. కష్టాల్లో టీంని ఆదుకునే ఆపద్బాంధవుడూ. చెప్పడానికి ఎన్ని ఉదాహరణలు! వ్యక్తిగతంగా తెలిసినవారికి – అతి సాధువు. దేశాన్నీ, తన టీంనీ ముందు నిలిపి దాని నీడలో గర్వంగా ఒదిగి నిలబడే దేశభక్తుడు. అన్నిటికన్నా ముఖ్యం – ఆటలో సర్వులకూ ఆనందాన్ని పంచే 'కళాకారుడు '. అందుకూ ఈ కాలం లో చోటు. అతని పెళ్ళి శుభాకాంక్షలు పంపాను. వి.వి.యస్. లక్ష్మణ్ కేరాఫ్ హైదరాబాద్ – అంటూ. అందాయి. ఫోన్లో గొంతు వినగానే ఒకే ప్రశ్న – 'బాగున్నారా? ' అంటూ.

ఈ తెలుగు తేజాన్ని గురించి ప్రముఖ బౌలర్ బ్రెట్ లీ అన్నమాటలు తెలుగులో రాయాలని ఉంది కాని, వాటి రుచిని చెడగొట్టడం ఇష్టం లేదు If you get Dravid, great. If you get Sachin, brilliant. If you get Laxman, it is a miracle. అని తన కెప్టెన్ స్టీవ్ వాతో అన్నాడు.

తెలుగువారి గొప్పతనాన్ని గుర్తించడం, గుర్తించేటట్టు చేయడం తెలుగు ప్రభుత్వాలకు రివాజు కాదు. ఆ విధంగా ఈ పద్మశ్రీకి అరుదైన విలువ ఉంది.

ఇక బాలసుబ్రహ్మణ్యం పద్మభూషణ్. ఆయన ఇంటింటి పరిమళం. మాధుర్యం. ఆయన పద్మభూషణ్ కి తమిళనాడు కారణం అని విని "అమ్మయ్య. నా ఆలోచన తప్పుకాదు" అని నిట్టూర్చాను. తెలుగు పాటకి 164 సంవత్సరాలుగా – అంటే త్యాగరాజు కాలం నుంచీ, శ్యామా శాస్త్రి కాలం నుంచీ, బాలూ కాలం వరకూ నెత్తిన పెట్టుకున్న ఘనత తమిళులదే. మొన్న పి.సుశీల గారి పద్మ భూషణ్ కీ వారే కారణం. మనం గానగంధర్వుడని చంకలు గుద్దుకునే గాయకుడిని తమిళులు పద్మభూషణుడిని చేశారు. ఆనవాయితీ చెడిపోలేదు.

ఎన్నో దశాబ్దాలుగా ఎన్నో భాషలలో కవిత్వాన్నీ, సంగీతాన్నీ (తెలుగు, ఇంగ్లీషు, తమిళ, కన్నడ, మళయాళం, హిందీ, ఉర్దూ) సుసంపన్నం చేసిన, చేస్తున్న పి.బి.శ్రీనివాస్ ఇంకా పద్మశ్రీ కయినా నోచుకోలేదని తెలుగు ప్రభుత్వానికి గుర్తున్నదా?




ఏమయినా ఆనవాయితీ ప్రకారం అపురూప గాయకుడికి జరిగిన సత్కారం ప్రతి తెలుగువాడికీ గర్వకారణం.

ఇక అక్కినేని. ఏడు దశాబ్దాల పాటు ఎన్నో తరాల ప్రేక్షకుల్ని అలరించిన అద్భుత నటుడు – అక్కినేనిని సత్కరించడానికి కొత్త 'అభిజ్ఞ'లను వెదుక్కోవాలి. రఘుపతి వెంకయ్య, కళాప్రపూర్ణ, కాళిదాస్ సమ్మాన్, దాదా సాహెబ్ ఫాల్కే, ఎన్.టి.ఆర్. సత్కారం. అమ్మయ్య – ఇప్పుడు పద్మవిభూషణ్ ఉన్నది.

కళలో, జీవితంలో అనూహ్యమైన క్రమశిక్షణ passion నీ నిలుపుకున్న కళాకారుడు అక్కినేని. ఈ మధ్యనే నేను సంపాదకత్వం వహించే 'సురభి'లో ఆయన గురించి వ్యాసం రాయడానికి రెండు రోజులు ఆయనతో గడిపాను. వారిపట్ల నా అభిమానం 65 ఏళ్ళు పాతది. వారితో నా సాంగత్యం 47 ఏళ్ళ పాతది. వ్యక్తిగా జీవించడంలో సత్శీలానికి ప్రాముఖ్యాన్నిచ్చి, దాని సరసనే కళని నిలిపిన అతి అరుదయిన కళాకారుడు అక్కినేని. ఈ రోజుల్లో హీరోలు నటనకి ఏ నాలుగో స్థానాన్నో ఇచ్చే నేపధ్యంలో ఆయన తలమానికంగా నిలుస్తారు. ఆ నాలుగు స్థానాలేమిటి? – వ్యాపారం, వ్యాపారం, అమ్మకం, గ్లామర్. ఆ తర్వాతే బతికి బట్టకడితే – నటన. "నటన ఎవడిక్కావాలి పోవయ్యా?" అని నేటి హీరోలు ఈసడించినా మనం ఆశ్చర్యపోనక్కరలేదు. ఆ మాట ఒక దేవదాసు, ఒక కాళిదాసు, ఒక విప్రనారాయణ, ఓ సీతారామయ్యగారిని అనమనండి చూద్దాం.

'నటుడి'కి ఉండాల్సిన లక్షణాలేమిటో – ముందు తరాలు బేరీజు వేసుకోడానికయినా మనకి ఒక 'కొలబద్ద' కావాలి. అదృష్టవశాత్తూ మనకి ఉంది. దాని పేరు పద్మవిభూషణ్ అక్కినేని.

(జనవరి *31,* 2011)









## (Feb 07,2011) Ayyo Magallu అయ్యో మగాళ్ళు

దాదాపు 50 సంవత్సరాల కిందట నేనో పెద్ద కథ రాశాను. పేరు: అహంకారపు అంతిమ క్షణాలు. నాతో ఆంధ్రా విశ్వవిద్యాలయంలో ఆనర్స్ చదివే సీనియర్ ఒకాయన ఉండేవాడు. నాగభూషణం. ఏలూరు దగ్గర ఏదో ఊరిలో ఉంటున్న ఓ హెడ్మాష్టరుగారబ్బాయి. తల్లిదండ్రుల్ని కాదని, ఓ టెలిఫోన్ ఆపరేటర్ని పెళ్ళిచేసుకున్నాడు. తండ్రి చదువుకి డబ్బు పంపడం నిలిపేశాడు. ఆమెకి సంపాదన ఉంది. ఇతన్ని చదివించేది. నరకయాతన పడిపోయేవాడు. మించి ఆమెని యాతన పెట్టేవాడు. సంస్కారే. చదువుకున్నవాడే. కనకనే మానసికంగా మధన ఎక్కువ. ఇద్దరికీ మనశ్శాంతి ఉండేది కాదు. సంవత్సరాలు గడిచాక నేను ఉద్యోగాన్ని ఊరు విడిచి వెళ్ళి తిరిగి వచ్చాక – ఇద్దరూ నాకు కనిపించారు. వాళ్ళకిప్పుడూ ఇద్దరు పిల్లలు. అతని ముఖంలో విజయ గర్వం. ఆమె ముఖంలో మనశ్శాంతి. ఏం జరిగింది? అతనికి ఉద్యోగం వచ్చింది. ఆమె జీతం కన్నా తక్కువ. అయినా భార్య ఉద్యోగం మానిపించాడు. ఇప్పుడు తను ఇంటికి యజమాని. తనదే పై చెయ్యి. ఆమె అతని అహంకారానికి ఒదిగింది. విజయం ఒదిగిన ఆమెదా? వంచిన భర్తదా? అదీ కథ.

మనది పురుషాధిక్యత చెల్లుబాటయే సమాజం. బాగా సంపాదిస్తూ, కీర్తి ప్రతిష్టలున్న భార్యల్ని రాసి రంపాన పెట్టిన చదువుకున్న, సంస్కారవంతులైన 'నాగభూషణా'ల నెందర్నో నాకు తెలుసు. నవ్వుతూ భర్త వెనుక నడిచే పెద్ద కీర్తిమంతురాలి కంటి కింద మచ్చ రాత్రి జరిగిన 'రచ్చ'ని చెప్పేది. పేర్లు చెప్పలేను. ఆ సంసారాలు నిలబడడానికి భర్తల దౌష్ట్యం కంటే, పురుషాధిక్యతని చెల్లనిచ్చే ఆ ఇల్లాళ్ళ 'పరిణతి ' గొప్పది. కష్టాన్ని కడుపులో దాచుకుని కాపురాల్ని నిలబెట్టుకున్న ఆ సాధ్వీమ తల్లులది. అంతకన్నా మార్గాంతరం మాత్రం ఏముంది? రాత్రంతా టెలిఫోన్ ఆఫీసులో డ్యూటీ చేసి వచ్చేది ఈ ఇల్లాలు. నాగభూషణం పొద్దుటే హోటల్ కి వచ్చి ఫలహారం తీసుకువెళ్ళేవాడు – చాలా కృంగిపోతూ.

'టిఫిన్ తెచ్చారా? ' అతి సాదా సీదా ప్రశ్న.

'ఏం? సంపాదిస్తున్నానని అహంకారమా? '

'నేను నీకు నౌఖర్నా? '

'ఎవడి కోసం తెస్తాడులే అన్న జులుమా? '

'నువ్వు దుప్పటీ కప్పుకు నిద్రపోతే నేను చాకిరీ చెయ్యాలా? '

ఆ ప్రశ్నకి ఇన్ని సమాధానాలు అక్కరలేదు. కాని చదువుకున్న మెదడులో అతని 'ఆత్మన్యూనత' అల్లిన 'చెద' ఇది. పాపం. అతని మనస్సు నొప్పించకూడదని అతనికి కనిపించేటట్టు రోజు ఖర్చుకి డబ్బు ఉంచేది. 'కుక్కకి బిస్కత్తు అందించినట్టు డబ్బు పడేస్తుంది' – భర్త కామెంటు.



అతి నిరపాయమైన, సరదా ప్రశ్న ఉందనుకోండి: 'ఏమిటివాళ ఆనందంగా ఉన్నారు? '

'ఏం? అడుక్కు తినేటట్టు ఉండాలని నీ ఉద్దేశమా?'

'కాఫీ తాగారా? '

'ఏం? ఏమీ తాగక మాడి చావాలని నీ ఉద్దేశమా?'

ఆత్మన్యూనత భయంకరమైన జబ్బు. అహంకారం అర్థంలేని రోగం. పురుషాధిక్యత ఈ సృష్టిలోనే మగాడిని పట్టిపీడించే రోగం. టొరెంటో విశ్వవిద్యాలయంలో రోత్సన్ స్కూలులో కొందరు పరిశోధకులు ఈ మధ్య ఓ గొప్ప సత్యాన్ని కనుగొన్నారని పేపర్లో చదివాను. హాలీవుడ్ సినీతారలకి కీర్తితోపాటు ఆస్కార్ బహుమతులు వస్తే సంసార జీవితం తప్పనిసరిగా విడాకులకు దారి తీస్తుందని కనుగొన్నారట. కారణం – పురుషాధిక్యత. జోన్ క్రఫోర్డ్, బెట్టీ క్రఫోర్డ్, బెట్టీ డేవిస్, హాలీ బెర్రీ, కేట్ విన్స్ లెట్ – ఉదాహరణలుగా చెప్పారు. ఇది గొప్ప పరిశోధన చేసి సూర్యుడు తూర్పున ఉదయిస్తాడని తేల్చడం లాంటిది. నేను రెండు ఉదాహరణలు చెపుతాను.

మా పనిమనిషి నాలుగిళ్ళలో పనిచేసి సమృద్ధిగా సంపాదించి – ఇంటికి భోజనం తీసుకు వెళుతుంది. మొగుడు వడ్రంగి పని చేసి నూరు రూపాయలు సంపాదించి, దానితో మందు తాగి, పెళ్ళాం తెచ్చిన అన్నం తిని దాన్ని చావబాదుతాడు. పొద్దుటే పగిలిన పెదవితో, కమిలిన మోచెయ్యితో, విరిగిన నడుంతో కనిపిస్తుంది. 'ఆ వెధవ మళ్ళీ కొట్టాడా? ' అని నేను హుంకరిస్తే వెన్నెల లాగ నవ్వుతుంది – పిల్లల కోసం మొగుడి అరాచకానికి తలవంచే – ఈ పనిమనిషి హాలీ బెర్రి కన్న గొప్ప మానసిక సౌందర్య రాశి అంటాను నేను.

మా వంట మనిషి భర్త వంట చేస్తాడు భార్యతో కలిసి. తన వాటా ఆదాయాన్ని తాగుడుకి ఖర్చు పెడతాడు. ఇంటికి వచ్చి భార్యని డబ్బు ఇవ్వమని సతాయిస్తాడు. భార్య తిట్టి, కొడితే తన్నులు తిని అతన్ని బయటికి పంపింది. ఇప్పుడు శవాలు మోస్తూ బతుకుతున్నాడు. గత 14 ఏళ్ళుగా ఇద్దరు ఆడపిల్లల్ని చదివించుకుంటోంది నాలుగిళ్ళలో వంటలు చేసుకుంటూ. పెళ్ళి అంటే తెలియని వయస్సులో 14 ఏట ఆమెకి పెళ్ళి జరిగింది. నిండా మునిగిన సంసారం అనే 'టైటానిక్ 'లోంచి తననీ, ఆడపిల్లల్నీ కాపాడుకుంటున్న అభినవ కేట్ విన్ స్లెట్ ఈ ఇల్లాలు.

పురుషాధిక్యత అనే రోగం ప్రపంచ వ్యాప్తం. ఈ రోగానికి ఎవరికి వారు తమదైన చికిత్సల్ని వెదుక్కున్న సౌందర్యరాశులెందరో ఉన్నారు. హాలీవుడ్ కనుక వాళ్ళ కథలు వీధిన పడ్డాయి. ఈ నేలబారు తారల కథలు – మేఘాల చాటు తారల కథలు. నేను మా వంటమనిషితో అంటూంటాను. "నీలాంటి పెళ్ళాం నాకుంటే హాయిగా నీ చేతి వంట తిని ఇంట్లో కూర్చుని కథలు రాసుకునేవాడిని' అని.

భర్త అనే చీడనుంచి తన బిడ్డల్ని ఉద్ధరించుకునే గొప్ప 'ఉద్యమాన్ని' నిర్వహిస్తున్న ఉద్యమకారిణిలాగ ఆమె నాకు కనిపిస్తుంది.

(ఫిబ్రవరి *07,* 2011)

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!






# (Feb 14,2011) Neecha Naayakulu నీచనాయకులు

చాలా ఏళ్ళ క్రితం ఒకానొక పత్రికలో నేను టంగుటూరి ప్రకాశం గారి మీద కాలం రాశాను. వెంటనే ఒక పాఠకుడు ఈ సందర్భాన్ని ఉటంకిస్తూ సంపాదకునికి లేఖ రాశాడు. ఆ లేఖలో వివరాలివి. ఇది ఆయన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న రోజుల్లో జరిగిన సంఘటన. ప్రకాశం గారు అతిధి బంగళా గదిలోంచి ఎంతకీ బయటికి రావడం లేదట. బయట కొందరు ఎదురు చూస్తున్నారు. తీరా ఆలశ్యానికి కారణం అయిన (ముఖ్యమంత్రి) చొక్కాకి తెగిపోయిన రెండు బొత్తాములు కుట్టించుకుంటున్నారట! బయట నిలబడిన ఓ పెద్ద మనిషి తన మిత్రుడిని పిలిచి తను ఇస్తే ఆయన ఎలాగూ పుచ్చుకోరు కనుక, ఆయనతో స్టేషన్ దాకా వెళ్ళి – ఆయనకి ఎక్కడికి వెళుతూంటే అక్కడికి రైలు టిక్కెట్టు కొని ఇచ్చి రమ్మన్నాడు. ఈ ఉత్తరాన్ని ఆ రోజుల్లో దాచుకోనందుకు ఇప్పటికీ బాధపడుతూంటాను. ఎప్పటికయినా వేటపాలెం లైబ్రరీకి వెళ్ళయినా ఈ ఉత్తరం సంపాదించాలని నా కోరిక. నాయకులు కోట్లు ఆస్తులు మూటగట్టుకుంటున్నారని పత్రికలు ఘోషించే ఈ రోజుల్లో ఇలాంటి అసమర్ధులు నాయకత్వం వహించారన్న నిజం అబ్బురంగా చెప్పుకోవాల్సిన విషయం.

మరొకాయన ఉన్నాడు. ఆయన ఈ దేశపు రెండవ ప్రధాన మంత్రి. లాల్ బహదూర్ శాస్త్రి. ఆయన కొడుకు సునీల్ శాస్త్రి 'లాల్ బహదూర్ శాస్త్రి : ఫాస్ట్ ఫార్వర్డ్' అనే పుస్తకంలో ఈ సంఘటనల్ని ఉదహరించాడు. ఒకసారి ఆయనకి తన తండ్రిగారి (ప్రధాని) చెవర్లెట్ ఇంపాలా కారులో తిరగాలని ముచ్చట కలిగింది. డ్రైవర్ని తాళాలడిగి బయటికి వెళ్ళాడు. ఆ విషయం తెలిసిన ప్రధాని డ్రైవర్ని పిలిచి "ఈ కారు తిరిగిన వివరాలు రాసుకుంటావా?" అని అడిగారు. డ్రైవరు భయం భయంగా తలూపాడు. తన కొడుకు ముందు రోజు ఎంత దూరం తిరిగాడని అడిగారు. పధ్నాలుగు కిలోమీటర్లు. తన పర్సనల్ సెక్రటరీని పిలిచి – ఆ పధ్నాలుగు కిలోమీటర్లకి అయిన ఖర్చు – తన సొమ్ముని గవర్నమెంట్ అకౌంటులో నమోదు చెయ్యమన్నారు.

వాళ్ళావిడ హిందీ నేర్చుకోవాలనప్పుడు ఓ హిందీ టీచర్ని పెట్టుకున్నారట. ఆదాయం ఎలాగ? ఇంటి పనిమనిషిని తీసేసి ఆ డబ్బుతో టీచర్ని పెట్టుకున్నారట. పాతబడిన ఆయన చొక్కాలను కత్తిరించి రుమాళ్ళు చేయమని ఆయన భార్యకి ఇచ్చేవారట. ఓసారి ఫైజాబాద్ జైల్లో రాజకీయ ఖైదీగా ఉన్నప్పుడు భార్య రెండు మామిడి పళ్ళు తెచ్చిందట. శాస్త్రిగారు భార్యని గట్టిగా మందలించారట – అలాంటి తప్పుడు పనిచేస్తున్నందుకు. ఏమిటా తప్పుడు పని? ఖైదీగా శిక్షని అనుభవిస్తున్న తను రూల్స్ ప్రకారం జైలు కూడే తినాలిగాని ఇలా మామిడి పళ్ళు తినడం దొంగతనం అవుతుందన్నారట! కేంద్ర రైల్వే మంత్రిగా ఉన్నప్పుడు నిజమైన గాంధేయ మార్గంలో లోకల్ రైళ్ళలో ఆఫీసుకి వెళ్ళేవారట.

ఈ కథలన్నీ – అబ్బురాలు. కొందరికి విపరీతాలు, విచిత్రాలుగా కనిపిస్తాయి. ఎందుకంటే ప్రస్తుతం మనం గూండాలనీ, హంతకులనీ పార్లమెంటు దాకా ప్రయాణం చేయడం చూస్తున్నాం. జైళ్ళలో మందు, విందు, సెల్ ఫోన్ల రవాణా విరివిగా జరగడం వింటున్నాం. ఈ నేపధ్యంలో శాస్త్రిగారిలాంటి నాయకులు ఈదేశాన్ని పాలించారంటే ముక్కుమీద వేలేసుకునే రోజులొచ్చాయి. నాకు తెలిసి – నా తరంలో – అంటే మన తరంలో అలాంటి నాయకుడిని చూశాను. ఆయన వావిలాల గోపాలకృష్ణయ్య. ఓసారి మేమిద్దరం ఆంధ్ర విశ్వవిద్యాలయం సభలకి అతిధులం. ఆయన చేతిలో ముతక ఖద్దరు సంచి ఉండేది. అందులో ఓ పంచె, చొక్కా. సభ అయాక ఆయన్ని విశాఖపట్నంలోనే ఏదో బస్ స్టాండులో దింపిన గుర్తు. వాళ్ళ పాదాలు అందుకునేటంత ఎత్తుకి ఎదగగలిగితే అటువంటి నాయకులకి పాదాభివందనం చేయగలగడం అదృష్టం.



ఈ కాలంకి 'నీచ నాయకులు' అని పేరు పెట్టడం చాలా మందికి ఆశ్చర్యంగా ఉండొచ్చు. కడివెడు పాలలో చిన్న విషపు చుక్క ఆ పాల 'రుచి 'ని నాశనం చేస్తుంది. ప్రస్తుతం కడివెడు 'విషం 'లో ఓ పాలచుక్క కథ మనం చెప్పుకునేది. అందుకని ఈ కాలం కి ఈ శీర్షిక సార్ధకమని నా ఉద్దేశం. ఇంకా తమరు నాతో ఏకీభవించకపోతే ఒక చిన్న నమూనా. కేవలం రెండు రోజుల కిందటి కథ. ఉత్తర ప్రదేశ్ లో ఆరియా జిల్లాలో పర్యటనకి మహారాణి మాయావతి – ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిగారు – హెలికాప్టర్ లో దిగారు . వారి బూట్ల మీద దుమ్మి పడింది. డిప్యూటీ సూపరింటెండెంట్ అయిన పోలీసు ఆఫీసరు టీవీ కెమెరాల సమక్షంలో ఆమె బూట్లు తుడుస్తున్నాడు. ఈ మహత్తర దృశ్యాన్ని దేశమంతా చూసి తరించింది. ఓ టీవీ కార్యక్రమంలో ఎమ్మెల్యే నవాబ్ ఖాసీం ఆలీగారు – ఆవిడ తుడవమనక పోయినా, అసంకల్పితంగా, తమ నాయకుల మీద భక్తి పారవశ్యంతో పోలీసు అలా తుడిచి ధన్యుడయాడని పేర్కొన్నాడు. సదరు పదం సింగ్ కి ఈ మధ్యనే సర్వీసుని ఓ సంవత్సరం పాటు పొడిగించారట,

చెప్పులు తుడిచే చెంచా కథ చెపుతూ, నాయకులని విమర్శించడం ఏం సబవు? అని కొందరికయినా అనిపించవచ్చు. అయ్యా, గంజాయి వనాల్లోనే కలుపు మొక్కలు ఏపుగా పెరుగుతాయి. సంజయ్ గాంధీ బూట్లు తుడిచే ఎన్.డి.తివారీలనూ, జయలలిత కాళ్ళమీద పడి నెత్తికి ధూళిని పూసుకునే భక్తశిఖాగ్రేసరులనూ.. ఏదీ? వాజ్ పేయ్ సభలోనో, సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి సభలోనో చూపించండి. ఈ పని లాల్ బహదూర్ శాస్త్రిగారి చెప్పులకి ఎవరేనా చేసి ఉంటే ఏం జరిగేదనే ఆలోచన నాకొచ్చింది. ఆ ఆఫీసరుని సంజాయిషీ అడిగేవారా? కసిరి తిట్టేవారా? కళ్ళనీళ్ళు పెట్టుకుని అతని రెండు చేతులూ పట్టుకునేవారా? భార్య రెండు మామిడి పళ్ళని జైలుకి తీసుకొచ్చినందుకు మందలించిన పెద్దమనిషి ఆ ఉద్యోగిని బర్తరఫ్ చేసినా ఆశ్చర్యం లేదు.

కన్నకొడుకు ప్రయాణం చేసిన కారుకి తండ్రి డబ్బు చెల్లించే ప్రధానులు, చిరిగిన చొక్కాకి బొత్తాములు కుట్టుకునే ముఖ్యమంత్రులూ, సభలకి బస్సుల్లో వచ్చే ఎమ్మెల్యేలూ ఈ తరానికి నమ్మశక్యం కాని 'నాయకులు'. మహాత్మాగాంధీ చచ్చిపోయి ఇంకా ఎంతో కాలం కాలేదు. మహారాణీ మాయావతుల విన్యాసాలకు అలవాటుపడిపోతున్న తరం మనది.

ఆఖరుగా పాఠకులకు మనవి. 'నీచ' అన్నమాటకంటే ఛండాలంగా, హీనంగా మరో మాట వాడలేని నా అసమర్ధతకి భేషరతుగా నా క్షమాపణ.

(ఫిబ్రవరి *14,* 2011)




# (Feb 21, 2011) Peda Melodrama పేద మెలోడ్రామా

ఆనాటి బ్రిటిష్ ప్రధానమంత్రి విన్ స్టన్ చర్చిల్ తన అనుభవాలలో చెప్పిన కథ ఇది. రెండవ ప్రపంచ యుద్ధం రోజుల్లో – ఇద్దరే పాపులర్ నాయకులు – హిట్లర్, చర్చిల్. మిగతా వారంతా వీరి తర్వాతే. ఇద్దరూ అమోఘమైన వక్తలు. రెండు వేర్వేరు దృక్పధాలకి ప్రపంచాన్ని ఆకట్టుకున్న నాయకులు – ఇద్దరూ విరోధి పక్షాలవారు.

యుద్ధపు రోజుల్లో జాతిని ఉత్తేజపరచడానికి చర్చిల్ రేడియోలో చేసే ప్రసంగాలు చాలా ఆవేశపూరితంగానూ, ఆసక్తికరంగానూ ఉండేవి. ప్రపంచమంతా చెవులొగ్గి వినేది. ముఖ్యంగా – బ్రిటిష్ ప్రజలకి అవి అపూర్వమైన క్షణాలు. అప్పటికింకా చర్చిల్ ప్రధాని కాలేదు. ఇప్పుడు చర్చిల్ చెప్పిన ఉదంతం వినండి.

ఆయన హడావుడిగా – బి.బి.సి. ఆఫీసుకి వెళ్ళాలట – ప్రసంగిచడానికి. టాక్సీ ఎక్కవలసి వచ్చింది. డ్రైవరు తీసుకెళ్ళనన్నాడు. కారణం – మరో అరగంటలో చర్చిల్ ప్రసంగం వినాలని. "పోవయ్యా నేను రాను. చర్చిల్ ప్రసంగం వినాలి" అన్నాడట. అవి రేడియో రోజులు. టీవి రోజులు కావు. చర్చిల్ ముఖం అంత పాపులర్ కాదు (కనీసం ఆ టాక్సీ డ్రైవరుకి). చర్చిల్ ఆ మాటకి ఆనంద పడ్డాడు. తనే చర్చిల్ నని చెప్పడం నామోషీ అనిపించింది. ఉదారంగా, ఉదాత్తంగా తన అభిమాన శ్రోతకి రెట్టింపు ధర ఇస్తానన్నాడు. టాక్సీ డ్రైవరు ఎగిరి గంతేశాడు. "ఎవడిక్కావాలయ్యా బోడి చర్చిల్ ఉపన్యాసం! కారెక్కు" అన్నాడట. ఇది చర్చిల్ స్వయంగా చెప్పిన సంఘటన. అదీ ఈ కథకి రుచి.

ఈ కథ నీతి ఏమిటయ్యా అంటే – డబ్బుకంటే ఏ వ్యక్తి పరపతీ ఎక్కువ కాదు – అని. దీన్ని ప్రస్తుతం మన దేశంలో నిరూపిస్తున్నంత ఉదారంగా ఏ దేశపు రాజకీయ చరిత్రా నిరూపించలేదు.

నా కనిపిస్తుంది. పదేళ్ళకిందట ఎవరైనా డి.ఎం.కె.రాజాగారిని ఓ గదిలో కూర్చోబెట్టి "చూడు బాబూ! నిన్ను పదేళ్ళ పాటు రెండుసార్లు మంత్రిని చేస్తాం. చేతనయినంత తిను. మా చేత తినిపించు. ఏనాడయినా గుట్టు బయటపడితే – ఓ పద్నాలుగు రోజులు జైల్లో ఉండడానికి సిద్ధపడాలి. ఆ తర్వాత నీకేమీ జరగదు. నీవాటా నీకుంటుంది" అని చెప్పివుంటే (చెప్పారేమో!) ఆయన ఆనందంగా తలూపేవాడనుకుంటాను. నా మట్టుకు ఆయన వాటాలో నాకు నాలుగోవంతు (పోనీ పదోవంతు) ఇస్తే నేను 28 రోజులు జైల్లో ఉండడానికి అంగీకరించేవాడిని.

మనకి బోలెడన్ని పాతకథలున్నాయి. అలనాడు జైన్ గారు రాసుకున్న హవాలా డైరీలు దొరికాయి. అందులో విష్ణు సహస్ర నామంలాగా ప్రముఖ నాయకులందరి పేర్లూ – ఎల్.కేద్వానీ, వీ.సీ.శుక్లా, పి.శివశంకర్, శరద్ యాదవ్,బలరాం జక్కర్, మదన్ లాల్ ఖురానా వంటి నాయకుల పేర్లున్నాయ్. ప్రస్తుతం వీరిలో కొందరు ఇప్పటికీ నాయకులే. వీరందరికీ 180 లక్షల డాలర్లు ముట్టజెప్పినట్టు జైన్ గారు రాసుకున్నారు. వారిలో ఒక్కరూ అరెస్టు కాలేదు. తగినంత సాక్ష్యం లేదని డైరీల్లో రాతలు మాత్రమే నేర నిరూపణ చెయ్యలేవని 1997 లో కోర్ట్ కేసుని కొట్టేసింది.

(అవినీతికి చిన్న కిటుకు: తమరెప్పుడైనా అవినీతి విషయాలపై డైరీల్లో రాసుకునేటప్పుడు – ఎందుకేనా మంచిది – నలుగురైదుగురు నాయకుల పేర్లు కూడా జతచేసుకోండి. వారు మురికి నీటిలో ఇండుగ పిక్కలాంటివారు. మీ అసలు అవినీతికి వారి పేర్లు విరుగుడుగా పనిచేస్తాయి.)

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

మధ్యలో చాలా కథలున్నాయి గాని – ఇటీవలి కథ – కామన్వెల్తు క్రీడల్లో కోట్ల అవినీతి ఉన్నదని పత్రికలు, ఛానళ్ళు గొంతులు చించుకున్నాయి. దీనికి కారకులు సురేష్ కల్మాడీ అన్నారు. వారి అనుచరులు మహేంద్రూ, దర్బారీ వంటి పెద్దల్ని అరెస్టు చేశారు. 90 రోజుల తర్వాత వారి నేరాలకి తగ్గిన సాక్ష్యాధారాలు లేవని విడుదల చేశారు.గిరీశం అన్నట్టు పెద్దవాళ్ళకి చిన్న గడువు. చిన్నవాళ్ళకి పెద్ద గడువు. అయితే ఆఖరికి అందరూ విడుదల అవుతారు. తీరా వారు కూడబట్టుకున్న సొమ్ము! వారి దగ్గరే మిగిలిపోయింది!

రాహుల్ ఫతే ఆలీ ఖాన్ అనే గాయకుడి దగ్గర లక్షా పాతిక వేల డాలర్ల కరెన్సీ దొరికింది. వారిని అధికారులు ప్రశ్నిస్తున్నారు కాని, ఆయన స్వేచ్ఛగా వీధుల్లో తిరుగుతున్నాడు. 'పాడు' వారికి 'పాడు' పనుల్లో వాటాని ప్రశ్నించరాదని పాకిస్థాన్ ఆవేశపడుతోంది. ఆయన్ని జైల్లో పెట్టే దమ్ము ఈ ప్రభుత్వానికి ఉందా? ఆయనకి డబ్బిచ్చినవారి గోత్రాలు ఎంత బలమైనవో!

ప్రస్తుతం మన రాజాగారిని తీహార్ జైలుకి పంపించారుగాని – లోపాయకారీ ఒప్పందం ప్రకారం వారు జామపండులాగ 14 రోజుల్లో బయటికి వస్తారని నా నమ్మకం.

అసలు విషయమేమిటంటే – ఈ దేశంలో సురేష్ కల్మాడీ ఇంట్లో సోదా, రాజాగారి అరెస్టు, షహీద్ బాల్వా అందమైన సూట్లో కార్లు ఎక్కి దిగుతూండడం – ఇవన్నీ పేదవాడి మెలోడ్రామాలు. న్యాయానికి మంచి రోజులు వచ్చాయని చంకలు గుద్దుకోడానికి ప్రదర్శనలు. గొప్పవాడు తలవొంచుకు నడవడం జనాన్ని కితకితలు పెట్టే చక్కని మెలోడ్రామా. పత్రికల్లో చదివి, టీవీల్లో చూసి జనం మురిసిపోతూంటారు. ఈలోగా బాలధాకరేలు, ఇందిరాగాంధీలు, లల్లూ ప్రసాద్ లూ, జయలలితలూ, నరేంద్రమోడీలు, పీవీ నరసింహారావులూ – నేరస్తులుగా చిత్రితమౌతూంటే – అమ్మో! మనది ఎంత నిజాయితీ! అంటూ ముక్కుమీద వేళ్ళు వేసుకుని వేసుకుని ఈ పాటికి ప్రజల ముక్కులు అరిగిపోయుంటాయి.

తమిళనాడులో కళైనర్ టీవీ మీద దాడి మరో గొప్ప మెలోడ్రామా. కరుణానిధిమీదా, దయాళూ అమ్మాళ్ మీదా, కనిమొళి మీదా చర్యలు తీసుకునే దమ్ము ఈ ప్రభుత్వానికి ఎక్కడ ఉంది? మొన్న ప్రధాని మాటల్లోనే రాజాగారి అవినీతి తెలుస్తున్నా తోటి పార్టీలతో పొత్తు కారణంగా వారికే ఆ మంత్రిత్వశాఖని అప్పగించామని వక్కాణించారు.

మహానుభావుడి బెళ్ళింపు నేలబారు మనిషిని ముచ్చటపడేటట్టు చేస్తుంది. న్యాయం జరిగిపోతుందని అమాయకంగా చంకలు గుద్దుకునేటట్టు చేస్తుంది. అలనాడు చర్చిల్ గారు సరదాగా చెప్పిన కథ నేడు మన ప్రజల విషయంలో అక్షరాలా నిజం. మనకి చర్చిళ్ళు లేరు. రాజాలే ఉన్నారు. అవసరం లేనప్పుడు చర్చిల్ వంటి నాయకుల్నే గద్దె దింపే ఓటర్లు లేరు. రాజాలే ఉన్నారు. కరుణానిధుల్నీ కనిమొళుల్నీ రాజాల్నీ పోషించి అందలాలెక్కించే 'గొర్రె'లే ఉన్నారు. మనది ప్రజాస్వామ్యం. తన్నుకు చావండి – తాంబూలాలు ఎప్పుడో పుచ్చేసుకున్నారు.

(ఫిబ్రవరి *21*, 2011)




# (Feb 28,2011) Iddaru peddalu – Oka nivali ఇద్దరు పెద్దలు ఒక నివాళి

ఒక మహానటుడు:

ఈ వారం ఇద్దరు పెద్దలు వెళ్ళిపోయారు. ఇద్దరూ వారి వారి రంగాలలో ప్రసిద్ధులు, ప్రతిభావంతులు, నిష్ణాతులు, చరిత్రని తిరగరాసినవారు. కిందటి జనవరి మొదటి తేదీన పుస్తక ప్రదర్శన ప్రారంభించడానికి ఆహ్వానించినప్పుడు – నేను కలుసుకోవాలని ఎదురు చూసిన మిత్రులు, హితులు మిక్కిలినేని. ఉదయం రైలు దిగుతూనే భార్యా సమేతంగా వెళ్ళాను.

మిక్కిలినేని కూతురు ఆలనలో అతి ప్రశాంతంగా కనిపించారు. ఆయన జీవితమే ఆద్యంతమూ ఒక ఉద్యమం. ఇంత విస్తృతమైన పరిధి చాలామందిలో చూడము. అలనాడు పార్టీ కలాపాలలో వెన్నుపూసగా నిలిచి ఇండియన్ పీపుల్స్ థియేటర్ ఆంధ్ర విభాగం ప్రజా నాట్యమండలి సభ్యుడిగా బుర్రకథ దళాలతో ఎన్నో కార్యక్రమాలు ఇచ్చారు. సుకర సత్యనారాయణగారి "మా భూమి"ని ఊరూవాడా ప్రదర్శించారు. అటు ప్రముఖ నటుడు బలరాజ్ సహానీ ఆ నాటకాన్ని హిందీలోకి అనువదించారు. వివిధ కళాప్రదర్శనలతో జన చైతన్యాన్ని కలిగించిన దశ అది. ఆ అనుభవాలను కదిలిస్తే అలవోకగా ఎన్నో ఒళ్ళు గగుర్పొడిచే కధల్ని విప్పేవారు. ఇక 'దీక్ష ' సినిమాతో సినీరంగ ప్రవేశం చేసి కొన్ని విలక్షణమయిన పాత్రలకు ప్రత్యామ్నాయం లేని నటుడిగా దాదాపు 350 చిత్రాలు నటించిన దశ మరొకటి. పుట్టినిల్లుని మరిచిపోకుండా కన్నతల్లి నాటకరంగానికి తనదైన సేవగా 'నాటక రంగ చరిత్ర ', 'నటరత్నాలు ' వంటి పరిశోధనాత్మక కృషి ఇంకొకటి. ఇది నాటకరంగానికి ఆయన చేసిన ఎనలేని ఉపకారం.

మద్రాసులో – ఆ మాటకి వస్తే మద్రాసులో అన్నమాటేంటి? – ఏ తెలుగు సభలోనయినా – ఓ బృందం ప్రత్యేకంగా దర్శనమిచ్చేది. మిక్కిలినేని, నేరెళ్ళ వేణుమాధవ్, పేకేటి, సినారె – ఇలాగ. బంగారం రంగు ఖద్దరు లాల్చీ, చక్కటి పంచెకట్టుతో ఎప్పుడూ ప్రశాంతంగా, ప్రసన్నంగా కనిపించేవారు. దశాబ్దం కిందట తరం మారి, అభిరుచుల అంతరం పెరిగినప్పుడు విజయవాడ తరలిపోయారు. నేను కలిసినప్పుడు "ఆరోగ్యం బాగుంది కాని నడుస్తూంటే తూలు వస్తోంది. ఆ మధ్య రోడ్డుమీద పడిపోయాను. ఇప్పుడు ఎటూ వెళ్ళడం లేదు" అన్నారు. 94 సంవత్సరాల సమగ్ర జీవనమే ఆయన జీవన శైలికీ, క్రమశిక్షణకీ తార్కాణం.

పదిమంది శ్రేయస్సు గురించిన ఆలోచన ఆయనకి పార్టీ ఇచ్చిన స్ఫూర్తి. చక్కని విగ్రహం, గంభీరమయిన శరీరం, నటనా కౌశలం – జన్మతః వచ్చిన వరాలు. బుర్రకథలో వేదిక మీద సింహం లాగా దూకే మిక్కిలినేని ఛాయలు 'మాయాబజార్' వంటి చిత్రాలలో మచ్చుకి దొరుకుతాయి. ఆ కళాఖండంలో మరో తార రాలిపోయింది. జీవితాన్ని నిలకడగా, నిండుగా, హుందాగా, హృద్యంగా పండించుకున్న నటుడు, రచయిత మిక్కిలినేని. మనిషి నడిచిపోయిన అడుగుజాడలు అభ్యుదయాన్ని ఆశించేవారికి దారిచూపుతూనే ఉంటాయి.

ఒక మహా రచయిత:

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ
కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!






చాలా నెలల కిందట చెన్నై పొట్టి శ్రీరాములు హాలులో జరిగిన బాపూ చిత్రప్రదర్శనకు నేను ప్రారంభకుడిని. ఆనాటి సభలో బాపూ రమణగార్లు ఉన్నారు. నేను ప్రసంగంలో చెప్పాను. మహా రచయితలు ముందు తరం వేసిన మార్గం వెంట ప్రయాణం చేస్తారు. కానీ జీనియస్ లు కొత్త మార్గాన్నే నిర్దేశిస్తారు – అని. అటువంటి జీనియస్లు బాపూ రమణ.

ఏ పేరు మొదలెట్టినా రెండో పేరు కలవకపోతే అది సంతకంలో సగభాగమే. ఇద్దరూ ఒకే నాణానికి రెండు పార్శ్వాలు. ఒక విలక్షణమైన హాస్య ధోరణికి రెండు సూచికలు. రమణ రచనలు చెయ్యలేదు. అది మామూలు రచయితలు చేసే పని. కొత్తపాత్రల్నీ, కొత్త నుడికారాన్నీ, కొత్త ఇతివృత్తాల్నీ, కొత్త తరహా హాస్యాన్నీ సృష్టించారు. మించి జీవించే నైర్మల్యాన్నీ, జీవితపు విలువల్నీ తాను జీవించి నిరూపించారు. ఆ జీవితానికి దృశ్యభాష్యం పేరు – బాపూ.

నా జీవితంలో నేను రాసిన రెండో చిత్రం – రమణగారు మొదలు పెట్టి – హఠాత్తుగా అక్కినేని 'బుద్ధిమంతుడు 'కి కాల్ షీట్లు ఇచ్చిన కారణంగా తాను పూర్తిచెయ్యలేని 'భలే రంగడు '. "ఈ పని నాకు సహాయం చేస్తున్నాననుకొని చేయండి" అన్నారు రమణ. అది ఆయన పెద్దమనస్సు. మద్రాసులో మా రెండు కుటుంబాలూ అత్యంత సన్నిహితం. మా కోడళ్ళు పెట్టే బొమ్మల కొలువుని చూడటానికి వచ్చి మనసారా ఆనందించేవారు. మా ఇంట్లో ప్రతీ శుభకార్యంలోనూ వారి సతీమణుల పాత్ర ఉంటుంది. ఏ సభకయినా – మా సభలకూ – రమణగారు రహస్యంగా వచ్చి – ఓ మూలన కూర్చుని ఆనందించి మాయమవుతారు. ఏ సభలోనయినా 'మొహమాటం'గా పాల్గొంటూ తమ చుట్టూ తెర దించుకుంటారు. అది ఆయన స్వభావం.

వారి పాత్రలూ, సినిమాలూ, కథలూ నిన్న మొన్నటి కోతి కొమ్మచ్చి వరకూ వారికే ప్రత్యేకం. అలాగే వారి అభిమానుల సంపద వారికే ప్రత్యేకం. మంచి చెడులూ, రాణింపులూ, విజయాల ప్రమేయం లేకుండా బాపూ రమణ సంతకం ఉన్నందుకే – చూసి, చదివి ఆనందించే అభిమానుల్ని సంపాదించుకున్న ఘనత వారిది. చదువు మీద ఏ మాత్రమూ ఆసక్తిలేని ఇళ్ళల్లో కూడా వారి పుస్తకాల బైండ్లు – కేవలం వారివే – ఎన్నో దేశాల తెలుగు ఇళ్ళల్లో చుశాను నేను. వాటి పక్కన ఏమూలయినా నా పుస్తకం మచ్చుకి ఒక్కటయినా ఉంటుందా అని వెదికి వెదికి నిరాశ చెందాను. 'నవ్వు'కి రమణగారు ఆలోచనతో, బాపూగారు ఆలోచనాత్మకమయిన బొమ్మతో ఇచ్చిన యూనివర్సల్ పాస్ పోర్టు అది.

ఇద్దరూ రామభక్తులు. రమణగారి ఆఖరి చిత్రం రామకథ. అంతకన్న ధన్యత్వం ఏముంది?

విశాఖ పట్నంలో ఉన్న నాకు ఎవరో ఫోన్ చేసి రమణగారు వెళ్ళిపోయారని చెప్పారు. మూడు నాలుగుసార్లు బాపూగారికి ఫోన్ చెయ్యాలని ఫోన్ పట్టుకుని, ప్రయత్నించి చెయ్యలేకపోయాను. కారణం – బాపూగారిలో ఓ పెద్ద భాగం కన్ను మూసింది. సంతాపానికి సంతాపం చెప్పడం సాహసం. నా అనుభవానికి లొంగని ప్రయత్నమది. బాపూగారి సోదరులు, రమణగారి వియ్యంకులు, రేడియోలో నా సహచరులు, చిత్రకారులు, నా మిత్రులు శంకర్ నారాయణగారికి ఫోన్ చేశాను.

A part of Bapu is dead. Can you convey my condolences... please..!

(ఫిబ్రవరి *28,* 2011)



# (March 07, 2011) Chaavu Hakku – 'చావు' హక్కు

నాకు చాలా ఇష్టమైన ఆల్ఫ్రెడ్ హిచ్ కాక్ సినిమాల్లో 'ది రోప్' ఒకటి. ఒక సాయంకాలం – కేవలం ఊసుపోకకి, తమ తెలివితేటల్ని నిరూపించుకోవాలనే వికారమైన, విపరీతమైన ఆనందానికి ఇద్దరు యువకులు తన మిత్రుడిని హత్యచేసి ఒక సందుగ పెట్టెలో శవాన్ని ఉంచి, ఆ పెట్టె మీదే ఆ సాయంకాలం మిత్రులకి విందుని ఏర్పాటు చేస్తారు. వాళ్ళ టీచరు హత్యని గుర్తుపడతాడు. అప్పటి ప్రముఖ నటుడు జేమ్స్ స్టూవర్ట్ ఆ పాత్రని నటించాడు. విషయం తెలిసి షాక్ అయి వాళ్ళిద్దరినీ నిలదీస్తాడు. "మరొక వ్యక్తిని చంపేహక్కు మీకెవరిచ్చారు? మీరేం దేవుళ్ళా?" అంటాడు. సంవత్సరాలు గడిచినా ఆ సన్నివేశం నాకు జ్ఞాపకం వస్తూంటుంది. రీలు నిడివి 900 అడుగులు కనుక – తప్పదు కనుక – 8 షాట్లలో తీసిన ఈ చిత్రంలో ఆ పతాక సన్నివేశాన్ని అద్భుతంగా నటించారు జేమ్స్ స్టూవర్ట్. ఆనాటికీ, ఈనాటికీ అది గొప్ప ప్రయోగం. అయితే అలా తీసినందుకు తర్వాత హిచ్ కాక్ బాధపడ్డాడు. కారణం? కొన్ని నిశితమైన విషయాల్ని నిలదీసి చెప్పలేకపోయినందుకు. సరే. ఇది విషయాంతరం.

మనిషి చావుని నిర్ణయించే అధికారం ఒక్క దేవుడికే ఉందని గుర్తుచేసిన సందర్భమది. మరి ఉరిశిక్షలు? అవసరమా? ఉరిశిక్షలు విధించే హక్కు న్యాయస్థానానికి ఉన్నదా, ఉండాలా అన్నది ఇంతవరకూ తెగని సమస్య. ఏ అజ్మల్ కసాబ్నో, అఫ్జల్ గురూనో, కొన్ని లక్షల మంది యూదుల చావుకి కారణమయిన అడోల్ఫ్ ఈక్ మన్ నో తలుచుకున్నప్పుడు మన నమ్మకాలు సడులుతాయి. కాని ఆరోగ్యకరమైన వ్యవస్థలో 'చావు' సామాన్యమే అయినా చంపడం, చచ్చిపోనివ్వడం, కోరి చావుని అంగీకరించేటట్టు చేయడం – సంస్కారానికీ, ఉదాత్తమయిన మానవతా విలువలకీ ఎదురు తిరిగే సమస్య.

ఇప్పుడు అసలు కథ. 1973 లో కర్ణాటకలో హాల్దీపూర్ లోని కింగ్ ఎడ్వర్డ్ మెమోరియల్ ఆసుపత్రిలో పనిచేసే అందమయిన నర్స్ – అరుణా షాన్ బాగ్ ని సోహన్ లాల్ భార్తా వాల్మీకీ అనే వార్డ్ బోయ్ కుక్క గొలుసుతో గదిలో బంధించి దారుణంగా రేప్ చేశాడు. ఆమె చెవి రింగులు, రిస్టువాచీ దోచుకున్నాడు. గొలుసుతో గొంతు బిగించడం వల్ల – మెదడుకి అందాల్సిన ప్రాణవాయువు నిలిచిపోయింది. అతని హింసకి ఆమెకి చెవులు పోయాయి. కళ్ళుపోయాయి. మానసిక స్థిమితం పోయింది. అప్పటినుంచీ – 37 సంవత్సరాలు – ఇదే స్థితిలో – అరుణ కొనసాగుతోంది. ఆమెకి ప్రస్తుతం 62 సంవత్సరాలు. కేవలం ప్రాణం ఉన్న కట్టెలాగ – జీవచ్ఛవమైపోయింది. శరీరంలో ప్రాణం ఉంది. ఏదయినా ఆహారం ఇస్తే నోరు తెరుస్తుంది. ఆమెకి ఆ రోజుల్లో ఇష్టమైన మాంసాహారం ఇస్తే ముఖం కాస్త వికసిస్తుంది. నోటమాట లేదు.

ఇప్పుడు ముఖ్యమైన ప్రశ్న. ఎవరికీ ఉపయోగంలేని, తనకూ ప్రయోజనం లేని ఈ జీవితాన్ని నిరవధికంగా ఇలా కొనసాగించవలసిందేనా – అన్నది. అయితే మనిషి ఏదయితే ఇవ్వలేడో – మనిషి ప్రాణాన్ని – దాన్ని తీసే హక్కు అతనికి లేదన్నది – ముఖ్యమయిన వాదన. ఆమె దయనీయంగా హింసని అనుభవించకుండా – హుందాగా, నిశ్శబ్దంగా కన్నుమూసే హక్కు ఆమెకి ఉన్నది – అన్నది మరో వాదన.

అయితే ఈ హక్కుని ఎవరు నిర్ణయించాలి? వెళ్ళిపోవడాన్ని ఆమె కోరుకుంటున్నదని ఎవరు నిరూపించగలరు? మనకు తెలియని నిర్ణయాన్ని, మనం మంచిదనుకున్న విధంగా – ఒక ప్రాణానికి సంబంధించి తీసుకునే హక్కు ఉన్నదా? సంస్కృతీ వికాసంలో మానవుని సంస్కారాన్నీ, ఉదాత్తత ప్రశ్నించే అత్యంత కీలకమైన విషయం ఇది. ఈ నిర్ణయాన్ని బంధువులు కోరినా, ఆత్మీయులు అర్థించినా "ఆమె తన్నుకులాడుతోంది. వెళ్ళిపోనివ్వండి" అని అయినవాళ్ళు ప్రార్థించినా – నిర్ణయం తీసుకోడానికి న్యాయవ్యవస్థ ఎప్పుడూ వణుకుతూనే ఉంది.




కారణాలు – మానవత్వపు విలువలకి సంబంధించినవే – ఎన్నెన్నో. గుండెల్ని వణికించే ఉదాహరణ – అమెరికాలోనే జరిగింది. కారెన్ ఆన్ క్విన్ లాన్ అనే ఆవిడ చాలా సంవత్సరాలుగా ఇలాంటి దయనీయమైన స్థితిలోనే ఉన్నది. ఇది 1975 మాట. కోర్టు ఆమెను చచ్చిపోనివ్వవచ్చని అంగీకారం తెలిపింది. వెంటిలేటర్లు తీసేశారు. ఆ తర్వాత ఆమె – కేవలం పది సంవత్సరాలు బతికింది. న్యాయస్థానం, ప్రపంచం వణికిపోయింది. 1985 జూన్ 11 న కన్నుమూసింది. మృత్యువుని ఆహ్వానించడానికి మనమెవరం? మన తాహతు ఎంత? భవిష్యత్తుని గురించి మన అవగాహన ఎంత? నైతికమయిన ఊతం ఎంత? ఈ విషయమై గుండెల్ని పిండిచేసేంత అద్భుతమైన నాటకాన్ని బెన్ క్లార్క్ అనే అమెరికన్ నాటక రచయిత రాశాడు. ఈ నాటకం ఆధారంగా తీసిన సినిమాలో ఈ పాత్రని మహానటుడు రిచర్డ్ డ్రైఫస్ నటించారు. ఆ చిత్రం ఒక మహాకావ్యం. అతని నటన అపూర్వం. అంతకుమించి – ఆ నాటకం ఇచ్చే సందేశం.

అరుణ గురించి పింకీ ఇరానీ అనే పాత్రికేయురాలు 'అరుణ కథ' అని పుస్తకం రాసింది. ఆమె సుప్రీం కోర్టులో ఒక దరఖాస్తు పెట్టింది. అరుణ చూడలేదు. వినలేదు. ఒక నిర్జీవమైన కట్టె ఆమె జీవితం. ఆహారాన్ని ఆపుచేసి హుందాగా ఆమెని వెళ్ళిపోనివ్వండి – అని ఆమె దరఖాస్తు సారాంశం. ఒక నిర్ణయానికి రావడానికి సుప్రీం కోర్టు గుంజాటన పడుతోంది. ఒక విధంగా అజ్మల్ కసాబ్ శిక్షని నిర్ణయించడం తేలిక. ఒక దురన్యాయానికి గురై, ప్రాణాలతో ముప్పై ఏడు సంవత్సరాలుగా పోరాడుతున్న మనిషిని చచ్చిపోనివ్వాలా వద్దా అన్నది, అతి క్లిష్టమైన నిర్ణయం.ఇంతకీ నేరస్థుడు సోహన్ లాల్ ఏమయాడు? హత్యకి ప్రయత్నించినందుకు అతనికి కోర్టు ఏడు సంవత్సరాలు శిక్షని విధించింది. రేప్ నేరాన్ని కోర్టులో ప్రవేశపెట్టలేదు నర్స్ భవిష్యత్తు దృష్ట్యా. ఫలితంగా సోహన్ లాల్ ఏడేళ్ళ తర్వాత విడుదలయి, పేరు మార్చుకుని – మళ్ళీ ఢిల్లీ ఆసుపత్రిలో వార్డ్ బోయ్ గా చేరాడు. ఈ మధ్య ఎయిడ్స్ వ్యాధితో చచ్చిపోయాడు.

ఆమెని పరీక్షించిన వైద్యుడు డాక్టర్ ప్రజ్నా పాయ్ – ఇలా అన్నారు. ప్రాణాన్ని నిలిపే యంత్రాల మీద ఆధారపడి ఆమె ప్రస్థుతం ప్రాణం నిలుపుకోలేదు. గుండె కొట్టుకుంటోంది. మెదడు – ఏ కొంచెమయినా పనిచేస్తోంది. అంటే ఆమె చచ్చిపోయినట్టు లెక్కకాదు. అయితే ఏది చావు? మర్యాదస్తుడికి పరువు, నీతి పరుడికి నింద, ఆడదానికి మానం, మగాడికి బ్రతికే ఆశ – చాలదు. మనిషి ఇంక చచ్చిపోవచ్చునని చెప్పడానికి ఈ తూకపు రాళ్ళు చాలవు. ఇంకాస్త లోతుకి పోతే ప్రాణం పోయలేని మనిషి మరొక ప్రాణం తీయవచ్చునని నిర్ణయించడానికి ఏ తూకపు రాయీ చాలదు.మరి ప్రేమించలేదని ఏసిడ్ పోసేవాళ్ళకి, మతాన్ని ఎదిరించారని మారణ హోమానికి పూనుకున్నవారికి, కార్పణ్యాలు కారణంగా కత్తులు దూసేవారికి – 'చావు' ఒక ప్రతీకారం. కాని న్యాయవ్యవస్థకి, ఉదాత్తమయిన మానవతా దృష్టితో చూడగల వ్యక్తికి – మరొకరి 'చావు'ని నిర్ణయించడం – అత్యంత సాహసం. అనూహ్యం. నరాల్ని వణికించే మీ మాంస.

ఇదే ఓ ఏసుప్రభువు, ఓ మహాత్ముడూ, ఓ బుద్దుడూ, ఓ మదర్ థెరెస్సా – తాము జీవించి – నిరూపించినది. తమ ప్రాణాలు ఒడ్డి రుజువు చేసినది.మృత్యువు సమదర్శి – మన ప్రమేయం లేకుండా మీద పడినప్పుడు. మృత్యువు పెద్ద చెలియలి కట్ట – మనిషి జీవన గమనాన్ని ఆపే అవసరం, అగత్యం మన చేతుల్లోకి వచ్చినప్పుడు.

సుప్రీం కోర్టు పింకీ ఇరానీ దరఖాస్తుని తోసిపుచ్చింది. అరుణని ప్రాణాలతో ఉండనివ్వాలని శాసించింది.

*(మార్చి 7*, 2011)



అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

# (March 14,2011) Neethi Avineethi నీతి – అవినీతి

నేను చదువుకునే రోజుల్లో భాగల్పూర్ వెళ్ళి హిందీ పరీక్షలు రాసే సౌకర్యం ఉండేది. నేను కొన్ని పరీక్షలకి చదివిన గుర్తు. దేశంలో ఇన్ని రాష్ట్రాలు, ఇన్ని జిల్లాలు ఉండగా భాగల్పూర్ ప్రత్యేకత ఏమిటా అని ఆ రోజుల్లో నేను ఆలోచించలేదు. ఆలోచిస్తే ఇన్నాళ్ళకి, ఇన్నేళ్ళకి సమాధానం దొరికేది. ఈ ప్రత్యేకత ఆ ఊరుదీ, ఆ విశ్వవిద్యాలయానిదీ కాదు. ఆ రాష్ట్రానిది – బీహారుది. ఈ విషయం నిన్న టీవీలో కనిపించిన ఓ సుందర దృశ్యం విశదపరచింది. ఇదీ ఆ దృశ్యం.

బీహారులో ఒక స్కూలులో – లోపల విద్యార్థులు పరీక్షలు రాస్తూంటే – బయట గోడల దగ్గర వారికి సహాయం చేసి, వారిని నెగ్గించాలని కంకణం కట్టుకున్న అభ్యుదయవాదులు కొందరు తంటాలు పడుతున్నారు. ఒక రక్షక భటుడు వాళ్ళ దగ్గరికి వచ్చాడు. ఇక వాళ్ళ ఆట కట్టని మనం భావించవచ్చు. కాని వాళ్ళని ఆపలేదు. ఆపకుండా వాళ్ళ పని వాళ్ళని చేసుకోనివ్వడానికి 'రుసుము' అడిగాడు. ఉదారులయిన ఈ సహాయకులు రుసుముని ఆనందంగా ఇచ్చారు. పోలీసు ఆనందంగా అక్కడనుంచి నిష్క్రమించాడు. ఇప్పుడు సహాయకులు ద్విగుణీకృతమైన ఉత్సాహంతో గోడలు ఎక్కడం ప్రారంభించారు. ఇప్పుడూ – నా చిన్ననాటి భాగల్పూరు ప్రత్యేకత అర్థమయింది.

అలనాడు – ఇలాంటి రక్షణనే కల్పించిన భటుల, సహాయకుల పుణ్యమాంటూ పరీక్షల్లో నెగ్గి, ఉద్యోగాలు సంపాదించిన అధికారులే పెరిగి పెద్దవారయి – మనకు 2 జి స్కాముల్లో అరెస్టయిన ఆర్.కె.చందోలియాలుగా, టెలికాం సెక్రెటరీ సిద్ధార్ధ బెహూజాలుగా దర్శనమిచ్చారని మనం గర్వపడవచ్చు. అయితే వీరిలో కొందరు తాటిచెట్ల కింద పాలుతాగిన పెద్దలయివుండవచ్చు. ఏమయినా 'అవినీతి'కి అందమయిన రక్షణ కల్పించే రక్షక భటులున్న ఈ వ్యవస్థలో ఇలాంటి స్కాంల పునాదులుంటాయని, ఈ స్కాంలు చదువులకి గోతులు తవ్వే స్థాయిలోనే ఏర్పడుతున్నాయని మనం గ్రహించాలి. డిగ్రీలని లంచాలతో దక్కించుకునే ఆఫీసర్లు, అధికారుల నుంచి ఇంతకన్న నిర్వాకాన్ని మనం ఆశించడం అన్యాయం.

'నీతి' చాలా దుర్మార్గమయిన ముడి సరుకు. అది ప్రదర్శించే వస్తువుకాదు. రాజకీయ నాయకుల ఉపన్యాసాల దగ్గర్నుంచి, టెలికాం మంత్రుల చీకటి గదుల భాగోతాల దగ్గర్నుంచి, పరీక్ష హాళ్ళ గోడల పక్క ఖాకీజేబులదాకా – ఇది సర్వాంతర్యామి. కెమెరా ఉంది కనుక మనం చూశాం కాని – దీనికి 'నీతి' బురఖా తొడగడం చాలా తేలిక. నీతి ఎవరి స్థాయిలో వారు విశృంఖలంగా, నిస్సిగ్గుగా, నిర్భయంగా వాడుకునే వ్యభిచారం. మొన్నటిదాకా ఏ.రాజాగారు నీతి గురించి ఎంత హుందాగా, ఎంత నమ్మకంగా, ఎంత స్పష్టంగా, ఎంత నిర్భయంగా మాట్లాడారు?

ఖత్రోచీ వంటి ప్రతినాయకుడు దొరికాడా? చస్తే ఆ నీతికి తిరుగులేదు. ఎంత గడ్డితిన్నా మంత్రి పదవి దొరికిందా – ఆ 'నీతి' (అవినీతి అని చదువుకోగలరు) జేగీయమానంగా వెలిగిపోతుంది.

నాకు నాకు చాలా ఇష్టమయిన ఓ చిన్న కథని టూకీగా చెప్పి ముగిస్తాను. ఈ కథని చెప్పడానికి నేను ఎన్నడూ జీవితంలో అలసిపోను.

ఓ మారుమూల గ్రామంలో గాంధీగారి మిత్రుడు జబ్బుపడ్డాడు. అతన్ని చూడాలని బయలుదేరారు బాపూ. అర్ధరాత్రి. సమీపంలోని రైలు స్టేషన్లో దిగారు – ఒంటరిగా. అక్కడనుంచి దాదాపు పదిమైళ్ళు రోడ్డు ప్రయాణం. చీకటి. అలవాటులేని మార్గం. ఒక ఒంటెద్దు బండివాడు బండి కడతానన్నాడు. జీవహింస బాపూకి కిట్టదు. ఎద్దుని కొట్టకుండా దాని మానాన దాన్ని నడవనిస్తే ఎక్కుతానన్నారు. బండివాడు అంగీకరించాడు.




బండి కదిలింది. యజమాని కొరడా దెబ్బకి అలవాటుపడిన ఎద్దు మొరాయిస్తూ పెళ్ళి నడక నడుస్తోంది. బండివాడి చేతిలో కొరడా దురద పెడుతోంది. ఒక్కటి తగిలిస్తే బండి దూకుతుందని తెలుసు. కాని ఇచ్చిన మాట. పదిమైళ్ళు – రెండు గంటలు నడిచింది. బాపూ కునుకుతున్నారు. దూరాన ఊరు కనిపిస్తోంది. ఇక బండివాడు ఆగలేకపోయాడు. ఎద్దు వీపు మీద కొరడా ఛళ్ళుమంది. బండి దూకింది. బాపూ తుళ్ళిపడి లేచాడు. బండిని ఆపమన్నాడు.

"ఊరొచ్చేశాం మహరాజ్! దీనికిది మామూలే" అన్నాడు బండివాడు.

బాపూ చేసినవి రెండు నేరాలు. జీవహింసకి కారణం కావడం. అందుకు బండివాడికి అవకాశాన్ని ఇవ్వడం. తనకి శిక్షపడాలి. బాపూ బండి దిగారు. ఎదురుగా ఊరు. తన చుట్టూ ఎవరూ లేరు. జరిగిన అనర్థానికి బాధపడి మరిచిపోవచ్చు. ముందుకు తరలిపోవచ్చు. ఎవరికీ సంజాయిషీ చెప్పనక్కరలేదు. ఎవరూ ప్రశ్నించరు. కాని బాపూ తప్పు చేశాడు. తన అంతరాత్మ ఉంది. ఆ తప్పుకి శిక్షపడాలి. తనని తాను సంస్కరించుకోవడం నీతి. నీతి ఎదుటివాడికి మనం చేసే ప్రదర్శన కాదు. సభలో ఉపన్యాసం కాదు. కెమెరాల ముందు చేసే బుకాయింపు కాదు. ఆత్మబలాన్నిచ్చే అంటువ్యాధి.

బాపూ – డబ్బు చెల్లించి – మూగ ప్రాణం ఎద్దుకి క్షమాపణ చెప్పి – వెనక్కి తిరిగి పదిమైళ్ళు వెనక్కి స్టేషన్ కి నడిచి – మళ్ళీ ఊరికి నడిచి వెళ్ళారు.

ఆయన బాపూ. ఈ తరానికి మహాత్ముడు. నీతికి ఇంతకంటే గొప్ప ఉదాహరణ – ఉంటే – అది నాకు తెలీదు.

(ఈ కథ విన్నాక బాపూ నిరాహార దీక్షల వెనుక పరమార్థం మనలాంటివారికి ఏలేశమయినా అర్థమౌతుంది. అది సమాజానికో, వ్యవస్థకో చేసే బెదిరింపు కాదు. ఆనాటి పాలక వ్యవస్థ బెదిరింది, ఆయన బ్లాక్ మెయిల్ కి కాదు. అటువంటి మహానాయకుడు పోతే పెల్లుబికే ప్రజల ఆగ్రహావేశాలకి. ఆయన దీక్ష – వ్యక్తి స్థాయిలో – కేవలం ఆత్మక్షాళనకి ఆయుధం. జీవుని వేదనని సమాజ హితంతో సంధించిన గొప్ప జిజ్ఞాసి ఆయన. రాజకీయ హితాన్ని ఆధ్యాత్మిక చింతనతో ముడిపెట్టి సాధించిన వీరుడు – అంతకు ముందూ, ఆ తర్వాతా ఎవరూ లేరు. అందుకే ప్రపంచం నిశ్చేష్టమయిపోయింది. రవి అస్తమించని బ్రిటిష్ పాలక వ్యవస్థ వేళ్ళతో కదిలింది. ఇప్పుడు ఈ మధ్య మనం వింటున్న ఆమరణ నిరాహార దీక్షలు, రిలే దీక్షల్లో అపురూపమయిన 'హాస్యం' ఇప్పుడు అవగతమౌతుంది.)

*(మార్చి 14,* 2011)

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

# (March 21, 2011) Cell is hell సెల్ ఈజ్ హెల్

పీవీ నరసిం హారావుగారి ధర్మమాంటూ టెలిఫోన్ డిపార్ట్ మెంట్ వారి నిరంకుశత్వం అణగారి ప్రజలకి స్వేచ్ఛ లభించింది. ఆ రోజుల్లో టెలిఫోన్ సౌకర్యం ఒక ఆస్తి సంపాదనలాగా తయారయి – ఎంతో భయంకరమైన అవినీతి ఎన్నో దశల్లో ఆవరించుకోవడం చాలామందికి ఇంకా గుర్తుండే ఉంటుంది. ఇవాళ ఆ డిపార్ట్ మెంట్ రకరకాల రాయితీలతో ప్రజల్ని దేబిరించే స్థితికి వచ్చింది. అది దాని ఖర్మ. అక్కసుతోనే ఈ నాలుగు మాటలూ అంటున్నాను.

సెల్ ఫోన్ పెద్ద సమాచార విప్లవం. కోట్ల మంది చేతుల్లో ఆ సౌకర్యం ఉంది. అయితే ఇప్పటికీ సెల్ వినియోగదార్లు దాన్ని సరిగా అవగాహన చేసుకోని సందర్భాలు లక్షలు. అయితే ఇంత విస్తృతమయిన వినియోగంలో ఇంత పెద్ద అవగాహనని ఆశించడం అన్యాయమేమో!

నాలాటి ఎందరికో ఇది హింస. నరకం. కొన్ని ఉదాహరణలు. ఫోన్ మోగుతుంది. తీస్తాను.

"గొల్లపూడిగారేనాండీ?"

"ఆ"

"నిజంగా గొల్లపూడి గారేనాండీ?"

"అవును బాబూ"

"నేను నమ్మలేకపోతున్నానండి"

"నమ్ముబాబూ"

"అయ్ బాబోయ్ – నాకు చిన్నప్పట్నుంచీ మీరంటే చచ్చేంత అభిమానమండి" – ఇక ఫోన్ ఆగదు.

కొందరు ఫోన్ చేస్తారు. ఉపోద్ఘాతం ఉండదు. "రంగా! ఏట్రా? ఇంకా బయల్దేరలేదురా తప్పుదునా కొడకా?"

మరి కొందరు సరాసరి విషయం లోకి వచ్చేస్తారు: "మీరిక కాదనకండి బాబూ – ఏభైకి బేరం తెగ్గొట్టెయ్యండి. మావోడు ఏడుత్తున్నాడండి"

అసలు సెల్ ఫోన్ తిప్పే వాళ్ళకి అర్థం కావలసిన మొదటి విషయం – అవతలి మనిషి గెడ్డం చేసుకుంటున్నాడా? కాఫీ తాగుతున్నాడా? కడుపు నొప్పితో బాధపడుతున్నాడా? పెళ్ళాం తిట్లను భరిస్తున్నాడా? ముక్కుపొడుం దొరక్క ఇబ్బంది పడుతున్నాడా? కక్కసులో ఉన్నాడా? బదిలీ అయి భయంకరమైన డిప్రెషన్ లో ఉన్నాడా? సెల్ ఫోన్ ఎప్పుడయినా, ఎక్కడయినా హఠాత్తుగా మోగుతుంది.అవతలి వ్యక్తిని అదాటుగా

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

పట్టుకుంటుంది. అవతలి వ్యక్తి అప్పటి పరిస్థితి మనకి తెలీదు. కాని తెలుసుకోవలసిన అవసరం ఇవతలి వ్యక్తికి ఉంది. అది మొదటి షరతు. అవతలి వ్యక్తి హక్కు.

"రంగయ్యగారా?" అని అడిగితే తప్పేముంది.

లేదా – "నేను వెంకట్రావునండి. విజయనగరం పాల డిపో వెంకట్రావునండి. ఒక్క నిముషం మాట్లాడవచ్చునాండి?" అన్నారనుకోండి.

"అయ్యో – తప్పకుండా –" అన్నాడనుకోండి. అంతే. ఇద్దరికీ సయోధ్య ఏర్పడినట్టు.

లేదా –

"నేను వీరభద్రాన్ని –" అని పలకరిస్తే –

"ఏరా, బాగున్నావా? ఎన్నాళ్ళయ్యింది నీ గొంతువిని –" అని సమాధానం వచ్చిందనుకోండి. ఇద్దరూ ఒక వేవ్ లెంక్త్ లో ఉన్నట్టు.

ఒకప్పుడు: "నేను ఫలానా." అని ఫోన్ వస్తుంది.

మెల్లగా "సభలో ఉన్నాను. పదినిముషాల్లో మాట్లాడుతాను.." అంటే ఒక సమన్వయం. ఎదుటి వ్యక్తి కష్టాన్ని అర్థం చేసుకోవడం. ఒక మర్యాద.

మరో రకం హింస: "నేను రాజునండి. నిన్న వస్తానని రాలేదేమండి?"

రాజు, శర్మ, శాస్త్రి, రావు – ఇవన్నీ వెంటనే గుర్తుకురాని పొడి పేర్లు. మరేదో పనిలో ఉంటున్న వారికి ఏ రాజు, ఏ పనో వెంటనే స్ఫురించి చావదు. కాని ఆలోచించరు. ఆ ఫోన్ కోసమే ఎదురు చూస్తున్నట్టు, రాజు అనగానే ఇటుపక్క అతని ముఖం సినిమా స్కోపులో కళ్ళముందు దర్శనమిస్తుందనీ, రాజు మనస్సులో ఉన్న ఆలోచనలన్నీ ఇటు ఫోన్ ఎత్తినవారి మనస్సుల్లోనూ అంతే ఉధ్రుతంగా తోసుకువస్తాయనీ నమ్ముతారు. ఇది హింస.

నేను కథ రాసుకుంటూ ఉంటాను. లేదా నెలసరి లెక్కలు చూసుకుంటూ ఉంటాను. ఇప్పుడు ఈ రాజు ఫోను. ఏ రాజు? ఎక్కడికి వస్తానన్నాను? ఎందుకు? నా రచన ఆలోచన తెగిపోతుంది. లెక్కలు గాడి తప్పుతాయి. మనస్సులో విసుగు. నిస్త్రాణ. ఇప్పుడీ ఫోన్ ఏమిటని – చిరాకు.

"నేను వీర్రాజునండి. మీ పొలాల గురించి దస్తావేజులు రాయమని నాకు అప్పగించారు కదండి?" అని చెపితే –

వెంటనే ఆలోచనకి ఆలంబన దొరుకుతుంది. మెదడు – ఆ విషయాన్ని ముందుకు తోస్తుంది. రాజు మనస్సులో నిలుస్తాడు. అప్పుడు మనకి తీరిక లేకపోతే "పనిలో ఉన్నాను. పది నిముషాల్లో మాట్లాడుతాను రాజుగారూ" అనే అవకాశం దొరుకుతుంది.

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

హఠాత్తుగా చేతిలో మోగిన ఫోన్ కి – ఫోన్ చేసే వ్యక్తి ఊతం ఇవ్వగలిగాలి. తప్పులేదు. తప్పదు. విధిగా చెయ్యాల్సిన పని. నిజానికి ఇప్పటికీ నేనా పని చేస్తాను.

"నేను గొల్లపూడి మారుతీరావుని బాబూ – రచయితని, సినిమా నటుడిని" అని చెప్పుకుంటాను.

"అయ్యో, మిమ్మల్ని తెలియని వారెవరుంటారండీ" అని అటునుంచి సమాధానం వస్తే మంచిదే. కాని ఒక్కొక్కప్పుడు – రాదు. రాకపోతే తప్పులేదు. "మీరు ఫోన్ చేశారని మా డాడీతో చెపుతానండి" అంటుంది నన్ను గుర్తుపట్టని గొంతు. మర్యాదే. నేను సర్వాంతర్యామిని ను. కాని ఇక్కడ గజిబిజిలేదు. మర్యాదలోపం లేదు.

ఆఖరుగా సెల్ ఫోన్ లో క్షమించలేని, భరించరాని, అతి దుర్మార్గమయిన, అతి క్రూరమైన, ఆలోచనారహితమైన, రాక్షసత్వం – ఒకటి ఉంది. ఇప్పటికీ చాలామంది ఈ పని చేస్తూంటారు. ఎంతో నిర్దయతో, బొత్తిగా sensitivity లేని పని ఇది. ఎంతో ముఖ్యమైన పనిలో ఉన్నప్పుడూ ఫోన్ మోగుతుంది. "ఏరా?" అంతే పిలుపు.

నిస్సహాయంగా, పనిలో ఉన్న మనం "ఎవరు?" అన్నామనుకోండి.

"ఆ మాత్రం పోల్చుకోలేవా?" అని సవాలు.

ఇటు బ్లడ్ ప్రెజర్ పెరుగుతుంది. మనం ఏదో సభలో ఉంటాం.

"ఎవరో చెప్పండి" అంటాం, అక్కడికి కోపాన్ని తట్టుకుని.

అటు పక్క వ్యక్తి సరదాగా మన నిస్సహాయతకి ఆనందిస్తూంటాడు – పక్కవాడిని సూదులు గుచ్చి కితకితలు అనుభవించే శాడిస్టులాగ.

"నీ ఫ్రెండు. పోల్చుకో చూద్దాం.."

ఇంతకంటే హింస లేదు. అటు పక్క స్నేహితుడి మూడ్ లో మనం ఉండం. తలకెక్కిన పనిలో ఉంటాం అతని మూడ్ తన స్నేహితుడి నిస్సహాయతతో ఆడుకునే ప్రసన్నత. మన బాధ – ఇటు భరించలేని కడుపునొప్పి కావచ్చు. దుర్భరం. అటు పక్క వ్యక్తికి అర్థం కాదు. ఇంకా ఆ ఆకతాయి, అల్లరి, క్రూరమయిన ఆటని కొనసాగిస్తాడు. ఇది చాలా దరిద్రమయిన prank. ఎవరూ – అతను నీ ప్రాణ మిత్రుడయినా హర్షించడు.

నేను – ఒకసారి – కావాలనే – ఈ నరకాన్ని బరించలేక – అవతలి వ్యక్తికి బుద్ధిచెప్పాలనే ఆ జోక్ ని అతి దారుణంగా కొనసాగించాను. "ఒరేయ్, నువ్వెటా దరిద్రం నా కొడకా! ఇన్నాళ్ళకి ఫోన్ చేస్తావా? నిన్ను చెప్పు తీసి కొట్టాలిరా. నేనిప్పుడు జ్ఞాపకం వచ్చానా? ఈ మాటు కల్సినప్పుడు – నిన్ను జుత్తు పట్టుకు చావగొట్టకపోతే నీ మీద ఒట్టు, పెంట వెధవా!" అన్నాను.



అటు పక్క గొంతు కంగారుపడిపోయింది.

"అయ్యా అయ్యా – నేను గంగాధరరావుని. మనిద్దరం – 1996 లో హౌరా మెయిల్ లో నిడదవోలుదాకా ప్రయాణం చేశాం" అని తడబడ్డాడు.

వెంటనే నేనూ తడబాటుని నటించాను. "అరెరె! మీరా? మీ గొంతు అచ్చు మా ఆంజనేయులు గొంతులాగ ఉందండీ. వాడెప్పుడూ వస్తానంటాడు. రాడు – పింజారీ వెధవ. సారి. మా వాడేమో అనుకున్నాను – బాగున్నారా?"

అక్కడితో ఆ క్రూరమయిన ప్రహసనానికి తెరపడింది.

దయచేసి ఒక్కటి గుర్తుంచుకోండి. సెల్ ఫోన్ ఎదుటి వ్యక్తిని అదాటుగా, హఠాత్తుగా, ఉన్నట్టుండి పట్టుకునే క్రూరమయిన ఆయుధం కాదు. కేవలం ఒక సౌకర్యం. సెల్ ఫోన్ లో మొదటి వాక్యం – అటు మీ పెళ్ళాం ఉన్నా – తప్పనిసరిగా – మీరెవరో చెప్పేదిగా ఉండాలి. "భారతీ – నేను శీనూని" అనడంలో మీ మర్యాదకి భంగం రాదు.

మీరు దేవుడయినా – మీరెవరో, ఎందుకు ఫోన్ చేస్తున్నారో చెప్పాలి. అందుకు వ్యవధి – పది సెకన్లు. అది మర్యాద. పద్ధతి. మీ కాల్ ని – తీసుకుంటున్న అవతలి వ్యక్తి హక్కు. అన్నిటికీ మించి – మీ చేతిలో ఉన్న సౌకర్యం యొక్క పరిమితి. పరిధి. ముఖ్యంగా పాటించాల్సిన రూలు.

(*మార్చి 21,* 2011)

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!






# (March 28,2011) Desa Seva దేశసేవ

ఈ దేశంలో ఎందరో రాజకీయనాయకులు లక్షలు, కోట్లు ఖర్చుచేసి, రాత్రింబవళ్ళు శ్రమించి, అవసరమయితే హత్యలు చేసి, చేయించి ఎందుకు నాయకులవుతున్నారో ఎప్పుడయినా ఆలోచించారా? వాళ్ళని అడగండి. కళ్ళు ఎర్రబడేలాగ ఆవేశపడి 'దేశ సేవ ' కోసమని చెపుతారు. వీళ్ళని దేశసేవ చేయమని ఎవడేడ్చాడు? వీళ్ళు 'చెయ్యని' రోజు ఏనాడయినా వస్తుందా అని ఆశగా ఎదురు చూసే ఎందరో నాయకుల పేర్లు, మొహాలు మనకు తెలుసు.

ఆ రోజుల్లో తిలక్, లాల్ బహదూర్ శాస్త్రి, మహాత్మాగాంధీ, నెహ్రూ – వీళ్ళంతా ఏం పెట్టుబడులు పెట్టి నాయకులయారు? నెహ్రూగారు ఏనాడయినా "నన్ను ఎన్నుకుంటే మీకో టార్చిలైటు ఇస్తాను. లేదా నాలుగు పెన్సిళ్ళు ఇస్తాను" అన్న పాపాన పోయారా? పోనీ, అనలేదని ఓట్ళు వేసేవాళ్ళు ఆలోచించారా? మా అమ్మా నాన్నా గాంధీగారిని రెండు ఫర్లాంగుల దూరం నుంచి మాత్రమే చూసిన అతి నేలబారు వోటర్లు. చచ్చిపోయే వరకూ మా అమ్మ కాంగ్రెసుకే ఓటు వేసేది.

విజయనగరంలో పుట్టి పెరిగింది కనుక "మా రాజావారు" అంటూ ఏ రాజుగారు నిలబడినా ఓటు వేసేది. ఆయన పార్టీలో, అభిప్రాయాలో ఆవిడకి తెలీవు. అవినీతి విశ్వరూపం దాల్చక, ఇంకా విశ్వాసానికి కాలదోషం పట్టని రోజులవి.

గుండె బాదుకుంటూ ఉపన్యాసాలిచ్చే నాయకులు ఎంత దుగుల్బాజీలో ఓటరుకి తెలుసు. ఏ విధంగానూ వాళ్ళ నుంచి తనకు విముక్తి లేదనీ తెలుసు. నిలబడిన నలుగురిలో – ఎవరి వల్ల 'తక్కువ ' అన్యాయం జరుగుతుందో ఆలోచించి, ఎవరివల్ల ఎక్కువ 'లాభం ' కిట్టుబాటవుతుందో బేళ్ళించుకుని ఓటు వేస్తున్నాడు – మరో గత్యంతరం లేక. ఏతావాతా నాయకుడికి పదవి పెట్టుబడి. ఓటరుకి ఓటు రాబడి. మధ్యలో దరిద్రంలో పడి నాశనమయిపోయేది ఏమిటి? దేశం. అది ఎవడిక్కావాలి?

ఈ ఒప్పందానికి అతి లాయకీగా పురోగతిని సాధించిన రాష్ట్రం – తమిళనాడు. కరుణానిధిగారి మొహాన్ని చూస్తూ – ఆయన దేశాన్ని ఉద్ధరిస్తారని ఎవరూ నమ్మరు. పెళ్ళాల పేరిట ఛానళ్ళూ, కొడుకులూ, రెండో పెళ్ళాం కూతుళ్ళూ, మేనల్లుళ్ళు, వారి దగ్గరి సంబంధాలవారూ – అందరికీ మంత్రి పదవులూ – అన్నిటినీ ఏర్పాటు చేసుకున్న కరుణానిధిగారు – ఓటరుతో లాలూచీ ద్వారానే పదవులు సాధ్యమని నమ్మే వేత్త. "అయ్యా, తమరు బాగా మేస్తున్నారని మాకు తెలుసు. మా చేత ఏం తినిపిస్తారు?" అని ఓటరు అడుగుతాడని తెలుసు. ఇందులో తికమకలేదు. అందుకే క్రితం ఎన్నికల్లో ఉచితంగా కలర్ టీవీలూ, చదువుకునే కుర్రాళ్ళకు సైకిళ్ళూ, పేదలకు సరసమైన ధరలకి మేలు రకం బియ్యం – అన్నీ ఇచ్చారు. ఆ బియ్యాన్ని దళారీల ద్వారా లారీల పళంగానే పక్క రాష్ట్రాలకి తరలిపోతుండగా కొందరు పట్టుకోవడం మనం విన్నాం. వీరిక్కడ లక్షా డెబ్బై ఆరువేల కోట్ల ధనాన్ని కొల్లగొట్టిన కథలు చదువుకున్నాం.

గుడిసెల్లో మగ్గే పేదవాడు – మేలు రకం బియ్యం వండుకు తినడు. దాన్ని అమ్ముకుని – నాసిరకం సారాని కొనుక్కుని తాగుతాడు. అది అతని ఆనందం.



తన మీద కోట్ల ఆదాయం కేసులు పొరుగు రాష్ట్రం కోర్టుల్లో మురుగుతున్న మరో తమిళ నాయకురాలు జయలలితగారు – ఆనాడే వారు శక్తి మేరకు ఓటరుని మేపే ఎన్నో పథకాలను ప్రకటించారు.

ప్రస్తుతం – ఈ నాయకుల పదవులకి పెట్టుబడులు – మరీ ఆనందకరంగా, నోరూరించేవిగా ఉన్నాయి.

కరుణానిధిగారు ఈ సారి ఓటరుకి ఉచితంగా గ్రైండరూ లేదా మిక్సీ, ఒక ఫాన్ ఇస్తారు. ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు లాప్ టాప్లు ఇస్తారు. స్వయం సహాయక సంఘాలకు నాలుగేసి లక్షలు ఇస్తారు. గర్భిణీ స్త్రీలకు పదివేల రూపాయలు ఇస్తారు. పెళ్ళికాని ఆడపిల్లలకు 25 వేల రూపాయలు, పెళ్ళి చేసుకునేటప్పుడు నాలుగు గ్రాముల మంగళ సూత్రం ఇస్తారు. డిగ్రీలు చదివే అమ్మాయిల పెళ్ళిళ్ళకి 50 వేలు ఇస్తారు. బడుగు వర్గాలవారికి 300 చదరపు అడుగుల విస్తీర్ణంలో 1.80 లక్షల వ్యయంతో ఇళ్ళు కట్టించి ఇస్తారు. పాలకోసం ఆవుల్ని ఇస్తారు.. ఇంకా.. ఇంకా..

జయలలితగారు ఏం తక్కువ తినలేదు. ఇవన్నీ మేమూ ఇస్తాం, అంతకంటే ఎక్కువ ఇస్తాం. ప్రభుత్వ కళాశాలలేం ఖర్మ – 11, 12 తరగతుల వారందరికీ లాప్ టాప్లు, స్వయం సహాయక సంఘాలకి పది లక్షలు, గర్భిణీ స్త్రీలకి పన్నెండువేలు, ఆవులకి బదులు నాలుగేసి మేకలు – అయ్యా, నేను మేసే గడ్డికి మీరు కళ్ళు మూసుకుంటే మీ వాటా గడ్డి మీకు దక్కుతుందని హామీ.

'దేశసేవ' చేయడానికి ఇలా ఉత్సాహపడే నాయకులుండడం ఈ దేశానికి శుభ సూచకం. ఇలాంటి ఉపకారాలు మన రాష్ట్రంలోనూ ఓటర్లకి జరగాలని, పొరుగు రాష్ట్ర నాయకుల దేశసేవ ఆంధ్ర నాయకులకు ఒరవడి కావాలని నా ఆశ.

నాయకత్వాన్ని వ్యాపారం చేసి, ఓటర్ని వెర్రిగొర్రెని చేసి ఇచ్చి పుచ్చుకోడాల్లో ఇంత బరితెగించి వీధిన పడిన ఈ దేశంలో – "దేశసేవ" అందరి నాయకుల నోళ్ళలోనూ నానే బూతుమాట.

తాయిలాలు పంచడం సమాజ శ్రేయస్సుకి దగ్గర తోవకాదని, నిస్సిగ్గుగా వ్యాపారం సాగించడానికి సంకేతమని – మన నాయకులు మరిచిపోయి చాలా రోజులయింది. మరి ఓటరు? క్రమంగా నిజాన్ని గమనిస్తున్నాడు. నాకు కేవలం కలర్ టీవీ, రెండు కిలోల బియ్యం – మీకు మాత్రం లక్షా డెబ్బై కోట్ల చీకటి ధనమూనా అని ఆలోచిస్తున్నాడు. వాటాలు పంచుకోవడంలో తేడాలు గమనిస్తున్నాడు. పెద్ద తిమింగలాలు,చిన్న చేపల్ని ఎరలుగా ఇచ్చి తమని జోకొడుతున్నాయని అర్థం చేసుకుంటున్నాడు. అయితే చీడపట్టిన పంటలో – దక్కినంత రాబట్టుకునే గడుసుదనానికి అలవాటుపడుతున్నాడు. కాని అవకాశం దొరికినప్పుడు – ఆ మాత్రం 'పచ్చగడ్డి' దొరికినప్పుడు వాటాలలో అన్యాయం పాలవుతున్న – చిన్న వాటాదారుడు – ఓటరు – దుడ్డుకర్రతో తన నిస్పృహనీ, కోపాన్నీ సంధించి – చీడని దులుపుతాడు. ఉదాహరణలు: ఈజిప్టు, లిబ్యా .

*(మార్చి 28,* 2011)




# (April 04, 2011) Kaalam gurinchina kaalam కాలం గురించి ' కాలమ్'

**నేను 30 ఏళ్ళుగా కాలం రాస్తున్నాను.** ఆ మధ్య మిత్రులు, ప్రముఖ సినీనటులు వంకాయల సత్యనారాయణ అమ్మాయి నా రచనల మీద పరిశోధన చేస్తానంటూ వచ్చారు. నేను నా కాలంల మీద చెయ్యమన్నాను. తెలుగు పత్రికా ప్రపంచంలో ఎందరో మహానుభావులు కాలంస్ రాస్తూ వచ్చారు. ఆ విధంగా ఈ పరిశోధన మార్గదర్శకం కాగలదని నా ఆలోచన. నిన్ననే డాక్టరేట్ సిద్ధాంత గ్రంధాన్ని నాకు చూపించింది చి.లావణ్య.

దినపత్రిక ఆయుష్షు తక్కువ. మహా అయితే రెండు గంటలు. ఒకప్పుడు అదీ ఎక్కువే. ఎవరూ దినపత్రికని ఆరుగంటలు చదవరు. చాలామంది రెండోసారి చదివే ప్రసక్తే లేదు. అందరూ అన్నీ చదవరు. కాలేజీ లెక్చెరర్ దగ్గర్నుంచి ఎక్కడో మున్నంగి రైతుదాకా ఎందరి చేతుల్లోకో పత్రిక పోతుంది. చాలామంది చదివిన చోటే వదిలేసి పోతారు. అది దాచుకునే వస్తువు కాదు. ఇంట్లో ఉన్నా నెలాఖరుకి చిత్తుకాగితాల షాపుకి పోతుంది. చదివి పడేసే వస్తువు. దినపత్రిక మొదటి ప్రయోజనం – సమాచారం. కేవలం సమాచారం. ఇందులో ఒక కాలమ్ నిడివిలో – ఆ సమాచారాన్నో, సమస్యనో, సన్నివేశాన్నో, విషయాన్నో విశ్లేషించే చిన్న 'మెరుపు ' కాలమ్'. ఇది అటు కాలేజీ లెక్చెరర్ కీ, ఇటు రైతుకీ అందే స్థాయిలో ఉండాలి. తీరా అందరూ చదవకపోవచ్చు. కొందరు ప్రత్యేకంగా గుర్తుపెట్టుకుని – ఈ కాలమ్ కోసమే పేజీలు తిప్పవచ్చు. ఈ ప్రజాస్వామిక వ్యవస్థలో వ్యక్తి అభిరుచికి – కేవలం తన అభీష్టం మేరకు – పలకరించే అతి అల్పాయుష్షు రచన కాలమ్. అలాగని – దాన్ని చిన్నబుచ్చడం ఉద్దేశం కాదు. దాని లిమిటేషన్ ని చెప్పడం ఉద్దేశం. ఎంతోమంది నా కాలమ్స్ ని చదువుతారు. కాని చాలామందికి ఆ కాలమ్ శీర్షిక కూడా గుర్తుండదు. "ఆ మధ్య మీరు గోదావరి గురించి రాశారే! చాలా బాగుందండీ" అంటారు. ఏ మధ్య? ఏం రాశాను? "ఏదోనండీ. కాని బాగుందండీ" అక్కడితో ఆగిపోతుంది దాని అప్పీలు.

కాలమ్ ని ఒకటికి రెండుసార్లు చదివి, కత్తిరించి, జాగ్రత్త చేసి గుర్తుంచుకునే వాళ్ళూ ఉన్నారు. కాని వీరు తక్కువ. ఇదొక నిశ్శబ్ద విప్లవం. సంతలో ఎర్రపాగా. క్రమంగా అలవాటవుతుంది – రంగువల్ల. తర్వాత గుర్తుపడతాం. తర్వాత గుర్తుపెడతాం. తర్వాత గుర్తుంచుకుంటాం. సంవత్సరాలుగా సాగే ఉద్యమంలో గొంతు బలపడుతుంది. ఆ కోణానికి విలువనిస్తాడు పాఠకుడు. "మారుతీరావు ఈసారి ఏమన్నాడు?" అని వెదుకుతాడు. దినపత్రిక రెండు గంటల ఆయుష్షులో ఈ కాలమ్ ఫోకస్ – పదినిమిషాలు. ఈ వ్యవధిలో తనదైన అభిప్రాయాన్నో, విమర్శనో, వివేచననో – సంధించే ప్రక్రియ కాలమ్. కమిట్ మెంట్ ఏ మాత్రమూ లేని పాఠకుడికి పరిచయం కావడమా? స్నేహం చెయ్యడమా? లొంగదీసుకోవడమా?

ఆ మధ్య నా కాలమ్ ని ఎవరో మెచ్చుకుంటూంటే పక్కాయన "మీరు రాత్తారాండీ నేనెప్పుడు సూడలేదండీ" అన్నాడు. 'చూడలేదు' గమనించండి 'చదవలేదు ' కాదు!

కాలమ్ కి ఉన్న ఈ పరిమితే దాని బలం కూడా. దాన్ని సంధించే బలం కూడా It influences the non denominational audiences without prejudice or favour. They fell liberated because they have their right to reject. ఈ 30 సంవత్సరాలలో నేను స్పృశించని అంశం లేదు. – మోనికా లెవెన్ స్కీ రంకు, వైట్ హౌస్ లో అమెరికా అధ్యక్షుడి కుక్క ప్రసవం, ఒలింపిక్స్, ఎన్నికలు, హత్యలు, వికారాలు – అన్నీ.. అన్నీ...




శనివారం ఉదయం ఈ కాలమ్ రాస్తున్నాను. మధ్యాహ్నం ప్రపంచమంతా అత్యంత ఆసక్తితో ఎదురు చూసే క్రికెట్ ప్రపంచ కప్ ఆట – ఇండియా, శ్రీలంకల మధ్య, సచిన్ కి ఆఖరి ప్రపంచ కప్పు. ఈసారి వందో వంద చేస్తాడా? మురళీధరన్ కి ఆఖరి ప్రపంచ కప్పు. అసలు ఈసారి ఆడగలడా? కప్పు మనం గెలుస్తామా? 1983 తర్వాత మూడుసార్లు ఆఖరిదాకా వచ్చి దక్కించుకోలేని చరిత్ర పునరావృతమౌతుందా? లేదా 1983 తర్వాత మరి కొన్నేళ్ళు నెమరు వేసుకునే మైలురాయిగా 2011 నిలుస్తుందా?

ఈ కాలమ్ మీరు చదివేసరికి ఈ పేరా పాచిపట్టిన పాత కథ. రాత్రి ఈ ప్రశ్నలన్నిటికీ సమాధానాన్ని మీరు చూశారు. కాలమ్ లో విషయానికి ఇంత తక్కువ వ్యవధిలో కాలదోషం పట్టింది!

వేదాంత ధోరణిలో ఆలోచిస్తే – నా ప్రియమిత్రుడు, మంచి నటుడు నూతన్ ప్రసాద్ మొన్న వాస్తవం. నిన్నవార్త. నేడు జ్ఞాపకం. రేపు గోడమీద బొమ్మ. ఆ తర్వాత......ఆ తర్వాత....

ప్రక్రియ ఎంత పెళుసు! కాలం పరుగు ఎంత క్రూరం! ఎంత వేగం! కాలమ్ అప్పీలునీ, పరిమితినీ, పాఠకుని అలసత్వాన్నీ, అశాశ్వతత్వాన్నీ, అతి స్వల్ప ఆయుష్షునీ – ఇన్నిటినీ ఎరిగి 'విశ్వరూపం' దాల్చవలసిన – అతి పదునైన రచన.

విచిత్రంగా – ఇవన్నీ జీవితానికీ వర్తిస్తాయి. నిన్న ఉన్న మనిషి ఇవాళ లేడు. నిన్న ఉన్నప్పుడు – అందరూ అతన్ని ఆదరించలేదు. కొందరే గుర్తించారు.వెళ్ళిపోయాక ఏ కొందరో బాధపడ్డారు. ఆ తర్వాత – దినపత్రిక వస్తూనే ఉంది. కాలమ్స్ రాస్తూనే ఉంటారు. ఎవరో – ఎక్కడో చదివి – చీమకుట్టినట్టు స్పందించి – ఆ చెట్టుకిందే పత్రికని వదిలేసి వెళ్ళిపోతూంటారు.

కాలం – మనిషికి వేదాంతాన్ని బోధించే సందేశం. వినయాన్ని సంధించే కనువిప్పు . కాలదోషాన్ని పరిణామ శీలంగా హెచ్చరించే గురువు .

*(ఏప్రిల్ 04,* 2011)

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ
కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

# (April 11, 2011) Anna..Aha.Ahaha..అన్నా..ఆహా..ఆహాహా.

ఉద్యమాలూ, నిరాహార దీక్షలూ, నినాదాలూ, బుకాయింపులూ దైనందిన కార్యక్రమాలుగా మారిపోయిన ఈ రోజుల్లో – మహాత్మాగాంధీని 'పాత చీపురుకట్ట'లాగా వాడుకుంటున్న కాలంలో, 'దేశసేవ' అనే బూతుమాటని 'మాటలు కూడా సరిగ్గా చెప్పలేని ప్రతీ దోపిడీదారుడూ వాడుకుని నిచ్చెన ఎక్కుతున్న ఈనాటి వైకుంఠపాళీ రాజకీయాల్లో, లాప్ టాపులూ, గ్రైండర్లూ, మంగళసూత్రాలూ వొడ్డి – ఎవడి బాబు సొమ్ముతోనో ఓట్లు కొనుక్కోడానికి పందెం కాస్తున్న పార్టీలు పేట్రేగిపోతున్న నేపథ్యంలో, ఈ దేశంలో 'అవినీతి' ముద్రపడిన నాయకులు పిఏసి సమావేశాలకి అలా షికారు వెళ్ళినట్టు వెళ్ళి మాయమవుతున్న తమాషాని చూస్తున్న ఓ మామూలు, నేలబారు మనిషి – కేవలం 'నీతి' పెట్టుబడిగా ఎంత సాధించవచ్చునో, దాని ప్రభావం ఎంత ఉండగలదో – అన్నా హజారే గతవారం రోజులుగా నిరూపించారు. ప్రజల నైరాశ్యం, ఆవేశం అనే కార్చిచ్చు ఎంత ఉధ్రుతంగా దేశమూ, రాష్ట్రమూ, జిల్లా, గ్రామం స్థాయిని దాటి ఎలా రేగిందో కోట్లాది మంది విస్తుపోయేలాగ, ఆవేదనతో రెచ్చిపోయేలాగ చేయగలదో గత ఏడురోజులూ నిరూపించాయి. గంటల్లో ఢిల్లీ సింహాసనం పునాదుల్తో కదిలింది. నాయకులు అర్థంకాక దిక్కులు చూశారు. నిరాహార దీక్షల్ని కమిటీల ఉచ్చులతో సుళువుగా దాటేసే పాలకులు – ఈ ఉద్యమం అలా లొంగే లాకాయి లూకాయి ఉద్యమం కాదని గ్రహించారు. గంటల్లోనే చర్చలకు దిగారు. అయితే మాటల్లో మభ్యపెట్టి, కమిటీల ఉచ్చులు బిగించి – నీతిని సమాధి చెయ్యడం వీరికి వెన్నతో పెట్టిన విద్య. అయితే నిప్పుకి చెదలంటవు. అది శాశ్వత సత్యం. ఆ నిజం చెదలకీ తెలుసు.

ఇంటర్నెట్ చూడగలిగిన వారికి ఖండాంతరాలలో, జాతీయంగా, జిల్లాలలో, ఊళ్ళలో, గల్లీలలో – పేరు కూడా తెలీని నేలబారు మనిషి స్పందించాడు. దేశం వెల్లువై లేచింది. ఈ పాలక వ్యవస్థ అవినీతికి దేశం ఎంత విసిగిపోయిందో, ఎంతగా నేలబారు మనిషి ఆశలు వదులుకున్నాడో, ఏనాడయినా ఈ ముఖాలు కనిపించకుండా పోతాయా అని ఎంతగా ఎదురుచూస్తున్నాడో ఈ ఏడు రోజుల ఉధ్రుతం తెలిపింది. ఇది కేవలం నమూనా.

ఇదొక వెల్లువ. దీనికి మూల సూత్రం అన్నా హజారే ఆగ్రహం. కాని సమిధెలు ఎల్లెడలా ఎండి రాజుకోడానికి సిద్ధంగా ఉన్నాయి. అదే ఇప్పుడు జరిగింది. బొజ్జలు పెంచుకుని, చిరునవ్వులు చిందిస్తూ కార్లలో తిరిగే ఈ నాయకుల్ని చూసి ప్రజలు ఎంత అసహ్యించుకుంటున్నారో – ఆ విముఖతకి ఊపిరి కలిసొచ్చింది. "మీరు మాకు యజమానులు కారు. మాకు సేవకులు. మేం మీ యజమానులం. ఆ మాటని మీరు మరిచిపోతున్నారు" అని జంతర్ మంతర్ దగ్గర అన్నా హజారే బల్ల గుద్దారు.

విజయనగరంలో ఉద్యోగి చెంపని సభలోనే పగులగొట్టిన నమూనా నాయకులకి ఈ మాటలు వినిపించే ఉండాలి. వినకపోతే ప్రజలు చెవులు పిండి మరీ వినిపిస్తారు.

గాంధీగారిలాగే అన్నా హజారే గొంతు పెద్దది కాదు. కాని బలమైనది. ఆ బలానికి మూలం నీతి. అంతకు మించి పవిత్రమైనది. 1965 లో ఇండియా పాకిస్థాన్ యుద్ధంలో పాల్గొన్న ఓ సిపాయి మహా రాష్ట్రలో అహ్మద్ నగర్ జిల్లాలోని రాలేగాం సిద్ధి అనే ఓ మారుమూల గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా ఎలా తీర్చి దిద్దారో తెలిస్తే – అవినీతిలో కూరుకుపోయిన వ్యవస్థ కాదు – నీతికి నిలబడిన ఒక్కడు – ఒకే ఒక్క వ్యక్తి ఏం



చేయగలడో అర్ధమవుతుంది. 1975 లో రాలేగాం ఒక కుగ్రామం. ఇప్పుడది మన దేశంలోనే సంపన్నమయిన గ్రామం. స్వయం సమృద్ధితో, వాతావరణ కాలుష్యానికి దూరంగా, సామరస్యంతో జీవించే ప్రాంతం.

ఈ వ్యవస్థని బాగు చెయ్యాలంటే ఏం చెయ్యాలి? అని నన్ను చాలామంది అడుగుతూ ఉంటారు. అతి చిన్న సమాధానం. వ్యక్తి బాగుపడాలి. నీ స్థాయిలో నువ్వు చిత్తశుద్ధితో నీ జీవనాన్ని తీర్చిదిద్దుకుంటే – నీ సమీప వాతావరణంలో జ్యోతిలాగా ప్రజ్వలిస్తావు – అన్నా హజారే ఆ పనే చేశారు. ఆయన్ని భారత ప్రభుత్వం పద్మభూషణ్ గౌరవంతో సత్కరించింది.

విద్యార్థులు, యువకులు, సినిమా నటులు, కార్పొరేట్ సంస్థలు – అందరూ అన్నా హజారేకి మద్దతు పలికారు. కిరణ్ బేడీ, బాబా రాందేవ్, ధోనీ, అమితాబ్ బచ్చన్, అమీర్ ఖాన్ – ఒకరేమిటి? వేలాదిమంది – అన్నా హజారేని చూడని, తెలియని కోట్లాది మంది స్పందించారు. కారణం ఆ వ్యక్తిని తెలియకపోవచ్చు. కాని వారు మ్రగ్గుతున్న ఈ సమస్యకు కారణమెవరో తెలుసు.

42 సంవత్సరాలుగా కేవలం 8 సార్లు జన లోక్ పాల్ బిల్లుని పార్లమెంటులో ప్రవేశపెడుతూనే ఉన్నారు. కాని ఆ బిల్లు హసీం ఆలీలు, సురేష్ కల్మాడీలు, బాలకృష్ణన్ లూ ఉండగా – ప్రజాప్రతినిధుల ప్రాతినిధ్యంతో అవినీతి జరిపిన ఏ వ్యక్తి అయినా, ఏ నాయకుడినయినా నిలదీయగల వ్యవస్థని ఎందుకు ఏర్పరుస్తారు?

ఈ నిరాహార దీక్ష విశేషం ఏమిటంటే – ఈ అవినీతిలో అతి చక్కని వాటా ఉన్న దేవ గౌడలూ, మన రాష్ట్ర నాయకులూ, గడ్కరీలూ – అన్ని ప్రతిపక్షాలవారూ మద్ధతు పలికారు. ఎందుకు? వారు ప్రతిపక్షాలలో ఉన్నారు కనుక. దొంగలే దొంగల్ని ఎదిరించే ఉద్యమానికి మద్దతు పలకడం గమనార్హం. ఇదే తంతుని 63 ఏళ్ళుగా వీరు సాగిస్తున్నారు. ఈ వినోదానికి, ఈ వికృతమైన ఆత్మవంచనకి మనమంతా ఇన్ని సంవత్సరాలుగా ప్రేక్షకులం.

ముంబైలో వేలమంది విద్యార్థులు "నేను అన్నా హజారే!" అని గాంధీ టోపీలు పెట్టుకుని ఊరేగింపులు జరిపారు. మరెందరో నిరాహార దీక్షలు జరిపారు. జరుపుతున్నారు. జమ్మూ, ముంబై, బెంగుళూరు, భోపాల్, ఢిల్లీ, విశాఖపట్నం, హైదరాబాదు – ఇలాంటి తిరుగుబాటు చూసి చాలాకాలమైంది.

అక్టోబరు విప్లవం గురించి మనకు తెలీదు. విన్నాం. కాని ఇది ఏప్రిల్ విప్లవం. ఇలాగే వ్యవస్థ కుళ్ళి పురుగులు పడితే అక్టోబరు విప్లవానికి ఎంతో దూరం లేదు. ఎప్పుడయినా కుళ్ళి, మురిగిన భూమిలోంచే పవిత్రమైన పద్మం తలెత్తుతుంది.

ప్రస్తుతం అన్నా హజారే అందుకు ప్రాణం పోసిన విత్తు.

(*ఏప్రిల్ 11,* 2011)




# (April 18,2011) O Gundayya Katha ఓ గుండయ్య కథ

నేను దైవ భక్తుడిని. కాని చదువుకున్న దైవభక్తుడిని. చదువుకోని దైవభక్తుడు తన విశ్వాసానికి సమాధానం చెప్పలేడు. కాని అతను నాకంటే చాలా విధాలుగా, చాలా కారణాలకి నాకంటే గొప్ప దైవభక్తుడు కావచ్చు. నేను కారణాలు చెప్పగలను. మన దేశంలో రకరకాల ఛానల్స్ ఉన్నాయి. ఇవన్నీ వ్యాపార కేంద్రాలు. నేను 20 సంవత్సరాలు ఆకాశవాణిలో పనిచేశాను. కాని ఏనాడూ ఆకాశవాణి గొప్పతనాన్ని బేరీజు వేసే ప్రయత్నం చెయ్యలేదు. పక్కన హిరణ్య కశిపుడు ఉంటేగాని ప్రహ్లాదుడి గొప్పతనం అర్ధం కాదు. ఇన్ని ఛానళ్ళు సామూహికంగా ఆ ఉపకారం చేస్తున్నాయి. నేను ఎక్కువగా ఛానళ్ళు చూడను. చూడకుండా జాగ్రత్త పడతాను. అది నా ఆరోగ్య రహస్యం.

మీ తల్లిదండ్రులు మిమ్మల్ని రంజింప చేయాలని ప్రయత్నించరు. మీ శ్రేయస్సుకి ఏది మంచిదో నిర్ణయిస్తారు. మీ భార్య మిమ్మల్ని రెచ్చగొట్టాలని ప్రయత్నించదు. మిమ్మల్ని ఆనంద పరిచే స్థాయిలో ఆగుతుంది. 'రెచ్చగొట్టడం' వ్యభిచారి చేసే పని. ఈనాటి ఛానల్స్ చేసే పని. అందరి మాటా కాకపోవచ్చు. కాని ఎక్కువ ఛానల్స్ కి ఇది వర్తిస్తుంది. నిరూపిస్తాను.

ఈ మధ్య సత్యసాయిబాబా ఆరోగ్యం క్షీణించింది. ఇప్పటికీ ప్రమాదకర పరిస్థితిలో ఉంది. ఆ వివరాలు తెలుసుకోవడానికి మాత్రమే కొన్ని ఛానళ్ళు చూస్తున్నాను. ఒక ఛానల్ లో చాలా మేధావి అయిన ఏంకర్ సత్యసాయి విద్యాసంస్థలో చదువుకుని, డాక్టరయి, అక్కడ సేవ చేస్తున్న ఒక డాక్టర్ ని ప్రశ్నిస్తున్నాడు.

"సత్యసాయి దేవుడయితే వీల్ చైర్ లో ఎందుకు కూర్చుంటాడు సార్?" అని.

ఎంత గొప్ప లాజిక్ ఇది! ఈ ఏంకర్ కూడా భారత దేశంలో పుట్టినవాడే. సంకర జాతి వాడనుకోను. అతని మొహమూ, భాషా ఆ విషయాన్ని తెలుపుతున్నాయి. ఆ ప్రశ్న వెయ్యడంలోనే "పిచ్చిముండా కొడకా! మీరు దేవుడని భజన చేస్తున్న మనిషి వీల్ చైర్ లోంచి లేవలేకపోతున్నాడురా – ఇంకెక్కడ దేవుడు?" అనే వెటకారం ఉంది. టీవీ ప్రేక్షకుల్ని కితకితలు పెట్టాలనే యావ ఉంది. ఆ డాక్టర్ పాపం, చాలా ఆవేదనతో, సంతాపంలో ఉన్న మనిషి. సమాధానానికి తడువుకున్నాడు. దైవభక్తుల్ని ఇలాంటి ఎన్ని ప్రశ్నలయినా వెయ్యవచ్చు. శ్రీకృష్ణుడు దేవుడయితే నెమలి ఈకలు ఎందుకు పెట్టుకున్నాడు సార్? కోడి ఈకలు పెట్టుకోవచ్చుకదా? నీల మేఘశ్యాముడు ఎందుకు సార్? తెల్లగా ఉండవచ్చుకదా? ఎనిమిది మంది పెళ్ళాలు ఎందుకు సార్? అతన్ని కామపిశాచి ఏమయినా ఆవహించిందా? ఇవే ఏ ఫ్రాన్స్, ఏ జింబాబ్వే, ఏ లిబియా నుంచో వచ్చిన మనిషి అయితే మనం అతని అజ్ఞానాన్ని అర్ధం చేసుకోగలం. కాని ఈ ఛానల్ మనిషికి తెలియక కాదు. కాని తనకు దేవుడిని వీధిన పెడితే వచ్చే ఆనందం తనవంటి వారెందరికో ఆనందాన్నిస్తుందన్న వ్యాపార సూత్రం తెలుసు. ఇది నల్లబజారులో గంజాయిని అమ్ముకోవడం లాంటిది. 'గంజాయి' వ్యాపారం లాభసాటి అవడం ప్రారంభించి చాలా రోజులయిందికదా – ఈ దేశంలో.

మీ అమ్మని మీరు ప్రేమిస్తున్నారా? ఆమె పొరపళ్లనా? బొక్కి నోటినా? మధుమేహం కారణంగా ఒడిలి శిధిలమైన అస్థిపంజరాన్నా? ఈమెనే తమరు అమ్మ అంటున్నారా? ఇదే బాబాగారి వీల్ చైర్ ప్రశ్న.

ఈ ప్రశ్నకి సమాధానం చెప్పను. చెప్పడానికి ప్రయత్నించను. ఆ ఛానల్ లో నేనుంటే చాలా గొప్ప సమాధానం చెప్పేవాడిని. వ్యాపారానికి, పక్కవాడి కోరికని రెచ్చగొట్టే వ్యభిచారానికి ఇది నిదర్శనంగానో – అంత దూరం పోనక్కరలేదనుకుంటే – విశ్వాసమంటే సరైన అవగాహన లేని




ఓ అజ్ఞాని వ్యాపార లౌక్యానికి ఇది నీచమయిన ఉదాహరణగా భావిస్తాను. మనం ఏ.రాజాలు, కరుణానిధులూ, హసీం అలీలులాగే ఇలాంటి వ్యాపారస్తుల బ్లాక్ మెయిల్ ప్రసారాలను భరిస్తూ జీవిస్తున్నామని – కుష్టు రోగుల ఆసుపత్రిలో ఉన్న కుష్టు రోగం రాని వ్యక్తిగా సరిపెట్టుకుంటాను.

ఇలా చెప్పడానికి కారణం – ఈ భారతదేశం ఇలాంటి చాలా తెలివైన అమ్మకందార్లను, ఛానళ్ళనూ భరిస్తోంది. జాతి విశ్వాసాలకూ, వ్యక్తి విశ్వాసాలకూ సంబంధం లేదని, ఉండనక్కరలేదని – హేతువుతో సంబంధం లేని దాన్నే విశ్వాసం అంటామనీ ఇలాంటి వారికి చెప్పాలని శ్రమ పడను. అది కల్లుపాకలో పాలకుండని ఉంచడంలాంటిది. పండు ముసిలి అయి, తల ముగ్గుబుట్టయి అవసానంలో ఉన్న మూర్తిని వాటేసుకున్న ఓ ప్రముఖ వ్యక్తి విశ్వాసానికి విలువనివ్వాలేగాని, ఆ అవ్వ అర్హతలను వెదికికాదు. శరీరంలో రక్తాన్ని పాలుచేసి బిడ్డకి జీవలక్షణాన్ని పంచే మాతృమూర్తి మమకారానికి ఏ హేతువు ఆంక్షని నిర్ణయిస్తుంది? ఆయన అడిగే చాలా ప్రశ్నలకు ఈ దేశంలో చాలా మంది దగ్గర వారి వారి స్థాయిలను బట్టి సమాధానాలున్నాయి. ఈ దేశంలో శ్రీకృష్ణుడు ఎందుకు నెమలి ఈక పెట్టుకున్నాడో, బాబాగారు ఎందుకు వీల్ చైర్ లో ఉన్నాడో, పి.భానుమతి లేవలేని స్థితిలో ఉన్నా తెలుగువాడిని కొన్ని దశాబ్దాలు ఆనందపరిచిన కారణానికి ఆమెను ఎందుకు ప్రేమించాలో చెప్పగల సామర్ధ్యం, అవగాహన ఉన్నవారు – నాకంటే గొప్పవారు చాలామంది ఉన్నారు. ఉంటారు.

కుళ్ళు కార్యక్రమాలతో ఛానల్స్ నింపే వారికి నా విన్నపం. ప్రజల విశ్వాసాలను వారి వారి విచక్షణకి విడిచిపెట్టండి. మీరు ఛానల్ ఉన్న కారణానికీ ఈ సమాజంలో నైతిక చైతన్యానికి (moral police) కి బద్ధ కంకణం మీకు మీరే కట్టుకోకండి. చేతనయితే దిక్కుమాలిన కార్యక్రమాలను కట్టిబెట్టి మంచి పాటల్ని ప్రసారం చెయ్యండి. మంచి సంగీతాన్ని పంచండి. మంచి మాటల్ని చెప్పండి. ఈ దేశానికి ఇప్పటికే చాలా దరిద్రం పట్టింది. దానికి మీ సహాయ సహకారాలనయినా ఆపండి. గంజాయి రుచి మప్పి బొజ్జలు పెంచుకునే వ్యభిచార స్థాయికి జాతిని ప్రభావితం చేసే అతి బలమైన, విలువైన మాధ్యమాన్ని దిగజార్చకండి. ఇప్పుడు ఈ కాలంకి శీర్షిక అయిన ఓ గుండయ్య కథ. ధోనీ ఈ దేశపు క్రికెట్ టీంకి కెప్టెన్. ప్రపంచ స్థాయిలో దేశాన్ని నిలిపిన ఘనుడు. 52 మిలియన్ల మంది ప్రపంచమంతటా చూస్తుండగా బిలియన్ల భారతీయులను ఆనందపరిచిన ఆటగాడు. ప్రపంచకప్పు అందుకున్న కొన్ని నిముషాల్లో డ్రస్సింగ్ రూంలోనే గుండు చేయించుకుని తలనీలాలను తిరుపతికి పంపాడట మొక్కు కారణంగా శ్రీ వేంకటేశ్వరస్వామి ధోని తలనీలాల కోసం ఎదురుచూస్తున్నాడా? పదకొండు మంది ఆటకంటే ధోని గుండు – తత్కారణంగా – పరోక్షంగా వేంకటేశ్వర స్వామి మనకీ కప్పు తెచ్చిపెట్టాడా? శ్రీలంక వాళ్ళకి ఇలాగ గెలిపించే దేవుళ్ళు లేరా? వాళ్ళకి గుండుకాక మరేదయినా సమర్పించుకోవాలా? ఇవన్నీ తెలివైన ఏంకర్లు అడగ్గల – ప్రేక్షకుల్ని కితకితలు పెట్టే ప్రశ్నలు. ఒక్క విషయం చెప్పి ముగిస్తాను.

ఈ ఏంకరు మహాశయుడికి అతి చిన్న సమాధానం. విశ్వాసం ప్రారంభమయిన క్షణంలో హేతువు శలవు తీసుకుంటుంది. రేపు మీ అమ్మని పలకరించినప్పుడు ఈ వాక్యాన్ని తలచుకుని అర్ధం చేసుకోడానికి ప్రయత్నించండి.

తెలుగువారంకదా? ఇంగ్లీషులో చెపితే ఈ తరానికి మరికాస్త సులభంగా అర్ధమౌతుంది.

Faith starts when logic ends.

(*ఏప్రిల్ 18,* 2011)




# (April 25,2011) Avineethiki Godugu అవినీతికి గొడుగు

మనం అవినీతికి 'నీతి' గొడుగు పట్టడం ప్రారంభించి చాలా ఏళ్ళయింది. తమకు గుర్తుందా? ఆ మధ్య ప్రభుత్వం మనతో లాలూచీ పడింది. "మీరు నల్లధనం ఎలా, ఏ అవినీతి పనిచేసి సంపాదించారని మేం అడగం. మీ దగ్గర ఎంత ఉందో చెప్పండి.40 శాతం మాకివ్వండి. మిగతా 60 శాతం మీ దగ్గరే ఉంచుకోండి" అన్న స్కీము పెట్టింది. ఎందరో పెద్ద మనుషులు సంతోషించారు. వేలకోట్ల ధనం పాతర్లోంచి బాంకుల్లోకి బదిలీ అయిపోయింది. ఇది ఊళ్ళని కొట్టేవాళ్ళని మంగళహారతి ఇచ్చి సత్కరించడం లాంటిది. అయితే లాభసాటి వ్యాపారం. ఎవరికి? కొల్లగొట్టేవాళ్ళకి.

ఇంతకంటే గొప్ప ఆలోచన మరో మహనీయుడు ఈ మధ్యనే చేశాడు. అది మీరో నేనో అయితే గొంతు చించుకోనక్కరలేదు. కేంద్ర ఆర్థిక శాఖలో ప్రధాన ఆర్థిక సలహా దారుడు డాక్టర్ కౌశిక్ బసు అనే అధికారి ఆలోచన ఇది. అది ఆర్థిక శాఖ వెబ్ సైట్ లోనే వచ్చింది.

(http://finmin.nic/working paper/Act Giving Bribe Legal.pdf)

విషయం ఇది. దేశంలో లంచగొండితనం పెరిగిపోయింది. లంచాలు అడిగేవాళ్ళూ, గతిలేక ఇచ్చేవాళ్ళూ నానాటికీ పెరిగిపోతున్నారు. ఏం చెయ్యాలో తెలీక నేలబారు మనిషి ఈ అవినీతికి తలవంచుతున్నాడు. పుచ్చుకునేవాడు లాభపడుతున్నాడు. ఇచ్చేవాడు పబ్బం గడుపుకుని రాజీపడుతున్నాడు. ప్రభుత్వం నష్టపోతోంది.

కనుక ఈ మేధావి అయిన బసుగారు ఓ పధకాన్ని సూచించారు. లంచాల అవినీతిని రెండు భాగాలుగా విభజించారు.మన మీద వత్తిడి లేకుండా చేతులు మారే లంచాలు. ఓ పిట్టకథ. మొన్ననే ఓ కుర్రాడు నాదగ్గరికి వచ్చాడు. ఏదో ఉద్యోగానికి తను ఏ నేరాలూ చేయలేదని పోలీసు శాఖ నుంచి ఓ కాగితం కావాలని. ఆ కాగితాన్ని సంపాదించడానికి నేరం చెయ్యవలసి వచ్చింది. ఓ మధ్యవర్తి పోలీసు శాఖలో బసువంటి పెద్ద మనిషికి అంతగా వత్తిడి లేని లంచం ఇచ్చి కాగితం తెచ్చుకున్నాడు. ఇంతకూ వత్తిడి ఎవరి మీద? తన జేబుమీదా? స్థోమతు మీదా? నైతికమైన విలువల మీదా? చేసుకుంటున్న ఆత్మవంచన మీదా?

సరే. బసుగారేమంటారంటే (అందరికీ అర్థమయేలాగ పామర భాషలో చెప్పుకుందాం). తప్పక, గతిలేక, పనిగడుపుకోడానికి మరో మార్గం లేక (పై పిట్టకథలో నిస్సహాయుడిలాగ) లంచం చాలామంది ఇస్తున్నారు కనుక – ఈ దేశంలో మరీ వత్తిడిలేని లంచాన్ని చట్టసమ్మతం చేసేద్దాం. అంటే మీరు ఎమ్మార్వో ఆఫీసులో 50 రూపాయలు లంచం ఇచ్చారనుకోండి. ఇచ్చిన మిమ్మల్ని, మీ పరిస్థితిని అర్థం చేసుకుని ప్రభుత్వం క్షమిస్తుంది. చట్టం మీ వేపు ఉంది కనుక. ఆ 50 రూపాయలు పుచ్చుకున్నవాడి పీక పట్టుకుంటుంది. న్యాయంగా ఇచ్చేవాడూ పుచ్చుకున్నవాడంత నేరస్థుడే. కాని ఇప్పుడు ఇచ్చే నేరానికి చిన్న వెసులుబాటు. మీకూ నాకూ ఈ ఏర్పాటు ఎంత ఆలోచనాత్మకంగా, సుఖంగా కనిపిస్తోంది! ఆహా! ఢిల్లీ ఇంతగా మన లంచాల కష్టాల గురించి ఆలోచిస్తోందా అని మనం సంబరపడతాం. ఇలాంటి ప్రభుత్వం, ఇలాంటి ఆఫీసర్లు, ఇంత గొప్ప మేధావులూ ఉన్న ప్రభుత్వాన్ని మనం ఎన్నుకున్నందుకు మనం గర్వపడతాం. కదండీ? కాని మనం వెర్రి గొర్రెలమని ఢిల్లీ బసూలకు తెలుసు. అవినీతిని నిర్మూలించలేని ప్రభుత్వం చేతకానితనానికి – కొండల్ని ఫలహారం చేసే బడా

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ
కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!






నాయకుల్ని చూసే రాళ్ళను నంచుకునే ఉద్యోగులు ఉంటారని మనల్ని మరిపించే మార్పియా ఈ ఉపకారం. ఇది మీకూ నాకూ కాదు. అసలు గుట్టు చూడండి.

రేపు ఎన్నికల్లో వోటు కోసం మీ చేతిలో నోటుని పెట్టే నాయకుడు 'నిస్సహాయంగా' ఇచ్చిన కారణానికి నిర్దోషి. కోట్లు ఖర్చు చేసి పదవిని కొనే ఆయన పదవిలోకి వెళతాడు. వందరూపాయలు పుచ్చుకున్న ఓటరు జైలుకి వెళతాడు. బహుశా – ఈ దేశంలో ఉన్న ఇలాంటి 'నిర్దోషుల్ని' రక్షించడానికే ఇంత బృహత్తరమైన చట్టం అవసరమని నాయకుల మధ్యవర్తిగా 'బసు' ఈ పథకాన్ని ప్రతిపాదిస్తున్నారేమో! నా మీద వత్తిడి తెచ్చే ప్రయత్నం జరిగినందుకే నేను ఆయా లంచాలు పంచవలసి వచ్చిందని రేపు మరో నిర్దోషి రాజా జైలు నుంచి బయటకు నడవచ్చు. (అవినీతిని ప్రజలతో పంచుకునే పని ప్రభుత్వం చేసిందని ముందే మనవి చేశాను) కార్పొరేట్ సంస్థల పెద్దలు వత్తిడి పెరిగిన దుర్భరమైన స్థితిలో లంచాలు చదివించక తప్పలేదని తప్పుకోవచ్చు. ఇచ్చేవాడు నేరస్థుడు కాదు కదా! రేపు ఓ జడ్జీగారికి నేను లంచం ఇచ్చి, ఇచ్చినట్టు నిరూపిస్తే నేను బయటపడతాను. ఆయన జైలుకి వెళతాడు. ఈ ఒక్క ఆయుధంతో నేను న్యాయ వ్యవస్థని బ్లాక్ మెయిల్ చెయవచ్చుకదా! మన రహస్యాలు కనుక్కోడానికి విదేశీ ఏజెంటు మన రక్షణ శాఖలో మనిషికి లంచం ఇచ్చాడు. రహస్యాల్ని ఎగరేసుకుపోయాడు. రేపు వ్యవహారం బట్టబయలయింది. ఫలానా ఉద్యోగికి ఇచ్చానని అతని విమానం ఎక్కే స్తాడు. అతని నేరస్తుడు కాదు కదా? ఉద్యోగి వీధిన పడతాడు. అది వీడి ఖర్మ. ఈ దేశం దరిద్రం.

బాబూ. ఇలాంటివి బోలెడున్నాయి. కడుపు చించుకుంటే కాళ్ళ మీద పడుతుంది. ఈ దేశం అధ్వాన్న స్థితిని ఇంతకంటే భయంకరమైన తెలివితేటలు నిరూపించవు. ఇవి మీరూ నేనూ చేసిన ఆలోచనలు కావు. కేంద్ర ఆర్థిక శాఖ వెబ్ సైటులో చోటుచేసుకున్న ఓ ప్రధాన అధికారి యంత్రాంగం.

ఈ వ్యవస్థలో అవినీతి పునాదులకు ఎంత మద్దతు లభిస్తుందో, ముందు ముందు మరెందరు పెద్దమనుషులు చట్టబద్దం కానున్న ఈ గొడుగు కిందకి వస్తారో – వేచి వినోదం చూడాలి.

నాకూ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి లక్షణాలు కొన్ని ఉన్నాయి. రేపు రాబోయే కొన్ని సౌకర్యాలు గమనించండి. రేప్ చేస్తే నేరం కాదు. మనిషి చావకుండా ఉంటే చాలు.

అయిదు కోట్ల లంచం నేరం కాదు. మినహాయింపు ఇస్తున్నాం. పది కోట్లు దాటితే నేరం.

కాలు విరగ్గొడితే నేరం కాదు. పీక తెగ్గొస్తే నేరం.

అవినీతికి మినహాయింపుని కల్పించే వ్యవస్థలో ఎన్ని సౌకర్యాలకు చోటుండదు!

183 మంది నేర చరితులూ, గూండాలూ, హంతకులూ ఉన్న పార్లమెంటులో నేరాలకి చట్టబద్ధతని కల్పించే – ఇలాంటి దిక్కుమాలిన ఆలోచనలు చేసే బసూలు కోకొల్లలుగా దొరుకుతారు!

*(ఏప్రిల్ 25,* 2011)



# (May 02, 2011) Kukkamuthi Pindelu కుక్కమూతి పిందెలు

ఈ కాలమ్ కీ సత్యసాయిబాబా దేవుడా? అవతార పురుషుడా? అన్న ప్రశ్నలకీ ఎటువంటి సంబంధంలేదు.

1964 మే 27 సాయంకాలం ఢిల్లీ నుంచి తెలుగువార్తల ప్రసారం ప్రారంభమయింది. "మన ప్రియతమ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ ఇకలేరు" అని న్యూస్ రీడర్ చదువుతూంటే అతని గొంతు వణికింది. దుఃఖంతో గొంతు బొంగురుపోయింది. ఆ రీడర్ పేరు రామచంద్రరావు. ఆ ఒక్క కారణానికే అతని ఉద్యోగం పోయింది.

'వార్త 'ని చెప్పేటప్పుడు వ్యక్తిగతమయిన – ఇంకాస్త ముందుకు వెళ్ళి – వ్యవస్థాగతమైన ఆవేశానికి స్థానం లేదు. ఇది అతి ముఖ్య సూత్రం. మొన్న సత్యసాయిబాబా అస్తమించారు. ఒకానొక ఛానల్ ఆ విషయాన్ని ఇలా చెప్పింది. "సాయిబాబా మరణించారు. 96 సంవత్సరాలు బతుకుతానని చెప్పిన బాబా మాట తప్పారు" అని. ఆ ఛానల్ పేరు చెప్పి ఆ పాపం కట్టుకోను. ఇదే సమయంలో అతి బాధ్యతాయుతమైన మర్యాదతో, సంయమనంతో – ఇంకా భక్తితో ఈ టీవీ, హెచ్ ఎం టీవీ, రాజ్ టీవీ (నేను చూసిన ఛానళ్ళు) ఈ వార్తల్ని ప్రసారం చేశాయి. ఆ నాలుగు రోజులూ ప్రసారం చేస్తున్నాయి – అంతే ఉదాత్తంగా. నేను తీవ్రవాదిని కాను. అతివాదిని కాను. ఛాందసుడిని కాను. ఈ దేశంలో కోట్లాదిమందిలో ఒకడిని. వార్తకీ, వ్యాఖ్యకీ బోలెడంత తేడా ఉంది. రాష్ట్రపతులూ, ప్రధాని, దేశ దేశాల ప్రతినిధులూ, గవర్నర్లు, ముఖ్యమంత్రులూ, ప్రతిపక్షనాయకులూ, ఇటలీ నాయకులూ, 160 దేశాల వారు శ్రద్ధాంజలి ఘటించిన ఒక 'భారతీయునికి' ఒక భారతీయ ఛానల్ ఈ దేశంలో చూపించిన మర్యాద ఇది. ఈ ఛానల్ ని మర్యాద చూపమని ఎవరూ దేబిరించలేదు. మీ అమ్మని విమర్శించే హక్కు మీకుంది. అది మీ సంస్కారం. కాని మా అమ్మని, మా దేవుడిని గౌరవించవలసిన బాధ్యత మీకుంది. అది మా హక్కు. ఇది బతిమాలి పుచ్చుకునేది కాదు. వార్తా ప్రసారంలో ప్రాథమిక సూత్రం. వేలాదిమంది సెన్సిటివిటీని గౌరవించవలసిన బాధ్యత అది. బహుశా ఈ ఛానల్స్ నడిపేవారి స్థాయి, సంస్కారం, అవగాహన – ఈ ప్రాథమిక సూత్రాల వరకూ వచ్చి ఉండదు.

You have a right too be wrong when it is a question of opinion. But you have no right to be wrong when it is a question of fact.

ఒక న్యూస్ రీడర్ వదరుబోతుతనం ఇది. గాజులు తొడుక్కున్న భారతదేశం కనుక చెల్లింది. ఎక్కడో డేనిష్ పత్రికలో అల్లా గురించి కార్టూను ప్రచురిస్తే – డెన్మార్క్ ఎక్కడుందో తెలియని వాళ్ళు, ఆ కార్టూన్లు ఏమిటో చూడని వాళ్ళు ప్రపంచంలో ఎన్నో చోట్ల కార్లు, బస్సులు తగలెట్టారు. నేనా కార్టూన్లు చూశాను. అలాంటి పని చెయ్యమని కోరడం లేదు. ఆత్మవంచనని ఈ జాతి అర్హతగా మెడలో మూర్ఛ బిళ్ళలాగ కట్టుకుని ఊరేగడాన్ని నిరసిస్తున్నాను. ధర్మానికి ప్రతీకగా పురాణాలు అభివర్ణించిన యమధర్మరాజు చేత లిమ్కా తాగించే సరదా సినిమాని చూసి మనం చంకలు గుద్దుకుంటాం. ఎప్పుడయినా, ఎవరయినా క్రైస్తవ మతాన్ని అవలంబించే ఇన్ని ప్రపంచ దేశాలలో సెంట్ లూక్ గురించో, సెంట్ పీటర్ గురించో ఇలాంటి పారిహాసిక తీశారా? తీస్తే బతికి బట్టకట్ట గలుగుతారా? మన సంస్కృతిని గురించి మనకి అభిమానం లేదు. ఛానళ్ళను కల్లు దుకాణాల్లాగ నడిపే వ్యాపారస్తుల వదరుబోతుదనాన్ని భరించే దుర్దశ మనకి పట్టింది. ప్రపంచంలో కొన్ని కోట్ల మంది సెన్సిటివిటికి గౌరవం ఇవ్వాలన్న కనీసపు మర్యాద నియమాన్ని పాటించని ఈ ఛానల్ని ఈ ప్రభుత్వం ఎందుకు నిలదీయదు? ప్రభుత్వ లాంఛనాలతో గవర్నరు, ముఖ్యమంత్రి, ప్రతిపక్షనాయకులు స్వయంగా నిలబడి ఈ గొప్ప లాంఛనాన్ని జరిపించిన పెద్దలు "సాయిబాబ మాట తప్పాడు" అని చంకలు




గుద్దుకున్న ఛానల్ పరిహాసాన్ని మాధ్యమాల స్వేచ్ఛగా సరిపెట్టుకుంటారా? మైనారిటీలకు వీరిచ్చే గౌరవం వారే స్వయంగా పూనుకుని గౌరవించిన ఒక మహనీయుని పట్ల జరిగిన బాధ్యతారాహిత్యాన్ని ఎందుకు నిలదీయరు? మరొక దరిద్రం. ఈ వార్తని రాసేవారికి బొత్తిగా అవగాహన లేమి. బాబాగారు విద్యారంగానికి సేవ చేశారు, అనంతపురానికి నీళ్ళు ఇచ్చారు, తమిళనాడుకి గొట్టాలు వేశారు – అని పదే పదే ఛానళ్ళు చెప్పాయి. ఈ కారణంగానే వారికి తామిచ్చే గౌరవం, ఈ కారణంగానే వారికి జాతి నివాళులర్పిస్తోందని వారి కితాబుల్లో అర్ధమయింది. అయ్యా, ఇవన్నీ అతి చిన్న విషయాలు. నేలబారు సంగతులు. ఒక బిర్లా గారు, ఒక టాటాగారు ఇంతకంటే బాగా, గొప్పగా చెయ్యగలరు. 160 దేశాలలో లక్షల మంది ఈ ప్రయోజనాన్ని పంచుకోలేదు, ఈ నీళ్ళు తాగలేదు, అయినా వారంతా స్పందించారు. ఎందుకని? ఈనాటి ఆధునిక యుగంలో అక్రమాలు, అవినీతి, ఆ వ్యవస్థ పెచ్చు రేగిపోతున్న నేపధ్యంలో సేవాభావం, ప్రేమ అనే రెండు గొప్పగుణాలను దేశాల ఎల్లలు చెరిపి స్వామి ప్రసారం చెయ్యగలిగారు. నేను పుట్టపర్తి ఆసుపత్రిలోకి వెళుతూ నా చెప్పుల్ని బయట వదిలేశాను. ఒక ముసలాయన ఆ చెప్పుల్ని భరతుడు పాదుకల్ని పట్టుకున్నట్టు అందుకుని పెట్టాల్సిన స్థలంలో ఉంచుతున్నాడు. ఆయన ఏదో రాష్ట్రంలో ప్రభుత్వంలో గెజిటెడ్ ఆఫీసరు.

స్వామి అద్భుతాలతో మనకి పనిలేదు. కాని 2011 లో ఏకీభావంతో, వినయంతో కుల, మత, ప్రాంత వివక్ష లేని సేవా సైన్యాన్ని తయారుచేశాడాయన. ఈ విజయం ముందు విద్య, నీళ్ళు తృణప్రాయం. విద్య ఇప్పుడు చదువుకునేవారికి. సమభావం, ప్రేమ వయస్సులో ఉన్న సర్వులకూ. ఈ సత్యం దాదాపు అన్ని ఛానల్స్ కీ అర్ధం కాలేదు. ఆశ్చర్యం లేదు. 165 సంవత్సరాల క్రితం ఒకాయన రాముడితో మొరపెట్టుకున్నాడు. "నాదుపై పలికారు నరులు, వేద సన్నుత భవము వేరుచేసి తిననుచు.." అని. ఆధ్యాత్మిక చింతనని పెంచి ఈ లోకపు రీతిని విస్మరించానని నన్నంతా విమర్శిస్తున్నారయ్యా – అని వాపోయాడు. ఆయన పేరు త్యాగరాజస్వామి. ఆధ్యాత్మికానికి విడాకులిచ్చి, నీళ్ళు, గొట్టాలు అని మనకర్ధమయే విలువలకి మాత్రమే పరిమితమైపోయే 'కురచ' దృక్పధాన్ని పెంచుకోడానికి కేవలం 165 సంవత్సరాలు సరిపోయింది! సత్యసాయిబాబా మరణించాడు, మాట తప్పాడు అని ఈ ఛానల్ ఉవాచ.

నిర్యాణం, అస్తమయంలాంటి మాటలు ఈ ఉద్యోగులకు చేతకావు. భేష్.

పోనీ, "స్టాలిన్ చచ్చాడు. లెనిన్ చచ్చాడు" అని చెపుతారా వీరు?

మనకి తెలియని విషయం తెలియదని తెలుసుకోవడం విజ్ఞానం. మనకి తెలిసిన విషయమే దేశానికంతటికీ తెలిసిన, తెలియాల్సిన విషయం అనుకోవడం మూర్తీభవించిన అజ్ఞానం, వార్తా ప్రపంచంలో ఎట్టి పరిస్థితుల్లోనూ చోటులేని అహంకారం. జులుం. కోటంరాజు రామారావు, ఎస్.వై. చింతామణి, కుందుర్తి ఈశ్వరదత్తు, ఖాసా సుబ్బారావు, నార్లవంటి మహనీయులు జాతీయ స్థాయిలో తీర్చిదిద్దిన ఈ గొప్ప మాధ్యమం ఈనాటికి ఇలాంటి కుక్క మూతి పిందెల పాలున పడిపోయింది. అది మన దౌర్భాగ్యం. రేపు తాజ్ మహల్ కూలిపోయిందని ఎవరయినా చెపితే నిజమా కాదా అని పరీక్షించుకునేందుకు పారదర్శకమైన ఛానళ్ళు లేవు. తమ నమ్మకాల్ని అమ్మకాలు చేసుకునే వ్యాపారస్తులకు వృత్తిలో నిజాయితీని నేర్పడం, హంతకుడికి మంగళహారతి పట్టడం లాంటిది. నేనిదివరకు బాబా గారి గురించి చాలా కాలంస్ రాశాను. చివర ఒక వాక్యం రాయడం రివాజు – "నేను బాబా భక్తుడిని కాను" అని. ఇప్పుడు బాబా పార్థివ శరీరంలో లేరు. బహుశా ఇది వారి మీద ఆఖరి కాలం కావచ్చు. ఇది నా ఆఖరి వాక్యం – నేను బాబా భక్తుడిని.

(*మే 02,* 2011)




# (May 09, 2011) Thotikodalu Navvimdi తోటికోడలు నవ్వింది

పాకిస్తాన్ కి తనదైన గొప్ప చరిత్ర ఉంది. ఆ దేశం అవతరించినప్పటి నుంచీ ఇప్పటి వరకూ ఎక్కువగా సైనిక నియంతల పాలనలోనే ఉంది. కాగా, ఇప్పటి ప్రజాస్వామ్యానికీ గొప్ప చరిత్ర ఉంది. ఎన్నో అవినీతి నేరాలకి అరెస్టయి, జైలుకి వెళ్ళి, దేశాన్ని వదిలి పారిపోయిన ఒక నేరస్థుడు జర్దారీగారు – కేవలం బేనజీర్ భుట్టో భర్త అయినందుకే, అదృష్టవశాత్తూ ఆమె హత్య జరిగినందుకే ఆ దేశపు అధ్యక్షుడయారు. ఇది ఆ దేశానికి గొప్ప కిరీటం.

నిజానికి రాజకీయ దౌత్యంలో – ఒక దశలో – అద్భుతమైన అవగాహన చూపించి, ప్రపంచమంతటికీ – ఒక్క ఇండియాకి తప్ప – స్నేహితుడయిన దేశంగా పాకిస్థాన్ ని నిలిపింది అయూబ్ ఖాన్ అని చెప్పుకుంటారు. ఆయన హయాంలో పాకిస్థాన్ – నాటోకి, సెంటోకి, సియటోకీ మిత్రదేశం. కాని ఇండియాతో యుద్ధం – లాల్ బహదూర్ శాస్త్రితో తాష్కెంటు ఒప్పందం తెలిసిందే.సరే. ప్రస్తుతానికి వద్దాం. ఈనాటి పాకీ ప్రభుత్వ రాజకీయాలు మంచి హాస్యనాటకాన్ని తలపిస్తాయి. ఒకానొక రాత్రి అమెరికా తమ దేశానికి వేలమైళ్ళ దూరంలో ఉన్న దేశంలోకి చొరబడి వారి రాడార్ లను జాం చేసి – మిలటరీ స్థావరాలకి కేవలం 500 గజాల దూరంలో ఉన్న భవనం మీద దాడి చేసి అతి నిర్దుష్టంగా – కేవలం 40 నిమిషాలలో – ప్రపంచంలో కల్లా భయంకరమైన తీవ్రవాదిని చంపింది. బాగా ఆలోచిస్తే అలనాడు 9 / 11 న ఒసామా బిన్ లాడెన్ పథకం ప్రకారం అయిదు విమానాలు అమెరికాలో సృష్టించిన దిగ్భ్రమకి ఇది తీసిపోదు. చేసుకున్నవాడికి చేసుకున్నంత. ఈ వినోదం ప్రపంచానికి తెలీదుకాని – వేలమైళ్ళ దూరంలో శ్వేత భవనంలో పెద్దలంతా సినిమాలాగ చూశారు.

ఇందులో మూడు విషయాలు అర్థమౌతాయి. అవసరమైతే అమెరికా తాననుకున్నది సాధించగలదని. రెండు: పాకిస్థాన్ నోరు మూయించగలదనే విశ్వాసం అమెరికాకు బలంగా ఉన్నదని. బిస్కత్తు అందించిన కుక్కపిల్లలాగ ఆర్థికంగా అమెరికా దయాదాక్షిణ్యాలను అనుభవిస్తున్న పాకిస్థాన్ కి మరో గతిలేదని. ఇవి నేలబారుగా చెప్పుకోవలసిన నిజాలు. వీటికి 'రాజకీయపు ముసుగు' అందంగా ఉంటుంది. ప్రపంచమంతటిలాగే ఈ దాడి వార్త పాకిస్థాన్ కి తెలిసింది. తెలియాల్సిన వారందరికీ అమెరికా ఫోన్లు చేసి చెప్పింది. వెనకటికి ఒకావిడ మొగుడు కొట్టాడని కాక తోటికోడలు నవ్విందని ఏడ్చిందట. అమెరికా పళ్ళూడకొట్టిందని కాక భారత సైన్యాధిపతి "మాకూ ఆ శక్తి సామర్థ్యాలున్నాయి" అన్నందుకు జుత్తు పీక్కుంది. సల్మాన్ బషీర్ అనే విదేశీ కార్యదర్శి – ఆయనకీ నాలాగే బుగ్గలు బూరెల్లాగ ఉంటాయి. వాటిని పూరించి "భారతదేశం ఏమైనా తొందరపడితే కొంపముంచుతామ"ని హెచ్చరించాడు. అయితే మళ్ళీ ఇలాగే చావగొట్టే హక్కుమాకుందని మరునాడే అమెరికా స్పష్టంగా చెప్పింది. అంతేకాదు – నిన్నంటే నిన్ననే చావగొట్టి చూపించింది. పాకిస్థాన్ పొలిమేరల్లో డ్రోన్ దాడులు జరిపి 12 మందిని చంపింది. మరో సరదా ఆరోపణ. మా ఇంట్లో భద్రంగా ఓ నగని దాచిపెట్టాను. ఎవరో వచ్చి ఎత్తుకుపోయారు. "మీరు జాగ్రత్తగా లేరు కనుక మా ఇంట్లో దొంగతనం జరిగింది" అన్నారు పాకీప్రధాని. ఇది విచిత్రమైన తర్కం. అలనాడు – 9/11 న అమెరికా దాడులకీ, మొన్న 26/11 దాడులకీ, తమ మిలటరీ కాలనీలోనే అయిదేళ్ళు భద్రంగా వసతి కల్పించిన ఒసామా బిన్ లాడెన్ చావుకీ – అంతర్జాతీయ పరిశోధనా యంత్రాంగం పనిచెయ్యకపోవడమే కారణమని ఆయన ఉవాచ. "మా దేశంలో ఒసామాని దాచాం.మీరు కనుక్కోలేకపోయారు. అది మీ లోపం" అన్నది వారి ఉద్దేశం.

అలనాడు – 9/11 దుర్ఘటన తర్వాత బుష్ దొరగారు ముషార్రఫ్ పిలక పట్టుకుని – పాకిస్థాన్ లోనే స్థావరాలు ఏర్పరచి – ఆఫ్ఘనిస్థాన్ ని స్మశానం చేశారు. పాకిస్థాన్ కి అటు పరువూ పోయింది. ఇటు మర్యాదా దక్కలేదు.




ఏమాటకామాటే చెప్పుకోవాలి – ఒసామా బుద్ధిగా తన మూడో భార్యతో, ఎనిమిదిమంది పిల్లలతో మిలియన్ డాలర్ల భవనంలో బుద్ధిగా గడిపాడు కాని – దావూద్ ఇబ్రహీం మెమూన్, టైగర్ మెమూన్, హాఫీద్ సయీద్ వంటి పెద్దలు టెలివిజన్ కెమెరాల ముందు దర్శనమిస్తూ, వ్యాపారాలు చేసుకుంటూ, పెళ్ళిళ్ళు జరిపించుకుంటూ జీవిస్తున్నారు. వారి అడ్రసులు ప్రపంచమంతా తెలుసు. పాకీ ప్రభువులకి తెలీదు. ఇదే ఈ దేశంలో వింత.

డబ్బిచ్చి – చెప్పుతో కొట్టే పనిని – అమెరికా చెప్పి మరీ సాధిస్తోంది. చెప్పకుండానే వారి దేశంలో జొరబడి ఒసామాను చంపింది. మళ్ళీ మళ్ళీ ఆ పనే చేస్తామంటూ నిన్ననే చేసి చూపించింది.

"అయినా పాకిస్థాన్ మాకు మిత్రులు. వారు తీవ్రవాదుల్ని అణచడానికి ఎంతో కృషి చేస్తున్నా రు" అంటోంది. "మాకూ వారంటే గౌరవమే నిన్నటి విషయం మరిచిపోదాం" అంటున్నారు బషీర్ సాహెబ్ గారు మింగలేక, కక్కలేక ఇండియా వేపు చూసి పళ్ళునూరుతూ.

ఏతా వాతా పాకిస్థాన్ నిజాయితీ ప్రపంచాని కంతటికీ తెలుసు. తెలుసునని అమెరికాకు తెలుసు. అమెరికాకు తెలిసిన విషయం పాకిస్థాన్ కి తెలుసు. ఇండియా ఆ పని చెయ్యలేదని తెలుసు. పాకిస్థాన్ కి తెలుసని మనకి తెలుసు. మధ్యలో అమెరికా పాకిస్థాన్ పళ్ళూడగొట్టిందని ప్రపంచానికంతటికీ తెలుసు. తెలిసిపోయిందని ఇప్పుడు పాకిస్థాన్ కీ తెలుసు.

ప్రస్తుతం ఇండియా పాకిస్థాన్ కి తోడికోడలు. అసలు కొట్టే మొగుడు ధైర్యంగానే కొడుతున్నాడు. నిన్ననే రెండో దెబ్బ కొట్టాడు. ఇప్పుడు పాకిస్థాన్ బాధల్లా తోడికోడలు నవ్విందని.

*(మే 09,* 2011)

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

# (May 16,2011) Cheekatloki Prayanam చీకట్లోకి ప్రయాణం

దాదాపు 40 ఏళ్ళు పైగా నా మనస్సులో నిలిచిన ఒక వాక్యం ఉంది."కథ బ్రహ్మ దేవుడి ఆఖరి వ్యసనం" అని. ఇది ఎప్పుడూ నాకు గుర్తొచ్చే వాఖ్య. బ్రహ్మదేవుడు అందమయిన ముఖాన్ని,శరీరాన్ని, సౌష్టవాన్ని సిద్ధం చేశాక ఆయన చెయ్యాల్సిన ఆఖరి పని – ఆ బొమ్మకి ఒక కథని నిర్దేశించడం. ఈ సృష్టిలో కోట్లాది కథల్ని సిద్ధం చేసిన గొప్ప కథా రచయిత, సృష్టి కర్త – బ్రహ్మ దేవుడు. ఇది చాలా అందమయిన ఆలోచన.

ప్రస్తుతం నేను అబూదాబీలో ఉన్నాను. ఈ పర్యావరణాన్ని సుప్రతిష్ఠం చేసే అన్ని రకాల వాస్తవాలను సమీకృతం చేసి పుస్తకాలుగా – కాదు – విజ్ఞాన సర్వస్వాలుగా ప్రచురించే యునెస్కో ప్రాజెక్ట్ ఇక్కడ నడుస్తోంది. దాన్ని సిద్ధం చేసే అంతర్జాతీయ సంపాదక మండలిలో నేను సభ్యుడిని. ఆ పనిమీదే ఇక్కడికి వచ్చాను.

ఇది వివరణ. ఈ కాలమ్ ఉద్దేశం ఇది కాదు. ఇవాళ సృష్టికర్త శక్తికి మూలకారణమయిన జన్యుకణాలలో (డి ఎన్ ఏ) ఏ అంశం వల్ల మానవజీవితంలో ఈ వైవిధ్యం రూపు దిద్దుకుంటోందో అర్థం చేసుకునే సామర్థ్యాన్ని కూడా మానవుడు పెంచుకున్నాడు. మనిషి పెరిగి పెద్దయ్యాక బట్టతల రావడానికీ , నేత్ర సౌలభ్యం దెబ్బతినడానికీ, శరీరం రంగు నల్లగా ఉండడానికీ, పక్షవాతం రావడానికీ – ఆ కణాలలో ఏ భాగాలు కారణమో మానవుడు గుర్తుపట్టాడు. ఇంకా గొప్పవిషయం ఏమిటంటే ఆయా ఏర్పాట్లను మార్చే సామర్థ్యాన్ని కూడా మానవుడు పెంపొందించుకున్నాడు. ఇది అద్భుతమైన అభివృద్ధి. అనూహ్యమైన ముందడుగు.

మరొక గొప్ప విషయాన్ని గుర్తు చెయ్యడానికే ఈ కాలమ్. కోట్లాది మంది ఉన్న ఈ భూగ్రహం పై ఒక మనిషికీ, చీమకీ, సింహానికీ, చెట్టుకీ – ఆ మాటకొస్తే ప్రాణం ఉన్న ఏ జీవరాశికైనా – ఆ జీవస్వభావాన్ని నిర్ణయించే ప్రాతిపదికలు ఈ జన్యుకణంలో కేవలం నాలుగే ఉన్నాయి. ఈ దశలో దీన్ని అర్థం చేసుకోడానికి ఈ మాత్రం వివరణ చాలు. ఈ నాలుగు ముఖ్య లక్షణాలను శాస్త్రజ్ఞులు A, G, C, T గా గుర్తుపట్టారు. ఈ నాలుగు ప్రాతిపదికల వివిధ సంయోగమే ఒక జీవరాశిని మరొక ప్రాణికి భిన్నంగా సృష్టిని చేస్తుంది. కేవలం నాలుగు. ఈ సృష్టి అంతా కేవలం ఈ నాలుగు పార్శ్వాలలో ఇమిడి ఉంది. ఇంతకంటే మరో కారణమూ లేదు మరో సంయోగమూలేదు. కేవలం నాలుగు పార్శ్వాలు. ఇప్పుడు – మనసృష్టి కర్తకి కేవలం నాలుగే ముఖాలు. నాలుగు విభిన్నమైన పార్శ్వాలు. ప్రత్యేకతలు. వీటిని సంయోగపరచడమే సృష్టికర్త చేసేపని.

ఆశ్చర్యంగా ఉందా? అద్భుతంగా ఉందా? పూర్వీకులు – ఆనాటి ఋషులు లేదా మేధావులు – ఇంత సాంద్రతగల జన్యుశాస్త్ర రహస్యాన్ని ఆనాడే గుర్తుపట్టారా? బ్రహ్మ నాలుగు ముఖాలలో దత్తాత్రేయుడి మూడు ముఖాలలో – ఇంకాస్త ముందడుగు వేసి రావణాసురుడి పది తలకాయలలో – మన "ప్రాథమిక"మైన ఆలోచనలకి అందని అభిజ్ఞ (సింబల్) ఏదైనా ఉందా?

ఎరిగిన బలమైన నిజాన్ని ఎరగనక్కరలేని విశ్వాసంగా తరతరాల మానవాళికి వారసత్వం గా పంచిన అలనాటి రుషులు తాము తెలుసుకున్న, అర్థం చేసుకున్న గొప్ప సత్యాల్ని కేవలం విశ్వాసాల్లోకి ఇరికించి నిక్షిప్తం చేశారా?

వెక్కిరించే పరిమితమైన తెలివితేటలు మాత్రమే ప్రోదు చేసుకున్న, వాలంటైనులను దొడ్డిదారిన దిగుమతి చేసుకున్న నేటి "తెలివైన" ఆధునికునికి ఇది అభూతకల్పనా? ఇలా చాలా నిజాలను చాలా రంగాలలో కేవలం విశ్వాసానికి మాత్రమే అందే దశలో వదిలిపెట్టేరా మన పూర్వీకులు?




మరొక గొప్ప సంఘటనని ఇక్కడ ఉదహరించక తప్పదు. మనం గుర్తించుకున్నా లేకపోయినా లోక కళ్యాణానికి అనునిత్యం, నిశ్శబ్దంగా కృషిచేసేవాడు ఋషి. కొన్ని వేల సంవత్సరాలు ఈ పనిని మనదేశంలో చాలామంది చేశారు. వాళ్ళు మనదేశంలో చేశారు కనుక మనం వాళ్ళని తేలిగ్గా మరచిపోవచ్చు. ఆపనే సమర్ధనీయంగా ప్రస్తుతం చేస్తున్నాం. కాని అలాంటి పని 19వ శతాబ్దంలో విదేశాల్లో ఒకాయన చేశాడు. ఆయన పేరు థామస్ ఆల్వా ఎడిసన్. ఆయన మానవజాతికి వెలుగునిచ్చిన వైతాళికుడు. పండితుడినీ పామరుడినీ, మెచ్చుకున్న వాడినీ తిట్టుకున్నవాడినీ వెలుగుతో (విద్యుద్దీపంతో) సత్కరించిన ఋషి. ఇంకా చలనచిత్ర కెమెరానీ, గ్రామఫోను రికార్డునీ కనుగొన్నాడు. కనుగొన్నాక గ్రాం ఫోను మీద మొదటిసారిగా ఎవరిచేత మాట్లాడించాలా అని ఆలోచించాడు. ప్రముఖ జర్మన్ తత్వవేత్త మేక్స్ ముల్లర్ అతని మనస్సులో కదిలాడు. ఆయన ఇంగ్లాండులో ఉంటున్నాడు. ఎడిసన్ షిప్పులో ఇంగ్లాండు బయలుదేరాడు. ఎందరో హాజరైన సభలో మాక్స్ ముల్లర్ గ్రామఫోను ముందు గొంతు విప్పి మాట్లాడాడు. ప్రేక్షకులు ఆయన కంఠధ్వని ఆ పెట్టెలోంచి రావడాన్ని చూసి దిగ్భ్రాంతులయారు. కాని ఆయన మాట్లాడిన భాష, విషయం వారి కర్ధంకాలేదు.

అప్పుడు మాక్స్ ముల్లర్ వారికి వివరించాడు: నేను మాట్లాడిన భాష 'సంస్కృతం ' చెప్పిన మొదటి వాక్యం – ఋగ్వేదంలో మొదటి శ్లోకం – "అగ్నిమీలే పురోహితం". వేదం మానవాళి చరిత్రలో సృష్టించబడిన మొట్టమొదటి కృతి – శృతి. ప్రాచీన కాలంలో యూరపులో మనుషులు చెట్టునుంచి చెట్టుకి కొమ్మనుంచి కొమ్మకి చింపాంజీలలాగ ఎగురుతూ, ఒళ్ళు దాచుకోడానికి ఆకులు చుట్టుకుని, వ్యవసాయమంటే ఏమిటో తెలియక, గుహల్లో తలదాచుకుని, జంతువులని వేటాడి, తిని బ్రతికే రోజుల్లో భారతీయులు అత్యున్నత స్థాయిలో సంస్కృతీ వికాసాన్ని మానవాళికి అందిస్తున్నారు. ప్రపంచ తాత్విక చింతనకు వేదం ద్వారా ఒక పరిణతినీ, మార్గాన్నీ సూచిస్తున్నారు. అదృష్టవశాత్తూ ఈ మాటని ఒక విదేశీయుడు మాక్స్ ముల్లర్ అన్నాడు కనుక మనం గౌరవించవచ్చు.

మళ్ళీ మనం ఈ కాలం ముఖ్యాంశం – బ్రహ్మస్వరూపం దగ్గరికి వద్దాం. ఎంతవరకు ఈ సమ్యమనాన్ని మనం అంగీకరించవచ్చు?

ముందుతరాలకు "పర్యావణ కాలుష్యాన్ని గురించి" ప్రాధమిక సమస్యల గురించి సాధికారంగా పరిశోధనలు జరిపి, విజ్ఞాన్ని 600 సంపుటాలలో – 20 విజ్ఞాన సర్వస్వాల ద్వారా రేపటి మానవుడికి నిక్షిప్తం చేస్తున్న UNESCO-EOLSS కార్యాలయంలో (అబుదాబి శాఖలో) కూర్చుని ఈ ప్రశ్నల్ని సంధిస్తున్నాను.

చీకటి అందర్నీ భయపెడుతుంది. అజ్ఞానం కొందరికి ఆయుధం అవుతుంది. కానీ చీకటిలోనే గురిచూసి బాణాన్ని సంధించే సామర్ధ్యాన్ని వేల సంవత్సరాల క్రితమే పురాణాల్లోకి ఎక్కించిన మన వ్యవస్థ ఈ "చీకటిని" సమన్వయం చేసుకునే సమయం వచ్చిందా? అన్న ప్రశ్న వేయడానికే ఈ కాలం.

ముగించే ముందు ప్రపంచ ప్రఖ్యాత రచయిత లియొ టాల్ స్టాయి మాటలు: "నేటి ప్రధాన సమస్యల గురించి అధ్యయనం చేసేముందు, గతించిన శతాబ్దాల ఆలోచనా సరళి పట్ల మన దురభిప్రాయాలు, స్పర్ధల్ని మనం సమూలంగా నిర్మూలించుకోవాలి."

*(మే 16,* 2011)




# (May 23,2011) Paapam పాపం

తమిళనాడు ఎన్నికలకు ముందు ఎన్ డీ టీవీ పాత్రికేయురాలు బర్ఖాదత్ కరుణానిధిగారిని చెన్నైలో ఓ ప్రశ్న వేసింది. "జయలలిత గురించి తమరు చెప్పేదేమైనా ఉన్నదా?" అని. కరుణానిధిగారు క్లుప్తంగా "పాపం" అన్నారు. బర్ఖాదత్ కిసుక్కున నవ్వుకుంది.

కరుణానిధిగారు నాస్తికులు కనుక, వారికి పాపపుణ్యాల మీద నమ్మకం ఉండదు కనుక ఈ పాపానికి అర్థం జయలలిత మీద జాలో, రోగం కుదురుతుందన్న వ్యంగ్యమో అనుకోవాలి . ఇది జరిగి కేవలం నెలరోజులు కూడా కాలేదు.

2జి అవినీతికి ప్రపంచ చరిత్రలోనే ఓ గొప్ప స్థానం లభించింది. దిక్కుమాలిన పనులు చేసిన ప్రపంచనాయకుల జాబితాను అమెరికా టైమ్స్ పత్రిక జాబితా సిద్ధం చేసింది. అధికార దుర్వినియోగం చేసి, పదవిని పావుగా వాడుకున్న మహానాయకుల దరిద్రపు ఘనతకి ఈ జాబితాలో చోటుంటుంది. ఈ జాబితాలో ఏ.రాజాగారి ఘనత – 7 బిలియన్ల డాలర్లు ఫలహారం చేసిన ఘనత – రెండో స్థానంలో నిలిపింది. మరి మొదటి స్థానం? వాటర్ గేట్ కుంభకోణం కారణంగా నిక్సన్ దొరగారిది. ఇక రాజాగారు జయించిన మిగతా ఘనులు? లిబ్యా అధ్యక్షులు గద్దఫీ, ఉత్తర కొరియా నాయకులు కిం యోంగ్, ఆడపిల్లల మోజు విడని యోధుడు, ఇటలీ ప్రధాని సిల్వియో బెర్లుస్కోనీ. ఏమైనా ఇది అనితర సాధ్యమైన ఘనత. ఇందులో రాజా తర్వాత లేదా రాజాతో అన్నిటినీ పంచుకున్న కరుణానిధిగారి కూతురు కనిమొళికే ఈ తాంబూలం దక్కుతుంది.

ఇలాంటి పర్యవసానం పత్రికలు, న్యాయ వ్యవస్థ సాధించిన విజయం. స్వాతంత్రోద్యమ కాలంలో గాంధీజీ, నెహ్రూ, పటేల్, తిలక్, పట్టాభి సీతారామయ్య వంటి మహనీయులెందరో జైళ్ళలో ఉన్నారు. తరతరాలు గర్వపడే వైభవమది. ప్రస్తుతం ఒక కేంద్ర మంత్రి, ఇద్దరు పార్లమెంటు సభ్యులు – అందులో ఒక ముఖ్యమంత్రిగారి ముద్దుల కూతురు, ఎందరో కార్పొరేట్ పెద్దలు ఉన్నారు. మరో విధంగా తరతరాలు గుర్తుంచుకోవలసిన క్షణమిది.

'వాడి పాపం పండుతుంది' అనుకోవడమే కాని పండడం లేదని వాపోయే ప్రజల నిర్వేదానికి నిన్న కనిమొళి జైలుకి వెళ్ళిన దృశ్యం – చక్కని ఊరట. "మీకూ ఒక కూతురుంటే – ఆమె చెయ్యని నేరానికి జైలుకి వెళితే.." అని వక్కాణించిన ఆమె తండ్రి, మహా రచయిత, ఒకప్పటి ముఖ్యమంత్రి కరుణానిధిగారు వాపోయారు. ఏ నేరమూ చెయ్యకపోతే కోట్ల పెట్టుబడితో తమ పేరున టీవీ ఛానల్ ఎలా వెలిసిందో తెలియని అమాయకులు వారు కారని దేశానికి తెలుసు. తమ కొడుకులూ, కూతుళ్ళూ, మేనల్లుళ్ళూ, ఇంకా కూతురి ఆత్మీయులూ కోట్ల రూపాయల్ని ఫలహారం చేస్తూంటే ఏ నల్ల కళ్ళజోడుతో వారు ఈ 'నిరపరాధుల్ని ' పరికించారో కోట్లాది ప్రజలు గమనిస్తున్నారన్నది నిన్నటి ఎన్నికలు తేల్చి చెప్పిన సత్యం. నిన్న కోర్టులో కనిమొళి ఏడ్చిందట. ఈ మెలో డ్రామాని ప్రజలు హర్షించలేదు. నేటి పత్రికలన్నీ రంగు రంగుల కనిమొళి బొమ్మలతో పండగ చేసుకున్నాయి. అందరూ జైళ్ళలో పక్కపక్కనే ఉన్నారట. కనిమొళి కళ్ళజోడు, కాగితాలు అడిగినట్టు పత్రికలు చెప్పాయి. భేష్. ప్రపంచ సాహిత్యం గుర్తుంచుకోతగ్గ రచనని ఆస్కార్ వైల్డ్ జైల్లో చేశాడు – 'ది ప్రొఫండిస్ ' (అంటే – హృదయాంతరాళాల లోంచి – అని), తిలక్ భగవద్గీతకి భాష్యాన్ని రాశారు. నెహ్రూ డిస్కవరీ ఆఫ్ ఇండియా రాశారు. రాజాజీ రామాయణాన్ని రాశారు. కనిమొళి ఏం రాస్తుందో చూడాలి. పక్క జైలుగదిలో ఉన్న ప్రియుడికి ప్రేమలేఖా?

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ
కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

ఇక్కడో నీతికథ. ఓ రాజుగారికి తన అనుచరుడి మీద ప్రేమ కలిగిందట. అతన్ని పిలిచి "నువ్వు నడిచి వెళ్ళినంత మేరా నీ సొంతం అవుతుంది. నడిచి వెళ్ళి తిరిగిరావాలి" అన్నారట. ఆ అనుచరుడు పరుగులు తీశాడు. అడుగులు దూసుకున్నంత మేరా తన సొంతం. ఆశ ఎగదన్నుతోంది. మధ్యాహ్నం దాటింది సాయంత్రమైంది ఇంకా పోతున్నాడు తిరుగు ముఖం పట్టేసరికి వేళ మించిపోయింది. రాలేక, అడుగులు పడక ప్రాణం వదిలాడు. ఆఖరికి అతనికి కావలసింది – పరుగులతో దోచుకున్న ఆస్తికాదు. ఆరడుగుల నేల.

లక్షా డెబ్బై ఆరువేల కోట్లు భుజించిన నాయకమ్మన్యులకు ఆఖరున మిగిలింది – తీహార్ జైలులో 15x10 అడుగుల జైలు గది. గాంధీజీ ఓ మాట అన్నారు: ఈ భూమి మీద ప్రతి వ్యక్తి అవసరాలను తీర్చగలిగినన్ని వనర్లు ఉన్నాయి. ప్రతి వ్యక్తి పేరాశను తీర్చగలిగే వసతి లేదు – అని. పది కార్లు, పది టీవీలు, వందకోట్లు, రెండుటీవీ ఛానళ్ళు, ముగ్గురు భార్యలు, ఇద్దరు భర్తలు –ఇదీ ఈనాటి పేరాశకి నిదర్శనాలు. ఏ.రాజా అనే ఓ నేలబారు రాజకీయ నాయకుడూ, ఓ మామూలు అడ్వొకేట్ ఇంటిని తమరు చూడాలి

(http://mail.google.com/mail?shva=1#search/A.RAJA+HOUSE/12de6ed7adceeb7e)

కళ్ళు తిరిగి పోయే దోపిడీకి, పేరాశకీ vulgarity of money కీ చిహ్నమిది.

ఈ దేశంలో అన్నా హజారే ఉన్నారు. ఆయన ఫరీదాబాద్ లో ఒకగుడిలో 10x 12 గదిలో నివసిస్తారు. పద్మభూషణ్. ఆయన అవినీతి మీద ధ్వజమెత్తితే దేశం ఒక్కటయి ఆయన వెనుక నిలిచింది. మదర్ థెరిస్సా ఉంది. ఆమె మతి సరిగ్గా లేని 8 మంది పసివారిని అక్కున చేర్చుకుంటే దేశం ఆమెతో కలిసి కంటతడి పెట్టుకుంది. ఇంకా మనూశర్మ ఉన్నాడు. ఏ.రాజా ఉన్నాడు. ప్రస్తుతం తీహార్ జైల్లో ఆరవ నెంబరు గదిలో ఓ ముఖ్యమంత్రి కూతురు – కనిమొళి ఉంది. నిన్న దేశమంతా ఒక్కటయి పండగ చేసుకుంది. చేసిన పాపానికి ఏడవరోజున తక్షకుడి కాటుతో ప్రాణం వదులుతాడని శాపం పొందిన పరీక్షిత్ మహారాజుకి శ్రీ శుకుడు ఏడు రోజుల పాటు పురాణాలన్నీ వివరించాడు. ఆఖరి మాటలు చెపుతూ చనిపోతానని బాధపడకు, పుట్టినవాడికి చావు తప్పదు – అంటూ ఆయన చెప్పిన హితవుని పోతన్నగారు అతి హృద్యంగా వివరించారు:

కారే రాజులు, రాజ్యముల్ కలుగవే, గర్వోన్నతిం బొందరే,వారేరీ, సిరి మూటగటుకుని బోవంజాలిరే, యుర్విపై పేరైనం గలదే..!!?

కరుణానిధిగారి 'పాపం' – ఇప్పుడు కొంగుబంగారంలాగ కలిసివస్తుంది – నాస్తికుడి వ్యంగ్యంగానైనా, ఆస్తికుడి 'పాపం'గా నయినా!!

*(మే 23,* 2011)



# (May 30,2011) Bhaktimaargalu భక్తిమార్గాలు


'మతం' రేపర్లో చుట్టడం వల్ల – మన చుట్టూ ఉన్న ప్రపంచంలో చాలా విషయాల పరమార్ధం మరుగున పడిపోతుంది. మతం నిజానికి రంగు కళ్ళద్దం. ఈ దేశంలో మతం అన్నమాట శతాబ్దాల క్రితం లేదు. ఆ మాటకి వస్తే ఎక్కడా లేదు. ఏ పురాణాల్లోనూ ఈ మాట కనిపించదు. ఆ రోజుల్లో మనకున్నది సనాతన ధర్మం. న్యాయంగా 'ధర్మం' అంటే చాలు. అది ఆనాటిది కనుక 'సనాతనం' చేర్చాం. నిజానికి ఈ ధర్మం ప్రతి మతానికీ వర్తిస్తుంది. మనిషి చెయ్యాల్సిన విధి. ప్రవక్తల, మహానుభావుల, ప్రవచనాల, ప్రభోధాల అర్థం ఇదే. ఈ గొడవ ఇక్కడికి చాలు.

'మతం' రేపర్లో చుట్టకుండా రామాయాణాన్ని గొప్ప కోణంలో చూసి, చూపి విశ్లేషించారు ప్రముఖ పరిశోధకులు, సంస్కృత పండితులు వి.రాఘవన్ గారు. (ఆయన చిత్రపఠాన్ని చెన్నై మ్యూజిక్ అకాడమీ మినీ హాలులోకి అడుగు పెడుతూనే ఇప్పటికీ చూడవచ్చు) సర్వకాలికమయిన విలువల్ని కలబోసిన రచన రామాయణం. అలాంటి రామాయణంలోనే ఒక లోపం మిగిలిపోయిందట. స్వామి భక్తికి, కృతజ్ఞతకి ప్రమాణం లేకపోవడం. కొన్ని శతాబ్దాలపాటు – కొన్ని రామాయణాల్లో ఒక పాత్రలేదు. తర్వాత దాన్ని చేర్చారట. దాని పేరు – హనుమంతుడు. నరుడు కాదు. వానరుడు. ప్రపంచంలోకలా రెండూ గొప్ప విలువల్ని నరుడు కాని ఒక వానరం ప్రాతినిధ్యం వహిస్తోంది. మనకి సూచిస్తోంది. ఇప్పుడు ఆయన్ని దేవుడు చేసుకుంటే గొడవ లేదు. (ఇలా రాస్తున్నప్పుడు చాలామంది భక్తుల మనస్సులు కలుక్కుమంటాయేమోగాని, నా పేరు 'మారుతి' అని గుర్తుంచుకుంటే కాస్త ఊరట కలగవచ్చు.) ఏతావాతా, ఈ జాతికి కృతజ్ఞత, స్వామి భక్తి విలువకట్టలేని ఆభరణాలు. నెహ్రూగారు పోయినప్పుడు నేను హైదరాబాదు రేడియోలో పనిచేస్తున్నాను. అప్పటి సమాచార, పౌర సంబంధాల మంత్రి పి.వి.నరసింహారావుగారు నెహ్రూకి శ్రద్ధాంజలి ఘటిస్తూ – ఈ దేశంలో ప్రజలకి పాలించే నాయకుడే కాక, ఆరాధించే ప్రభువూ కావాలి అన్నారు. తమకి బాగా నచ్చిన, తాము బాగా మెచ్చిన లేదా మేలు చేసే 'పెద్ద' కి జీవితంలోనే పెద్ద పీట వేయడం ఈ జాతికి వ్యసనం.

ఒబామాకి ఎక్కడా గుడి ఉన్నట్టు మనం వినలేదు. ఘంటశాల గారికి గుడి ఉంది. ఎంజీఆర్ కి గుడి ఉంది. జయలలితకి గుడి ఉంది. ఎన్టీ ఆర్ పాదాల మీద నెలల బిడ్డని ఉంచి – ఆయన చేత పేరు పెట్టించుకున్న సందర్భాలని నేను ఆయన పక్కన నిలబడి కళ్ళారా చూశాను. తమ నాయకుల్ని గౌరవ స్థాయిలో ఆపడం మన జాతికి సాధ్యం కాదు. లేదా మనస్సు ఒప్పదు. ఆ పరిధిని దాటి ఆయనని 'వేలుపు'గా, 'దేవుడు'గా నిలుపుకుంటే తప్ప ఊరట కలగదు. ఇది జాతి బలం అందామా? బలహీనత అందామా? స్వభావం అందామా? ప్రత్యేకత అందామా? వికారం అందామా? – స్థూలంగా వీటన్నిటికీ వర్తించే గుణమిది.

ఏకపత్నీవ్రతుడు, పితృవాక్య పరిపాలకుడు, దానవుల్ని సంహరించే యోధుడు, అబద్ధం చెప్పనివాడూ, పరిపాలనా దక్షుడూ, మనోహరుడూ, మంగళ స్వరూపుడూ – శ్రీరాముడు – మనకి దేవుడు. ఈ గుణాలు అతన్ని దేవుడిని చేశాయా? ఆయన దేవుడు కనుక ఈ గుణాలన్నీ అబ్బాయా అన్నది చరిత్ర. మొదటిది ఆదర్శం. రెండోది ఆరాధన. మొదటిది మార్గదర్శకం. రెండోది పారమార్థికం. మొదటిది విశ్లేషణాత్మకం. రెండోది విశ్వాసాత్మకం.



**BEST FEET FORWARD:** IT minister R B Udhayakumar comes barefoot for the assembly session on Wednesday

ఇప్పుడు అసలు విషయానికి వస్తే అతి ప్రాథమిక స్థాయిలో – అతి మామూలు జీవితాన్ని గడిపే ఒకాయన – తమిళనాడులో అవనియాపురం అనే గ్రామంలో ఉన్నాడు. అతని పేరు ఉదయకుమార్. ఆయన తండ్రికి ఎంజీఆర్ దేవుడు. ఆయన్ని ఆరాధిస్తూ గడిపాడు. ఆయన కొడుకు ఉదయకుమార్, అమ్మ(జయలలిత)ని ఆరాధిస్తూ గడిపాడు. ఆమె కోసం దేవాలయాల్లో పూజలు చేశాడు. మొక్కుకున్నాడు. ప్రార్ధనలు చేశాడు. ప్రస్తుతం ఈయన జయలలిత మంత్రివర్గంలో సమాచార, సాంకేతిక శాఖ మంత్రి అయాడు. (భక్తులకు దేవుడు వరాలు ఇవ్వడని ఎవరనగలరు!) ఇతనికి ఒకటే నియమం. అమ్మ నడిచిన నేలమీద చెప్పులు వేసుకుని నడవరాదు. (అమ్మవారు – అలమేలు మంగ స్వామి కోసం ప్రతి రాత్రీ తిరుమలకి వస్తుందని నమ్మే భక్తులు తిరుమలలో పాదరక్షలు వేసుకోరు) ఒక దశాబ్దంగా ఆ పనే చేస్తున్నాడు. ప్రస్తుతం ఈ మంత్రిగారు చెప్పులు లేకుండానే ఆఫీసుకి వస్తున్నారు. మెరిసే బూట్లతో, పాదరక్షలతో వచ్చేవారంతా ఆయన కాళ్ళు చూసి కంగుతిని – గుమ్మం దగ్గరికి పరిగెత్తుతున్నారట తమ పాదరక్షలు విప్పడానికి.

"నా ఆరాధన ఎవరికీ ప్రతిబంధకం కాదు. నా విశ్వాసం నాది. ఎవరూ దీన్ని పాటించనక్కరలేదు. ఆక్షేపించనక్కరలేదు" అంటారు ఈ అమ్మ భక్తుడు.

అయ్యా, ఎవరి భక్తివారిది. ఎవరి దేవుళ్ళు వాళ్ళకి. పరాయి దేవుళ్ళ కారణంగా మన కొంపల మీద బాంబులు పడితే బాధపడాలిగాని – జయలలితని కొలిచే ఈ చెప్పుల్లేని భక్తుల వల్ల ఎవరికీ ఇబ్బంది లేదు.

కాగా, విశ్వాసం వెర్రితలలు వేసే స్థాయికి వచ్చిన సందర్భమిది. ఆ మాట 'రాముడు ' విషయంలోనూ కొందరు అనొచ్చుకదా? అంటున్నారు కదా? 'విశ్వాసం' వింత కొలబద్ద. దాని తూనికరాళ్ళు – శ్రీ కృష్ణ తులాభారంలో తులసి దళం. ద్రౌపది వస్త్రాపహరణంలో స్తోత్రం. కురుక్షేత్రంలో ప్రార్ధన. అవనియాపురంలో – పాదరక్ష. అలా సరిపెట్టుకుంటే గొడవలేదు. తాటిచెట్టునీ తాతపిలకనీ ముడివేసిన సందర్భంగా ఇది కొందరికి కనిపించవచ్చుకానీ – తీగెలాగితే డొంక కదిలే విచికిత్స ఇది.

(*మే 30,* 2011)




# (June 06, 2011) Kalmadiki Borukodutondi కల్మాడీకి బోరుకొడుతోంది

నన్నెవరయినా "మీరేం చేస్తూంటారు?" అనడిగితే – " వెధవ్వేషాలు వేస్తూంటాను – సినిమాల్లో" అంటూంటాను. మరోసారి "ముఖాన్ని అమ్ముకుని బతుకుతూంటాను" అంటాను. నేనే వేషం వేసినా, మిత్రులు రావుగోపాలరావుగారూ నేనూ షూటింగులలో కలవక పోయినా 'క్లైమాక్స్ లో కలుస్తాం లెండి ' అనుకునేవాళ్ళం. ఎందుకంటే తప్పనిసరిగా క్లైమాక్స్లో మా ఇద్దరినీ శిక్షిస్తే కాని కథ పూర్తికాదు. ఇద్దరం కనీసం రెండు రోజులయినా కోర్టు బోనులో నిలబడేవాళ్ళం. హీరో మమ్మల్ని దుయ్యబడతాడు. జడ్జిగారు మాకు శిక్షవేస్తాడు. అప్పుడు శుభం కార్డు. మా అదృష్టం బాగుంటే సినిమాలో 'చావు' ముందే వస్తుంది. ముంచుకొస్తుంది. మిత్రులు మోహన్ బాబుతో నేను విలన్ గా నటించిన సినిమా 'పద్మవ్యూహం'. ఇప్పుడు టీవీ ప్రోగ్రాం చేస్తున్న ఆయన కుమార్తె లక్ష్మిని ఎత్తుకుని నటించిన గుర్తు కాంచీపురం ఆలయంలో. క్లైమాక్స్ లో నా మీద రకరకాల పాముల్ని విసురుతారు – నన్ను హింసించడానికి. పాములకి మనుషులంటే భయం. నాకు పామంటే చీదర. "ఇదంతా చూశాక ప్రేక్షకులకి విలన్ మీద సానుభూతి పెరిగిపోతుందయ్యా" అనేవాడిని.

ఇంత వివరంగా ఈ పూర్వాశ్రమాన్ని జ్ఞాపకం చేసుకోవడానికి కారణం – నిజజీవితంలో రకరకాల ఆటలు ఆడించి – డబ్బుకోసం నానా నాటకాలూ ఆడి వందల కోట్ల ఫలహారం చెయ్యడానికి కారణమయిన క్రీడాకారులు సురేష్ కల్మాడీ గారు. మొన్నటి కామన్వెల్తు ఆటల్లో జ్యోతిని వెలిగించడానికి బ్రిటిష్ రాణి సరసన నిలిచారు. క్రీడలు అయాక బహుమతి ప్రధానానికి మన ప్రధాని సరసన నిలిచారు. ప్రస్తుతం తీహార్ జైలులో 10x12 అడుగుల జైలు గదిలో నిలిచారు. అవినీతికి చక్కని, తప్పని ముగింపుని సినిమాల్లో 150 చిత్రాలలో నటించిన నాకు – నిజజీవితంలో మొదటిసారిగా కల్మాడీగారిని చూశాక కళ్ళు చెమర్చాయి.

వారికి ప్రస్తుతం జైలులో బోరుకొడుతోంది. కారణం – 27 ఛానళ్ళు చూపే టీవీని వారు ఏమీ తోచక చూస్తున్నారు. వారానికి రెండుసార్లు పెళ్ళాం, పిల్లలు వస్తారు. జైలుగదిగురించీ, దొంగ సొమ్ముగురించి వారు శ్రీమతితో మాట్లాడుకుంటారు. రోజంతా జైల్లో పచార్లు చేస్తారు. సాయంకాలం ఆరునుంచి ఉదయం ఆరుదాకా తప్పనిసరిగా జైలుగదిలో ఉండాలి. ఇదిగో, ఇక్కడ కల్మాడీగారికి బోరు కొడుతోంది. ఈ సందర్భంలో తనతో ఎవరయినా గదిలో ఉంటే బాగుండునని వారికనిపిస్తోంది. ఆ విషయాన్ని వారు జైలు అధికారులతో చెప్పారట. ఆయన అనుచరులు లలిత్ భానోత్, వి.కె.వర్మగారిని కానీ, లేదా ఇద్దరినీ తన గదిలోకి పంపమని కోరారట. రాత్రంతా ముగ్గురూ కామన్వెల్తు భాగోతాన్ని గురించి మాట్లాడుకోవచ్చు. దోచుకున్న డబ్బు ఎలా పంచుకోవాలో చర్చించుకోవచ్చు. తీరా జైలు నుంచి విడుదల అయాక ఏం చెయ్యాలో ఒక సమగ్రమైన ప్రణాళికని వేసుకోవచ్చు. అయితే కల్మాడీగారికి తెలియకుండా ఫలహారం చేసిన సొమ్మును వారిద్దరూ సంప్రదించుకుని పంచుకోవలసిన కార్యక్రమంలో వారున్నారేమో!

ఏతావాతా, కల్మాడీగారికి ముందు చూపు తక్కువంటాను. ఇప్పుడూ అవినీతిపరులకి నా సలహా. తమరు నిజజీవితంలో వెధవ్వేషాలు వేసేటప్పుడూ – రేపు జైలుకి వెళితే మీతో తోడుగా గదిలో ఉండేవాళ్ళనే, ఉండడానికి ఇష్టపడేవాళ్ళనే సహచరులుగా ఉంచుకోవాలి. చేతులు కాలాక ఆకులు పట్టుకుని ప్రయోజనం లేదు. రేపు మారన్ సోదరులు జైలుకి వచ్చారనుకోండి. దయానిధిగారినీ కళానిధిగారినీ ఒకే గదిలో ఉంచుతారని నమ్మకం లేదు. ఒక కడుపున పుట్టిన పిల్లలయినా, ఒకే పాపంలో పాలు పంచుకున్నా జైల్లో ఒకే గది దొరక్కపోవచ్చు. ఎవరి పాపం వారిది. ఎవరి గదివారిది. ఎవరి ఏకాంతం కోసం హిమాలయాల్లో గుహల్ని ఆశ్రయించిన వైభవం ఈ దేశానిది. అప్పనంగా తీహార్ జైలులో సాయంత్రం ఆరునుంచి ఉదయం ఆరుదాకా లభించిన ఏకాంతం – 'బోరు'గా ఉండడం కల్మాడీ స్థాయి మనుషులకి సహజం.




ఏకాంతం అంతర్ముఖులకి వైభవం. గోముఖ వ్యాఘ్రాలకి నరకం. ఒంటరి తనం తనని తాను తెలుసుకోడానికి చక్కనివకాశం. నేరస్తులకి తమ నేరాలు తమని హింసించే నరకం.

చేసుకున్నవాడికి చేసుకున్నంత.

(*జూన్ 06*, 2011)

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

# (June 08, 2011) Brahma Muhurtam బ్రహ్మముహూర్తం

"చెడు స్నేహాలు అనర్థదాయకం.." అన్నారు కరుణానిధిగారు తన పుట్టినరోజునాడు. ఇన్నాళ్ళకి – 88 వ ఏట – వారికి జ్ఞానోదయమైంది. 'మంచి ' కోణం నుంచి చూడగలిగే మరో మహానుభావుడు – ఆదిశంకరులు – మంచి స్నేహాలు మిమ్మల్ని జీవన్ముక్తుల్ని చేస్తాయి – అన్నారు. సజ్జన సాంగత్యం జీవన్ముక్తి హేతువు అంటూ.

కరుణానిధిగారిది స్మశాన వైరాగ్యం. దొంగ డబ్బుని తినే వ్యాపారంలో – తన మట్టుకు 'మంచి' స్నేహం చేస్తున్నానని గర్వపడిన రాజా వంటి 'చెడు ' స్నేహం పుణ్యమాంటూ గడ్డి కరిచి – తక్కువ కరిచిన తన కూతురు జైల్లో ఉండగా ఎక్కువ కరిచినవారు ఇంకా పదవుల్లోనే ఉన్నారని వారి తాత్పర్యం. కరుణానిధిగారికి ఇది కనువిప్పు కాదు – ఫక్తు తెలుగువాడి గోడు లాంటిది.

వెనకటికి 'పక్కవాడు బాగుపడిపోతున్నాడు బాబోయ్!' అని ఓ తెలుగువాడు ఏడ్చాడట – భమిడిపాటి కామేశ్వరరావుగారు అన్నట్టు.

కరుణానిధిగారు రచ్చ గెలిచారుగాని – ప్రస్థుతం వారింటికి నిప్పంటుకుంది. దొంగ సొమ్ము 20శాతం తిన్న దయాళు అమ్మాళ్ పిల్లలు నిమ్మకు నీరెత్తినట్టు బయటే ఉన్నారని రాజాతి అమ్మాళ్ బాధ. మొదటి పెళ్ళాం పిల్లలు 60 శాతం తిని ఇంట్లో భోజనం చేస్తుండగా, 20 శాతం తిన్న తన కూతురు హైలు కూడు తినడం ఏ తల్లికయినా కడుపుమంటే.

రాబోయే పుట్టిన రోజుకయినా కరుణానిధిగారు – తన 89 వ ఏట – రెండు పెళ్ళిళ్ళ అనర్థాన్ని గుర్తిస్తారని మనం ఆశించవచ్చు. అక్కడ ఢిల్లీలో – మిగతా పార్టీ తోడు దొంగల పని అంత వైభోపేతంగా లేదు. ఏ మూలనుంచి ఏ సాధువో, ఏ అన్నా హజారేవో వచ్చి – నిరాహార దీక్ష అంటారని వణికిపోతున్నారు. వారి గోత్రాలన్నీ స్విస్ బాంకుల్లో ఉన్నాయి. వారి వాటాలన్నీ మూటల్లో అడ్రసులు తెలియని చోటుల్లో ఉన్నాయి.

ఆ విషయాన్ని సూచనగా గ్రహించినవారు – వారిని వీధిని పెట్టాలని చూస్తున్నారు. నిన్నకాక మొన్ననే చార్టర్డ్ విమానంలో దిగిన బాబా రాందేవ్ గారు సాక్షాత్తు అమెరికా అధ్యక్షుడిలాగ దర్శనమిచ్చారు కాంగ్రెస్ నాయకులకి. ఉప ప్రధాని స్థాయిలో ఉన్న ప్రణబ్ ముఖర్జీ దగ్గర్నుంచి కేంద్ర మంత్రులు విమానాశ్రయంలోనే స్వాగతం పలికారు. అయిదు నక్షత్రాల హోటల్లో భేటీ వేశారు.

ఇటుపక్క రెండున్నర లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో – రాంలీలా మైదానంలో – అయిదు నక్షత్రాల స్థాయిలో ఏర్పాట్లు జరుగుతున్న విషయం వారికి తెలియకుండా ఉండదు. ఆ డబ్బు ఎక్కడినుంచి వస్తోందో తనకు స్పష్టంగా రుజువులతో తెలుసునని దిగ్విజయ సింగ్గారు టీవీ కెమెరాల ముందు బోరవిరిచారు. తెలిస్తే బాబాగారిని విమానాశ్రయంలోనే అరెస్టు చేయాలి కదా?

ఏతావాతా, మంత్రుల మంతనాలు ఫలించలేదు. కారణం – బాబాకి యోగా బాగా తెలుసు. కాని రాజకీయ నాయకుల పైయెత్తులు తెలీవు. బాబా 'గూండా, దుర్మార్గుడు' అంటూ దిగ్విజయ సింగు గారు మైకుల ముందు వీరంగం చేశారు. అంత తెలిస్తే గూండాలతో మంతనాలు జరపడం ఎందుకు? మంత్రుల మంతనాల్ని ఆపాలికదా? తమ మేడం ముందు ఆ గోత్రాలు విప్పాలికదా? అయ్యా, ఏ ఎకౌంట్లు, ఎవరివి, ఎక్కడ ఉన్నాయో వారందరికీ ఎరుక. బాబా కలిసొస్తే మహానుభావుడు. ఎదిరిస్తే గూండా. నిజానికి ఈ మంత్రాంగంలో బాబా వెర్రి గొర్రె. కాని వెనుక




బోలెడంత మద్దతు ఉంది. మింగలేక, కక్కలేక, బాబాగారి అడుగులకి మడుగులొత్తి వారిని ఆపాలని చూశారు. ఎందుకు? కనిమొళికి పెద్ద వాటాదారులు – అక్కడ గాజు అద్దాల భవనాలలో ఉన్నారు కనుక.

తీరా మంతనాలు పొసగకపోయేసరికి – ఉన్నట్టుండి వీధిన పడ్డారు. అర్ధరాత్రి రాం లీలా మైదానంలో పోలీసు చర్యలో ప్రభుత్వ అనుచిత ప్రవర్తనకంటే – ప్రభుత్వ నిస్సహాయత, వారి మనస్సుల్లో, వెన్నెకల్లో పుట్టిన 'చలి 'కి నిదర్శనం.

ఈ ఒక్క అర్ధరాత్రి వీరంగం చాలు. బాబాగారి దీక్షకి అపురూపమయిన ఫలితం దక్కింది – దక్కించుకోవాలనుకున్నవారికి. అంతవరకు ముభావంగా ఉన్న కమ్యూనిష్టులు , మాయావతులూ, ములాయంలూ, ముస్లింలూ – అందరూ ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. బాబాగారి ఉద్యమం అప్పుడే ప్రయోజనాన్ని సాధించేసింది. దేశంలో ప్రజాభిప్రాయం, రాజకీయ పక్షాల అభిప్రాయం ఒక్కటయింది.

అలనాడు – కరుణానిధిగారి మీద కక్ష తీర్చుకోవాలని అర్ధరాత్రి ఆయన్ని అరెస్టు చేయించాలన్న మేడం ప్రయత్నాన్ని – మురసోలి మారన్, వారి కొడుకు కళానిధి మారన్ కలిసి చక్కని కెమెరాల సాయంతో కరుణానిధిగారిని గాలిలోకి ఎత్తిన దృశ్యం, మురసోలి మారన్ గారు ఎదిరించిన దృశ్యం, దయాళు అమంఆళ్ ఏడుపు – కేవలం అడుగుల దృశ్యాన్ని ఒకే రోజు రెండు వందల సార్లు సన్ టీవీ ప్రసార్మ చేసింది. అలా చేస్తూనే ఉంది.

ఆనాడే డి.ఎం.కె పార్టీ పదవిలోకి వచ్చేసింది!

ప్రతిపక్షాలకు నిన్నటి రాంలీలా మైదానంలో పోలీసు చర్య బ్రహ్మ ముహూర్తం. అప్పుడే కాషాయ జెండా పదవిలోకి వచ్చేసింది. 2014నాటి ఎన్నికలు కేవలం పునరక్తి.

ఇప్పుడు ఆఖరున మొదటి మాట. చెడు సావాసాలు అనర్ధదాయకం. ఢిల్లీ నాయకులకి తమిళనాడు స్నేహితుల మాట – ఇప్పుడు చెప్పేది.

*(జూన్ 08,* 2011)









# (June 13, 2011) Vayassuni Jayimchina Vallu వయస్సుని జయించినవాళ్ళు

ఉదయం పార్కులో నడిచే మిత్రులలో నోరి రామకృష్ణయ్యగారొకరు. ఆయన వయస్సు 82. ఆ మధ్య హిందీ ప్రచార సభ స్నాతకోత్సవాన్ని చూశారు. అక్కినేని ముఖ్య అతిధి. పట్టభద్రులందరికీ ముతక ఖద్దరు శాలువాలు కప్పారట. శాలువాకి నాలుగు అంచుల్లో మూడు హృదయాలు (ఆటీన్లు) ముద్రలుంటాయి. "ఏక్ రాష్ట్ర భాషా హిందీ హో, ఏక్ హృదయ్ హో భారత జననీ" (హిందీ రాష్ట్ర భాష, భారతమాత హృదయం) అని రాసి ఉంటుంది. ఆ శాలువా కొనుక్కోవాలని హిందీ ప్రచార సభకి వెళ్ళారు. అక్కడి గుమాస్తా "దీన్ని అమ్మరు. పరీక్ష రాసి సంపాదించుకోవాలి" అన్నాడట. ఈయనకి 82. ఎప్పుడో – ఈ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తొలిరోజుల్లో (1948లో) రాష్ట్ర భాషా విశారద పాసయారు. గుమాస్తా వెక్కిరింత తుపాకీలాగ పనిచేసింది. ప్రవీణ్ పరీక్షకి డబ్బు కట్టి పుస్తకాలు తెచ్చుకున్నారు. 63 సంవత్సరాల తర్వాత చదువు ప్రారంభించారు. రేపు ఆగస్టులో పరీక్ష రాస్తున్నారు.

నేను కడపలో పనిచేసే రోజుల్లో జోగారావుగారని విద్యుచ్ఛక్తి శాఖ సూపరింటెండెంట్ ఇంజనీరు ఉండేవారు. తరుచు కడప మున్సిపల్ కమీషనర్ వేమరాజు నరసింహారావుగారింట్లో కలిసేవాళ్ళం. నేను సినిమాల్లో పడి ఉద్యోగం మానేశాక ఆయన గురించి మరిచిపోయాను. ఆ మధ్య ఓ పెళ్ళిలో ఒకాయన కలిసి తను జోగారావుగారి అబ్బాయినని పరిచయం చేసుకున్నాడు. "నాన్నగారు బాగున్నారా?" అన్నాను. "వెళ్ళిపోయారు" అన్నాడు. ఆయన రిటైరయాక బోరుకొట్టి, ఏం చెయ్యాలో తెలీక పి.హెచ్.డి (పరిశోధన)కి దరకాస్తు పెట్టి థీసిస్ రాశారు. మౌఖిక పరిక్షలో ప్రొఫెసర్లు ప్రశ్నలు వేస్తే ఆయన నవ్వి ప్రశ్నల్ని సవరించారట. ప్రొఫెసర్లు దండం పెట్టి "బాబూ! నీ ప్రశ్నలు నువ్వే వేసుకో, నీ సమాధానాలు నువ్వే చెప్పుకో" అని ఆయనకు డాక్టరేట్ ఇచ్చేశారట.

ఎనభయ్యో పడిలో ఉన్న ఒకావిడ చెన్నైలో అయిదారు విద్యా సంస్థలు నడుపుతున్నారు. ఆమె పేరు శ్రీమతి ఐ.జి.పార్థసారధి. ఆమె తన 70 వ పడిలో సాంఘిక సమస్య మీద డాక్టరేట్ చేసి డిగ్రీపుచ్చుకున్నారు. ఆమెని భారత ప్రభుత్వం ఇటీవలే పద్మశ్రీతో సత్కరించింది. మిత్రుడు, సినీ నిర్మాత మురారికి 67 సంవత్సరాలు. నిన్నంటే నిన్ననే తనకి వీణ నేర్పే సంగీతం గురువుకి కొత్తబట్టలు పెట్టి నమస్కారం చేసి వచ్చాడు.

ఈ ముదిరిన వయస్సులో ఈ సాధన వల్ల ఏం ప్రయోజనం? సమాధానానికి మరో సందర్భం. నేను ఆంధ్రప్రభలో పనిచేసే రోజుల్లో విశ్వనాధ సత్యనారాయణగారు చిత్తూరు వచ్చారు. మాటల సందర్భంలో ఆయన ఇంగ్లీషు నవలలు – అందునా డిటెక్టివ్ నవలలు చదివే అలవాటు ప్రసక్తి వచ్చింది. ఆయన నవ్వి "ఈ జీవితానికి ఉపయోగపడకపోతే వచ్చే జన్మకి దాచుకుంటాను" అన్న గుర్తు. ఆయన పునర్జన్మ మీద "పునర్జన్మ" అనే అద్భుతమైన నవల రాశారు.

ఈ మధ్య చెన్నై భారతీయ విద్యాభవన్లో సంగీత సభకి వెళ్ళినప్పుడు ఓ పదేళ్ళ కుర్రాడు ఆడుకుంటూ కనిపించాడు. సంగీత సభ మొదలయే టైముకి అతని తల్లి ఆ కుర్రాడిని మైకు దగ్గరికి పంపింది. అతని పేరు ప్రచోదన్. హైదరాబాదు నుంచి వచ్చిన తెలుగు కుర్రాడు. ప్రేక్షకులు నిశ్చేష్టులైపోయేలాగ అద్భుతంగా పాడాడు. ఆయన హైదరాబాదు సోదరులలో జ్యేష్టులు రాఘవాచారిగారి శిష్యుడు. కచ్చేరీ నుంచి బయటికి రాగానే ఫోన్ చేశాను. పదేళ్ళ వయస్సులో అయిదారేళ్ళ శైశవంలోనే పోతే ఇంత విద్వత్తుని ఎలా వొడిసి పట్టుకున్నాడు? విశ్వనాధగారన్నట్టు గత జన్మలో దాచుకున్నాడేమో!



ఇలాంటి ఆలోచనలు నమ్మని వారుంటారు. అదిన్నీ విశ్వనాధవారన్నారు కనుక ఛాందసమూ, అభూతకల్పన అని నాలిక చప్పరించేవారుంటారు. వారికి ఇంగ్లీషు ఉదాహరణ చెపితే రుచిగానూ, నమ్మకంగానూ ఉంటుంది. "మెనీ లైవ్స్ – మెనీ మాస్టర్స్" (ఎన్నో జన్మలు – ఎందరో గురువులు) అంటూ డాక్టర్ బ్రియాన్ వీస్ అనే అమెరికా శాస్త్రజ్నుడు అతి విచిత్రమైన, అనూహ్యమైన జన్మ జన్మల వివరాలతో సోదాహరణంగా తనకు తారసపడిన కేసుల గురించి రాశాడు.

మరొకాయన ఉన్నాడు. ఆయన 80 సంవత్సరాలు బతికాడు. చివరి అయిదు సంవత్సరాలు అనారోగ్యంతో ఉన్నాడు. తన అరవయ్యో ఏట చిత్రకళని అభ్యసించడం ప్రారంభించాడు. దానిని 15 సంవత్సరాలు కొనసాగించాడు. బహుశా జీవితంలో కొత్తవ్యాపకం, కొత్త లక్ష్యం ఆ దశలో కొత్త రుచిని కలిగించి ఉంటుంది. ఆయన రాసిన రెండు కవితల్ని రెండు దేశాలు తమ జాతీయ గీతాలుగా చేసుకున్నాయి – జనగణమణ, అమోర్ సోనార్ బంగ్లా. ఇప్పటికి ఆయనెవరో అర్ధమయి ఉంటుంది. ఆయనపేరు రవీంద్రనాధ్ ఠాకూర్.

కొత్త విషయాన్ని నేర్చుకోడానికీ, కొత్త లక్ష్యాన్ని ఏర్పరుచుకోడానికి (సాధించడం అనడం లేదు – ప్రయత్నించి వీగిపోయినా అందులో రుచి ఉంది) వయస్సు ఏనాడూ మించిపోదు. వయస్సుని మరిపించే గొప్ప ఆయుధం – కొత్త ఆదర్శం. జీవితాన్ని జీవనయోగ్యం చేసే రహస్యం. సాధించినవారు తమ సాధన మేరకు ఒక చెంచా జీవామృతాన్నయినా రుచి చూడగలుగుతారు. అది వారి వారి అదృష్టం.

మరొక్క ఉదాహరణ. చెప్పాలని మనస్సు పీకుతోంది. ఒకాయన తన ఎనిమిదవ ఏటే నాలుగు వేదాలనూ జీర్ణించుకున్నాడు. 16 వ ఏటికి అన్ని శాస్త్రాలనూ ఆపోశన పట్టేశాడు. మరో పదహారేళ్ళు మాత్రమే బతికాడు. ఆ పదహారేళ్ళూ కాలినడకన ఈ దేశమంతా పర్యటించి దేశంలో నాలుగు దిక్కుల్లో నాలుగు పీఠాలను స్థాపించాడు. అన్ని శాస్త్రాలకూ అనితర సాధ్యంగా భాష్యాలను రాశాడు. హిందూ ధర్మానికి (మతం అనడం లేదు) సడులుతున్న పునాదుల్ని పటిష్టం చేశాడు. గుర్రాలమీదా, హెలికాప్టర్ల మీదా తప్ప వెళ్ళలేని కేదార క్షేత్రాన్ని దర్శించుకుని అక్కడే తనువు చాలించాడు. ఆయన ఎన్ని దోసిళ్ళ జీవామృతాన్ని సేవించి ఉంటాడు? ఎన్ని తరాలు జాతికి జీవామృతాన్ని పంచాడు? దీన్ని కేవలం పూర్వజన్మ 'వాసన 'గా సరిపెట్టుకోలేము. ఇది ఒక జన్మకి కూడదీసుకోగల శక్తికాదు. అది మానవశక్తి ఊహించలేని సాధన. అలౌకికమైన ఆధ్యాత్మిక వైభవం.

ఆయన ఆదిశంకరులు. సాక్షాత్తూ శంకరుని అవతారం. అందుకు ఒక్క ఉదాహరణ కావాలా? ఒక్క సౌందర్యలహరి, ఒక్క శివానంద లహరి, ఒక్క మనీషా పంచకం, ఒక్క లక్ష్మీనృసింహ ఒక్క..ఒక్క..ఒక్క

*(జూన్ 13,* 2011)

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!






# (June 20, 2011) Punya Dongalu పుణ్య దొంగలు

**దొంగలందు మంచి దొంగలు వేరయా** ' అన్నారు పెద్దలు. ఒకాయనకి తరుచుగా ఫోన్ కాల్స్ వచ్చేవి. అటు పక్క పెద్దమనిషి 'నమో వెంకటేశ!' అని మొదలెట్టి "బాబూ! తిరుమల తిరుపతి దేవస్థానం ఫోన్ నంబరు చెప్పగలరా!?" అని అడిగాడు. అటువంటి భక్తుడు అడిగితే కాదనలేక తెలుసుకుని మరీ చెప్పాడీయన. రెండు రోజుల తర్వాత మళ్ళీ ఆ భక్తుడే ఫోన్ చేసి 'జై శ్రీరాం!' అంటూ బిర్లామందిర్ నంబరు అడిగాడు. పాత పరిచయస్థుడిలాగ తోచింది ఈయనకి. వెతికి మరీ చెప్పాడు. మరో వారం తర్వాత పనిలో ఉండగా "జై సాయిరాం!" అంటూ సాయిబాబా గుడి నంబరు అడిగాడు. కాస్త చికాకు కలిగినా – ఈయనా భక్తుడు కనుక – ఆ పెద్దమనిషికి నంబరు చెప్పి "అయ్యా, మీకిలాంటి సమాచారం కావాలంటే ఫలానా నంబరుకి చెయ్యండి" అని సలహా ఇచ్చాడు. పదిరోజుల తర్వాత మళ్ళీ ఫోన్ మోగింది. ఆ భక్తుడి గొంతు వినిపించగానే ఈయనకి కోపం రాబోయింది. "అయ్యా, ఈసారి నంబరు కోసం ఫోన్ చెయ్యలేదు. మీ కారణంగా దేవుళ్ళని దర్శించి తరించాను. ఈ పుణ్యంలో మీకూ వాటా ఉంది. కృతజ్ఞతగా 'భక్తరామదాసు' సినిమాకి మీ ఇంటిల్లిపాదికీ టిక్కెట్లు మీ స్కూటర్ లో ఉంచాను. చూసి తరించండి" అన్నాడు. ఈ పెద్దమనిషి పొంగిపోయాడు. సకుటుంబంగా సినిమాకి వెళ్ళి తరించాడు. ఇంటికి వచ్చేసరికి ఇల్లంతా దోచుకున్నాడు దైవభక్తుడు.

మరొక్కసారి. "దొంగలందు పుణ్యదొంగలు వేరయా". 'పుణ్యదొంగ' అనే తెలుగు సంకరాన్ని క్షమింతురుగాక. దొంగలగురించి రాసేటప్పుడు ఆ మాత్రం అవినీతి చెల్లుతుంది.

ఏమయినా దొంగలు తెలివిమీరిపోతున్నారు. కొత్త కొత్త ఎత్తులు వేస్తున్నరు. మొన్న బొంబాయిలో పట్టపగలే జ్యోతిర్మయిడే అనే ఒక పాత్రికేయుణ్ణి నలుగురు 9 బుల్లెట్లను పేల్చి చంపేశారు. అది చిన్న నేరం. చంపినవారు ఏ చిన్న ఆచూకీ అయిన ఆ పోలీసుకి దక్కనివ్వకుండా చేసి మాయమయ్యారు. వారం గడిచినా వారి అంతు చిక్కడం లేదు. నిన్న మహారాష్ట్ర హోం మంత్రి టి.టి.పాటిల్ గారు వాపోయారు. "ఈ మధ్య దొంగలు బొత్తిగా తెలివి మీరి పోతున్నారు. నేరాలు చేసి ఏ ఆచూకీ తెలియకుండా చేస్తున్నారు" అని. ఇది చాలా అన్యాయమని నేను వారితో ఏకీభవిస్తాను. ఎంత గొప్ప నేరాన్ని చేసిన నేరస్థులు ఏదో ఒక ఆచూకీని హోం మంత్రికో, పోలీసులకో తెలిసేటట్టు చెయ్యాలి. ఆ పుణ్య దొంగలాగ చిన్న చీటీ రాసి "బాబూ! నా పేరు కామేశ్వరరావు. బుగ్గమీద పుట్టమచ్చ ఉంటుంది. వయస్సు 32. బియ్యే తప్పాను. జింఖానా వీధిలో ఆరో నంబరు ఇంట్లో ఉంటున్నాను. ఉదయం తొమ్మిది పన్నెండు మధ్య వస్తే నాకు సౌకర్యంగా ఉంటుంది. మీకు వీలులేకపోతే నా మొబైల్ కి ఫోన్ చేస్తే నేనే తమ దర్శనం చేసుకుంటాను. నా మొబైల్ నంబరు: 9988776531" అని రాస్తే మర్యాదగా ఉంటుంది. బొత్తిగా ఆచూకీ ఇవ్వని దొంగల తెలివితేటలు ఈ సమాజానికి అనర్థం అని పాటిల్ గారు బాధపడ్డారు.

పోలీసులను సుఖపెట్టలేని నేరస్థుల తెలివితేటలు ఈ దేశ సంక్షేమానికి గొడ్డలిపెట్టు అని వారి ఆవేదన. ఈ మధ్య నేరస్తులలో బొత్తిగా నీతి సన్నగిల్లింది. మన పొరుగు దేశం పాకిస్థాన్ని చూడండి. ముంబై దాడులు జరిపాక, వాళ్ళ తరఫున కసాబ్ సాహెబ్ గారిని వదిలివెళ్ళారా లేదా? వారిని మనం నవాబుల స్థాయిలో గౌరవంగా చూసుకుంటున్నామా లేదా?

అలనాడు మహాత్ముడిని కాల్చిన నాథూరాం గాడ్సే గారు ముందు బాపూజీని నమస్కారం పెట్టి చంపిన విషయం మరిచిపోయారా? నడిరోడ్డు మీద రివాల్వర్లు పేల్చే నేరస్తులు ఈ విషయాల్ని మనస్సులో పెట్టుకోవాలి. తమ నేరాలకి ఎంతో కొంత ఆచూకీ ఇవ్వకపోతే పోలీసుల గతి ఏమిటని ఆలోచించాలి. హోం మంత్రులు పడే నిందల్ని దృష్టిలో పెట్టుకోవాలి.



మీరెవరిని కాల్చాలంటే వారిని కాల్చుకోండి. మానభంగం చేయాలనుకుంటే చేసుకోండి. కానీ చివర మీ విజిటింగ్ కార్డో, ఫోన్ నంబరో పోలీసులకి ఇచ్చి పొండి. అది కనీస మర్యాదగా గుర్తించండి. "నేను ఫలానా రివాల్వర్ వాడాను. నా అడ్రసు 15 జంబులింగం వీధి" అని చెప్పండి చాలు. నేరాలలోనూ ఇచ్చిపుచ్చుకోడాలు ఉండాలి. నిన్న కాక మొన్నటి కుంభ కోణంలో కేవలం 200 కోట్ల చెక్కు సొమ్ము బదిలీ అయింది. గవర్నమెంటు మిగతా లక్షా అయిదువందల కోట్ల గురించి పళ్ళెత్తుమాట అడిగిందా? ఇందులో సబబుని అర్థం చేసుకోండి – అని పాటిల్ గారి ఉవాచ.

అయితే దొంగలకి దొంగల అడ్రసులు తెలియకపోవు – అని వారు భావించి ఉండవచ్చు. ఒక్కొక్కప్పుడు ఈ దొంగలు పరాకుగా ఉంటారు. కొత్త దొంగల ఇటీవలి జాబితా వారి దగ్గర లేకపోవచ్చు. దొంగలు ఈ బలహీనతల్ని గమనించాలి. మనుషుల్ని చంపి ఏ ఉపకారమూ పోలీసులకి చెయ్యకుండా తప్పించుకునే తెలివి ఈ దేశానికి అరిష్టం అని సూచిస్తున్నారు పాటిల్ మంత్రివర్యులు.

తీరా ఆ మాట అన్నారో లేదో ఆయన మంత్రి పదవికి రాజీనామా చెయ్యాలని ప్రతిపక్ష నాయకులు ఒంటికాలు మీద లేచారు. అయ్యా! రేపు మీ హయాంలోనూ ఇలాంటి దొంగల బెడద ఉండవచ్చునని మరిచిపోకండి.

ఏతావాతా, జ్యోతిర్మయి దేగారి చావు మంత్రివర్యుల పదవికి ఎసరు పెట్టే స్థితికి వచ్చిందని నేరస్థుల గ్రహించాలి. వారి తెలివితేటల్ని అర్థం చేసుకునే మంత్రులుండడం మన అదృష్టం. చాపకింద నీరులాగ కోట్లు మింగడం లాయకీ అనిపించుకోదు. చిన్న ఆచూకీ వదలడం – ఇచ్చిపుచ్చుకోవడం అవుతుందని, అది సామాజిక బాధ్యత అని ఒక రాష్ట్రపు హోం మంత్రిగారు వక్కాణిస్తున్నారు.

నాయకులలో ఇది అరుదయిన నీతిగా దేశం గ్రహించాలని, ముఖ్యంగా నేరస్థుల అర్థం చేసుకు సహకరించాలని పత్రికా ముఖంగా నేను పుణ్య దొంగలకు విన్నపం చేస్తున్నాను.

*(జూన్ 20,* 2011)

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!




gollapudimaruthirao.blogspot.com gmrsivani@gmail.com

# (June 27,2011) Asupatriki Trova Etu ఆసుపత్రికి తోవ ఎటు?

ఈ మధ్య టీవీలో ఒక ఆలోచనాభరితమైన చర్చని చూశాను.

మందు ఆ చర్చకి ప్రాతిపదిక. మహారాష్ట్ర ప్రభుత్వం పిల్లలు మద్యం తాగే వయస్సుని 21 నుంచి 25కి పెంచారు. అమితాబ్ బచ్చన్ గారికి కోపం వచ్చింది. అలా పెంచడం అన్యాయమని ఆయన వాపోయారు. ఈ టీవీ చర్చ ముఖ్యోద్దేశం ఏమిటంటే – అలా పెంచడం ద్వారా పిల్లలు తమకేం కావాలో నిర్ణయించుకునే హక్కుని కోల్పోతున్నారని పెద్దలు కొందరు వాక్రుచ్చారు. పెద్దల బుద్దులు ఎలా వెర్రితలలు వేస్తున్నాయో మనం అనునిత్యం చూసి ఆనందిస్తున్నాం. జైల్లోనే డాక్టర్ సచాన్ హత్య, బీహార్ లో ధర్నా చేస్తున్న రైతును తొక్కి చంపిన పోలీసుల వీరంగం, కోట్ల ధనం దోపిడీ– ఇవన్నీ మనం రోజూ చూసే సుందర దృశ్యాలు. పాతికేళ్ళ లోపునే మందు తాగే విచక్షణ యువకులకు ఉన్నదని వీరి వాదన. టీవీలో ఈ చర్చ వీలయినంత అసహ్యంగా, అసందర్భంగా, ఆలోచనారహితంగా కనిపించింది నాకు.

ఒకాయన అన్నాడు: "ఈ దేశంలో 18 ఏళ్ళకి యువకులకి ఓటు హక్కు ఇచ్చారు. 21 సంవత్సరాలకు పెళ్ళి చేసుకునే హక్కు ఇచ్చారు. మరి 25 ఏళ్ళ దాకా తాగే విచక్షణ రాదని ఎందుకు ఎందుకు భావిస్తున్నారు?" అని. సమాధానం ఎవరూ సరిగ్గా చెప్పలేదు. నేను చెప్పగలను. "అయ్యా! 18 ఏళ్ళకి ఓటు హక్కునిచ్చిన కారణంగానే రాజాలు, కల్మాడీలు, కనిమొళిలు, మాయావతులూ పదవుల్లోకి వచ్చే దరిద్రం ఈ దేశానికి పట్టింది. 21 ఏళ్ళు పెళ్ళి చేసుకునే విచక్షణ కారణంగానే రొట్టెల పొయ్యిలలో పెళ్ళాలు కాలుతున్నారు. ఈ మధ్య పెద్ద కుటుంబాలలో జరిగిన పెళ్ళిళ్ళు పెటాకులయి భార్యా భర్తలు విడిగా బతుకుతున్న సందర్భాలు నాకు తెలిసే – కోకొల్లలు. కనీసం తాగే దరిద్రాన్ని మరో నాలుగేళ్ళు దాచడం వల్ల – ఆ మేరకు ఈ దేశం సుఖంగా ఉంటుంది" అని.

ఈ చర్చలో పాల్గొన్న పెద్దలందరూ సూట్లు వేసుకుని, కనుబొమ్మలు చిట్లించి ఆవేశపడుతున్న చదువుకున్న మూర్ఖులు. ఇందులో ఓ కుర్రాడు కూడా ఉన్నాడు. అతనంటాడు: "మాకు ఆ మాత్రం విచక్షణ లేదని ఎందుకనుకుంటారు? ఏ బార్ వాళ్ళు మా వయస్సుని పరీక్షిస్తారు? ఈ ఆంక్షవల్ల దొంగతనంగా తాగే అవకాశాన్ని పెంచుతున్నారు" అని. వాళ్ళ నాన్న, అమ్మ ఎవరో తెలీదు కాని "నువ్వేం అనుకోవద్దు బాబూ! మీ అమ్మా నాన్నా ఎప్పుడో చెయ్యాల్సిన పని నేను చేస్తున్నాను. ఈసారికి నన్ను క్షమించు" అని ఆ కుర్రాడి చెంపని చాచి పగులగొట్టాలని అనిపించింది.

కేవలం 20–30 సంవత్సరాల కిందట "తాగడం తప్పుబాబూ" అని చెప్పే వ్యవస్థ ఉండేది. తాగి తందనాలాడి ఇంటికొచ్చే ప్రబుద్ధులూ, ఆ వీరంగం ఫాషన్ అయే రోజులు వచ్చాయి. సరే. పెద్దలు చేసిన పనిని పిల్లలు చేస్తారు. కాని చేసే పనిని కాస్త 'ఆంక్ష'గా నయినా ఆపదం నేరమని టీవీల్లో చర్చ! ఈ దేశంలో ప్రజాస్వామిక మనే దురన్యాయాన్ని ఎంత ఘోరంగా, ఎన్ని అనర్థాలకు సాకుగా వాడుతున్నారో ఊహించలేం. ఇప్పుడు కొన్ని నిజాలు. రెండు పెగ్గులకోసం కక్కుర్తిపడి – రెండో పెగ్గునుంచి తన శరీరాన్ని మరిచిపోయి ఎదుటి వ్యక్తికి అప్పగించే ఓ సినీ పరిశ్రమ మనిషిని తెలుసునాకు. ఆ పిల్లని చూస్తే జాలి వేసేది. తల్లితండ్రులు ఆమెనేం చెయ్యాలో తెలీక అదుపులో పెట్టే ఆస్కారం లేక అమెరికా పంపేశారని విన్నాను. అమెరికాలోనూ అలాంటి పనే చేస్తే? అది అమెరికా కనుక పరవాలేదు. చేసినా మనకి తెలీదు. 'అవనీతి'కి మడిబట్ట కట్టి కళ్ళు మూసుకునే దయనీయమైన ఆత్మవంచన ఇది.



నిన్నకాక మొన్ననే – ఇండోర్ లో పన్నెండేళ్ళ అమ్మాయిలు ఇంటినుంచి మంచినీళ్ళ సీసాలో వోడ్కా పోసుకుని తెచ్చుకుంటున్నారట. వోడ్కా? మిగతా మందు రంగు తెలుస్తుంది. వోడ్కా మంచినీళ్ళలాగే ఉంటుంది. స్కూల్లో మరో ఇద్దరు పిల్లలతో కలిసి ఈ అమ్మాయి తాగుతోంది. ఒకమ్మాయి వాంతి చేసుకుంది. యాజమాన్యం ఆ ముగ్గురినీ స్కూలునుంచి బహిష్కరించింది. అమ్మాయిలు, అబ్బాయిలు కలిసి తాగి తందనాలాడే దృశ్యాల్ని విరివిగా టీవీలో చూపించారు.

మన వివాహ వ్యవస్థలో వంశోద్ధరణకి వివాహం తర్వాత ముహూర్తాన్ని నిర్ణయించడం ఆచారం. వంశాన్ని ఉద్ధరించే ఇలవేలుపు, గృహలక్ష్మి, కుటుంబ వ్యవస్థకి మూలాధారం – ఇవన్నీ ప్రస్తుతం బూతుమాటలు. ఇప్పుడిప్పుడు పట్నాల్లో 45 శాతం మంది – ఆడపిల్లలు అనూహ్యమైన వయస్సులో మందు తాగుతున్నారు. ఇది అవినీతికి దగ్గర తోవ. తర్వాత పైన చెప్పిన అమ్మాయి స్థితికి వేరే ప్రయత్నం అక్కరలేదు. తర్వాత జరిగేది – ఆ పిల్ల పదిమందికీ చెప్పే అబద్ధం, తల్లిదండ్రులు వేసే ముసుగు. ఆరాచకం. అవ్యవస్థ.

ఈ మధ్య సర్వే జరిపారు. 32 శాతం మంది ఏమీ తోచక, 42 శాతం మంది స్నేహితులతో తామూ చేయగలమన్న డాబుకి, గొప్పకి తాగుతున్నారట. ఈ దేశం తాగుడికి వయస్సుని నిర్ణయించే స్థితికి వచ్చింది.అది మేలు. ఆ నిర్ణయం తప్పని, తమకి తామే నిర్ణయించుకునే వెసులుబాటు, విచక్షణ తమకి ఉండాలని పెద్దలు పిన్నలకు అండగా నిలిచే భయంకరమైన 'ప్రజాస్వామ్యం' వచ్చేసింది! ఈ దేశానికి బాలమేధావుల్ని తెలుసు. బడిలో చదవకుండానే 'హరికథ' వంటి ప్రక్రియై ప్రాణం పోసిన ఆదిభట్ల నారాయణ దాసు వంటి మహనీయుల్ని తెలుసు. ఒక వీణ గాయత్రి, ఒక మాండలిన్ శ్రీనివాస్, ఒక బాలమురళీకృష్ణ ఇంకా మన మధ్య ఉన్నారు.

తాగడానికి 25 ఏళ్ళు ఆంక్ష అన్యాయమని, 18 ఏళ్ళకే దరిద్రపు నాయకుల్ని ఎన్నుకునే వ్యవస్థలో తాగే నిర్ణయాన్ని తీసుకునే విచక్షణ తమకున్నదని – 12 ఏళ్ళ ఆడపిల్ల బడిలో తాగి వాంతి చేసుకునే స్థితికి మనం పురోగమించాం.

'విచక్షణ' విషయంలో పెద్దలకి పాఠాలు చెప్పవలసిన దయనీయమైన రోజులు వచ్చాయి. 18 ఏళ్ళు వచ్చిన ఆడపిల్ల తోడబుట్టినదయినా పరాయి స్త్రీగా గౌరవించాలని ఈ వ్యవస్థలో పెద్దలు చెప్పిన మాట బూతుమాటలాగ వినిపించే రోజులొచ్చాయి.

నాకు వయస్సు మీదపడింది. ఈ జబ్బు కుదిర్చే ఆసుపత్రి పేరు చెప్పండి – మీకు పుణ్యముంటుంది..

*(జూన్ 27,* 2011)




## (July 04, 2011) Devudiki Jvaramoccimdi దేవుడికి జ్వరమొచ్చింది

మన దేవుళ్లు ఒకొక్కప్పుడు మనకంటే బలహీనులు. బొత్తిగా ఆరోగ్యాన్ని నిలుపుకోలేనివాళ్లు.

ప్రతీ సంవత్సరం ఆషాడమాసంలోనే జగన్నాధుడికి జ్వరం వస్తుంది. ఎందుకని? ఆయనకి 108 కలశాలతో అభిషేకం జరిగినందుకు. జలుబుచేసి, ముక్కు దిబ్బడవేసి జ్వరం ప్రారంభమవుతుంది. భక్తులు ఆయనకి రకరకాలయిన లేహ్యాలను సిద్ధం చేస్తారు. అంతేకాదు. ఆయన సోదరుడు బలభద్రుడు, దేవేరిలతో మూడు రధాలతో బయల్దేరదీసి– వేరే ఏకాంతమందిరంలో వుంచుతారు. అక్కడ ఆయనకి 15 రోజులపాటు అభిషేకాలు లేవు. దేవుడు పత్యం చేస్తాడు. జలుబు తగ్గి ఆరోగ్యం పుంజుకున్నాక– మళ్లీ స్వస్థలానికి వస్తాడు.

మన దేవుళ్లు వెన్నదొంగతనం చేస్తారు. తల్లులతో చిన్న చిన్న అబద్ధాలు చెప్తారు. పెద్దయాక పెద్ద పెద్ద అబద్ధాలను చెప్పించే నేర్పరులవుతారు. పరాయి అమ్మాయిల బట్టలు దొంగతనం చేస్తారు. మనకొచ్చే కష్టాలు– ఆ మాటకు వస్తే– మనం కూడా తట్టుకునే కష్టాలను దేవుళ్లు తట్టుకోలేరు. ఆయనకీ శరీరం రంగు సమస్యలున్నాయి. మూడు పూటలా స్నానాలున్నాయి. కొత్త బట్టలున్నాయి. యజ్ఞోపవీతం ఉంది. పెళ్లాలున్నారు. పెళ్లాల సమస్యలున్నాయి. కొడుకుల సమస్యలున్నాయి. పెళ్లాల కాళ్లు పట్టుకోవలసిన పరిస్థితులున్నాయి. వెరసి– మనం ఊహించని– ఒక్క మనిషి జీవితంలో రాలేని, రాకూడని పాట్లు ఉన్నాయి.

ఇంక వీళ్లు దేవుళ్లేమిటి? అనిపిస్తుంది– మన దేవుళ్ల కథలు చదివినవాళ్లకి. "అదేమిటయ్యా! అక్కడ ఒరిస్సాలో చెల్లెల్ని కట్టుకున్నవాడా?" అని మీ దేవుణ్ణి ఆడిపోసుకుంటారు. మరెక్కడో వాలిని దొంగదెబ్బ కొట్టినవాడా? అని తిట్టుకుంటూంటారు. వినాయకచవితినాడు మీ దేవుడిలాగ మీరూ తిట్లు తినాలని కోరుకుంటారు. మీ దేవుళ్లు చేతులతోనూ, చక్రాలతోనూ, గదలతోనూ చెయ్యని హత్యలు లేవు. పైగా అవన్నీ ధర్మాన్ని ఉద్ధరించడానికని పెద్దలు సమర్ధిస్తారు– ఇవన్నీ ఈ మతాన్ని కొత్తగా తెలుసుకున్నవాడికి విడ్డూరంగా కనిపించే విషయాలు.

మహాభక్తుడు–నందనార్ చెప్పులు కుట్టుకునేవాడు. అతనికి ఆలయ ప్రవేశం లేదు. మహాశివుడిని దర్శించాలని కోరిక. ఎప్పుడూ ఆలయం బయటనుండే ఆత్రంగా చూసేవాడట. కాని స్వామి దర్శనం కాదు. కారణం– స్వామి ముందు పెద్ద శరీరంతో నందీశ్వరుడు కొలువుతీరివుంటాడు. నందనార్ గుండె పగిలిపోయింది. స్వామిని వేడుకున్నాడట. "స్వామీ! నిన్ను చూడాలని కొండంత ఆశతో వస్తున్నాను. ఈ నందీశ్వరుడు నీకూ నాకూ మధ్య నిలబడ్డాడు. కాస్సేపు పక్కకి తప్పుకోమని చెప్పు స్వామీ. నిన్ను కళ్లారా చూసుకుంటాను." అన్నాడు. స్వామి నందీశ్వరుడిని తప్పుకోమన్నాడు. నందనార్ కి మూలవర్ల దర్శనమయింది. తమిళంలో అద్భుతంగా సంగీతరూపకంగా రచించారు ఒక ఆళ్వార్. తమిళనాట 12 మంది ఆళ్వారులలో ఒకాయన కులశేఖరుడు. ఆయన స్వామిని మోక్షాన్ని కోరుకోలేదు. ""స్వామీ! నిన్ను అనునిత్యం కోట్లాదిమంది భక్తులు దర్శించిపోతూంటారు. వారి పాద ధూళి నా శిరస్సుని తాకేలాగ నీ ముందు గడపగా నన్ను పడిఉండనీ" అన్నారు. తిరుమల క్షేత్రంలో గర్భగుడిలో స్వామివారి ముందు గడపని "కులశేఖరప్పడి' అంటారు.

మరొక భక్తుడు శివుడికి పందిమాంసాన్ని పెట్టాడు. రెండో కన్నుని యివ్వడానికి తన కాలిని గుర్తుగా శివుడి ముఖంమీద పెట్టాడు. ఆలోచనకి ఆస్కారమయినా లేని ఒక ఏనుగు స్వామికి ప్రతినిత్యం అభిషేకం చేస్తుంది.

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

ఇలాంటి కథలన్నీ అభూతకల్పనల్లాగా అనిపిస్తాయి. బొత్తిగా ఆలోచనచాలని ప్రాథమిక స్థాయిని గుర్తుచేస్తాయి. మన మతాన్నీ, మన దేవుళ్లనీ, మన ఆచారాల్నీ, మన ఆలోచనల్నీ వెక్కిరిస్తాయి. వేళాకోళం చేస్తాయి. హేతువాదులకి యివన్నీ అవకాశవాదుల ఆగడాలుగా, అరాచకాలుగా కనిపిస్తాయి.

కాని–

దేవుడు మనకి పైవాడు కాదు. మనమే! ఇక్కడ భక్తుడు తన దేవుడిని తన limitations లోనే తయారు చేసుకున్నాడు. అతనిలోని limitlessness ని వెదకడం భక్తి. అమ్మకి అన్నివిధాలా తనపైన ఆధారపడే నిస్సహాయుడు తన బిడ్డ. అన్నివిధాలా తన పని తాను చేసుకునే సమర్థుడయిపోతే? ఇక అమ్మ అవసరమేముంది? దేవుడిలో limitation భక్తుడి గడుసుదనం. ప్రపంచ మతాల్లో మరేమతంలోనూ భగవంతుడితో యింత తాదాత్మ్యాన్నీ, యింత ఏకీభావాన్నీ సాధించిన మతం లేదు. ఇస్లాంలో దేవుడికి రూపం లేదు. క్రైస్తవమతంలో దేవుని కొడుకే ఉన్నాడు. హిందువులు తనరూపంలో దేవుడిని భావించుకున్నారు. తమ లక్షణాల్నీ, అవలక్షణాల్నీ, తమకి ఆనందాన్నిచ్చే క్రియల్ని అన్నీ దేవునికి ఆపాదించుకున్నారు. ఆయన తమలాగే స్నానాదికాలు చెయ్యాలి. తమలాగే అర్ఘ్యం పుచ్చుకోవాలి. తమలాగే బట్టలు కట్టుకోవాలి. మంచిపదార్థాలు సేవించాలి. తమకొచ్చే కష్టాలన్నీ స్వామికీ వస్తాయి. వాటన్నిటినీ ఆయనా అధిగమించాలి. అప్పటికి భక్తుడికి తృప్తి. ఈ మతంలో అనాదిగా చేసినంత muse మరేమతంలోనూ లేదు.

మానవుడి నైమిత్తిక జీవితంలో ప్రతి లక్షణానికీ, అవలక్షణానికీ, గొప్పతనానికీ, బలహీనతకీ– దేవుడికీ దగ్గరతోవవుంది. అవన్నీ ఎప్పుడో ఒకప్పుడు దేవుడు అనుభవించాడు. ఆ అనుభవాల అమృతసారమే ఎందరో ఆళ్వారుల, వాగ్గేయకారుల, దాసుల, కవుల, సాహితీపరుల కీర్తనలు! ప్రపంచంలో కళాపరంగా, సాహిత్యపరంగా, ఆధ్యాత్మ చింతనపరంగా యింత వైవిధ్యం మరే మతంలోనూ లేదు. ఎంత ఉన్నతుడైనా –అంతులేని బాధలో, ఊహించని ఆనందంలోఅతి ప్రాథమిక మానవుడయిపోతాడు. తట్టుకోలేనిబాధతో సుడులు తిరిగిపోయే 90 ఏళ్ల వృద్ధుడూ అమ్మనే ఆశ్రయిస్తాడు. "మేష్టారూ!" అని ఏడవడు. ఆర్ధ్రతలో, అంతులేని ఆరాధనలో భక్తుడు పసివాడవుతాడు. బేల అవుతాడు. తనకంటిని భగవంతుడినికి దానమిచ్చే ఉదారుడవుతాడు. ఊహల ఎల్లలు చెరిపేసుకుంటాడు. పరిమితులు లేని ప్రేమ, పరాకాష్ఠ సాధించిన భక్తి– "హేతువు'కి లొంగని సింబల్ అవుతుంది. బయటనుంచి చూసేవారికి అది అసందర్భం. నందనార్ వంటి భక్తుడి అది దేవుడి సమక్షం.

మరొ దేవుడి జులుబు? నిజమైన ప్రాథమిక మనస్థత్వానికి అది మొదటి నిచ్చెన. అంతలోతుగా ఆలోచించలేనివాడూ దేవుడిని ఆశ్రయిస్తున్నాడు. అది గొప్ప గమ్యానికి ప్రాథమిక ప్రయత్నం. తప్పులేదు. మన దేవుడు అకాశంలొ లేడు. మన మధ్యనే ఉన్నాడు. మనలోనే ఉన్నాడు. మనమే– అనుకోవడంలో ఎంత ధైర్యం! ఎంత నమ్మకం! ఎంత దగ్గర తోవ! ఉన్నతమయిన స్థాయిలో తాదాత్మ్యం సాధించిన భక్తుడు– దళితుడైనా నందనార్ అవుతాడు. నందీశ్వరుణ్ణి పక్కకి తప్పుకొమ్మంటాడు. దేవుడు తలవొంచి అతని కోరికని తీరుస్తాడు. ఇది ఈ తాత్విక చింతనలోని మూలసూత్రం. నమ్మేవారికి వైభవం!

*(జూలై 04,* 2011)






అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ
కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

# (July 11,2011) A Rare Evening ఓ అరుదయిన సాయంకాలం

మహానటి సావిత్రి నా మొదటి సినీమా (డాక్టర్ చక్రవర్తి) హీరోయిన్. నా ఆఖరి రేడియో నాటకం హీరోయిన్. ఈ రెండు సంఘటనల మధ్య ఆమె జీవితంలో జరిగిన అన్ని ముఖ్యమయిన ఘట్టాలూ పరుచుకున్నాయి. ఆకాశం ఎత్తుకి ఎగసిన కీర్తి ప్రతిష్టలున్నాయి. కృంగదీసిన అపజయాలున్నాయి. అనారోగ్యం ఉంది. నిస్సహాయమైన జీవన విధానం ఉంది. ఎన్ని ఉన్నా- దాదాపు మూడు దశాబ్దాల తర్వాత సావిత్రి జ్ఞాపకాన్ని యింకా యింకా పచ్చగా, పవిత్రంగా కాపాడుకుంటున్న అభిమానులున్నారు.

సావిత్రి తెలుగువాడి గొప్ప జ్ఞాపకం. ఒక తరం సినీ ప్రేక్షకుల వరం. కొన్ని పాత్రలకు ప్రత్యామ్నాయం లేని కళా వికసనం. నాకు ఆ కుటుంబంతో ఆత్మీయమైన పరిచయం. ఆమె కూతురూ, అల్లునికి నేనంటే ఎనలేని గౌరవం, భక్తి. ఆమె మనుమడు ఈ మధ్యనే సెల్యూలాయిడ్ మీద అమ్మమ్మ వారసత్వాన్ని పుచ్చుకున్నాడు.

జులైలో శాంతాక్లారా తానా సభలకి వచ్చినప్పుడు ఆమె కొడుకు సతీష్ ఈ ప్రాంతాల్లోనే ఉన్నారని తెలిసింది. ఫోన్ చేస్తే అత్మీయంగా వచ్చి కలిశారు. మరునాడు భార్యనీ, కొడుకునీ పరిచయం చేశాడు. తల్లి కన్నుమూసినప్పుడు సతీష్ వయస్సు 16 సంవత్సరాలు. ఆలోచనలు, ఆవేశాలూ, జ్ఞాపకాలూ, ఉద్రేకాలూ ముసురుకుంటున్న వయస్సది. ఇన్నేళ్ల తర్వాత- యిప్పటికీ తెలుగు దేశాన్ని ఆనందపరుస్తున్న ఆ విదుషీమణి జ్ఞాపకాలు అతని మనస్సులో ఎలా నిలిచాయి? ఆత్మీయమయిన ప్రసంగం ఇది. మారియట్ హొటల్లో ఒక గంట. ఓ గొప్ప జీవితంలోని గొప్ప జ్ఞాపకం.






ఇవీ సతీష్ మాటలు:

అమ్మ అందరి తల్లులలాగే తన పాత్రనీ మా జీవితంలో పోషించేదానికి ప్రయత్నించేది. ఇది నటించే పాత్రకాదు. జీవించే పాత్ర. ఏది చేసినా ఒక నిర్దుష్టమయిన పూనికతోనే చేసేది.

ఆమె ఓ విభిన్నమయిన వాతావరణంలో పెరిగింది. కాని ఆమె అమ్మ. ఆమెలో ప్రత్యేకంగా గుర్తున్న విషయం -అచంచలమైన అత్మవిశ్వాసం. అలాగే ఎందరున్నా- నాన్న-అందరికన్న ఎత్తుగా నా జీవితంలోకి తొంగిచూశారు. ప్రభావాన్ని చూపించారు. చిన్నతనంలో అక్కకి ఏ బొమ్మలు కొన్నా వాటిని విరగ్గొట్టి చూసేవాడిని. చిలిపితనం కాదు. జిజ్ఞాస. నన్ను ఇంజనీరుని చెయ్యాలని అమ్మ కోరిక.

అలాగే అక్క డాక్టరు కావాలని. అమ్మ కలని అక్క దాదాపు సాధించింది. ఫిజికల్ ఫిట్నెస్ నైపుణ్యాన్ని సాధించుకుంది అక్క. అమ్మ ఎప్పుడూ అంటూండేది: ఎన్నిరకాల మనుషులు కలిసినా వారిలో మంచిని చూడు, చెడుని చూడకు–అని. మమ్మల్ని ఏదో పేరున్న గొప్ప కళాకారిణి పిల్లల్లాగ పెంచలేదు అమ్మ. అలా మేం పెరగడం యిష్టం లేదు. నేలమీద నిలబడి నలుగురు పిల్లల్లాగే పెరగాలని అమ్మ ఆశించేది. 1980 ప్రాంతాల్లో అమ్మతో కలిసి అన్నానగర్ లో చింతామణి సూపర్ మార్కెట్ లో కూరగాయలు కొనుక్కోడానికి వెళ్లిన జ్ఞాపకాలున్నాయి.

వెనక్కి తిరిగి చూసుకుంటే కొడుకుగా నేను అదృష్టవంతుడినే అనిపిస్తుంది. నేనెక్కడికి వెళ్లినా– యిప్పటికీ– సావిత్రి మా అమ్మ అని తెలిస్తే ఆ ఒక్క కారణానికే నన్ను అభిమానిస్తారు. ఇది అమ్మ నాకిచ్చిన వరం.

అమ్మది ఎడం చేతి అలవాటు. క్రికెటంటే చాలాయిష్టం. వెస్ట్ ఇండీస్ ఆటగాడు గారీ సోబర్స్ ఎడం చేతి ఆటగాడు. అతని అభిమాని మా అమ్మ. ఎన్ని పనులున్నా తీరిక చేసుకుని మాతో చదరంగం ఆడేది. బాడ్ మెంటన్ ఆడేది. పేకాటలో "లిటరేచర్' ఆట ఆంటే అమ్మకి అభిమానం. నాకు అమ్మే యీత నేర్పింది.

అమ్మ నటించిన సినీమాలన్నీ చూసే అవకాశం నాకు రాలేదు. ఇప్పటికీ అన్నీ చూడలేకపోయాను. అమ్మ నటించిన మాయాబజార్, గుండమ్మ కథ, మిస్సమ్మ వంటివి చూశాను. విషాద భరితమైన పాత్రలు నటించేదికాని ఏడుపు పాత్రల్నీ, కథల్నీ మమ్మల్ని చూడనిచ్చేదికాదు. నాకు బాగా నచ్చిన సినీమా– అమ్మ పాత్ర– అర్ధాంగి. తెలుగు వెర్షన్ లో అక్కినేని హీరో. తమిళంలో శివాజీ విలన్ పాత్రని చేశారు. ఆమె నటించిన సినీమాలన్నీ ఎప్పటికయినా చూడాలనీ, అవన్నీ పోగుచేసి ఒక లైబ్రరీ చేయాలనీ నాకోరిక.

హాలీవుడ్ నటి షిర్లీ మాక్లియన్ అంటే అమ్మకి యిష్టం. షిర్లీ మాక్లియన్ కీ అమ్మంటే యిష్టం. ఓసారి ఆవిడ మా యింటికి వచ్చారు. చివరలో చాలా కారణాలకి ఆమె ఆరోగ్యం దెబ్బతినడం ప్రారంభించింది. "తనవాళ్లు' అనుకున్నవాళ్లే వెన్నుపోటు పొడిచారు. తన చుట్టూ ఉన్నవాళ్లమీద ఎక్కువ నమ్మకాన్ని పెంచుకుంది(ఓవర్ కాన్ఫిడెన్స్). మరికాస్త జాగ్రత్తగా ఉండవలసింది. ఆరోగ్యం పాడయిందికాని అది అవసానమని ఎన్నడూ అనుకోలేదు. నాకేం పరవాలేదనుకునే మొండి ధైర్యం ఉండేది.

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

క్రమంగా ఆరోగ్యం క్షీణించింది. బాగుచెయ్యాలని ప్రయత్నించాం. కాని మా చెయ్యి దాటిపోయింది. ఒకటిన్నర సంవత్సరాలు బాధపడింది.1977 లో ఒక్కసారి కోలుకుంది. ఆ రోజుల్లోనే గోరింటాకు, బెంగుళూరులో రాజ్ కుమార్ తో "తాయితక్కమగ' వంటి చిత్రాలు చేసింది. ఇంక పరవాలేదని, మెల్లగా కోలుకుంటుందని నిట్టూర్చాం.

అయితే ఇన్ కంటాక్స్ సమస్యలూ, కోర్టు కేసులూ ఆమెని మరీ క్రుంగదీశాయి.

1981 లో కోమాలోకి వెళ్లిపోయింది. అది ఆఖరి దశ. కాస్త ముందుగానే వెళ్లిపోయివుంటే బాగుండేది అన్నంతగా బాధపడింది. మేమేం చెయ్యలేకపోయాం.

ఎన్ని అవాంతరాలు మీద పడినా– ఆమె మెదడు, ఆలోచనలు పదునుగా ఉండేవి. ఆరోగ్యం ఏమాత్రం సహకరించినా యింకా ఎన్నో అద్భుతాలు చేసి ఉండేది అనుకుంటూంటాను. తన కళని పదిమందికీ పంచగలిగేది.

మా అబ్బాయికి నాన్నమ్మ పోలికలు బాగా వచ్చాయి. మా అమ్మలాగే ఎడం చెయ్యి అలవాటు. అమెలాగే ఉంటాడు. మొండితనం, నిర్దుష్టమైన అభిప్రాయాలూ అమ్మవే. "మూర్ఖత్వం' కాదు– "పట్టుదల' అని నా ఉద్దేశం.

మా ఆవిడ మా అమ్మకి పెద్ద అభిమాని. ఆమె చిత్రాల్ని చూసినప్పుడు తప్పనిసరిగా ఆమె కళ్లు చెమ్మగిల్లుతాయి. ""మరి మీకు?" అనడిగాను.

చెప్పలేదు. ఒప్పుకోలేదు. నవ్వేశాడు. కాని తల్లి జ్ఞాపకాలు పదిలంగా, ఆత్మీయంగా, ఏకాంతంగా దాచుకున్న కొడుకు తెలిశాడు. అమెరికా మర్యాదలకి అలవాటుపడిపోయాడు. లేచి ఒక్కసారి నా కాళ్లకి నమస్కారం చేశాడు–""మిమ్మల్ని కలుసుకోవడం ఆనందంగా ఉంది" అంటూ.

వెనకటికి చెలం ఒక ప్రేమలేఖలో ప్రేయసికి రాస్తాడు. నీ వేపు ప్రయాణం చేస్తున్న ఏ రైలు అయినా– నాకు ఆత్మీయంగానే కనిపిస్తుంది–నీకు చేరువవుతోంది కనుక–అని.

తన తల్లితో పనిచేసిన ఏవ్యక్తి అయినా, ఏ జ్ఞాపకమయినా అతన్ని ఆర్ద్రం చేస్తుంది. మనస్సులో ఏకాంతంగా దాచుకున్న "అర' ఒక్కక్షణం తెరుచుకుంటుంది. నన్ను చూస్తున్నప్పుడు అలాంటి స్పందన ఏదో కదిలింది.

చెప్పలేని మాధుర్యం, వాత్సల్యం, మమకారం, గర్వం, వేదన, తియ్యని బాధ– యిన్నిటిని కదిలించింది. అదీ ఓ అరుదయిన అమ్మ జ్ఞాపకాలకు – అమ్మ అభిమాన ప్రపంచానికి దూరంగా జీవిస్తూ జనజీవనంలో కలిసిపోతున్న ఓ కొడుకు అంతరంగం.

*(జూలై 11,* 2011)

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

# (July 18, 2011)America Karma Siddhantam అమెరికా కర్మ సిద్ధాంతం

అమెరికాలో అన్నిటికన్నా ఆకర్షించే విషయం- వ్యాపారం. సర్వకాలసర్వావస్థలలోనూ వీటిని అమ్మవచ్చా, వీటికి బేరం ఉంటుందా, యిలాకూడా వ్యాపారం చెయ్యవచ్చా అనిపించేరీతిగా నిత్యనూతనంగా- ఎప్పుడూ కొత్త కొత్త తాయిలాలను, వరాలను కురిపిస్తూ- ఎన్నటికీ అలసిపోని, ఎప్పుడూ సాగే కర్మకాండ వ్యాపారం.

ప్రతీ వస్తువూ ఒకే చోటు నుంచి కొనుక్కోడానికి కొన్ని బిగింపులుంటాయి. మీకొక సభ్యత్వం కార్డు యిస్తారు. ప్రతీసారీ మా దగ్గరే కొనుగోలు చేస్తున్నారా? అయితే మీకు కొన్ని రాయిఅతీలు. కొన్ని టోకు వ్యాపారాల "మాల్'లు ఉంటాయి. అక్కడా కార్డు పద్ధతి. పది దువ్వెనలు, పన్నెండు టూత్ పేస్టులు, 20 బిస్కెట్ పాకెట్లు, 30 మంచినీళ్ల సీసాలు, 20 పెన్నులు, 15 గోళ్లూడదీసే కత్తెరలు- మీయిష్టం. ఆ మాల్ లోనే ఉచితంగా ఏదో పానీయాన్ని యిస్తారు. ఇది అమ్మే సరుకు వరకు. సరుకుల వ్యాపారులు యిచ్చే వరాలు బోలెడు. అలాంటి సౌకర్యాలు, అంత సరసంగా యివ్వవచ్చునని మనం ఊహించలేం.

ప్రతీ వస్తువు ధరా చూడముచ్చటగా ఉంటుంది వినముచ్చటగానూ ఉంటుంది. వ్యాపారులకి 99 యిష్టమయిన సంఖ్య. 5 డాలర్లు అనరు. 4.99 డాలర్లు అంటారు. 500 డాలర్లు చెప్పరు. 499 డాలర్లు చెప్తారు. అలాగే చిన్న చిన్న వస్తువులు. ఒక్కొక్కటి డాలరు 99 సెంట్లు. మూడు డాలర్ల 99 సెంట్లు.

"ఇంకా ఎంత దూరం బాబూ?" అని అలసిపోతూ నడిచేవాడికి

"అదిగో- ఆ సందు మలుపే-" అంటే ఓదార్పుగా ఉంటుంది.

""ఇంకా రెండున్నర మైళ్లు" అంటే అలసటగా ఉంటుంది.

399 డాలర్లు చేతిలో అరటిపండు. నాలుగువందలు? అమ్మో! ఎక్కువ!

ఇక టీవీల్లో, పేపర్లలో చాలక యింటికి పంపే వందల ఉత్తరాల బంగీలలో ఊరింపులే ఊరింపులు.

"""మీ పన్ను నొప్పిగా ఉందా? చూసే సౌకర్యం ఫ్రీ. మీ యింటికే వచ్చి చూసే విసులుబాటు ఉంది. రెండు పళ్లు పీకితే మూడో పన్ను ఫ్రీ.మీరు నాలుగు రకాలుగా నాలుగు పీకించుకున్నారా? మీకు నాలుగు కూపన్లు వస్తాయి. వాటి మీద రేపు మీ ఆవిడ పన్ను పీకినప్పుడు (మీ పళ్లు ఎలాగూ అయిపోయాయి కనుక) 25 శాతం రాయితీ వుంటుంది. అయితే ఈ సౌకర్యం మూడువారాల వరకే! మరి తర్వాత? అవిడ పళ్లూ అప్పటికి ఊడిపోవచ్చు. ఊడకపోతే కొత్త సౌకర్యం వస్తుంది. ఎదురుచూడండి. అమ్మే సరుకు ఖరీదులు- 3.99, 12.99 అంటారుకదా? ఆ సరుకుల మీద యిచ్చే రాయితీలు మాత్రం శాతాలలో ఉంటాయి. వాటిని పెద్ద పెద్ద అక్షరాలలో వేస్తారు. 40 శాతం తగ్గింపు! గమనించండి-39.99 శాతం కాదు. కొనేవాడికి అంకె హాయిగా కనిపించాలి. దక్కే విసులుబాటు డాబుగా ఉండాలి.

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

రకరకాల వస్తువుల అమ్మకం గురించి పెద్ద బొత్తి పోస్టులో వస్తుంది. ఆ బొత్తి విప్పి చదివినందుకే మీకు 3 కూపన్లు దక్కుతాయి. వాటివల్ల ఏమిటి లాభం? ఇలాంటివి 16 సంపాదిస్తే– మీకు ఒక పూల తొట్టి ఫ్రీ. ఆదిన్నీ రెండుకొన్నాక. వర్షానికి మీ యిల్లు కారుతోందా? చూడడం ఫ్రీ. మీకు చూపడం ఫ్రీ. అలా పాడయిన వస్తువులకి ఇన్సూరెన్సు ఎలా రాబట్టాలో రాసే పద్ధతి ఫ్రీ. 1200 డాలర్లదాకా రాయితీలు. అయితే ఆగస్టు మొదటివారందాకానే ఈ సౌకర్యం. ఎందుకని? తొందరపెడితే విచక్షణకి అవకాశం ఉండదు. తర్వాత ఏమౌతుంది? వర్షాలు ఆగిపోవచ్చు. మీ యిల్లు కూలిపోవచ్చు. ఉంటే మళ్లీ కొత్త తాయిలాలు అమలులోకి వస్తాయి. మరికొన్ని వరాలు–ఇంకా విచిత్రం. మీరు కెమెరాకొని 30 రోజుల్లో నచ్చకపోతే వాపసు యిచ్చెయ్యవచ్చు. తలగడకొని–పది రోజులు పడుకుని మెడ నొప్పిపెడితే మార్చుకోవచ్చు. రకరకాల వంట సామాన్లు– కొని, వంట చేసుకొని 30 రోజుల తర్వాత వాపసు యివ్వవచ్చు. మీ కుక్క జుత్తు దువ్వే దువ్వెనలు నాలుగు కొంటే ఒకటి ఫ్రీ. కుక్క జబ్బుల వివరాలు, జాగ్రత్తలు చెప్పే పుస్తకం ఫ్రీ. దానికి పెట్టే రకరకాల ఆహారం మీద 30 శాతం రాయితీ. ప్రతి వస్తువు మీదా 4 కుక్క బిస్కెట్లు ఫ్రీ. కుక్క కూర్చునే రెండు రకాల కుర్చీలు– 20 రోజులు వాడి వాపసు యివ్వవచ్చు. ఖరీదు–17.99!

ఇక అమ్మే వస్తువులు– మనం ఊహించలేం. పంది కాలు, ఆవు చట్ట, కోడి తొడ, టీ బోన్ రొట్టెలు(?), రొట్టెలకి రాసే ఎర్ర నూనె, మూకుడు తుడిచే బ్రష్, వంటింట్లో నేల మీద నిలబడడానికి పరిచే ప్లాస్టిక్ చాప, ఫ్రీ కూపన్ ల్ మీద చెర్రీలు–2 డాలర్ల 99 సెంట్లు మాత్రమే. ఇక సౌకర్యాలు– మీ తివాచీలు శుభ్రపరిచే సౌకర్యం– వారానికి ఒక రోజు తోట గడ్డిని కత్తిరించి శుభ్రం చేసే సర్వీసు– ఒక్కొక్క విడతకి గంటకి 90 డాలర్లు. నాలుగు గదులు తుడవాలా? 69 డాలర్లు. 5 గదులు తుడిపించుకుంటే మీ హాలు తుడవడం ఫ్రీ. 6 గదులు ఆయితే వంటగది, పాయిఖానా ఫ్రీ.

అన్నిటికన్నా టీవీలో నన్ను ఆకర్షించిన రెండు ప్రకటనలు– ఇద్దరు ముసిలిదంపతులు టీవీలో కనిపించారు. ముసలావిడ చెప్తోంది.

""గడ్డురోజులు వచ్చాయి. ఏ రోజెలావుంటుందో చెప్పలేం. రేపు మా ఆయన చచ్చిపోతే నాకేం బెంగలేదు. గవర్నమెంటు 200 డాలర్లు యిస్తుంది. కాని నేను 20,000 డాలర్లకి ఇన్సూర్ చేశాను"

ముసలాయన నవ్వాడు. ""నేనూ మా ఆవిడకదే చేశాను. ఆవిడ చచ్చినా నాకేం బాధలేదు"

మరొక ముసలాయన సూటులో ఉన్నాడు.""నా జీవితమంతా అన్నీ పరిశుభ్రమయిన వస్తువులే వాడాను. రేపు నేను పోతే తళ తళా మెరిసే శవం పెట్టెని యిప్పుడే బేరం చేసుకుని పెట్టుకున్నాను. తర్వాతి షాట్– మెరిసే అందమయిన కర్రపెట్టిలో మెరిసే అందమయిన సూటుతో– చిరునవ్వుతో ముసలాయన శవం. తళ తళామెరిసే మూత పడింది. ఆంకర్ గొంతు: త్వరపడండి. మూడువారాలలో నాలుగు రంగుల పెట్టెలు. ఇప్పుడే మీరు పోతారని కాదు. ఎప్పుడు పోయినా పెట్టెమీకు గ్యారంటే. మీ శ్రాద్ధం మీకు పెట్టడం గ్యారంటీ.

మా మిత్రుడొకాయన– ఓ విచిత్రమైన సందర్భాన్ని చెప్పారు. ఒకాయన 350 డాలర్ల ఫొటో స్కానర్ కొన్నాడు.అంటే దాదాపు 18 వేల రూపాయల సరుకు. నేను ఆశ్చర్యపోయాను. అలవోకగా ఎడం చేత్తో కొన్నాడు. కొనేముందు "నచ్చకపోతే 30 రోజుల్లో తిప్పి యిచ్చే సౌకర్యం ఉందా?" అని అడిగాడు అక్కడి మేనేజర్ని. ఉంది.




ఈ మిత్రుడితో మెల్లగా చెప్పాడు. ఇంట్లో బోలెడు ఫొటోలు స్కాన్ చెయ్యాలి. ఓ వారం రోజుల్లో పీకిపారేసి– 20 రోజుల తర్వాత వాపసు యిచ్చేస్తాను. అదిగో చూడండి– నాలాంటివాడే సరుకుని తెచ్చి యిచ్చేస్తున్నాడు– అంటూ డబ్బా విప్పిన బంగీతో వెళ్తున్న మనిషిని చూపించాడు.

మరి యిందులో షావుకారుకి ఏమిటి లాభం?

ఇలాంటి సౌకర్యానికి అలవాటుపడినవాళ్లు షాపు మీద ముసురుకుంటారు. సరుకులు చెల్లుతాయి. 30 రోజుల్లో సరుకు పాడయితే? యివ్వడం మరిచిపోతే? యిచ్చిందాన్లో లొసుగు ఉంటే? ఈలోగా మీమీద పిడుగు పడితే? ఒసామా దేశం మీద బాంబు వేస్తే?– యిలా ఏదో కారణానికి సరుకు మీ చేతుల్లోనే ఉండిపోతే? కొన్న 40 మందిలో 11 మంది ఇలాచేశారనుకుందాం. ఆ పదకొండు మంది వల్ల వచ్చే నష్టాన్ని, అరుగుదల ఖర్చుని, మీ గడుసుదనానికి రుసుమునీ సర్దుకోడానికి అమ్మే సరుకుమీదే 15 శాతం భరోసా సుంకం (వారంటీ) వేస్తారు. ఈ సిద్ధాంతాన్ని ఫైనాన్షియల్ ఇంజనీరింగ్ అంటారు.

అయ్యా, భారతీయ కర్మ సిద్ధాంతాన్ని వంటబట్టించుకున్న నికార్సయిన వ్యాపారం– అమెరికా జీవనం. నేను వ్యాపారాన్ని గురించి మాత్రమే చెప్పడం లేదు. జీవనం గురించి మాట్లాడుతున్నాను. గమనించాలి.

*(జూలై 18, 2011)*

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

# (July 25,2011) Dourjanyakaraulaku Lekha దౌర్జన్యకారులకు లేఖ

ప్రియమైన సోదరులారా!

ఈ మధ్య కాలంలో మీ గురించి ఈ దేశ ప్రజలు ఆలోచిస్తున్నట్టు మా తల్లిదండ్రులు, ఆత్మీయుల గురించి కూడా ఆలోచించడంలేదు. అందుకు బోలెడన్ని కారణాలున్నాయి. పాకిస్థాన్ మిత్రులకి 'కాశ్మీర్' ఊతపదం. కానీ మాకు మీ దౌర్జన్యకాండలు ఊతపదం. అయితే మీరు చిన్న చిన్న తప్పులు చేస్తున్నారు. మీలో చిన్న అవగాహనా లోపం ఉంది. దాన్ని తొలగించడానికే ఈ ఉత్తరం. చిత్తగించండి. మా దేశంలో నాయకులూ, ప్రభుత్వమూ, ప్రజలూ మీ బాంబు పేలుళ్ళకీ, ప్రాణ నష్టానికీ చలిస్తారని మీకో దురభిప్రాయం ఉంది. కానీ వాళ్ళకి ఎంతమాత్రం లక్ష్యం లేదు. ఎందరు పోయారో, ఎక్కడ పోయారో చూసి మరిచిపోతారు. మా దేశంలో జననష్టానికి బొత్తిగా విలువలేదు. నేలబారు మనుషులు చచ్చిపోవడం వల్ల ఎవరికీ, ఏమీ కాదు. నాయకులు ఇలాంటప్పుడు సాధారణంగా చెప్పే మాటలున్నాయి. "మన ప్రజలు ఇలాంటి పిరికి దెబ్బలకు లొంగరు. మన ఆత్మస్థైర్యం గొప్పది" అంటారు. ఈ బూతు మాట వారి ఊతపదమని తమరు గ్రహించాలి. దుండగుల్ని పట్టుకుని తీరుతామని చెపుతారు. వాళ్ళలా చెపుతున్నప్పుడే చేసే నమ్మకం లేదని వాళ్ళ మొహాల్లో మనకు తెలుస్తూంటుంది. ఆ మధ్య మీరు కష్టపడి కొన్ని వందల మందిని ముంబైలో చంపారు. "మా ముంబై ఇలాంటి దాడులకు లొంగదు. నిలదొక్కుకుంటుంది. మరునాటికే మామూలు జీవనం కొనసాగిస్తుంది" అని నాయకులు బోర విరిచారు. అంతకంటే నేలబారు మనిషికి మరోగతిలేదుకదా? వాడి దినచర్య నడవకపోతే నోటి దగ్గర కూడు పడిపోతుంది. కనుక తప్పనిసరిగా చావును లెక్కచెయ్యక వీధిని పడతాడు. అది ఈ ప్రజల గొప్పతనం కాదు. నిస్సహాయత. అక్కడితో అంతా మరిచిపోతారు. కనుక మీరు చేస్తున్న పని బూడిదలో పోసిన పన్నీరవుతోందని గమనించవలసిందిగా నా ప్రార్థన. కాకపోతే మీ దాడుల వల్ల ఛానళ్ళ వ్యాపారం పెరుగుతుంది. వాళ్ళ ప్రకటనలు గొప్ప గొప్ప ధరలకి అమ్ముడుపోతాయి. గొప్ప గొప్ప నాయకులు, పోలీసు అధికారులు పదే పదే మైకుల ముందుకు వస్తారు. వాళ్ళ గ్లామరు పెరుగుతుంది. నిముషాల్లో నిజానిజాలు ఎలా తేల్చేస్తారో – ఎవరు ఈ దాడులు చేశారో మాకు పూస గుచ్చినట్టు చెప్పేస్తారు. వీటి వల్ల మీకు ప్రచారమొస్తుందని మీరు భావిస్తే మీతో నేను ఏకీభవిస్తాను. ఏమయినా ఘోట్కపర్, ములంద్, కొలాబా, దాదర్, వర్లీలలో చిన్న చిన్న పేలుళ్ళు పెద్ద స్పందన కలిగిస్తాయని తమరు నమ్ముతున్నారు. కానీ మేము వాటికి అలవాటు పడిపోయాం.

మీ సోదరులు దొరికితే మేం ఏమీ హాని చెయ్యమని మనవి చేస్తున్నాను. కోట్ల ఖర్చు పెట్టి, పువ్వుల్లో పెట్టి కంటికి రెప్పలాగ కాపాడుకుంటాం. మాది కర్మ భూమి అని తమరు ఈ పాటికి గ్రహించే ఉంటారు. ఇంకా గ్రహించకపోతే అజ్మాల్ కసబ్, అఫ్జల్ గురు సోదరులని అడిగి తెలుసుకోండి.

ఒక్కటి మాత్రం మీరు సరిగ్గా అర్థం చేసుకున్నారు. మాకు స్వాతంత్ర్యం వచ్చాక పోలీసుల్ని గస్తీ తిప్పే శ్రమ నుంచి మా నాయకులు తప్పించారు. కాగా రోడ్డు మీద, మార్కెట్లలో చెత్తకుప్పల్ని పెంచే హక్కుమాకుంది. కనుక – చెత్తకుండీల్లో, పాడయినస్కూటర్లలో, విరిగిన సైకిళ్ళలో చిన్న చిన్న బాంబులు పెట్టే సౌకర్యం మీకు కలిసివస్తుంది. బాంబులు పేలగానే వర్షం పడగానే కలుగులోంచి బయటకు వచ్చిన చీమల దండులాగ పోలీసులు వచ్చిపడతారు. ఎక్కడ చూసినా వాళ్ళే కనిపిస్తారు. ఎందుకు? ప్రత్యేక భద్రత. ఎవరికి? ప్రజలకి కాదు. ఈ వినోదం చూడడానికి వచ్చే నాయకులకి. నాయకులు వెళ్ళిపోగానే పోలీసులూ మాయమౌతారు. ఎక్కడికి? వాళ్ళ వాళ్ళ సౌకర్యాల మేరకి. చావు కబుర్లు చల్లగా చెప్పిన ఛానళ్ళు మళ్ళీ తమరు కొత్త కథల్ని ఎప్పుడు సృష్టిస్తారా అని ఎదురు చూస్తుంటాయి.

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

మరో పొరపాటుని మీరు గమనించాలి. మొన్న ముంబైలో సీరియల్ పేలుళ్ళు జరిపారు. వెంటనే తమరు రెండు రోజులు శలవు తీసుకున్నారు. అక్కడే మీరు పప్పులో కాలేస్తున్నారు. వెంటనే మా నాయకులు ఆసుపత్రుల చుట్టూ మూగి విరిగిపోయిన చెయ్యిల్నీ, పగిలిపోయిన తలల్నీ నిమురుతున్నప్పుడు తమరు దెబ్బకొట్టాలి. నేను ఇలా చెపుతున్నప్పుడు దేశద్రోహిగా మీకు కనిపించవచ్చు. కారణం – మా నాయకులు వారికి అన్యాయం జరిగినప్పుడే స్పందిస్తారు.

వాళ్ళమాయిలు, బంధువులు జైళ్ళకు వెళ్ళినప్పుడే వారిలో చలనం కనిపిస్తుంది. మా కరుణానిధిగారు జీవితంలో ఏనాడయినా చెన్నైలో పుగల్ జైలుకి వెళ్ళినట్టు మనం విన్నామా? ఈ మధ్య తీహార్ జైలుకి మీనాక్షిదేవాలయానికి వెళ్ళినంత విరివిగా, భక్తితో వెళ్ళున్నారని తమరు గ్రహించే ఉంటారు. అల్లప్పుడు ఎప్పుడో కాశ్మీర్ హోం మంత్రి కూతుర్ని తమరు ఎత్తుకుపోయినప్పుడు కేంద్రం ఎలా స్పందించిందో తమకు గుర్తుండే ఉంటుంది.

మామూలు మనుషులు చచ్చిపోతే, గాయపడితే నలుగురూ వింటారు, వెంటనే మరిచిపోతారు. పండగ తర్వాత పాచి అన్నం అది. రాజీవ్ గాంధీతోపాటు చచ్చిపోయిన 18 మంది పేరుని – నెలల కొద్దీ పరిశోధన చేసిన కార్తికేయన్ గారిని చెప్పమనండి. మూడు పేర్లు చెపితే ఆయనకి పద్మభూషణ్ ఇవ్వవచ్చు.

పాకిస్థాన్ పేలుళ్ళలో అక్కడ మా దేశంలో లాగే ముక్కూ మొహం తెలీని మనుషులు పోతున్నారు. అందువల్ల అక్కడి నాయకులకూ చీమకుట్టినట్టు ఉండదు. పైగా మాకూ మా దేశంలో 'తలనొప్పి' ఉందని చెప్పుకోడానికి మీ దేశం నాయకులకి ఆ మాత్రం ప్రాణ నష్టం ఉపయోగపడుతోంది. నిజానికి ఈ చావుల్ని అక్కడి నాయకులు కొంగు బంగారం చేసుకుంటున్నారని ఒక అపప్రధ ఉంది. అలాగే మా దేశంలో పేలుళ్ళు పాకిస్థాన్ని తిట్టడానికి ఉపయోగిస్తాయి.

ఒక్క విషయం మా కర్ధమౌతోంది. చచ్చిపోతే తమకు ఈ 'జిహాద్'లో వీరస్వర్గం తప్పదని మాకు తెలుసు. బతికుంటే మా జైళ్ళలో మీరు సమస్త భోగాలూ అనుభవిస్తూ ఉండవచ్చునని మీకు తెలుసు. ఎప్పుడయినా మీ సోదరులు కరుణిస్తే ఖాందహార్ దాకా మా మంత్రులు మీ మనుషుల్ని తీసుకువచ్చి సమస్త రాజమర్యాదలతో అపపించే ఔదార్యం మాకుందని మీకు తెలుసు.

కనుక కేవలం మా నాయకుల దర్శనానికీ, మా ఛానళ్ళ వ్యాపారానికీ మీ బాంబుల్ని వృధా చేసుకోవద్దని చెప్పడానికే ఈ ఉత్తరం రాస్తున్నాను. ముందు ముందు కొత్త బాంబుల్ని తెలివిగా వినియోగించమని, నేలబారు మనుషుల మీద వృధా చెయ్యవద్దని నా మనవి.

(ఎకనామిక్స్ టైంసులో పాత్రికేయుడు జైతీర్థరావ్ స్ఫూర్తితో)

*(జూలై 25,* 2011)



# (August 1, 2011) Dementia డిమెన్షియా

ప్రపంచ సాహిత్యంలోనే గొప్ప కథల్లో ఒక కథ జర్మన్ రచయిత ఫ్రాన్స్ కాఫ్కా "ది మెటొమార్ఫొసిస్". ఒక రోజు కథానాయకుడు నిద్రలోంచి లేవగానే తను ఒక పెద్ద 'పురుగు' అయిపోయినట్టు భావిస్తాడు. అధివాస్తవికత, అద్భుతమైన 'సింబాలిజం'తో కథ సాగుతుంది. ఇప్పటికీ ఈ కథని ఎంతో మంది విశ్లేషిస్తున్నారు. ఎన్నో రకాల రచనా రూపాలను ఈ కథ సంతరించుకుంది. ప్రపంచ సాహిత్యంలో ఇది చరిత్ర. ఇంతవరకూ దీని ప్రసక్తి చాలు.

ఇప్పుడింత గొప్ప కళాఖండాన్ని జ్ఞాపకం చేసుకోవడానికి కారణం మరో గొప్ప కళాఖండం వంటి నాయకులు సురేష్ కల్మాడీగారు. వారు ఒక రోజు లేచిన వెంటనే వారికి 'మతి' మందగించి, చాలా విషయాలు మరిచిపోతున్నట్టు అనిపించింది. ఈ నిజాన్ని వారికంటే ముందు వారి న్యాయవాదులు గుర్తుపట్టారు. ఇది కాఫ్కా కథ స్థాయిలో గుర్తుంచుకోవలసిన విషయం.

వారికిప్పుడు 67 సంవత్సరాలు. అప్పుడప్పుడు తల తిరుగుతున్న మాట నిజం. ఒకొక్కప్పుడు – ముఖ్యంగా తీహార్ జైల్లో వారికి బోరింగుగా ఉంటోంది. ఆ మధ్య తన మిత్రులతో – అంటే తీహార్ లోనే ఉన్న లలిత్ భానోత్, వి.కె.వర్మ వంటివారితో కలిసి ఉంచమని జైలు అధికారులను కోరారు. అయినా వారు అంగీకరించలేదు. ఇప్పుడిప్పుడు వారికి 'మతిమరుపు' అనే రోగం మీదపడింది. వారికి తాను సురేష్ కల్మాడీ అని గుర్తుంది. కామన్వెల్తు క్రీడలు చూచాయగా గుర్తుకు వస్తున్నాయి. గత నవంబరు 30 న ఢిల్లీలో సిబిఐ జరిపిన పదకొండు దాడులు బొత్తిగా గుర్తులేవు. స్విస్ సంస్థతో కుమ్మక్కయి ఫలహారం చేసిన 107 కోట్లు ఏదో పూర్వజన్మ స్మృతిలాగ ఉంది. టి.ఆర్.ఎస్. కాంట్రాక్టుల బాపతు 95 కోట్ల కుంభకోణం – అసలు గుర్తురావడం లేదు. మధ్య మధ్య టైంస్ నౌ వ్యాఖ్యాత ఆర్నాద్ గోస్వామి ముఖం జ్ఞాపకం వస్తోంది. ఎందుకు? స్పష్టంగా తెలియడం లేదు.

తీహార్ లో అప్పుడప్పుడు కనిపించే లలిత్ భానోత్, వర్మ ప్రభృతుల్ని ఎక్కడో చూసినట్టుంది. ఎక్కడ? ఆస్ట్రేలియా దేశం – అక్కడి దొంగ కంపెనీలు – అబ్బే, అస్సలు గుర్తులేదు.

ఇది అసలు సిసలైన కాఫ్కా కథ. సందేహం లేదు. ఆ కథలో నాయకుడు గ్రిగోర్ శాంసా అచ్చం మన కల్మాడీ గారే. కవి కాలం కంటే ముందుంటాడంటారు. 2011 లో మనదేశపు రాజకీయ నాయకుడిని ఎక్కడో జర్మనీలో – 1915 లో ఒక రచయిత గుర్తుపట్టడం ఎంత విడ్డూరం! 1915లో కాఫ్కా సృష్టించిన 'పురుగు' పేరు సురేష్ కల్మాడీ!

మానవ స్వభావాల నైచ్యానికి ఎల్లలు లేవనడానికి ఇది గొప్ప ఉదాహరణ.

అయితే ఈ మతిమరుపు ప్రారంభం కావడానికి ముందు కొన్ని సంఘటనలు జరిగాయి. కల్మాడీగారికి తాను పార్లమెంటు సభ్యుడినని గుర్తుంది. ఒకటో తారీకునుంచి పార్లమెంటు సభలు జరుగుతాయని జ్ఞాపకం ఉంది. అవినీతి పనులు చేసి జైలుకి వెళ్ళినా ఫలానా మధు కోడాలాగ, రాష్ట్రీయ జనతా దళ్ రాజేష్ రంజన్ లాగ రోజూ పార్లమెంటుకి వెళ్ళిరావచ్చుననే ఆలోచన ఉంది. అయితే గత 29 సంవత్సరాలలో వారు ఎన్నిసార్లు పార్లమెంటుకి వెళ్ళారు? వెళ్ళి ఏం ఉద్దరించారు? ఆ మాటే ఘనత వహించిన న్యాయమూర్తి అడిగారు. ఒక న్యాయమూర్తి ఇంత స్పష్టంగా కుండ బద్దలు కొట్టిన సందర్భం నేనెరగను. అచ్చంగా వారి మాటలివి. "పార్లమెంటులో ప్రస్తుతం మీరు (కల్మాడీ) వెళ్ళకపోతే



ప్రభుత్వం కూలిపోయేంత ముఖ్యమైన వ్యవహారం ఏమీలేదు". నమూనాకి కిందటి పార్లమెంటు సమావేశాల్లో కల్మాడీగారు ఎన్ని ప్రశ్నలు వేసి, ఏయే చర్చల్లో పాల్గొన్నారో సెలవివ్వమని అడిగారు.

ఈలోగా వారికి మతిమరుపు జబ్బు వచ్చింది.

కొందరికి 'మతి' పెట్టుబడి. మరికొందరికి సాకు. కల్మాడీ వంటివారికి అది చక్కని పలాయనం.

లలిత భానోత్ ని కలిసినప్పుడల్లా 'మిమ్మల్ని ఎక్కడో చూసినట్టుంది' అంటున్నారట.

ఉన్నట్టుండి "అన్నట్టు క్రీడాకారుల మేజోళ్ళ కుంభకోణంలో మనకు కిట్టినదెంత?" అనడుగుతున్నారట.

"మేజోళ్ళు కావు బాస్ – ముఖం తుడుచుకునే గుడ్డలు" అని నాలిక కరుచుకుంటున్నారట భానోత్ గారు.

మధ్య మధ్య "నా పేరేమిటి?" అనడుగుతున్నారట.

ఈ విధంగా వారి 'మతి మరుపు' తీహార్ లో మూడు పువ్వులూ ఆరుకాయలుగా సాగుతోంది. నిజానికి 'మతిమరుపు' నేరం చేసిన ప్రతివాడికీ వస్తుందని నా ఉద్దేశం. మొన్నమొన్నటిదాకా మన రాజాగారు తను నిర్దోషిననే అంటున్నారు కదా? లక్షా డెబ్బై ఆరు వేల కోట్లగురించి వారు మరిచిపోతున్నారు. మనం కళ్ళారా ముంబైలో మారణకాండను చూసినా అజ్మల్ కసాబ్ గారేమన్నారు? తను నిర్దోషిననే కదా? నేరస్థులందరికీ డిమెన్షియా ఉంటుంది. అది వారిలో సామాన్యగుణం. ఒక్కొక్కప్పుడు ఈ జబ్బు దేశాలకీ వర్తిస్తుంది. కసాబ్ తమ దేశస్థుడన్న విషయం చాలాకాలం వరకూ పాకిస్థాన్ ప్రభుత్వం మరిచిపోయింది. ఇప్పటికీ దావూద్ ఇబ్రహీం గారి అడ్రసు ఆ ప్రభుత్వానికి గుర్తులేదు. టైగర్ మెమూన్! ఆ పేరెక్కడో విన్నట్టుందే! మన రాజకీయ నాయకులందరికీ డిమెన్షియా ఉంటుంది. ఆ మధ్య చాలామందిని మన జాతీయ గీతం గురించి అడిగారు. కానీ చాలామంది మరిచిపోయారు. కొందరయితే రవీంద్రుడు రాశారని మరిచిపోయారు. బాబూ! ఇవి డిమెన్షియా లక్షణాలు – వాళ్ళ బుద్ధిలోపం కాదని మనం గ్రహించాలి.

యెడ్యూరప్ప వంటి నాయకులు మంత్రులకి 'సిగ్గూ లజ్జా' ఉండాలని మరిచిపోయారు. చాలామందికి 'నీతి' అన్న పదానికి అర్ధం మరిచిపోయారు. ఈ దేశం జాతిపితని – మహాత్మాగాంధీని ప్రతీ సంవత్సరం 364 రోజులు మరిచిపోతోంది! వారు ఒకే ఒక రోజు గుర్తుకు వస్తారు. అయితే నిన్ననే – కల్మాడీగారు తేరుకుని "నాకిప్పుడన్నీజ్ఞాపకం వస్తున్నాయి. మీరేమడిగినా చెప్పగలను. నా పేరే సురేష్ కల్మాడీ. నేను రోజూ కోల్గేటు తోటే పళ్ళు తోముకుంటాను" – ఇలా స్పష్టంగా ఆలిండియా మెడికల్ సైన్సెస్ ఆవరణలో వాక్రుచ్చారు. అది ఈ దేశానికి శుభసూచకం. నేరస్థుడికి తను చేసిన పని గుర్తులేకపోతే – గుర్తులేని పరిస్థితిలో అతని మనస్సు ఉంటే ఇంక ఆ నేరం చెల్లదు. ఇదీ న్యాయవాదులు ఎత్తు. పాపం. ఒక అవినీతిపరుడి 'సాకు'కి న్యాయవాదులు వెదికిన దొంగతోవ డిమెన్షియా.

కానీ ఈ దేశం యావత్తూ ఎన్నో రంగాలలో 'డిమెన్షియా'లో పడి చాలా ఏళ్ళయింది.

(*ఆగస్టు 1,* 2011)




# (August 8,2011) Sense of Humor సెన్స్ ఆఫ్ హ్యూమర్

ఇది తెలుగు కాలం కనుక ఇంగ్లీషులో మొదలెడతాను. సెన్సాఫ్ హ్యూమర్ అంటే కష్టాన్నీ, నష్టాన్నీ చూసి కడుపారా నవ్వుకోవడం. మనకి ఆ అలవాటు బొత్తిగా తక్కువంటాను. స్థాలీపులాకన్యాయంగా ఇక్కడ కొన్ని ఉదాహరణలు.

ఆ మధ్య పేపర్లో ఓ వార్త చూశాను. తమిళనాడులో ఎక్కడో ఓ కుర్రాడు ఓ కక్కుర్తి దొంగతనం చేస్తూ పట్టుబడ్డాడు. కోర్టు ఆ కుర్రాడిని జైల్లో పెట్టింది. తీరా విచారణ జరుపుతూ బెయిల్ ఇవ్వడానికి 1200 రూపాయలు కట్టమంది. వెనకటికి ఓ పూర్వసువాసిని 'మా ఆయనే ఉంటే మంగలి ఎందుకు బాబూ' అన్నదట. 'నా దగ్గర అంత డబ్బుంటే దొంగతనం ఎందుకు చేస్తాను బాబూ?!' అన్నాడట ఆ కుర్రాడు. కట్టని కారణంగా జైల్లోనే ఇరుక్కున్నాడు. కేసుని పట్టించుకునే నాధుడు లేడు. అలా ఎన్నాళ్ళు? కాదు. ఎన్నేళ్ళు? ఏడు సంవత్సరాలు. ఈ మధ్య ఎవరో జైలు రికార్డులు తిరగేస్తూ వీడిని గమనించి అవతలికి పొమ్మన్నారు. స్థూలంగా ఇదీ కథ.

మనకి సరదాగా నవ్వుకోవడం తెలీదంటాను మరొక్కసారి. ఈ కుర్రాడిని ఆ రోజుల్లోనే – మా తూర్పు భాషలో – ఓ టెంకిజెల్ల కొట్టి పొమ్మంటే ఈ దేశానికి ఒక మేలు జరిగేది. వాడు తన కళకి మెరుగులు దిద్దుకుని – చూసీ చూడనట్టు వదిలేసే వ్యవస్థ అలుసు చూసుకుని – పెరిగి పెద్దవాడయి ఏ రాజావో, కల్మాడీవో – అదీ ఇదీ కాకపోతే – మధుకోడాలాగానో, షీలా దీక్షిత్ మేడం లాగానో ఓ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయేవాడు. ఇప్పుడు వ్యవస్థ వాడిని ఏడేళ్ళు మేపి, పోషించింది. వాడు చేసిన నేరం పెద్దదా? వ్యవస్థ చేసిన నేరం పెద్దదా? నవ్వుకోండి బాబూ! నవ్వుకోండి.

నిన్న ఏలూరులో రవి అనే ఓ టౌన్ ప్లానింగ్ ఆఫీసరు గారు కేవలం ముప్పై వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడని వార్త. ఇది చాలా నీరసమైన పనిగా నేను భావిస్తాను. ఆయనింకా తన వృత్తిలో పరిణతిని సాధించలేదని మనం జాలిపడాలి. ఆయన్ని వీధిన పెట్టడం అన్యాయం. ఆయన్ని వెంటనే ఢిల్లో ముఖ్యమంత్రి కార్యాలయానికో, కామన్వెల్త్ క్రీడల కార్యాలయంలోనో తర్ఫీదు ఇప్పించాలి. ఇంత పలచగా ప్రారంభమయిన కృషే రేపు పుష్పించి ఫలితాల నివ్వగలదని అదే పేపరులో, అదే పేజీలో టోకు అవినీతి వార్తలు మనకు చెపుతున్నాయి. ఇంకా గొప్ప అవినీతిని తట్టుకునే శక్తి మనకున్నదని రవిగారికి తెలియజెయ్యాలంటాను. మరొక్కసారి మనకి సెన్సాఫ్ హ్యూమర్ బొత్తిగా లేదంటాను. మరొక కథ. ప్రకాష్ ఝా అనే చిత్ర దర్శకుడు ఈ మధ్య "అరక్షణ్" అనే హిందీ సినీమా తీశాడు. అందులో అమితాబ్ బచ్చన్, సైఫ్ ఆలీఖాన్, దీపికా పదుకునే వంటి హేమాహేమీలు నటించారు. ఇదీ కథ. నిజాయితీపరుడైన ఓ ప్రిన్సిపాల్. అంతే నిజాయితీ, పట్టుదల ఉన్న ఓ కుర్రాడు. కథ ప్రేమ వ్యవహారంతో ప్రారంభమయి, ముదిరి – ఆ మధ్య సుప్రీం కోర్టు 'రిజర్వేషన్ల' మీద ఇచ్చిన తీర్పు చుట్టూ తిరుగుతుందట. పెద్ద నాటకీయత, తిరుగుబాటు, సంఘర్షణ కలబోసిన ఈ చిత్రం కొందరికి అప్పుడే ఇబ్బంది కలిగిస్తోందట. సినిమా ఇంకా రిలీజు కాలేదు. రిజర్వేషన్ల గురించి కథ నడిచిన కారణంగా 'రిజర్వేషన్ల' ప్రయోజనం పొందేవారికి ఇబ్బందిగా ఉన్నదేమో. ఏమయినా ఉత్తర ప్రదేశ్ లో ఈ సినిమా విడుదలను నిషేధించింది అక్కడి రాష్ట్ర ప్రభుత్వం. విశేషమేమంటే అక్కడ ముఖ్యమంత్రి ఓ దళిత నాయకురాలు. పశ్చిమ బెంగాల్, బీహార్ రాష్ట్రాలు అభ్యంతరం చెప్పలేదు.

మన దేశంలో నారదుడు బఫూన్ గా, ధర్మదేవత అయిన యముడు లేకి హాస్యనటుడిగా తీసిన చిత్రాలను చూసి తరించే ప్రేక్షకులున్న ఈ కర్మభూమిలో ఇంకా ఇలాంటి వెనుకబడిన వారున్నారా అని ఆశ్చర్యం కలుగుతుంది. ఓ గొప్ప వాగ్గేయకారుడి చిత్రంలో బ్రాహ్మణులు పేద

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

ముద్దలు తింటూ మంత్రాల్ని వర్ణించే హాస్యాన్ని ఆశ్వాదించిన రసజ్ఞులు మనవారు. పౌరాణిక పాత్రల్ని భ్రష్టు పట్టిస్తే బహుమతులిచ్చే ఉదారులు మనవారు. కేవలం సినీమాని చూసి నవ్వుకోవడం తెలియకపోవడం దురదృష్టకరం.

ఈ మధ్యనే అంతర్జాతీయంగా పేరు తెచ్చుకున్న భారతీయ చిత్రకారుడు హుస్సేన్ సాహెబ్ గారు పరదేశంలో కన్నుమూశారు. ఆయన్ని మనదేశానికి రప్పించి, వారి చిత్రాల్ని నెత్తికి ఎత్తుకోలేదని చాలామంది పెద్దలు బాధపడ్డారు. ఈ మధ్యనే వారు చిత్రించిన చిత్రాల్ని నాకో మిత్రులు పంపారు. చూసి నా జన్మధన్యమయిందని తరిచాను. వారు దుర్గాదేవిని బట్టలిప్పి నిలబెట్టారు. కానీ ముస్లిం ప్రవక్త కూతురు ఫతిమాను పూర్తి దుస్తులతో అలంకరించారు. విఘ్నేశ్వరుడి నెత్తిమీద బట్టలిప్పుజుని కూర్చున్న లక్ష్మీదేవిని అద్భుతంగా రచించారు. తన తల్లిని పవిత్రంగా బట్టలతో చిత్రించారు. స్థనాలు వేలాడేసుకుని వీణని కాళ్ళ దగ్గర పెట్టుకున్న సరస్వతీ దేవిని రూపొందించారు. మదర్ థెరెస్సాను పసిబిడ్డను ఎత్తుకున్న దేవతగా చిత్రించారు. పార్వతీదేవి గుడ్డలిప్పుకుని ఎలకపిల్లలాంటి విఘ్నేశ్వరుడిని ఎత్తుకున్నట్టు రచించారు. తన కూతురిని అందంగా బట్టల్తో, టోపీతో చిత్రించారు. ద్రౌపది బట్టలిప్పుకుని నిలుస్తుంది. ముస్లిం యువతి పువ్వుల చీరె కట్టుకుని సభ్యతతో దర్శనమిస్తుంది. బట్టల్లేని హనుమంతుడినీ, రావణుడి తొడమీద బట్టలిప్పుకుని కూర్చున్న సీతనీ, బట్టల్లేని భారతమాతనీ..

ఒకరోజు కాదు, ఒక దశలో కాదు – పోనీ, ఆ దశలో ఆయన మనస్థాపంతో ఉన్నారని సరిపెట్టుకోడానికి – ఇవన్నీ ఆయన జీవితకాలంలో పరుచుకున్న అపూర్వమయిన కళారూపాలు. పరమ పవిత్రమైన పండరీ పురక్షేత్రంలో జన్మించిన ఈ కళాకారుడి భారతీయ సంస్కృతి వైభవం అవగాహనకిగాను ఒక పద్మశ్రీ పద్మభూషణ్, పద్మవిభూషణ్ కాక ఇంకా భారతరత్న ఇచ్చి సత్కరించకుండా దేశం వదిలి వెళ్ళిపోయేటట్టు చేశాం. మరొక్కసారి. మనకి నవ్వుకునే పెద్ద మనస్సు లేదు.

మన దేశంలో చట్టం, వ్యక్తి నీతి, సినీమా కళ, సామాజిక బాధ్యత, అభిరుచి – క్రమంగా భ్రష్టు పట్టిపోతున్నాయి. ఒక్కటే మార్గం. తలపంకించి సరదాగా నవ్వుకునే సెన్సాఫ్ హ్యూమర్ ని పెంపొందించుకోవాలి.

<u>*(ఆగస్టు 8,* 2011)</u>

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ
కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

# (August 15,2011) Mushti Pettanam ముష్టి పెత్తనం

ఒక ముష్టివాడు ఒక ఇంటికి బిచ్చానికి వెళ్ళాడట. ఇంటి కోడలు ఏమీ లేదు వెళ్ళమంది. బిచ్చగాడు బయలుదేరిపోయాడు. వెళుతున్న బిచ్చగాడిని అత్తగారు పిలిచారట. ఏమయ్యా వెళ్ళిపోతున్నావని.

కోడలమ్మగారు వెళ్ళమన్నారండి అన్నాడట బిచ్చగాడు. అత్తగారు చర్రున లేచింది. "అదెవరయ్యా చెప్పడానికి. నువ్వు రా" అన్నది. ఇతను వెళ్ళాడు. అప్పుడు అత్తగారు చెప్పిందట సాధికారికంగా "ఇప్పుడు నేను చెపుతున్నాను. ఏమీలేదు వెళ్ళు" అని. ఇచ్చినా, పొమ్మన్నా అత్తగారికే చెల్లును – అన్నది సామెత. ఈ దేశానికంతటికీ అలాంటి ఓ అత్తగారుంది. తిట్టినా తిమ్మినా, శిక్షించినా, రక్షించినా, పొమ్మన్నా ఉండమన్నా ఆ అత్తగారికే చెల్లును. ఆ అత్తగారు – సుప్రీం కోర్టు. ఈ దేశంలో ఎవరూ ఏ విషయంలోనూ మరే కోర్టునీ పట్టించుకోవడం మానేశారు. ఎన్నో కోర్టుల్లో శిక్షలు పడినా, పడకపోయినా, న్యాయం జరిగినా జరగకపోయినా ఆఖరికి అత్తగారిదే ఆఖరి మాట.

ఎవరు చేసిన పనయినా తప్పని కింద కోర్టు చెప్పిందనుకోండి. ఈ రోజుల్లో నేరస్థుడు సిగ్గుపడడం మానేశాడు. "ఆరోపణ జరిగింది కాని శిక్షపడలేదు కదా?" అని బోరవిరుచుకుంటాడు. ఇదివరకు 'అవినీతిపరుడు' అన్నందుకే కుమిలి చచ్చేవాళ్ళు. ఇప్పుడిప్పుడు పార్లమెంటులో పవిత్రంగా చట్టాలు చెసే పనిలో మునిగితేలుతున్నారు. నేరం వారిని బాధించడం మానేసింది. సుప్రీం కోర్టు అవినీతికి అంతిమ పరిష్కారం. మా నాన్నగారు పనిచేసే రోజుల్లో – నా చిన్నతనం మాట – ఆ కంపెనీ మేనేజరు – ఓ బ్రిటిష్ దొరగారు ఉండేవారట. చాలామంచివాడు. తాగుడికి అలవాటు పడి, ఆఫీసు సొమ్ము ఖర్చుచేసేశాడు. సంజాయిషీ చెప్పుకోలేని స్థితికి వచ్చాడు. అయితే తను చేసింది తప్పుకాదని బుకాయించే నిజయితీ చాలని ఆ దొరగారు ఒకరోజు విశాఖప ట్నం బీచ్ కి వెళ్ళి రివాల్వరుతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ కథని తరచుగా మా నాన్నగారు చెప్పేవారు. ఈ రోజుల్లో రివాల్వరుతో కాల్చిన వాళ్ళే సుప్రీం కోర్టు చెప్పేవరకూ సమాజంలో పెద్దమనుషులుగా ఛలామణీ అయిపోతున్నారు.

ఏతావాతా, నిజాయితీపరుల కాలం ముదిరిపోతోంది కనుక – ఒక్క సుప్రీం కోర్టు తీర్పునే నిజాయితీపరులు శిరసావహిస్తున్నారు కనుక మన దేశంలో ప్రతి రాష్ట్రంలోనూ ఒక్కొక్క సుప్రీం కోర్టుని స్థాపించాలని మనవి చేస్తున్నాను. తమిళనాడు కయితే రెండు చాలవు. ఎందుకంటే డిఎంకే పదవిలో ఉన్నప్పుడు ఏడిఎంకేవారు పరువు నష్టం దావాలు వేస్తారు. గద్దె దిగాక కరుణానిధిగారు ఆ పని చేస్తారు. పైగా ఆయా రాష్ట్రాలలో అయితే వీరికి సరైన న్యాయం జరగదు కనుక (ప్రస్తుతం జయలలితగారి కేసులు కర్ణాటకలో విచారణ జరుగుతున్నట్టు) పొరుగు రాష్ట్రాలలో వీరికి తైనాతిగా మరో సుప్రీం కోర్టు ఉండాలి.

ఈ లెక్కన – మన దేశంలో 28 రాష్ట్రాలు, ఏడు కేంద్రపాలిత ప్రాంతాలూ ఉన్నాయి కనుక, ప్రతీ రాష్ట్రానికీ రెండేసి చొప్పున 70 సుప్రీం కోర్టులూ, ఇవికాక పొరుగు రాష్ట్రంలో ఈ రాష్ట్ర కేసులకి మరో 35 అదనపు సుప్రీం కోర్టులూ ఉండాలి. ఇంకా ప్రత్యేక రాష్ట్రాల ఉద్యమాలు ఎన్నో రాష్ట్రాలలో జరుగుతున్నాయి కనుక – తెలంగాణా, గూర్ఖాలాండ్, విదర్భా మొదలయిన రాబోయే రాష్ట్రాలకు జరిగిన అన్యాయాల పరిశీలనకు ఇప్పుడే ముందుగా సుప్రీం కోర్టులను ఏర్పాటు చెయ్యడం సబబు. ఆ విధంగా రాష్ట్రాల ఏర్పాటుకు న్యాయస్థానం సముచితమైన సంకేతం కాగలదు.




ఈ దేశంలో పిల్లల పాఠాల పుస్తకాలకు, కాలేజీల్లో సీట్లకు, విడిపోయిన పెళ్ళాలకు మనోవర్తికి, కలిసున్న భార్యాభర్తల విడాకుల సమస్యలకి, ఎమ్మెల్యేల రాజీనామాల సమర్ధనకి, ఆఫీసర్లని ఉద్యోగాలనుంచి తీసెయ్యడానికి, సీనియారిటీలను కాపాడడానికి, జైళ్ళలో టీవీలకి, నేరస్తులకి కంప్యూటర్ అవసరాలకి, పోలిసాఫీసర్ల టోపీల రంగు నిర్ణయించడానికి – అన్నింటికీ, అందరికీ సుప్రీం కోర్టే శరణ్యం. హైకోర్టులు బొత్తిగా మాట చెల్లని నేలబారు ఇంటి కోడళ్ళలాంటివి. ఆఖరి తీర్పు అత్తగారిదే – అనగా సుప్రీం కోర్టుదే.

మరొక్క ముఖ్యమయిన పరిణామం ఈ దేశంలో ప్రబలుతోంది. ఎన్నడూ కనీవినీ ఎరగనంతమంది మహానుభావులు వరసగా జైళ్ళకు తరలిపోతున్నారు. ఇదివరకు జంతువుల్ని చంపినా మనుషుల్ని చంపినా ఎవరికీ ఖాతరు ఉండేది కాదు. ఇప్పుడిప్పుడు కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రుల కూతుళ్ళు, పార్లమెంటు సభ్యులు, కార్పొరేట్ అధిపతులు, ఐయ్యేయస్ ఆఫీసర్లు, మేనేజింగ్ డైరెక్టర్లు – జైళ్ళకి వలస వస్తున్నారు. మరి ఒకరిద్దరు మంత్రులు, ముఖ్యమంత్రుల కొడుకులు రావచ్చునని ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

మన దేశంలో ఒక అపప్రధ ఉంది. మన చట్టాలు ఎప్పుడో నూట పాతిక సంవత్సరాల కిందట రూపుదిద్దుకుని బూజుపట్టిపోయాయని. కావచ్చుగాక – ఇంత గొప్పవారు తరుచుగా వచ్చిపోయే ఈ జైళ్ళను సంస్కరించుకోవలసిన అవసరం మనకి ఎంతయినా ఉంది. ముందు జైళ్ళ నిబంధనావళిని సవరించుకోవాలని నా ఉద్దేశం. ఇందుకు నా సూచనలు కొన్నింటిని మనవి చేస్తున్నాను.

జైళ్ళలో పప్పూ యాదవ్ లాగ అప్పుడప్పుడు విస్తృతంగా పుట్టిన రోజులు చేసుకునే హాళ్ళు ఏర్పరచాలి. చార్లెస్ శోభరాజుగారిలాగ జైళ్ళలో ఉండగానే ప్రేమించి పెళ్ళిచేసుకునే వాతావరణాన్ని – ఉదా: బృందావనం, విజయా గార్డెన్స్ వంటి విహారోద్యానవనాల్ని ఏర్పరచాలి. చిన్నబార్, ఓ నైట్ క్లబ్ ఉండాలి. అడపా తడపా తాము నిర్దోషులమని బల్లగుద్ది చెప్పడానికి పెద్ద పెద్ద బల్లలతో వారం వారం పత్రికా సమావేశాలకి అవకాశం ఉండాలి. ప్రియదర్శినీ మట్టూ హంతకులు సంతోష్ సింగ్, జెస్సికా లాల్ హంతకుడు మనూశర్మల వంటివారికి తరచుగా జలుబు, దగ్గు, పంటి నొప్పి, వెన్నుపోటు – వంటివి ఆలిండియా మెడికల్ సైన్సెస్ ఆసుపత్రిలో చేరుతూంటారు కనుక – అలాంటి వారి సౌకర్యార్ధం అయిదు నక్షత్రాల స్థాయిలో ఓ ఆసుపత్రి ఏర్పాటు ఉండాలి. ఇక కల్మాడీ, మధూకోడా వంటి పార్లమెంటు సభ్యులు – జైల్లో ఉన్నా దేశ శ్రేయస్సు గురించే కలలు కంటూ పార్లమెంటు సభలలో పాల్గొనాలని తహతహలాడుతూంటారు కనుక – ఒక మినీ పార్లమెంటు గదిని జైలులోనే ఒక పక్క ఏర్పరిచి – అక్కడినుంచే పార్లమెంటు వ్యవహారాలలో పాల్గొనే అవకాశం కల్పించాలి. అక్కడినుంచే పాల్గొంటూ మన శ్రేయస్సుకి చట్టాలు చేస్తారని మనం ఆశించవచ్చు.

నిరపరాధికి ఏ లేశమయినా అన్యాయం జరగకూడదన్న నూట పాతిక సంవత్సరాల కిందటి ధర్మసూక్ష్మాన్ని అవినీతి పరులు అవకాశంగా చేసుకునే ఈ 'సిగ్గు 'లేని సమాజంలో – సుప్రీం కోర్టులూ, జైళ్ళూ – వీధిభాగవతుల మేళాలు కావడంలో ఆశ్చర్యం లేదు.

*(ఆగస్టు 15, 2011)*




# (August 22, 2011) Anna Venuka Manishi అన్నా వెనుక మనిషి

మా ఇంట్లో ఇద్దరు అవినీతిపరులున్నారు – నేనూ, మా అబ్బాయి. మేమిద్దరం ఈ దేశంలో సగటు అవినీతికి నమూనాలం కాము. అయినా మాకూ ఈ గుంపులో స్థానం ఉంది.

చాలా ఏళ్ళ కిందట మా పెద్దబ్బాయి మంచి డ్రస్సు వేసుకుని టై కట్టుకుని సిద్ధం అవుతున్నాడు. ఎక్కడి కన్నాను. కోర్టుకి అన్నాడు. అర్థంకాలేదు. అయిదారు రోజుల కిందట రోడ్డు మీద పోలీసు అతన్ని ఆపాడట. ఏదో నేరం చేశాడో, చేశాడని పోలీసు భావించాడో. (నీతికీ అవినీతికీ అభిప్రాయబేధాలు తప్పవు కదా?) న్యాయంగా పోలీసు చేతిలో ఆమ్యామ్యా పడితే తేలిపోయే వ్యవహారమది. కానీ కోర్టుకే వచ్చి తాను రైటని నిరూపిస్తానన్నాడు మా వాడు. పోలీసు తలవూపాడు. సమన్లు వచ్చాయి. ఇప్పుడు కోర్టుకి వెళుతున్నాడు. యువకుడు, ఉడుకు రక్తం కలవాడు. రోడ్డు మీద అవినీతిని ఎదుర్కోవాలనే చిత్తశుద్ధి కలవాడు. మంచిదే అన్నాను.

ఆ సాయంకాలం అతి నీరసంగా ఇంటికి వచ్చాడు. రకరకాల అలగా జనంతో కోర్టు వరండాలో ఆరుగంటలు కూర్చున్నాడట. ఆ జనానికి కోర్టులు పరిపాటి. కేసులు ఉపాధి. అవినీతి వృత్తి. ఈ యువకుడికి ఛాలెంజ్. మధ్యాహ్నం ఏ రెండు గంటలకో మెజిస్ట్రేట్ పిలుపు వచ్చింది. బోనులో నిలబడిన ఇరవైయ్యేళ్ళ పవిత్రమైన కుర్రాడిని మెజిస్ట్రేట్ కన్నెత్తయినా చూడలేదు. మాట వినలేదు. పోలీసు ఏదో చెప్పగా "నూరు రూపాయలు" అన్నాడు. "మిలార్డ్! నేను నిజానికి..." ఏదో చెప్పబోయాడు. మెజిస్ట్రేట్ విసుగ్గా "నూటయాభై" అన్నారు. మళ్ళీ నోరెత్తబోతే బోరవుతున్న గుమాస్తా చెయ్యిపట్టుకుని అతన్ని బోనులోంచి బయటికి లాగాడు. అదీ కథ.

ఇరవైయ్యేళ్ళ యువకుడి నిజాయితీకి పరిష్కారం – ఆరుగంటల నిరీక్షణ, ఒకరోజు కోర్టు వరండాలో పడిగాపులు, తన నీతిని చెవినయినా బెట్టని న్యాయమూర్తి, గుమాస్తాల అలసత్వం – వెరసి 150 రూపాయల జరిమానా. యువకుడికి ఇది మంచి పాఠం. తర్వాత ఏమయింది? ఈ సమాజానికి ఓ కొత్త అవినీతిపరుడు జమ అయాడు. ఈసారి రోడ్డు మీద పోలీసు ఆపినప్పుడు 20 రూపాయలు నిశ్చింతగా అతనికి సమర్పించుకున్నాడు. పోలీసు సెల్యూట్ చేశాడు. అవినీతికి వెసులుభాటు తోడయింది. అలవాటయింది. పోలీసుకి అవసరమయింది. అరుదుగా ఎదురయ్యే ఓ కుర్రాడి నీతిని రోజూ తనముందు తారసిల్లే వందలాదిమంది మధ్యనుంచి ఏరే వ్యవధి మేజిస్ట్రేట్ కి లేదు. కాగా ఆ నీతిని ఆయన గుర్తుపట్టడం మరిచిపోయి చాలా సంవత్సరాలయింది. ఆయనకి తెలియని విషయం – పోలీసుకీ, యువకుడికీ అర్థమయిన విషయం ఏమిటంటే ఈ దేశంలో నీతిని పాటించాలనే పట్టుదలతో ఉన్న ఓ యువకుడు కొత్త 'అవినీతి పరుల జాబితాలో నమోదు అయిపోయాడు. ఈ వెసులుబాటు పోలీసుకి ముందే తెలుసు. ఈ యువకుడికి ఇప్పుడు తెలిసింది. అవినీతితో రాజీకి ఇప్పుడు ఇద్దరూ బంధువులయారు. రెండో అవినీతిపరుడిని నేను. నేను కొంచెం ముదిరిన – తెలివైన, కాని నిస్సహాయమైన అవినీతిపరుడిని. వ్యవస్థ చేతకానితనం, నాయకుల నిస్సత్తువ, ఉద్యోగుల అవకాశవాదం, అవసరాన్ని గడుపుకోవలసిన గత్యంతరం, వ్యవస్థతో పోరుకి దిగలేని, దిగే వ్యవధిలేని నిర్వీర్యత – ఇన్ని నా అవినీతికి పెట్టుబడులు.

ఒకానొక ఊరిలో నా గెస్ట్ హౌస్ లో – ఇంకా ఉపయోగించని ఆ బిల్డింగుకి విద్యుచ్ఛక్తి ఇవ్వలేదు. మర్నాడు ఉదయమే ఫోన్. ఒక ఇంజనీరుగారు అటునుంచీ మాట్లాడారు. నా బిల్డింగుకి అక్రమంగా విద్యుచ్ఛక్తిని తీసుకోవడం వల్ల – ఆయన నా ఫోటో పేపర్లో వేసి, నా మీద క్రిమినల్ కేసుపెట్టి, నన్ను 24 గంటల్లో అరెస్టు చేస్తారట. పేరున్న రచయిత ఫోటో కింద "ఫలానా మారుతీరావు అరెస్టు" అన్న అక్షరాలు నా కళ్ళముందు



కదిలాయి. ఇంకా విద్యుచ్ఛక్తి వాడలేదు కదా? నోనో, కనెక్షన్ తీసుకోవడమే నేరం. దీని పర్యవసానం – నేను జైల్లో, తర్వాత బెయిల్, సివిల్ కేసు, నెలల తరబడి కోర్టుల చుట్టూ ఆ ఊరికి తిరగడం, నా పరపతి రోడ్డు మీద పడడం. నేను ఆఫీసరుగారికి అత్యంత ఒడుపయిన చేప. బంగారు బాతుగుడ్డు. ఈ వ్యవస్థలో వ్యక్తి ఎంత బలహీనుడో, నాలాంటివాడిని సుళువుగా బజారుకీడ్వడం ఎంత తేలికో అతనికి తెలుసు. కాగా, అది అతని దైనందిన చర్య. కేసు ముఖ్యం కాదు. కేసు రూపేణా నేను భయపడడం ముఖ్యం. నా నిస్సహాయత ముఖ్యం. ఫలితం – అక్షరాలా పాతిక వేలు ఆ ఇంజనీరుగారికి సమర్పించాను. గర్భగుడిలో దేవుడిలాగా చిరునవ్వుతో అందుకుని, నా సినీమాలు ఎంత బాగా చూస్తాడో వివరించి, పెళ్ళానికి నన్ను పరిచయం చేసి, గుమ్మం దాకా వచ్చి నన్ను సాగనంపాడు.

రాం లీలా మైదానంలో నిరాహార దీక్ష చేస్తున్న అన్నా హజారే ప్రతిపాదించిన లోక్ పాల్ బిల్లు గురించి ఈ దేశంలో చాలామందికి తెలియదు. తెలిసినా వాళ్ళకి లెక్కలేదు. తెల్లారితే రాజాలు, కల్మాడీలు, ముఖ్య మంత్రి కూతుళ్ళు జైళ్ళకి వెళ్ళడం – వాళ్ళకి కేవలం అవినీతిపరుల పళ్ళూడడంలాంటి మెలోడ్రామా మాత్రమే.

కానీ తెల్లారిలేస్తే – బియ్యం క్యూల దగ్గర్నుంచి, రైల్వే దగ్గర్నించి, ఆఫీసు గుమాస్తాల చేతుల్లో, డవాలా బంట్రోతుల అహంకారానికి, చిన్న ఉద్యోగుల నిరంకుశత్వానికి – తప్పనిసరయి, మరో గతిలేక, దమ్ముచాలక ఎదిరించే వ్యవధీ, స్థోమతూ చాలక నలిగిపోయే మధ్య తరగతి, కింది తరగతి పౌరులు లక్షలాది మంది అన్నా వెనుక నిలబడ్డారు.

వెనకటికి 'కన్యాశుల్కం'లో గిరీశం బండివాడితో రాజకీయాల గురించి గంట లెక్చరు ఇస్తే 'మా ఊరు పోలీసుకి ఎప్పుడు బదిలీ అవుతుంద'ని అడిగాడట. సామాన్య మానవుడి జీవితం – తన స్థాయి అవినీతిలో మురుగుతోంది.

ఆ మురికి కూపంలోంచి విడుదలని కల్పించే పెద్ద ఆశ, కనిపించదా అనే చిన్న కోరికా, దైనందిన జీవితాన్ని కకావికలు చేసే నేలబారు అవినీతికి చెంపపెట్టు ఏనాటికయినా సాధ్యం కాదా అన్న ఆక్రోశం – అన్నా వెనక నడిచే లక్షలాది నినాదాలకు పెట్టుబడి. లోకపాలులూ, పార్లమెంటులూ, ప్రజాస్వామిక సూత్రాలూ, రాజకీయ సిద్ధాంతాలూ – ఇవన్నీ ఆ మనిషికి అర్థంకాని, అక్కర్లేని కకావికలు.

అన్నా ఉద్యమంలో నినాదం చేసే మనిషి – కన్యాశుల్కంలో బండివాడు.

*(ఆగస్టు 22,* 2011)




# (August 29,2011) Maro Leader Katha మరో 'లీడర్'కథ

ఆ మధ్య 'లీడర్ ' సినీమాలో ఓ తమాషా అయిన పాత్ర వేశాను. పాత్ర చిన్నది. రెండు సీన్ల వ్యవహారం. ఏదో తేలికగా సాగిపోయే పాత్ర అని సరిపెట్టుకున్నాను. కానీ ఆ పాత్రకి వచ్చిన స్పందన చూసి ఆశ్చర్యపోయాను. అంతకు మించి నివ్వెరపోయాను. ఎంతోమంది ఆ పాత్రని మెచ్చుకున్నారు.

కారణం? నేను బాగా నటించడం కాదు. ఆ పాత్రలో కొట్టొచ్చినట్టు కనిపించే నిజం. కుండ బద్దలు కొట్టే లౌక్యం. వెరసి – ఒక సీనియర్ నాయకుని రాజకీయ చాతుర్యానికి మచ్చుతునక. అయితే ఒకప్పుడు గాంధీగారి ఉద్యమానికి మురిసిపోయిన నాయకుడు ఇతను. రాజకీయాలు మరిగి, పండిన ముసలి నక్క. కకలు తీరినవాడు. అవినీతిని నిర్మూలించాలని కంకణం కట్టుకున్న కుర్ర ముఖ్యమంత్రిని నిలదీసి పాఠం చెప్పగల అనుభవం ఉన్నవాడు. శాసన సభలో 'మమ్మల్ని జైలుకి పంపే చట్టాన్ని మమ్మల్నే చెయ్యమంటావయ్యా? ఎవరయ్యా నీకు చదువు చెప్పిన మేష్టరు?' అని వెక్కిరిస్తాడు. నీ చట్టంలో శాసన సభ్యుల్ని మినహాయించు – చట్టం పాసయిపోతుందని సలహా ఇస్తాడు. అలాగే చేస్తాడు ముఖ్యమంత్రి. చట్టం నెగ్గుతుంది. ఈ పాత్రలో కుటిల నీతి, దాపరికం లేకుండా చెప్పే నిర్భయత్వం చాలా మందికి నచ్చిందనుకుంటాను.

అలాంటి లీడర్ వ్యవహారమే ప్రస్తుతం ఢిల్లీలో, పార్లమెంటులో జరుగుతోంది. అయితే ప్రస్తుతం ఢిల్లీలో నిరాహార దీక్షని చేస్తున్న అన్నా హజారే 'లీడర్' సినీమాలోలాగా కుర్ర ముఖ్యమంత్రి కాదు. అయితే రాజకీయ నాయకుడూ కాదు. అద్భుతమైన మానవతావాది. అపూర్వమైన ఆత్మశక్తిగల కర్మయోగి. ఎట్టి పరిస్థితులలోనూ రాజకీయాలు వంటబట్టించుకున్నవాడు కాదు. ఆ లక్షణాలు, ఎత్తుగడలకూ బొత్తిగా దూరం. ఆయన వెనుక నిలిచిన – కొద్దిమంది పెద్దలు – నిజాయితీగా సమస్యకి పరిష్కారాన్ని ఆలోచించగల ఉద్దండులు. వారూ రాజకీయ నాయకులు కారు. దేశమంతటా ఈ ఉద్యమాన్ని ఉవ్వెత్తున సమర్ధిస్తున్న లక్షలాది ప్రజానీకం – అవినీతికి నష్ట పోయినవారు. కొందరు – లేదా చాలామంది అవినీతికి తలలు వంచినవారు. అంటే తప్పనిసరిగా 'అవినీతి' లో వాటాపంచుకున్నవారు. వెరసి – ఈ ఉద్యమం బలం – నాయకత్వపు నైతిక బలం. ప్రజల ఆక్రోశం, విసుగు, నిర్వీర్యత. వీరెవరూ రాజకీయ నాయకులు కారు.ఏతావాతా, ఈ బిల్లు చట్టం కావాలంటే ఎక్కడికి పోవాలి? ఎవరు సమర్ధించాలి? ఎవరు చట్టం చేయాలి? రాజకీయ నాయకులు. అక్కడ ఈ పెద్దలకి కాని, ఈ బాధితులకి కానీ స్థానం ఉన్నదా? లేదు. ఇప్పుడూ 'లీడర్' సినిమా. నా పాత్ర మెలిక.

2008 లో వాషింగ్టన్ పోస్ట్ పత్రిక లెక్కల ప్రకారం 540 సభ్యులున్న పార్లమెంటులో దాదాపు నాలుగోవంతు – అంటే దాదాపు 120 మంది నేరస్థులున్నారు. వీరిలో దొమ్మీలు, దొంగతనంగా మనుషుల్ని రవాణా చేసినవారు, డబ్బుని దోచుకున్నవారూ, మానభంగాలూ, హత్యలూ చేసినవారూ ఉన్నారు. వారంతా కేవలం పాలక వర్గం సభ్యులు కారు. తిలాపాపం తలా పిడికెడు అన్నట్టు అన్ని పార్టీలలోనూ ఉన్నారు. ప్రస్తుతం లోక్ సభ సభ్యులు – నలుగురు – ఒక కేంద్ర మంత్రి, మరో ముగ్గురు సభ్యులు తీహార్ జైల్లో ఉన్నారు. ఇది ఈ దేశంలోనే చరిత్ర. ఒక రికార్డ్.

ఈ లోకపాల్ బిల్లు ఇంతవరకూ పార్లమెంటులో 1968 నుంచి కనీసం పదిసార్లు ప్రవేశపెట్టారు. ఎవరూ దీన్ని పట్టించుకోలేదు సరికదా సీరియస్ గానయినా తీసుకోలేదు. పదకొండోసారీ ఆ గతే పట్టేది కానీ – ఓ ఉద్యమకారుడు నడుం బిగించాడు. ఓ మారుమూల గ్రామంలో ఓ గుడి వసారాలో ఒకే ఒక్క పరుపు చుట్ట, అన్నం కంచం ఆస్తిగా గల ఓ కటిక పేద – కానీ మానసికంగా అవినీతి పునాదుల్ని కదిలించే దమ్మున్న వీరుడు అండగా నిలిచాడు. విసుగెత్తిన, కస్సుమనే ప్రజానీకం సముద్రమై లేచింది.

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

ఇప్పుడు బిల్లు పార్లమెంటులో చర్చకు నిలిచింది. ఈ పార్లమెంటు నిజాయితీగా, నిక్కచ్చిగా ఈ బిల్లుని చట్టాన్ని చేస్తే ముందుగా 120 మంది పార్లమెంటు సభ్యులు జైలుకి వెళ్ళడమో, వీధిన పడడమో జరుగుతుంది. చాలామంది గొప్పవాళ్ళ గోత్రాలు బయటకొస్తాయి. ఇది జరిగే పనేనా? అలనాడు కాళిదాసు తాను కూర్చున్న కొమ్మని తానే నరుక్కున్నంత వెర్రిబాగులవాళ్ళా మన నాయకులు? వీరిలో ఘనత వహించిన రాజా భయ్యాలు, లల్లూ ప్రసాద్ లూ, మాయావతులూ, మధుకోడాలు, కరుణానిధులూ, అళగిరులూ, సుప్రీం కోర్టు లెక్కల ప్రకారం జగన్ లూ ఉన్నారు. ఇప్పుడు 'లీడర్ ' సీను పార్లమెంటులో జరగబోతోంది.

ఈ దేశంలో అన్నా హజారే ఉద్యమానికి తలవంచి పార్లమెంటరీ వ్యవస్థని, రాజ్యాంగాన్ని మంటగలపడం సరికాదని సోమనాధ చటర్జీ, హరీశ్ సాల్వే, అరుంధతి రాయ్ వంటి మేధావులు వాపోతున్నారు. ఏ పార్లమెంటరీ వ్యవస్థని? ప్రజాస్వామ్యం పేరిట 120 మంది నేరస్థుల్ని చట్టసభలో నిలిపిన వ్యవస్థనా? వీరా నేరస్థుల్ని ఎండగట్టే చట్టాన్ని చేసేది? లీడర్ లో నా పాత్ర భాషలో 'ఎవరయ్యా మీకు పాఠం నేర్పింది?' అనాల్సిన స్థితి. చట్టం చేతకానితనానికి 64 ఏళ్ళుగా నలిగిపోతున్న ప్రజానీకం ఆవేశం ఒక పక్క, డబ్బునీ, కండబలాన్నీ, కులాన్నీ, మైనారిటీ సాకునీ అడ్డం పెట్టుకుని చట్టసభకు చేరిన నాయకమ్మన్యులు ఒక పక్క. ఏ వ్యవస్థని రక్షించాలి? మొన్న టీవీలో ఏంకరు – ప్రముఖ న్యాయవేత్త, మాజీ ఎడ్వకేట్ జనరల్ పాలీ నారీమన్ ని ఒక ప్రశ్న అడిగాడు. అయ్యా, ఈ ఉద్యమం పార్లమెంటరీ వ్యవస్థ ఔన్నత్యాన్ని దెబ్బతీస్తోందంటున్నారు. తమరేమంటారు? అని. ఆయన ఒక్కటే అన్నారు" నాన్సెన్స్, ఈ దేశంలో ఒకే ఒక్క పుస్తకానిదే పై చెయ్యి. దాని పేరు రాజ్యాంగం. దానిలో మొదటి రెండు మాటలు: మేం, ప్రజలం.."

ప్రజలకన్న, ప్రజల తిరుగుబాటుకన్నా వ్యవస్థలో దేనికీ బలం లేదు. ఏదీ గొప్పది కాదు. ఇందుకు అడ్డం నిలిచిన వ్యవస్థలు కూలిపోతాయి. ఆనాడు అక్టోబరు విప్లవంలో అదే జరిగింది. అటు మొన్నటి ఇరాన్ లో రాజపాలనని ప్రజలు అలాగే తిప్పికొట్టారు. నిన్న టర్కీ ఆ నిజాన్ని నిరూపించింది. నేడు లిబ్యా ఆ పనే చేస్తోంది. వేళ్ళతో కూలిపోతున్న వ్యవస్థని కాపాడడం కోసం ఎవరూ పాటుపడనక్కరలేదు. సమాజంలో ఇలాంటి ఉద్యమాలే కొత్త వ్యవస్థల్ని రూపుదిద్దుతాయి. ఈ ఉధ్రుతంలో బలహీనమయిన వ్యవస్థలు నేలమట్టమవుతాయి. ఆవేశం, నిజాయితీ, జీవుని వేదన పెట్టుబడులుగా నిప్పులు చెరిగే ఉద్యమాలు బూజుపట్టిన వ్యవస్థలకి లోబడిసాగవు. సాగితే అవి ఉద్యమాలు కావు. ఉద్యోగాలు.

అయితే –

అద్భుతంగా పెల్లుబికిన గొప్పవెల్లువ ప్రస్థుతం – నేరస్తుల మధ్య, భుజాలు తడువుకునే రాజకీయ నాయకుల చేతుల్లోకి పోయింది. చరిత్రలో పదకొండోసారి ఇది అటకెక్కుతుందా, బతికి చట్టమౌతుందా అన్నది సందిగ్ధం. ఈ భయానికి ఒక్కటే కారణం – మహిళల రిజర్వేషన్ బిల్లు. ఇరవై లక్షల కోట్లను ఇండియా ఎల్లలు దాటించి, ఖత్రోచి వంటి వారి అవినీతికి గొడుగుపట్టి, నోరెత్తి, నేరస్తుల్ని బయటపెట్టే 13 మందిని, కొందరి కుటుంబాలతో సహా దారుణంగా హత్య చేసిన భారత చరిత్రలో ఓ మహానుభావుడి ఆర్తికి, మహా ప్రజా సందోహం ఆవేశానికి ఘనమైన స్వాగతం లభిస్తుందా?

ఇక్కడే మరో 'లీడర్' మెలిక.

*(ఆగస్టు 29,* 2011)



అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

# (September 5, 2011) Chaavu Telivi, 'చావు'తెలివి

ఈ విషయాన్ని గురించి చాలాసార్లు రాసిన గుర్తు అయినా మరోసారి మననం చేసుకునే అతి ముఖ్యమయిన ఘట్టం ఇది.

20 ఏళ్ళ క్రితం ఈ దేశానికి ప్రధాని కావలసిన ఒక మాజీ ప్రధానిని – రాజీవ్ గాంధీని – ఎల్ టీ టీయీ బృందం దారుణంగా హత్య చేసింది. అది నిజానికి హత్యకాదు. మారణకాండ. అందులో రాజీవ్ గాంధీతోపాటు మరో 17 మంది చచ్చిపోయారు. వారి పేర్లకోసం, వారి కుటుంబ వివరాలకోసం కంప్యూటర్ ముందు కూర్చుని కొన్ని గంటలు వెదికాను. ఎక్కడా ఆ వివరాలు లేవు. ఎవరో అనామకుల చావు వివరాలు ఎవరికి కావాలి? రాజీవ్ గాంధీ చావుకి గ్లామర్ ఉంది. తెలుసుకోవాలనే ఉత్సాహం ప్రజలకీ, తెలపాలనే ఉత్సాహం ఇంటర్నెట్ ఇంజన్లకీ ఉంది. చచ్చిన పదహారో కానిస్టేబుల్ కుటుంబం వాళ్ళకి బోరింగ్ వివరం. తాజ్ మహల్ నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీలు ఎవరో పిచ్చి కవి శ్రీ శ్రీ వంటివారి బాధ. రాజీవ్ గాంధీ? అది తురుపు ముక్క. నేరానికి బంగారు అంచు. అది చంపిన వాళ్ళకీ తెలుసు. చావుని ప్రచారంలో నిలిపిన మాధ్యమాలకి తెలుసు. నేరస్థులని క్షమించే ఔదార్యంతో దాన్ని సొమ్ము చేసుకున్న ప్రియాంక వంటి (మా తూర్పు భాషలో) 'గుంట'లకి తెలుసు.

రాజీవ్ గాంధీతో చచ్చిపోయిన 17 మందికి సిద్ధాంతాలతో కానీ, రాజకీయాలతో గానీ ఏమీ సంబంధం లేదు. వాళ్ళలో కొందరు కేవలం ఉద్యోగాలు చేసుకుంటున్న పోలీసులు. వాళ్ళకి పెళ్ళాం, పిల్లలూ ఉన్నారు. వాళ్ళ తండ్రి, భర్త ప్రతి రోజులాగే ఆ రోజూ నౌఖరీ చేసి ఇంటికి వస్తాడని ఎదురుచూశారు. కానీ రాలేదు. ఓ కొండ చరియ కూలినట్టు, రాజీవ్ గాంధీ అనే పెద్ద పేరు నీడలో దిక్కులేని చావు చచ్చారు. రాజీవ్ గాంధీ హత్యకి ప్రపంచం దిగ్భ్రాంతి చెందింది. ప్రపంచం సానుభూతి పలికింది. దేశం కన్నీటితో వారి అంత్యక్రియల్ని చూసింది. ఈ 17 మంది కుటుంబాలవారూ ఏకాంతంగా కన్నీరు కార్చారు. వారికి ప్రభుత్వం సానుభూతితో ఉపకారం చేస్తానంది. కాని ఉపకారం వారికి అందలేదు. వాళ్ళ కుటుంబాలు – పిల్లలు – తండ్రులు పోయిన కారణంగా ఛిన్నాభిన్నమయారు. ఆ సంగతి దేశంలో చాలామందికి తెలీదు.

రాజీవ్ గాంధీ చచ్చిపోవడం వల్ల పార్టీకి మేలు జరిగింది. ఊహించరాని మెజారిటీతో పదవిలోకి వచ్చింది. భర్త చావు కారణంగా భార్య దేశంలో అత్యున్నత పదవిలో కూర్చుంది. ప్రియాంక, రాహుల్ గొంతులు అందరూ వింటున్నారు. ఈ 17 మంది కుటుంబాల పిల్లల్నీ ఎవరికీ తెలీదు. ఏ కార్తికేయనో –ఫైళ్ళు చూస్తేనే కానీ వారి పేర్లు కూడా ఎవరికీ తెలీదు.

ఈ హింసని పకడ్బందీగా రూపొందించినవారికి జరగబోయే మారణ హోమం తెలుసు. నిజానికి 18మంది పోయారు కానీ – ఎంతమందయినా చచ్చిపోయే అవకాశం ఉన్నదని తెలుసు. వాళ్ళందరూ చెయ్యని నేరానికి, నిర్దాక్షిణ్యంగా చంపబడుతున్నారని తెలుసు. వాళ్ళు అతి క్రూరంగా 18 మంది చావుకి కారణమయారు.

హత్య కుట్ర జరుగుతున్న సందర్భంలో ఇద్దరు చెయ్యి కలిపారు. మురుగేశన్, నళిని. భయంకరమైన కుట్ర వారి సఖ్యతకి ప్రాతిపదిక. అది క్రమంగా ముదిరింది. హత్య తర్వాత – కేవలం – ఆ భయంకరమైన వత్తిడి నుంచి 'ఆటవిడుపు'కి ఇద్దరూ సెక్స్ అనుభవించారు. నళిని గర్భవతి అయింది. ఇద్దరూ అరెస్ట్ అయేనాటికి – రాజీవ్ గాంధీ హత్య తర్వాతే ఆమె గర్భం దాల్చిన రుజువులున్నాయి. ఇది ఇద్దరూ భయంకరమైన వత్తిడి నుంచి విడుదలకి నిదర్శనం.

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ
కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

మీరూ నేనూ కాదు – ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక పరిశోధక విభాగం – వారి నేరాల్ని రుజువు చేసింది. కోర్టులు అతి నిశితంగా, నిర్దుష్టంగా ఆయా నేరాలను పరిశీలించాయి. నిందితులలో దాదాపు 20 మందిని నిరపరాధులుగా తగిన సాక్ష్యాధారాలు లేనందువల్ల విడిచిపెట్టాయి. కొందరికి శిక్షలు పడ్డాయి. హైకోర్టు పునఃపరిశీలించి శిక్షలను ఖరారు చేసింది. నేరస్థులు సుప్రీం కోర్టుకు వెళ్ళారు. సుప్రీం కోర్టు మళ్ళీ వివరాలని తిరగదోడి ఉరిశిక్షలను ఖరారు చేసింది. దరిమిలాను క్షమాభిక్షకు నేరస్థులు రాష్ట్రపతిని ఆశ్రయించారు. రాష్ట్రపతి ముందు దాదాపు అయిదేళ్ళ పైగా నడిచిన కేసుల వివరాలున్నాయి. మూడు న్యాయస్థానాల వేరు వేరు తీర్పులు – ఒకే శిక్ష వివరాలున్నాయి. అయినా ముగ్గురు రాష్ట్రపతులు 11 సంవత్సరాలపాటు ఈ క్షమాభిక్ష మీద నిర్ణయం తీసుకోలేదు. ఇప్పుడు రాష్ట్రపతి తిరస్కరించారు. నళిని అప్పటికి గర్భవతి కనుక సోనియాగాంధీ ఆమె పట్ల సానుభూతిని చూపమన్నారు. న్యాయస్థానం చూపింది. ఇప్పుడు ఉరిశిక్ష ఆపాలని తమిళనాడులో ప్రదర్శనలు జరిగాయి. ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు.

ప్రియాంక అనే ఒకావిడ జైల్లో నళినిని కలిసి – తనకి ఆవిడంటే ఏ ద్వేషమూ లేదని నవ్వుతూ ప్రకటించింది. 18 కుటుంబాల సామూహిక విషాదానికి ఆమె ప్రతినిధికాదు. తండ్రి చావు కారణంగా తల్లికి దక్కిన దేశీయమైన పదవి, అధికారాన్ని రుచిచూసే కూతురి ఔదార్యమది. భేష్. అలాంటి ఔదార్యం ఆ 17 మందిలో ఏ అనామకుడి బిడ్డపట్ల ఆమె చూపినా ఆ 'క్షమ' విలువ మరింత పెరిగేది. మిగతా కుటుంబాలకు మేలు జరిగిందా అని ఆమె పూనుకుని వారికి ఉపకారం చేస్తే ఆమె ఔదార్యం ఉదాత్తంగా ఉండేది. నళిని కూతురు ప్రణీత – ప్రస్తుతం ఇంగ్లండులో చదువుకుంటోంది. ఆమె అమ్మా నాన్నా మారణ హోమంలో పాలు పంచుకుని తనకు ప్రాణ ప్రతిష్ట చేసేనాటికి ఆ నేరం భోగట్టా తెలీదు. ఇప్పుడా పిల్ల తన తల్లిదండ్రులు నిరపరాధులని చెప్పింది. ఆ మాట తమ తండ్రిపోయిన కారణంగా కనీసం తమిళనాడులో చదువుకొనసాగించే మరే హతుడి కూతురయినా చెప్పగలిగితే సజావుగా ఉండేది.

నిస్సహాయుడి కన్నీరు వ్యవస్థకి అందని వ్యర్థమైన వ్యథ. 'క్షమ'కీ ఒక గ్లామరుంది. హింసకీ ఒక గ్లామరుంది. హింస పర్యవసానంగా దేశస్థాయిలో నిలవగలిగే ఓ తల్లి కూతురు చిరునవ్వుకీ బోలెడంత గ్లామరుంది. తన బిడ్డని కాలేజీలో చేర్చడానికి డబ్బు సమకూర్చుకోవాలని ఆ రోజు అదనపు డ్యూటీ చేస్తూ కన్నుమూసిన అలగప్పన్ (పేరు ఇది కాకపోవచ్చు) దిక్కుమాలిన చావుకి గ్లామర్ లేదు. 20 సంవత్సరాల తర్వాత – ముగ్గురికి అమలు కావలసిన శిక్షకి ఒక రాష్ట్రం, ఒక ప్రాంతం, ఒక పార్టీ, ఒక సిద్దాంతం సమర్ధన ఉంది. మిగతా 17 కుటుంబాలకీ వీరెవ్వరి సమర్ధనా లేదు. ఆత్మవంచనకి ఇది దగ్గర తోవ.

ఈ కథకి ముగింపు ఏమిటంటే దారుణమయిన మారణ కాండలో భాగమయిన నేరస్థులకు సానుభూతిని చూపే ఈ కర్మభూమి 'ఖర్మ'ని గమనిస్తున్న – కేవలం 128 మంది చావుకి మాత్రమే కారణమయిన ఓ పొరుగు దేశం నేరస్థుడు – అజ్మల్ కసాబ్ – తనకి విధించిన ఉరిశిక్ష గురించీ ఆలోచించాలని న్యాయస్థానానికి దరఖాస్తు పెట్టుకున్నాడు. చచ్చిపోయిన 128 కుటుంబాలలో ఒక్క ప్రియాంక అయినా ఉండదా అని ఆ నిరపరాధి ఆశ.

చావడం మీదే ఖాతరులేని పొరుగు దేశపు దౌర్జన్యకారుడికి – 20 సంవత్సరాల కిందట తమ ప్రధానిని చంపిన వారి చావుని అమలు చెయ్యలేని అలసత్వం (మానవత్వం కాదు) మరింత అలుసు కావడంలో ఆశ్చర్యంలేదు. ముందుంది ముసళ్ళ పండగ.

(సెప్టెంబర్ *05*, 2011)

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ
కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

# (September 12, 2011) Mayapradesh , 'మాయా' ప్రదేశ్

ప్రపంచంలోకల్లా ఆసక్తికరమైన విషయాలు మూడు ఉన్నాయి. పక్కవాడి రహస్యాన్ని కనిపెట్టడం, ఎదుటివాడి అవినీతిని బయటపెట్టడం, పొరుగువాడి రంకు గురించి కబుర్లు చెప్పుకోవడం. ఇంతకన్నా రుచికరమైన వ్యావృత్తి ప్రపంచంలో మరొకటి లేదు.

"నీకు తెలుసా – మన గోవిందుగాడు – వాళ్ళ వంటమనిషితో మొన్న --" ఆ రుచి అద్భుతం.

"మీకు తెలీదు బాబూ – ఫలానా మంత్రిగారు పదికోట్లు స్వాహా చేశారు.." ఆ ఆనందం తొడమీద దురద గోక్కోవడం అంత సుఖం.

"మీరు విన్నారా? మనవాడు ఫలానా స్వామి దగ్గరకి వెళ్ళడానికి కారణం పుణ్యమూ కాదు, పాపమూ కాదు – తను సంపాదించిన బంగారాన్ని దాచిపెట్టడానికి" – ఆ రహస్యాన్ని పంచుకోవడం స్వర్గం.

జూలియన్ అసాంజే వికీలీక్స్ లో అంత సుఖం ఉంది. మనకి తెలియని ఎన్నో 'నీచపు' విషయాల్ని తెలియచెప్పే తాటాకు పత్రాలవి. ఇందులో బొత్తిగా తెలియన క్కర్లేని కథ – మాయావతి మేడంది. పాపం, ఆవిడకి కొత్త జోళ్ళు కావలసి వచ్చింది. వెంటనే జెట్ విమానం లక్నోనుంచి ముంబైకి బయలుదేరింది. ఫలానా జత జోళ్ళను తెచ్చింది. దాని ఖరీదు – ఏతావాతా పది లక్షలు.

ఇందులో ఎవరినయినా ఆ ఖరీదయిన చెప్పుచ్చుకు కొట్టాలంటే – ముందు ఓటర్ని. ఆమె దళితులకే అన్యాయం చేస్తోందని ఆ వికీలీక్స్ సమాచారం. ఇందుకు నేను సుతరామూ అంగీకరించను. ఆ మధ్య నేను అయోధ్య వెళుతూ ఒకరోజు లక్నోలో ఆగాను. స్వయంగా ఆమె దళితులు గర్వపడే పనులెన్నో చేయడం చూశాను.

మహాత్మా గాంధీ అనే ఓ గర్భ దరిద్రుడి స్మృతి చిహ్నం – రాజ్ఘాట్ – వీటి దిష్టికి కూడా పనికిరానంత వైభవంగా బాబా సాహెబ్ అంబేద్కర్, వారి సతీమణి రమాబాయ్ అంబేద్కర్, పాఠాలు చెప్పుకుంటూ ఏదో మూల ఉద్యోగం చేసుకుంటున్న ఓ దళిత యువతికి – కేవలం దళిత యువతి అయిన కారణంగానే పార్టీలో ప్రాముఖ్యాన్ని కల్పించి, రాష్ట్ర ఆధిపత్యానికి రాగల ఆస్కారాన్ని కల్పించిన మాయావతి మార్గదర్శకులు కాన్షీరాం పేరిట నిర్మించిన స్మృతి భవనాలు అనూహ్యం. ఒక్క 'కాన్షీరాం ఇకో గార్డెన్'కి మాత్రమే కేవలం 450 కోట్లు ఖర్చయించట. ఇంకా అభివృద్ధికి మరో 41 కోట్లు కావాలని ఆమె కేంద్రాన్ని అడుగుతున్నారు. మిగతా రెండు స్మృతి మందిరాలకీ కేవలం 500 కోట్లు మాత్రమే ఖర్చయ్యాయి. కాన్షీరాం మెమోరియల్ లో తమరు మాయావతి మేడం విగ్రహాన్ని దర్శించవచ్చు.

ఈ పార్కులకీ, స్మృతి భవనాలకీ కోట్లకి కోట్లు ఖర్చయిపోతోందని కంట్రోలర్, ఆడిటర్ జనరల్ గగ్గోలు పెట్టినా పట్టించుకునే నాధుడు లేదు. మరి చెప్పులకోసం ప్రత్యేక విమానం కథ వారిదాకా వెళ్ళిందో లేదో మనకి తెలియదు.

నాయకులు పదవుల్లో ఉన్నప్పుడు, వారి పార్టీ ప్రభుత్వాన్ని నడుపుతున్నప్పుడు తమ తమ పెద్దలకు ఇలా నివాళులర్పించడం ఈ దేశంలో సబబు, సంప్రదాయం. ఈ అరాచకానికి కొలబద్దలేదు. వెదకడం వృధా. 1967 లో కనీవినీ ఎరగని రీతిలో అధికారంలోకి వచ్చిన ద్రవిడ మున్నేట్ర




కజగం నాయకులు అన్నాదురై కొన్ని నెలలు మాత్రమే ముఖ్యమంత్రిగా ఉన్నారు. వారి అకాల మరణానికి 150 లక్షల మంది మాత్రమే తరలి వచ్చారు. ఆయన స్మృతి చిహ్నం చెన్నై బీచిలో ఉంది. అదే కోవలో మరొక నాయకులు, నటులు ఎం.జిఆర్ సమాధి పక్కనే ఉంది.

ఈ దేశంలో రాజకీయ పార్టీల పుణ్యమా అని బొంబాయి ముంబై అయింది. మద్రాసు చెన్నై అయింది. బరోడా వదోద్రా అయింది. వెస్ట్ బెంగాలు పశ్చిం బంగా కానుంది. ఒక్క చెన్నైలోనే మౌంట్ రోడ్ అన్నాశాలై అయింది. ఇంకా ఈవీ రామస్వామి నాయకర్ శాలై, పసుంపోన్ మత్తు రామలింగ తేవర్ శాలై వంటివెన్నో ఉన్నాయి. మరి 'నాయకర్ ', 'తేవర్ ' కులాల పేర్లు కదా? ఆ మధ్య ద్రవిడ నాయకులు కులాల పేర్లు ఉండరాదని రోడ్ల పేర్లమీద పడ్డారు. వారే గౌరవంగా పెట్టిన బి.ఎన్.రెడ్డి రోడ్డు బి.ఎన్.రోడ్డయి, బి.ఎన్.అంటే ఏమిటో ఎవరికీ అర్ధంకాక – ఇప్పుడు నరసిమ్హన్ రోడ్డు అయింది! ఇప్పటి ఈ నరసిమ్హనే మన బొమ్మిరెడ్డి నరసిమ్హారెడ్డి అనబడే బి.ఎన్ రెడ్డి అని ఎవరయినా అన్వయించుకుంటే వారికి ముందు 'పద్మభూషణ్' ఇవ్వాలి. కులపిచ్చి తలకెక్కిన మరో వింత పార్శ్యమిది! బాబూ, రాజకీయ విన్యాసాలు అనూహ్యం, అపూర్వం, అమోఘం!

తన జీవితకాలంలోనే రాజీవ్ గాంధీ కనీసం ఒకసారి ఎన్నికలలో ఓడిపోయారు.. అయినా ఆయన పేర హైదరాబాదులో అంతర్జాతీయ విమానాశ్రయం ఉంది. చెన్నైలో ఐటీ కారిడార్ పేరు రాజీవ్ గాంధీ శాలై.

అంతెందుకు? మన రాష్ట్రాన్ని పాలించి, ఆక్సిడెంటులో కన్నుమూసిన రాజశేఖర రెడ్డిగారి పేరు ఒక జిల్లాకు పెట్టారు. మంచిదే. ఇంకా రెండేళ్ళయినా తిరగకుండా, అదే పార్టీ హయాంలో, అదే ప్రభుత్వం అదే నాయకుని పేరుని ఆ నాయకుని కొడుకు మీద పెట్టిన క్రిమినల్ కేసులో పేర్కొంది!

మన దేశంలో వ్యవస్థల్ని గబ్బు పట్టించడానికి మెజారిటీ మద్దతు చాలు. మన అరాచకానికి ప్రజల హిస్టీరియా చాలు. ఇటలీలో విమానాశ్రయాల పేర్లు – గెలిలియో, మైకెలాంజిలో, అమెరిగో విస్పూచీ, లియొనార్డో డివించీ, ఫెడిరికో ఫెలినీ – మానవాళిని ప్రభావితం చేసిన – తరతరాలు ఆరాధిస్తున్న మహనీయులు వీరంతా.

మనకి రాజీవ్ గాంధీ, ఎన్.టి.రామారావు, రాజశేఖర రెడ్డి, – వీరి గొప్పతనాన్ని మనం శంకించనక్కరలేదు. ఆయా కాలాల్లలో ఆయా పార్టీలకి పెద్దరికం వహించిన పెద్దలు వీరు. కాని మరిచిపోకూడదు. వీరి జీవితకాలంలోనే ప్రజలు వీరిని తిరస్కరించిన సందర్భాలున్నాయి. రాజకీయాలలో మెజారిటీకీ సర్వకాలికమైన మహనీయతకూ బోలెడంత తేడా ఉంది. దూరం ఉంది. మైకెలాంజిలోకీ బెర్లుస్కోనీకి ఉన్నంత తేడా. (మన దేశంలో నాయకుల పేర్లు చెప్పడానికి మొహమాటపడి ఈ విదేశీ ఉపమానంతో కక్కుర్తి పడుతున్నాను.)

చెప్పుల్ని విమానాల్లో తెప్పించుకునే నాయకులకు మనమే కారణం. మెజారిటీ ఉదాత్తతని ఇవ్వదు. అసమర్ధుడికి అహంకారాన్ని ఇస్తుంది. కుసంస్కారికి కుహనా ఆధిపత్యాన్ని అంటగడుతుంది. చెప్పుల్ని ఆకాశంలో ఊరేగిస్తుంది. మరోసారి ఎన్నికయితే ఉతర ప్రదేశ్ మాయా ప్రదేశ్ అవకపోతే నేను చెవి కోయించుకుంటాను.

(సెప్టెంబర్ *12,* 2011)

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

# (September 19, 2011) Adhikaram Ahankaram అధికారం అహంకారం

అధికారం అంటే ఎదుటి వ్యక్తి స్వేచ్ఛకి అంతరాయం కలిగించే శక్తి. అరాచకం అంటే ఆ అధికారం అదుపు తప్పడం. అనర్థం అంటే ఈ రెండూ విచ్చలవిడిగా సాగడం. అహంకారం సాగించుకునే నిష్పత్తి.

నాకు పోలీసు శాఖ అధికారులలో ఎందరో మిత్రులు ఉన్నారు. పోలీసు అకాడమీ నడిపేవారూ ఉన్నారు. వారితో ఎప్పుడూ చెప్తూంటాను – ప్రజా సంబంధాల గురించి మీ సిబ్బందితో మాట్లాడే అవకాశం కలిపించమని. అదెప్పుడూ జరగలేదు.

అధికారాన్ని అవకాశంగా భావించడం – వ్యక్తి సంస్కారానికి చిహ్నం. అది ఏ మహాత్మాగాంధీ అవగాహనలోనో, అన్నా హజారే స్థాయిలోనో సాధ్యమవుతుంది.

అధికారానికి జవాబుదారీతనం పోతున్నకొద్దీ – జవాబు చెప్పాల్సిన బాధ్యత నుంచి అధికారి తప్పించుకోవాలని చూస్తాడు. మొదటి వ్యక్తి బలం అవినీతి. రెండో వ్యక్తి బలహీనత – సామాజిక న్యాయం.

బొత్తిగా ఈ విచక్షణ లేని – లేదా చాలని స్థాయిలో – నేలబారు దశలో 'పోలీసు'కి ఈ అధికారం ఇవ్వడం – ఒక విధంగా తప్పనిసరి. మరొకవిధంగా దురదృష్టం.

ఏవో కొన్ని మినహాయింపులు తప్ప – ఎంతమంది ఈ అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారో, ఎంతమంది చెప్పుకునే అవకాశం, దిద్దుకునే ఆస్కారం లేక – ఈ అరాచకానికి బలవుతున్నారో మనకందరికీ తెలుసు. మనకి తెలుసునని వాళ్ళకీ తెలుసు.

గ్రామంలో ఓ పసులకాపరి తప్పు చేశాడు. కానిస్టేబులు లెంపకాయ కొట్టాడు. అది అరాచకం. ఆ హక్కు పోలిసుకి లేదని పసుల కాపరికి తెలీదు. ఇంకా దురదృష్టం ఏమిటంటే – తమకి లేదని కొందరు కానిస్టేబుళ్ళకే తెలీదు! అతని సీనియర్ చేశాడు. చెల్లిపోయింది. తనూ చేశాడు. చెల్లిపోతుంది. తనని కొట్టాడని పసులకాపరి సాక్ష్యాలతో కోర్టులో నిరూపించగలిగితే కానిస్టేబుల్ బర్తరఫ్ అవుతాడు. పసులకాపరిది అజ్ఞానం. పోలీసుది చెల్లిపోయే జులం. పట్నంలో నేలబారు మనిషిది నిస్సహాయత. కోర్టులో ఏ కానిస్టేబుల్ చెయ్యి దుడుసుదనాన్ని నిరూపించే వ్యవధి, తీరిక, విసులుబాటు ఎవరికి ఉంది. ఇలాంటి నిస్సహాయతల టోకు విసుగుదల, కోపం, నిర్వీర్యతే – అన్నా హజారే వంటి ఉద్యమకారుల వెనుక లక్షల మంది నిలబడడానికి కారణం. అంటే వ్యవస్థ –నిస్సహాయంగా అంగీకరించి, తప్పనిసరయి సరిపెట్టుకున్న 'అవినీతి' ఇది. లోబడి బతుకుతున్న దయనీయమయిన పరిస్థితి. కానిస్టేబులు ప్రజాబంధువు కావాలి. ప్రజాహితుడు కావాలి. ఆ దశలో రోడ్డుమీద మనిషికి ఉపకారి కావాలి. కానిస్టేబులు ప్రజలలో కలిగించాల్సింది భయాన్ని కాదు. నమ్మకాన్ని విశ్వాసాన్ని అయితే ఇవన్నీ నీతిపాఠాలు.

అమెరికాలో తప్పు చేసిన కారు డ్రైవరునీ 'సార్ ' అనే పలకరిస్తాడు పోలీసు. తప్పు చేస్తే నిర్దయగా కేసు రాస్తాడు. రాస్తాడని తెలుసు. కానిస్టేబుల్ అరాచకం మనకి వినిపించదక్కడ. క్రూరమయిన విధి నిర్వహణ తెలుస్తుంది. అమెరికాలో తప్పు చేసిన వాడి నిస్సహాయతా తెలుస్తుంది. తప్పు చేయకూడదనే భయమూ తెలుస్తుంది. ఆ భయానికి కారణం అతని క్రూరత్వం కాదు. చట్ట బద్ధత. తెల్లవారు ఝామున 3 గంటలకి నిర్మానుష్యమయిన అమెరికా రోడ్డు మీద ట్రాఫిక్ మీద రూల్స్ కి భంగం కలుగకుండా కారు నడిపిన మిత్రుల్ని నాకు తెలుసు.









"ఇప్పుడెవరు చూస్తారయ్యా?" – నికార్సయిన మన దేశపు నిరసన

"అమ్మో, పోలీసు పట్టుకుంటే లైసెన్స్ పోతుంది" సమాధానం.

మన దేశంలో అయితే మనం ఆఫీసరుగారి బంధువయినా, మంత్రిగారి మేనల్లుడయినా, పెళ్ళాం తమ్ముడయినా, 20 రూపాయలు ఇచ్చుకున్నా – లైసెన్స్ కీ, మనకీ మన దేశంలో ఏమీ ఢోకా లేదు. కొండొకచో పోలీసులు ఈ అవినీతి కారణంగా దారుణంగా అలుసయిన సందర్భాలను నేను కళ్ళారా చూశాను. అతి క్రూరంగా, అతి మర్యాదగా, అతి నిర్లక్ష్యంగా నగరాల్లో పోలీసుల్ని నిలదీసిన వాళ్ళని నాకు తెలుసు.

"ఎవరు నువ్వు? స్టీరింగు ముందు ఎవరున్నారో చూశావా? ఫలానా మనిషి మేనమామ. ఏం? కళ్ళు కనిపించడం లేదా?" అన్నవాళ్ళనీ, అన్నవాళ్ళకి సెల్యూట్ కొట్టి పక్కకి తప్పుకు నిలబడిన నిస్సహాయపు పోలీసుల్నీ చూశాను..

ఇది – ఈ దేశంలో వ్యవస్థకి పట్టిన చీడ.

నిన్న బీహార్ లో నలందా జిల్లాలోని నూర్ సరాయ్ పోలీసు స్టేషన్ దగ్గర పోలీసులు జరిపిన జులం అమానుషం. పాశవికం. ఆ ప్రాంతంలో ఓ 24 ఏళ్ళ స్త్రీ మాయమయింది. అందుకు ఒక పోలీసు ఆఫీసరు ప్రమేయం ఉన్నదని తెలిసింది. ప్రజలు మందగా వచ్చి నిలదీశారు. రాళ్ళు రువ్వారు. ఉద్రిక్తులయిన పోలీసులు లాఠీలతో ఆడా మగా బేధం లేకుండా తరిమి తరిమి చావగొట్టారు. ఆడవాళ్ళు నేలమీద పడి దొర్లినా కొట్టారు. ఇది ఆటవికం. పోలీసుల మీద ప్రజల రాళ్ళు వాళ్ళ అవినీతి పట్ల ప్రజల నిరసనకి, ఉదాసీనతకి నిదర్శనం. ప్రజల మీద పోలీసుల లాఠీల ఝుళిపింపు అధికార దుర్వినియోగం. ఒక పక్క టీవీ కెమెరాలు తిరుగుతున్నాయని తెలిసినా బరితెగించిన వారి అహంకారం – ఈ వ్యవస్థ దుస్థితికి నిదర్శనం. మొన్ననే ఉత్తర ప్రదేశ్ లో అమేఠీకి చెందిన సుల్తాన్ పూర్ పోలీసు స్టేషన్ లో జరిగిన దుర్ఘటన గుర్తుండే ఉంటుంది. ఓ దళిత యువతి భర్త శవం దొరికింది. పోలీసు స్టేషన్ కి భార్యని పిలిపించాడు స్టేషన్ ఆఫీసర్ కైలాస్ ద్వివేదీ. ఊపిరి అందక తనని చావగొడుతున్న అతన్ని బతిమాలుకుంది దళిత యువతి. కానీ ద్వివేదీ ఆగలేదు. ఆమె చేత నేరాన్ని ఒప్పించాలని అతని పట్టుదల. అలా చెప్పిన వాఙ్మూలం చెల్లదని అతనికీ తెలుసు. మరి? ద్వివేదీని ప్రభుత్వం బర్తరఫ్ చేసింది.

ఆ మధ్య అరేరియా జిల్లాలోని ఫర్ బేస్ గంజ్ పోలీసు లాఠీ దెబ్బలకి పడివున్న శరీరాన్ని హోం గార్డ్ తొక్కి గంతులేసిన అతి దారుణమయిన దృశ్యాన్ని మరిచిపోలేదనుకుంటాను. ఇది ఊహకి కూడా అందని పాశవిక ప్రవృత్తి.

విదేశీ దౌర్జన్యకారుల చేతుల్లో అనునిత్యం జరుగుతున్న దౌర్జన్య చర్యలు గర్హనీయం. కానీ ప్రజలని రక్షించి వారి శ్రేయస్సుని కాపాడవలసిన ఈ పశువుల నిర్దాక్షిణ్యమైన చర్యలు దౌర్జన్యకారుల చర్యల కంటే దారుణం. ఆ దౌర్జన్యానికి నిస్సహాయమైన జుగుప్స, ఈసడింపు తప్ప మరో మార్గం లేదు. అధికారం ఈ దేశంలో అవినీతిగా తర్జుమా కావడం ప్రారంభించి చాలాకాలమయింది. కానీ పశుత్వంగా, ఆతవికమైన జులుంగా మారడం దురదృష్టం. అమానుషం. ఈఈ శాఖల్లో ఎవరయినా ఇంకా నీతిపరులూ, సజ్జనులూ ఉంటే దురదృష్టవశాత్తూ వారంతా తాటి చెట్లకింద పాలుతాగుతున్నవారే.

(సెప్టెంబర్ *19*, 2011)



# (September 26,2011) Oka Keerthi Seshuralu ఒక 'కీర్తి ' శేషురాలు

మంచి పని ఎప్పుడూ ఒద్దికగా జరుగుతుంది. దౌర్భాగ్యపు పని బాహాటంగా ఒళ్ళు విరుచుకుంటుంది. ఒక 70 సంవత్సరాలలో మానవాళి మరిచిపోలేని దౌర్భాగ్యపు పని రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో యూదుల మారణ హోమం. మూలపురుషుడు హిట్లర్. ఆ మారణ హోమం నుంచి తనదైన ప్రయత్నంలో కొందరు యూదుల్ని రక్షించిన జర్మన్ షిండ్లర్ కథని ప్రపంచ ప్రఖ్యాత దర్శకుడు స్టీవెన్ స్పీల్ బర్గ్ చిత్రంగా తీసి అజరామరం చేశాడు. అలాంటి మరొక అద్భుతమైన వ్యక్తి కథ ఇది. మానవాళి కృతజ్ఞతతో పులకించి చిరస్మరణీయం చేసుకోవలసిన కథ.

ఆమె పేరు ఇరీనా శాండ్లర్. పోలెండ్ దేశస్తురాలు. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో జర్మనీ పోలెండుని ఆక్రమించాక పోలెండులో యూదుల మారణహోమానికి తలపెట్టింది. అందుకు వార్సాలో ఒక శిబిరాన్ని ఏర్పరిచింది. దాన్ని ఘెట్టో అంటారు. ఇరీనా సాంఘిక సేవా సంస్థలలో పనిచేసేది. పాలక వ్యవస్థకి వ్యతిరేకంగా పనిచేసే జెగోటా అనే రహస్య (అండర్ గ్రౌండ్) సంస్థలో ఇరీనా సభ్యురాలు. ఈ వార్సా ఘెట్టోలో కుళాయిలు, మురుగు కాలువల మరమ్మత్తు చేసే పనికి కుదురుకుంది. అప్పటికి ఇరీనా వయస్సు 23 సంవత్సరాలు.



రోజూ చేతిలో పనిముట్లు ఉన్న పెట్టె, వీపు మీద పెద గోనె గోతాంతో పనిలోకి వచ్చేది. కేవలం నౌఖరీ చెయ్యడం ఆమె లక్ష్యం కాదు. ఆ శిబిరాల్లో ఉన్న యూదుల పసిబిడ్డల్ని తన పనిముట్ల పెట్టిలో అడుగున దాచిపెట్టి బయటకు రహస్యంగా చేరవేసేది. కాస్త శరీరం పెద్దదిగా ఉన్న పిల్లల్ని వీపు మీద గోతంలోకి ఎత్తుకునేది. ఆమెతో ఓ కుక్క కూడా వచ్చేది. ఈ పిల్లలు ఏడిచి శబ్దం చేస్తే నాజీ సైనికుల చెవినిపడకుండా వాళ్ళని చూసినప్పుడల్లా మొరగడం కుక్కకి అలవాటు చేసింది. కుక్క అరుపులకు అలవాటు పడిపోయిన సైనికులు ఆమెను పట్టించుకునేవారు కాదు. అనుమానం వస్తే నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపే నరరూపరాక్షసుల మధ్య నుంచి అలా రెండు వేల అయిదువందల మంది పిల్లల్ని బయటికి చేర్చింది.

బయటికి తెచ్చాక వారి తల్లిదండ్రుల వివరాలు, అడ్రసులు – అన్నీ స్పష్టంగా రాసి – ఆ విలువైన జాబితాలను ఓ గాజు కుప్పెలో ఉంచి – ఇంటి వెనుక పెరట్లో ఓ చెట్టు కింద పాతిపెట్టింది. ఈ పిల్లలకి కొత్త పేర్లూ, కొత్త అడ్రసులూ సృష్టించి కొన్ని కుటుంబాలలో, బాల రక్షణ కేంద్రాలలో వారిని చేర్చింది. ఇదొక అపూర్వమైన విప్లవం. తల్లిదండ్రులని కాపాడడం సాధ్యంకాకపోయినా వారి సంతానాన్ని కాపాడే మానవీయ విప్లవం.

యుద్ధం ముగిశాక – అడ్రసుల్లో వివరాల ప్రకారం ఆయా పసివారిని వారి వారి తల్లిదండ్రుల దగ్గరికి చేర్చాలని ఆమె పథకం. కానీ యుద్ధం ముగిసేనాటికి చాలా మంది తల్లిదండ్రులు ఈ నాజీ శిబిరాలలో విషవాయు ప్రయోగాలలో మరణించారు. తప్పించుకుని ప్రాణాలు దక్కించుకున్న ఏ కొద్దిమందో ఆచూకీ లేనంతగా మాయమయారు.

1943లో పిల్లల్ని చేరవేస్తూ ఇరీనా నాజీ సైనికులకు దొరికిపోయింది. అప్పుడామెకు 23 సంవత్సరాలు. (ఫోటో చూడండి). ఇలాంటి సాహసాలు తలపెట్టనక్కరలేని వయస్సది. కానీ మనస్సులో మానవతా చైతన్యం వెల్లివిరిసిన అమృతమూర్తి ఇరీనా. నాజీలకు పట్టుబడ్డాక నిర్దాక్షిణ్యంగా


అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ
కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

ఆమెని చావగొట్టారు. కాళ్ళూ చేతులూ విరగ్గొట్టారు. నానా చిత్రహింసలూ పెట్టారు. చివరికి మరణ శిక్షను విధించారు. ఆమెని కాల్చి చంపడానికి తీసుకువెళుతుండగా ఆమె పనిచేసే జెగోటా సంస్థ మనుషులు – నాజీ సైనికులకు లంచాలిచ్చి ఆమెని కాల్చి చంపకుండా తప్పించారు. కానీ బయటి ప్రపంచానికి ఇరీనా చచ్చిపోయినట్టే ప్రకటన వచ్చింది. యుద్ధం తరువాత పోలెండుని సోవియట్ యూనియన్ ఆక్రమించుకుంది. రహస్యంగా పనిచేసిన ఈ కార్యకర్తలందరిని ఆ ప్రభుత్వం రాసిరంపాన పెట్టింది. అప్పటికి ఇరీనాకి పెళ్ళయి – రెండోసారి గర్భస్రావమయింది. క్రమంగా రాజకీయ వాతావరణం మారింది. కమ్యూనిస్టు పాలన నుంచి పోలెండు విముక్తమయింది. కొత్త పోలెండు ప్రభుత్వం ఆమె సేవలను గుర్తించింది. ఇజ్రేల్ ప్రభుత్వం యూదులకు చేసిన సేవలకుగాను ఆమెకు తమ దేశపు అత్యున్నత పురస్కారాన్నిచ్చింది. పోలెండు ప్రభుత్వం ఆమె స్వయంగా వెళ్ళి ఆదుకునేందుకు అనుమతినిచ్చింది.



2003లో రెండవ పోప్ పాల్ యుద్ధకాలంలో ఆమె కృషిని అభినందిస్తూ ఉత్తరం రాశారు. అదే సంవత్సరం పోలెండు తమ దేశపు అత్యున్నత పురస్కారంతో ఇరీనాను సత్కరించింది. 2007లో పోలెండు సెనేట్ ఆమెను గౌరవించుకుంది. అప్పటికి ఆమె వయసు 97. లేచివెళ్ళలేని పరిస్థితి. ఆమె రక్షించిన బిడ్డలలో ఒకరయిన ఎలిజబెత్ ఫికోస్కా అనే ఆమె ఇరీనా తరపున వెళ్ళి ఆ గౌరవాన్ని అందుకుంది.

2009లో ఐక్యరాజ్యసమితి తరపున ప్రముఖ హాలీవుడ్ నటి – ఆడ్రీ హెప్ బర్న్ ( "రోమన్ హాలీడే' హీరోయిన్) పేరిట ఏర్పరిచిన మానవతా పురస్కారాన్ని ఆమెకి అందజేశారు. 2007 లో కాన్సాస్ లో ఒక ఉపాధ్యాయుడు నోబెల్ శాంతి బహుమతికి ఆమె పేరుని ప్రతిపాదించారు. బహుమతిని ప్రకటించాక – అంగీకరించని నామినేషన్లని గత 50 సంవత్సరాలుగా బయట పెటకపోవడం ఆచారం. కానీ ఇరినా శాండ్లర్ పేరు బయటికి వచ్చింది. శాంతి బహుమతికి ఆమె కంటే ఎవరికి అర్హత ఉంటుంది? మానవత్వాన్ని అంతకంటే ఎవరు ఉన్నత స్థాయిలో నిలపగలరు? ఒక మదర్ థెరిస్సా, ఒక దలైలామా, ఒక మహాత్మాగాంధీ (ఆయన పేరుని నోబెల్ శాంతి బహుమతికి సూచించలేదు!), ఒక ఇరీనా శాండ్లర్. కాదు బాబూ! కాదు. అర్హతలు చాలామందికి ఉన్నాయి. నోబెల్ స్థాయి రాజకీయాలూ ఉన్నాయి. పర్యావరణ కాలుష్యానికి కృషిచేసిన అమెరికా ఉపాధ్యక్షులు ఆల్ గోరేకి ఆ సంవత్సరం శాంతి బహుమతిని ఇచ్చారు. అది 2007. ఈ విషయాన్ని తెలిసిన ఇరీనా నవ్వుకుని ఉంటుంది. 68 సంవత్సరాల ముందు వీపు మీద మోసిన మానవాళి ఔన్నత్యానికి ఇలాంటి విలువల్ని ఆశించి ఉండదు. విరిగిన కాళ్ళూ, చేతులూ, దాదాపు చావుదాకా వెళ్ళిన ప్రయాణం, తన కళ్ళముందే పెరిగి పెద్దదయిన ఎలిజబెత్ ఫికోస్కా, ఇంకా 2499 మంది పిల్లలు ఆమెకి సజీవ నోబెల్ బహుమతులు. ఈ బహుమతి కేవలం ఒక సంస్థ గుర్తింపు. ఆ కృషి మానవత్వం ఆమెకిచ్చిన కితాబు. ప్రశంస. తన 98 వ ఏట – ఆ మధ్యనే ఇరీనాశాండ్లర్ అనే దేవతామూర్తి కన్నుమూసింది.

దేవుడిని చాలామంది నమ్మరు. 23 ఏళ్ళ ఓ అందమయిన అమ్మాయి – 2500 పసి జీవితాలకు ప్రాణం పోసిన మాతృమూర్తిలో దైవత్వాన్ని – 98 సంవత్సరాలు ఆ జీవితాన్ని జీవనయోగ్యం చేసిన వైభవాన్ని అందరూ నమ్మక తప్పదు. ఇది వాస్తవం. 98 వ ఏట ఆ దేవత ముఖంలో చిరునవ్వు ఆ జీవన సాఫల్యానికి అద్దం పడుతుంది.

(సెప్టెంబర్ *26*, 2011)

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!






# (October 03, 2011) Chttaniki Gajulu చట్టానికి గాజులు

మన రెండో ప్రపంచ యుద్ధంలో హిట్లర్ రాక్షస ప్రవృత్తి గురించి ఇప్పటికీ కథలు కథలుగా చెప్పుకుంటాం. ఇప్పటికీ ఆ పీడకల నుంచి తేరుకోలేని దేశాలు, వ్యవస్థలు, కుటుంబాలూ, వ్యక్తులూ ఉన్నారు. ఈ పీడకలలను తమ కథల్లో, నవలల్లో, సినిమాల్లో ఇప్పటికీ తల్చుకు దు:ఖిస్తున్న సందర్భాలున్నాయి. మానవాళి చరిత్రలో అది మాయని, మానని గాయం. అంతకన్న పైశాచికమైన 'ఇండియా' మార్కు దౌర్భాగ్యమిది.

అనగా అనగా వాచాతి అనే గ్రామం. తమిళనాడులో ధర్మపురికి 50 కిలోమీటర్ల దూరంలో, హరూర్ అనే ఊరుకి 12 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ రెండూ గుర్తులుగా చెప్పడానికి కారణం హరూర్‌లో పోలీస్ స్టేషన్ ఉంది. ధర్మపురిలో సెషన్స్ కోర్టు ఉంది. ఈ రెండింటితోనూ ఈ కథ ముడిపడివుంది. 19 సంవత్సరాల కిందట సరిగ్గా చెప్పాలంటే 1992 జూన్ 20న వాచాతి గ్రామంలోని ఆదివాసులు మంచిగంధం చెట్లను పడగొడుతున్నారని విని ఫారెస్టు విభాగం, పోలీసు విభాగం, రెవిన్యూ విభాగానికి చెందిన వారు దాదాపు 300 మంది ఆ గ్రామం మీద దాడి చేశారు. ఆ గ్రామంలో ఉన్న ప్రతీ ఆడదాన్నీ నిర్దాక్షిణ్యంగా మానభంగం చేశారు.

రెండే రెండు ఉదాహరణలు. ఎనిమిదో క్లాసు చదువుకుంటున్న 13 ఏళ్ల అమ్మాయిని జుత్తు పట్టుకుని గుడిసెలోంచి ఓ పోలీసు రాక్షసుడు ఈడ్చుకొచ్చాడు. బూతులు తిట్టాడు. పక్కన ఉన్న చెరువు గట్టుకి అంతా కలిసి ఈడ్చుకొచ్చారు. "నేను చదువుకుంటున్న చిన్న పిల్లని బాబూ. నన్ను విడిచిపెట్టండి" అని ఆ పిల్ల మొత్తుకుంది. "నువ్వు ఆడదానివి. అదిచాలు నాకు" అని ఆ కాకీ దగుల్బాజీ సమాధానం. పరంధాయి అనే ఆదివాసి ఈ కథని విప్పింది. తన కళ్లముందే 16 ఏళ్ల కూతుర్ని ఈడ్చుకొచ్చి ఆవిడ కళ్లముందే బట్టలు ఊడదీశారు. బట్టల్లేని ఆ పిల్లని మధ్యాహ్నం 2.45 కి తీసుకుపోయారు.

సగం స్పృహతో ఉన్న పిల్లని 9 గంటలకి వెనక్కి తీసుకొచ్చారు. ఇంటిదగ్గర వదిలిపెట్టడానికి కాదు. ఆ రాత్రి ఫారెస్టు బంగళాలో ఆఫీసర్ల పక్కలోకి చేర్చారు ఈ తార్పుడుగాళ్లు. ఈ అరాచకాన్ని తట్టుకుని ఇప్పటికీ బతికే ఉందీ అమ్మాయి. ఆమెకి పెళ్లయింది. ముగ్గురు పిల్లలు. పైన చెప్పిన చదువుకంటున్న పిల్లనీ ఓ ఆదివాసి పెళ్లి చేసుకున్నాడు. మానవత్వానికి మరో బంగారు అంచు ఈ ఔదార్యం. గత 19 సంవత్సరాలుగా ధర్మపురి కోర్టులో జరుగుతున్న విచారణకి ఈ కుటుంబాలన్నీ వచ్చిపోతున్నాయి. సాక్ష్యాలు చెప్తూనే ఉన్నాయి. ఏనాటికయినా న్యాయం జరగదా అని ఎదురుచూస్తున్నాయి.

అంతకు ముందు కథ మచ్చుకి. ఈ దురన్యాయం, కీచకుల దారుణ నేరకాండ బయటి ప్రపంచానికి 15 రోజుల దాకా తెలియలేదు. గిరిజనులు హరూర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు ఇయ్యబోయారు. కాని ఫిర్యాదు తీసుకోవలసిన పోలీసు నీచుడికీ ఇందులో పాత్ర ఉంది. అందుకని కేసు నమోదు కాలేదు. గిరిజనుల తరఫున కమ్యూనిస్టు మార్క్సిస్టు కార్యకర్తలు పూనుకున్నారు. ఈ అరాచకాన్ని బయటపెట్టడంలో వారి కృషి గొప్పది. వారు కార్యరంగంలోకి దిగారు. నాలుగు నెలలకి కేసు నమోదు అయింది.

అప్పటికి ఈ పీడితులు ఎక్కడ ఉన్నారు? తమ స్త్రీల మీద జరిగిన దురన్యాయాలకు హడలెత్తి వాళ్లని తీసుకుని అడవుల్లోకి చెట్టుకొకరు పుట్టకొకరుగా పారిపోయి తలలు దాచుకున్నారు. వాళ్లందరినీ పార్టీ కార్యకర్తలు సముదాయించి వారి గుడిసెలకు చేర్చారు. పల్లె అంతా అస్తవ్యస్థమై కిరసనాయిలు వాసనకొడుతోంది. వీళ్లని, 18 మంది మానభంగం పాలయిన వారినీ తీసుకుని ఒకనాటి అర్ధరాత్రి ధర్మపురి జిల్లా



కలెక్టరుని లేపి చర్య తీసుకోవలసిందని నిలదీశారు. అలా కార్యాచరణ ప్రారంభమయింది. మరో నాలుగు నెలల తర్వాత అంటే జనవరి 1993న హైకోర్టు సిబిఐకి ఈ కేసుని అప్పగించింది. ఎంతమంది మీద కేసులు నమోదు చేశారు? 269 మీద. ఇది ఈ దేశపు చరిత్రలో రికార్డు. ఈ కేసులో నలుగురు ఐఎఫ్ఎస్ ఫారెస్టు ఆఫీసర్లు ఉన్నారు. పశుత్వాన్ని పంచుకోడానికి అన్ని డిపార్టుమెంటులూ కలిశాయి. 126 మంది అటవీ శాఖవారు, 84 మంది పోలీసు శాఖవారూ, అయిదుగురు రెవిన్యూ శాఖవారూ –ఈ పాపాన్ని పంచుకున్నారు. 19 సంవత్సరాలు ఈ కేసు నడిచింది. ఈ వ్యవధిలో 54 మంది చచ్చిపోయారు. చాలామంది ఉద్యోగాలనుంచి రిటైరయారు. ఇద్దరికి పక్షవాతం వచ్చి కాళ్లు చచ్చుబడ్డాయి. మొన్న తీర్పుని కోర్టు ప్రకటించిననాడు వీరంతా కోర్టుకి హాజరయ్యారు. నడవలేని ఈ ఇద్దరు కోర్టు మెట్లమీద చతికిల బడ్డారు. కోర్టు గుమాస్తా న్యాయమూర్తి ఆదేశం మీద వీరికి శిక్షల్ని చదివి వినిపించారు. బంధువులతో వచ్చిన 17 మందిని అప్పటికప్పుడు 19 సంవత్సరాల తర్వాత జైలుకి తరలించారు. మిగతా వాళ్లకి పై కోర్టులకు అప్పీలు చేసుకోడానికి నెలరోజులు వ్యవధి ఇచ్చింది కోర్టు. కొందరికి రెండు నుంచి పదేళ్ల దాకా జైలుశిక్షలు పడ్డాయి. ఇంత ముమ్మరంగా శిక్షలు విధించడం భారత దేశ చరిత్రలోనే మొదటిసారి. ఈ దారుణానికి బలయినవారికి ప్రభుత్వం 15 వేలు నష్టపరిహారం ఇచ్చింది. ఈ 19 సంవత్సరాలూ తమకు జరిగిన అన్యాయానికి ముద్దాయిలు శిక్ష అనుభవించాలని ఎదురుచూస్తూ కోర్టుల్ను పట్టుకు తిరుగుతూ ఈ దారుణాన్ని ఎప్పటికప్పుడు పునశ్చరణ చేస్తూ, సాక్ష్యాలు చెప్తూ గిరిజనులు బతికారు. ఇది వారికి యావజ్జీవ కారాగార శిక్ష. ఇంకా ఇప్పటికీ కథ ముగియలేదు. ముద్దాయిలు పైకోర్టులకి వెళ్తారు. మళ్లీ విచారణ సాగుతుంది. మళ్లీ ఈ నిస్సహాయులు తమకు జరిగిన అన్యాయాల గోడుని పై కోర్టుల్లో చెప్పుకుంటారు. మరికొందరు చచ్చిపోతారు. ఇంకొందరికి పక్షవాతం రావచ్చు.

కాని ఈ దేశంలో న్యాయానికి పట్టిన దురవస్థ ఇది. సుప్రీం కోర్టు న్యాయమూర్తి ఎస్.మోహన్ అన్నారు: ఎన్నికల కేసుల విచారణ ముగించడానికి నిర్దిష్టమైన గడువుంది. కాని ఇలాంటి కేసులకి లేదు వీటికీ ఉండాలి. మాజీ అడ్వొకేట్ జనరల్ పి.ఎస్.రామన్ మాట: నేరచట్టాలు నేరస్థుల్ని శిక్షించడానికి, వారిని ఆపు జెయ్యడానికి ఉపయోగిస్తాయి. కాని నిర్ణీత సమయంలో శిక్షలు పడకపోతే న్యాయవ్యవస్థ ఉద్దేశమే మంటగలిసిపోతుంది. ముంబై హైకోర్టు న్యాయమూర్తి హెచ్.సురేష్, నేరం జరిగిన 8 –10 ఏళ్ల దాకా శిక్షలు పడకపోతే నేరస్థులకి గుండె ధైర్యం పెరుగుతుంది. వాళ్లకి కొమ్ములు మొలుస్తాయి. దారుణమైన నేరం చేసి చచ్చినవాళ్లు తృప్తిగా నవ్వుకుంటూ చచ్చివుంటారు. కోర్టు గుమ్మం దగ్గర నడవలేక చతికిల బడ్డ దౌర్భాగ్యులిద్దరికీ కాళ్లా వేళ్లా పడిన 13 ఏళ్ల అమ్మాయి కన్నీళ్లు ఒక్కసారయినా మనస్సులో కదిలివుంటాయి.

కాని మిగతా 199 మంది మాటేమిటి?

సుప్రీం కోర్టు ఖరారు చేసిన మరణ దండనల్ని ఆపాలని రాష్ట్ర శాసనసభలు (తమిళనాడు, కాశ్మీర్) రెచ్చిపోతున్న నేపథ్యంలో చట్టానికి గాజులు తొడిగే నాయకత్వం ఈ దేశంలో పెచ్చురేగిపోతోంది. దౌర్భాగ్యుడిని కాలం శిక్షిస్తుందని సరిపెట్టుకోవడం నిస్సహాయుడు నమ్మే మెలోడ్రామా. చట్టాన్ని చవటని చేయడం నేటి నాయకత్వం కొనసాగిస్తున్న కొత్త మెలోడ్రామా. చట్టానికి ఈ మాత్రం చెల్లుబాటూ లేనినాడు ఊరుకొక వాచాతీ దర్శమిచ్చినా ఆశ్చర్యం లేదు. ఇది నిరాశావాది ఆక్రోశం కాదు. చేతకాని చట్టాలకు తలవొంచిన ఈ వ్యవస్థ దౌర్భాగ్యానికి దారి తోచని ఓ నిస్సహాయుడి ఆవేశం. ఇందులో వాచాతీ గిరిజనుల కన్నీరు ఉంది. ఆవేశం ఉంది. నిస్సహాయత ఉంది. గాయపడిన గుండెలతో జీవికల్ని నడుపుకుంటున్న వారి దయనీయమైన జీవనయాత్ర ఉంది. ఈ దేశం సిగ్గుతో తలవొంచుకోవలసిన భయంకరమైన పీడన ఉంది.

*(అక్టోబర్ 03,2011)*




# (October 10,2011) Mexico Mark Pellillu మెక్సికో మార్కు పెళ్ళిళ్ళు

ఈ మధ్య మెక్సికోలో కొత్తరకమైన పెళ్లి చట్టాలు అమలులోకి తేవాలని తలపోస్తున్నారు. ప్రేమించి పెళ్లిళ్లు చేసుకుని –తీరా ఇద్దరి మధ్యా సంబంధం పొసగక విడిపోవాలని –విడాకులు తీసుకోవాలని తంటాలు పడే నూతన దంపతులు ఎక్కువగా కనిపిస్తున్నారట. వారి సౌకర్యార్థం అసలు పెళ్లిళ్ల లైసెన్సులనే రెండేళ్లకు పరిమితం చెయ్యాలని ఆలోచిస్తున్నారట.

ఇది చాలా సుఖవంతమైన ఏర్పాటుగా నాకు తోస్తుంది. పెళ్లి బాదరబందీ లేకుండా ఈ మధ్య కలిసి బతికే పద్ధతులు వచ్చాయి. అలా బతకడానికి 'పెళ్లి'ని గుర్తుగా పెట్టుకోవడం వారికి యిష్టం వుండడం లేదు. అలాంటి వారి సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ సంస్కరణ జరపాలని పెద్దలు ఆలోచిస్తున్నట్టున్నారు. బరితెగించి, కుండబద్దలు కొట్టినట్టు రాసిన ఆత్మకథ ప్రసిద్ధ హాలీవుడ్ తార హెడ్డీ లామర్‌ది. ఆమె సిసిల్ బి.డిమిల్లీ దర్శకత్వం వహించిన 'శాంప్సన్ అండ్ డలైలా' లో హీరోయిన్. ఆ చిత్రానికి హీరోయిన్‌గా ఖరారు చేసేముందు ఆమె కదలికల్ని, హావభావాలనీ గమనించడానికి డిమిల్లీ ఒక సంవత్సరంపాటు ఆమెని తనతో తిప్పుకున్నాడంటారు. లామర్ చాలా అందగత్తె. జీవితంలో కేవలం అయిదుసార్లు మాత్రమే పెళ్లి చేసుకుంది. (ఇలాంటి ఘనత దరిమిలాను ఎలిజబెత్ టేలర్ సాధించింది). ఆమె తన ఆత్మకథ 'ఎక్స్టసీ అండ్ మీ'లో రాసిన ఓ సంఘటన. ఓసారి ఆమెకి ఒకానొక రచయిత మీద మక్కువ కలిగిందట. అతన్ని కారెక్కమంది. "నీ యిష్టం వచ్చినప్పుడు నీతో రాడానికి నీ మొగుడినేం కాను" అన్నాడట ఆ రచయిత. అతని చొక్కా పుచ్చుకుని కారులో కూలేసి తాత్కాలికంగా పెళ్లి లైసెన్సులు పుచ్చుకునే వూరికి తీసుకుపోయి పెళ్లి చేసేసుకుంది. శని, ఆదివారాలు అతనితో గడిపాక సోమవారం అతనికి విడాకులిచ్చింది. స్థూలంగా ఇదీ కథ.

ఇలాంటి వెసులుబాటు కేవలం అందగత్తెల సొత్తే కాదు –త్వరలో అందరి సొత్తూ కాబోతోంది.

ఈ మధ్య ముగ్గురు నలుగురు ఆడవాళ్లను "మీ వారేం చేస్తున్నారు?" అని అడిగాను. "మేం కలిసి ఉండడం లేదండీ" అని ముక్తసరిగా –కాని సిగ్గుపడకుండా, అదేదో నేరంలాగ కాకుండా ధైర్యంగా చెప్పిన సందర్భాలు నాకు తెలుసు. అతి ఘనంగా జరిగిన గొప్పింటి పెళ్లిళ్లు పెటాకులయిన సందర్భాలూ తెలుసు. కాలం మారిపోతోంది. పెళ్లిళ్లు మునపటిలాగ జరగడం లేదు. సాయంకాలం ప్రారంభమయి అర్ధరాత్రికి ముగిసిపోతున్నాయి. వాళ్ల వైవాహిక జీవితాలూ అంతే క్లుప్తంగా ముగిసిపోతున్నాయి. 'త్వంజీవ శరదశ్శతమ్' అంటే అర్థం చాలామందికి తెలీదు. తెలిసినవాడికి అది బూతుమాట. నూరేళ్ల జీవితాన్ని పంచుకోవడం ఎంత బోరు! ఎవడెన్నాళ్లుంటాడో ఎవరికి తెలుసు? అసలు ఈ రోజుల్లో కొన్ని పెళ్లిళ్లే పెద్దలదాకా రావడంలేదు. పెళ్లయిపోయిన చాలారోజులకి పెద్దలకి తెలియజేస్తున్నారు. ఆ రోజుల్లో అంటే మా రోజుల్లో దిక్కుమాలిన చాదస్తం ఉండేది. ఆడపిల్లని చూసేవాళ్లు ఆ పిల్ల తల్లినీ చూడాలనేవారు –పట్టుగా. కారణం పిల్ల పెరిగి రెండు మూడు పురుళ్లయాక తల్లి రూపునీ, తండ్రి ఆలోచనల్నీ పుణికి పుచ్చుకుంటుంది అనేవారు.

ఈ మధ్య ఎవరో "ఫలానా ఆయన కూతుర్ని మా అబ్బాయికి చేసుకోవచ్చా?" అని అమెరికానుంచి ఫోన్ చేశారు. అమెరికా వెళ్లాక కూడా ఇంకా తల్లిదండ్రులకి ఇంత వెసులుబాటు ఇచ్చిన ఆ అసమర్థుడైన కొడుకు ఎవరా అని నిర్ఘాంతపోయాను.



మా రోజుల్లో పెద్దలెవరయినా కనిపిస్తే "ఎవరబ్బాయివి బాబూ? మీ ఇంటి పేరేమిటి?" అని అడిగేవారు. చెప్పాక –"ఫలానా వారబ్బాయివా? మీ నాన్నగారు–" అంటూ మురిసిపోయేవారు ఆ అడిగిన పెద్దమనిషి. సంప్రదాయం సత్ప్రవర్తనకి దగ్గరతోవ. నమ్మకమయిన రేపుకి పునాది. పెళ్లి అనే వెండి పళ్లానికి ఆధారమైన గోడ. పైగా ఆ రోజుల్లో గర్భాదానానికి పెద్దతంతు. ముహూర్తం. చెలంగారు మన పెళ్లిళ్లు ఆ రోజుల్లో ఆడదాన్ని చెరచడంతో ప్రారంభమవుతాయని వాపోయారు. ఇప్పటి యువత ఈ వ్యవహారం చూసి తప్పనిసరిగా నవ్వుతారు. తన వంశాన్ని పరిపుష్టం చేసే జన్యుకణాన్ని –ఆ నిరాకార బీజం తటిల్లతయై గర్భాన్ని చొచ్చుకుపోయినప్పుడు ఆ పిండం శిశువుగా మారే హిరణ్మయత్వం –అంటూ మురిసిపోయారు మిత్రులు, రచయిత వాకాటి పాండురంగరావు గారు. ఈ కాలంలో గర్భాదానాలు కారు వెనుక సీట్లలో జరిగిపోతున్నాయి. రాధారీ బంగళాల్లో సాగిపోతున్నాయి. దీనికో బోడి ముహూర్తం ఒకటి!

కోరి పెంచుకున్న శారీరక సంబంధానికి 'ప్రేమ' అని తప్పుడు గుర్తు పెట్టుకుంటుంది యువత. ప్రేమ అంటే పుచ్చుకోవడం కాదు. యిచ్చుకోవడం –సుఖాన్నీ, స్నేహాన్నీ, సానుభూతినీ, సహజీవనాన్నీ –అన్నిటినీ. తర్వాత వచ్చే అభిప్రాయ బేధాలకూ, అభ్యంతరాలకూ –యిద్దరి మధ్యా కుదరని సమన్వయం మీదే మొగ్గు. పరిష్కారం –విడాకులు. వ్యవస్థ దీవెన, పెద్దల ఆశీర్వాదం, కుటుంబాల ప్రతిష్ఠ, ఆయా తరాల సంస్కారం పోవయ్యా, ఎవడిక్కావాలి ఈ ముసలి ఆలోచనలు? గర్భాదానానికి గదులున్నాయి. పెళ్లిళ్లకి కళ్యాణ మంటపాలున్నాయి. విడాకులకి కోర్టులున్నాయి. పుట్టిన బిడ్డలు పెరగడానికి అనాధ శరణాలయాలున్నాయి. మళ్లీ చేసుకోడానికి కావలసినంత మంది చుట్టూ ఉన్నారు. ఈనాటి పెళ్లిళ్లకీ పెద్దలకీ, వ్యవస్థకీ, కుటుంబ ప్రతిష్టకీ ఏమీ సంబంధం లేదు. మనం గదిలో వాల్ పేపరు మార్చుకుంటాం. అడపా తడపా సెల్ ఫోనులు మారుస్తాం. కార్లు మారుస్తాం. ఉద్యోగాలు మారుస్తాం. ఇళ్లు మారుస్తాం. తొడుక్కునే బట్టలు మారుస్తాం. జీవిత భాగస్వాముల్ని ఎందుకు మార్చకూడదు? ఈ ఆలోచనలో మెక్సికో ప్రపంచంలో అందరికంటే ఒకడుగు ముందుకు వేసింది. వాలెంటిన్లు, ఫాదర్స్ డేలూ, మదర్స్‌డేలూ దిగుమతి చేసుకుని ఆనందించే మనకి రెండేళ్ల పెళ్లిళ్ల లైసెన్సులు వడ్డించిన విస్తరి.

పెళ్లిళ్ల మంత్రాలు చదివే పురోహితులూ –పెళ్లితంతు మీదాకా వస్తే మంత్రాలు మార్చండి. "ఈ పెళ్లి మనం మళ్లీ మనస్సు మార్చుకునేదాకా వర్ధిల్లుగాక" అని దీవించండి. కోర్టు ఖర్చులు కలిసొస్తాయి. పిల్లల పెంపకం బెడద లేదు. అన్నిటికీ మించి పెళ్లి అనే బోర్ నుంచి ఆటవిడుపుకి ఇది దగ్గరతోవ.

నిన్నకాక మొన్ననే ఓ పెద్దమనిషి నాతో మాట్లాడుతూ –మన ఆర్ష ధర్మంలో సన్యాసం అనే ఆలోచనే లేదు. మన ఋషులందరూ చక్కగా పెళ్లిళ్లు చేసుకున్నారు. గృహస్థాశ్రమమే సనాతన ధర్మం. యాజ్ఞ్యవల్క్య రుషి రెండుసార్లు పెళ్లి చేసుకున్నాడు. బౌద్ధం, జైనం నుంచే ఈ సన్యాసి అనే ఆలోచన వచ్చింది. జాతిని పెంపొందించే ఆలోచన, సమాజాన్ని పరిపుష్టం చేయడమే ఈ ధర్మం మూలసూత్రం –అన్నారు. దానికేం? మనకీ ఆర్ష ధర్మం వద్దిప్పుడు. మెక్సికన్ ధర్మం చాలు.

***(అక్టోబర్ 10,2011)***

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

# (October 17,2011) Majority Raajakeeyalu మెజారిటీ రాజకీయాలు

ఇది అపర ప్రహ్లాదుల కాలం. దేశాన్ని పాలించే రాజునీ, రాజు ఆలోచనల్నీ, పాలక వ్యవస్థనీ, పాలన సరళినీ నిలదీసి, ఎదిరించి, ఎదిరించడం తమ హక్కుగా బోరవిరుచుకుని, అవసరమయితే వీధినపెట్టే అద్భుతమైన రోజులు వచ్చాయి. అన్నా హజారే పాలక వ్యస్థని ఎదిరిస్తున్న పెద్దమనిషి. పెద్దమనిషి. ఈ దేశ చరిత్రలో పాలక వ్యవస్థకి వోటు వెయ్యవద్దని ఎన్నికల్లో ప్రచారం చేసిన స్వచ్ఛంద సంస్థ –పోనీ, ఉద్యమం ఆయనది. ఇది విద్దూరం. ఇందులో ఒకనీతి ఉంది. అయితే ఈ నీతిని ప్రశ్నించే పెద్దమనుషులూ ఈ దేశంలో ఉన్నారు. నిన్ననే సుప్రీం కోర్టు ఆవరణలోనే అన్నా అనుయాయులు, సుప్రీం కోర్టు న్యాయవాది ప్రశాంత్ భూషణ్‌ని నలుగురు చావగొట్టారు.

కాశ్మీర్ గురించి ఆయన ఆలోచన వారికి నచ్చలేదు. వాళ్ల ఉద్దేశాన్నో, కోపాన్నో అర్థం చేసుకొందాం. మా అవినీతిని వోటరు తేల్చాలిగాని మీరెవరయ్యా అన్నది వారి వాదం. వాళ్లని అరెస్టు చేస్తే, చేసినందుకు ఒక తిరుగుబాటు. వద్దని అడ్డుపడిన అన్నా మనుషుల్ని మర్నాడు సుప్రీం కోర్టు గేటు ముందే చావగొట్టారు.

ఇలాంటి ప్రహ్లాదులు మనకి బోలెడు. కోట్ల రూపాయల్ని స్వాహా చేశారని రాజాగారి మీద అభియోగం. సుప్రీం కోర్టు ఆయన్నీ, ముఖ్యమంత్రిగారి ముద్దుల కూతుర్నీ, మిగతా కార్పొరేట్ సంస్థల పెద్దల్నీ జైలుకి పంపింది. న్యాయంగా అవినీతికి ఇదే పర్యవసానం. కాని పాలక వ్యవస్థలో భాగస్వామి అయిన ఒకపార్టీ నాయకత్వానికి ఈ అవినీతిలో వాటా ఉంది. అందుకనే తన కూతురు నిజాయితీపరురాలని కరుణానిధిగారు కేంద్రం మీద కాలుదువ్వారు. న్యాయ వ్యవస్థ నిర్ణయాన్ని నిలదీసే రోజు వస్తుందని నా జీవితంలో ఊహకందని విషయం.

అణు విద్యుత్‌ను శాంతియుత ప్రయోజనాలకు వినియోగించేందుకు కూడాంకులంలో ఒక కేంద్ర నిర్మాణం సాగుతోంది. స్థానికులు నిర్మించడానికి వీలులేదంటున్నారు. తమిళనాడు ప్రభుత్వం, జయలలితగారు వారితో చెయ్యి కలిపి మద్దతుని ప్రకటించారు. రాజీవ్ గాంధీని చంపిన వారిని ఉరితీయాలని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చింది. వారిని నిరపరాధులుగా విడుదల చేయాలని కరుణానిధిగారు బల్ల గుద్దుతున్నారు. వారిని ఉరి తీయరాదని ప్రస్తుత తమిళనాడు ప్రభుత్వమే –శాసనసభలో తీర్మానాన్ని సాధికారికంగా చేసింది. అలాగే అఫ్జల్ గురుని ఉరితీయాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. తీయరాదని కాశ్మీర్ సభలో ప్రభుత్వమూ, ప్రతిపక్షాలూ కొట్టుకుంటున్నారు.

ఇది మిశ్రమ ప్రభుత్వాల రోజులు. ఎన్నో పార్టీల సంకరం. ఆ సంకరం స్పష్టంగా వీధినపడి తెలుస్తోంది. పాలక వ్యవస్థ గౌరవం ఎవరికీ పట్టదు. ఎవరి పార్టీల ఎజెండాలను, ఎవరి పార్టీల వారిని వారు ఒప్పించుకోగలిగితే మళ్లీ అందలమెక్కవచ్చు. దేశాన్ని పాలించే వ్యవస్థ ఐకమత్యం పాలనకి అవసరమన్న స్పృహ పోయి చాలారోజులయింది. నా పార్టీ అవసరాలను, లక్ష్యాలను, ప్రయోజనాల్ని నేను నిలుపుకుంటే రేపు ఈ ప్రభుత్వం కూలిపోయినా –మళ్లీ నా పార్టీకి నిలవనీడ ఉంటే నాకు చాలు. చిన్న నా బొజ్జకు శ్రీరామరక్ష. ఒకే పార్టీలో ఉన్నకారణంగా అభిప్రాయ బేధాలున్నా వాటిని దిగమింగుకుని ప్రజల దృష్టిలో ఈ పాలన ఏక తాటిమీద సాగుతోందని ఒప్పించాల్సిన బాధ్యత తమదిగా భావించిన రోజులు ఆనాటివి. అప్పటి రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్‌కూ, ప్రధాని నెహ్రూకు చాలా విషయాలలో




అభిప్రాయ బేధాలుండేవి. కాని వారిద్దరూ ఈ దేశ పాలక వ్యవస్థ రధసారథులు. ఐకమత్యం సమష్టి బాధ్యత. అభిప్రాయ బేధం ఆరోగ్యకరమేకాని, ఆ కారణంగా వీధిన పడడం వ్యవస్థని బలహీనపరుస్తుంది. వారిద్దరి దగ్గరా సెక్రటరీగా పనిచేసిన ఐసియస్ ఆఫీసరు హెచ్ .వి.ఆర్. అయ్యంగార్ వారు కన్నుమూశాక ఆ విషయాలు చెప్తే అంతా ఆ నాయకుల ఉదాత్తతకీ, విచక్షణకీ ముక్కుమీద వేలేసుకున్నారు.

బాబూ, ఇప్పటి ప్రభుత్వాలు మిశ్రమ ప్రభుత్వాలు. అంటే కప్పల తక్కెడ. ఎగిరే హక్కు ప్రతీ కప్పకీ ఉందని ప్రతీ కప్పా బ్లాక్‌మెయిల్ చేసే రోజులు. అవినీతి పరుడైన మంత్రి –నేనీపని ప్రధానికి చెప్పే చేశాను అని జైల్లోంచి బోరవిరుచుకునే రోజులు. చేసిన అవినీతికి సిగ్గుపడే రోజులు పోయాయి. నా అవినీతిలో ప్రధానికీ వాటావుందని బోరవిరుచుకునే 'సిగ్గులేని' అవినీతి నేటిది.

ఆ మధ్య మన్మోహన్‌సింగ్ 2జి కుంభకోణం గురించి ఒక పత్రికా సమావేశంలో మాట్లాడుతూ –మిశ్రమ ప్రభుత్వాలలో ఇలాంటి సర్దుకుపోవడాలు తప్పవని వాక్రుచ్చారు. వారు సర్దుకుపోతున్నారని తెలిసే చాలా పార్టీలవారు సూట్‌కేసులు సర్దుకున్న ఫలితమే ప్రస్థుతం – కల్మాడీ దగ్గర్నుంచి ఎందరో తీహార్‌లో కొలువు తీర్చడం. ఇవాళ చెల్లుబాటయే మూలసూత్రం –మెజారిటీ. ప్రస్తుతం పదవుల్ని పంచుకున్న ప్రభుత్వం తట్ట తగలేసినా తమ తమ లాభాలను, లక్ష్యాలనూ కాపాడుకుంటూపోతే, కాపాడినట్టు తమ ప్రాంతీయ వోటర్ల ముందు రేపు బోర విరుచుకోగలిగితే –అప్పుడు వచ్చే కొత్త మిశ్రమంలో మళ్లీ కొత్త పంపకాలకు అవకాశం ఉంటుంది. ఈ 'సిగ్గులేని', 'తెగింపు' మనస్తత్వానికి పెట్టుబడి –మెజారిటీ.

అందుకే మెజారిటీ ఒక గాడిద అన్నాడు బెర్నార్డుషా. నిజాయితీపరుడు మెజారిటీ వ్యవస్థకి మొదటి శత్రువని నిరూపిస్తూ నూరేళ్ల కిందట గొప్ప కళాఖండాన్ని సృష్టించాడు –ది ఎనిమీ ఆఫ్ ది పీపుల్ – By Henrik Ibsen. ఒక నమూనా ఉదాహరణ. మొన్ననే జీవితంలో మొదటిసారిగా మెజారిటీని సంపాదించి మమతా బెనర్జీ పశ్చిమ బెంగాల్‌లో చరిత్రను సృష్టించారు. ఈ దేశపు ప్రధాని పొరుగు దేశం బంగ్లాదేశ్‌తో రకరకాల ఒప్పందాల మీద సంతకాలకి ఆయా ప్రాంతాల ముఖ్యమంత్రులతో తరలివెళ్లారు. ఇది దేశ ప్రతిష్టకీ, శ్రేయస్సుకీ సంబంధించిన విషయం. రెండు దేశాల నదీజలాల పంపిణీ గురించిన ఒప్పందం మీద సంతకాలకి మమతా బెనర్జీ వెళ్లాలి. కాని ఆవిడ వెళ్లలేదు. ఈ దేశపు ప్రతిష్ట కన్నా ముఖ్యమంత్రికి తన రాష్ట్రంలో తన వోటర్ల మద్దతు ముఖ్యం. రేపు తన మెజారిటీ ముఖ్యం. అంతకుమించి ఈ దేశ ప్రతిష్టకీ ఆవిడకీ ఏమీ సంబంధం లేదు. అయినా కేంద్రం ఏమీ చెయ్యలేదు. కారణం? ఇది ఉమ్మడి కుంపటి.

ఆ మాటకి వస్తే నిన్నటి సుప్రీం కోర్టులో జరిగిన దౌర్జన్యానికీ, కర్ణాటకలో శ్రీరామసేన వీర విహారానికీ, జార్ఖండ్‌లో శిబూసొరేన్ అవినీతికీ –దేనికీ కేంద్రానికి శక్తి చాలదు. ఇది ఉమ్మడి పొయ్యి. ఈ దేశపు న్యాయవ్యవస్థనే నిరసించి, ఎదిరించే 'మెజారిటీ' సంపాదించిన ఆ ప్రాంతపు ప్రభుత్వాలు, పార్టీలు –దాదాపు 160 ఏళ్ల కిందట జమీందారీల విశృంఖలత్వాన్ని గుర్తు చేస్తున్నాయి. అందరూ ఎవరి మానాన వారుంటే పైనుంచి ఎవరో వచ్చి తన పబ్బం గడుపుకున్నాడు. అదే ఆనాటి ఈస్టిండియా కంపెనీ పునాదులకి పెట్టుబడి. ఆ వాతావరణం ఈ దేశంలో క్రమంగా నెలకొంటోంది. వ్యవస్థని ఎన్నికయిన ప్రభుత్వం ఎదిరిస్తే దిక్కులేదు. మెజారిటీ సంపాదించిన పార్టీ ఎదిరిస్తే చెయ్యగలిగిందేమీ లేదు. చెయ్యి చేసుకోగల ముష్కరత్వం ఎదిరిస్తే? నిజాయితీ పరుడైన పాపానికి ప్రాంతీయ దురహంకారం ఎదిరిస్తే? దిక్కులేదు. హిరణ్యకశిపుడి



పాలనలో మామూలు మనిషి రాజుని ఎదిరించినా నరసింహావతారం అవసరం లేదు. కాని రాజుని ఎదిరించింది –రాజు కొడుకే! కనుక మన పురాణాల్లో దేవుడు దిగివచ్చి రాజుని చంపాడు.

మన కాలంలో వ్యవస్థగా బలం చాలని, స్థానికంగా బలం ఉన్న ఎన్ని పార్టీలో ఎదిరిస్తున్నాయి. కనుక ఇక అవతారంతో పనిలేదు. కారణం – మనదేశంలో వీధికో అవతారం. పార్టీకో అవతారం. రాష్ట్రానికో అవతారం. ప్రహ్లాద తత్వం దేశాన్నంతటినీ ఆవరించుకున్న అద్భుతమైన రోజులివి. ఆధునిక కాలంలో నరసింహుడు స్థంభాల్లోంచి రాడు. ఏ అమెరికా రూపంలోనో ఆకాశం నుంచి దిగబడతాడు. మరో 200 సంవత్సరాలు పరపీడన. మరో గాంధీ. మరో స్వాతంత్ర్య సమరం. మళ్లీ వందేమాతరం.

*(అక్టోబర్ 17,2011)*

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

# (October 24,2011) Cheppudu Maata చెప్పుడు మాట

ఏదైనా నిర్ణయం తీసుకునేటప్పుడు నేనూ మా రెండో అబ్బాయీ వేసుకునే పడికట్టు ప్రశ్నలు కొన్ని ఉన్నాయి.

"ఈ పని వల్ల వచ్చే నష్టం ఏమిటి?"

"దాన్ని తట్టుకునే శక్తి మనకి ఉన్నదా?"

"లేకపోతే ఈ సమస్యకి మొదటి ప్రత్యామ్నాయం ఏమిటి?"

"రెండో ప్రత్యామ్నాయం ఏమిటి?"

"వీటిలో ఏది మంచిది?"

ఏ సమస్యకీ వీటికి భిన్నంగా పర్యవసానాలుండవు.

ఉదాహరణకి. కాలుకి ఆపరేషన్ జరపాలి. పర్యవసానాలు: 1. కాలు బాగుపడుతుంది. మంచిదే. ఉద్దేశం అదే. 2. మూడు నెలలు కుంటిగా నడవక తప్పదు. మూడు నెలలు మన పని చెడకుండా తట్టుకోగలమా? 3. అస్సలు కాలు బాగుపడదు. ఇప్పుడున్న సమస్య అదే కదా? ఇవీ ఆలోచనలు. ఇంతవరకూ మేమిద్దరం ఈ విచికిత్సలో పరాజయం పొందలేదు –అన్ని పర్యవసానాలూ మా కళ్ల ముందున్నాయి కనుక.

విచిత్రమేమిటంటే మాకంటే గొప్పగా, సునిశితంగా ఇలాంటి ఆలోచనలు చేసే యంత్రాంగం ఒకటి ఉన్నదని మాకు ఈ మధ్యనే అర్థమయింది. అసలు కథ ఇది. అన్నా హజారే, ఆయన మనుషులూ అవినీతిని తుదముట్టించాలంటున్నారు. యంత్రాంగం ఆలోచనలు:

1. అది అసాధ్యం. మనకి తెలుసు. అన్నాకి తెలీదు. తెలియజెప్పడం సాధ్యం కాదు –ఆయన వీధిన పడ్డాడు కనుక.

2. అన్నా ఉద్యమం వల్ల మన ప్రతిష్ట మంటగలుస్తుంది. కనుక ఆయన్ని ఒప్పించడమో, తలవొంచడమో చెయ్యాలి. (తలవొంచే పని దిగ్విజయ సింగ్ సమర్థవంతంగా సాగిస్తున్నారు. ఒప్పించే ప్రయత్నం కపిల్ సిబల్ చేస్తున్నారు) రెండూ సాధ్యం కాకపోతే?

3. అన్నా కొంపముంచుతాడు. ఈలోగా అతని కొంప మనం ముంచగలమా? బాబా రాందేవ్ కొంపముంచాం. రాజకీయమైన 'మతలబులు' తెలియని వాళ్లని రొచ్చులోకి దించి గజిబిజి చెయ్యడం సుళువు. అప్పుడే అన్నా హజారేకి ఈ రొచ్చు అర్థమయి మౌనవ్రతంలో పడ్డాడు. మనిషి అలిసిపోయి, మన పన్నాగాలకి తలవొంచుతున్నాడనడానికి ఇది సూచన. ఈ లోగా ఒక అనుచరుడిని కొందరు కొట్టారు. మరొకరిమీద చెప్పులు వేశారు. మరో ఇద్దరు ఉద్యమం లోంచి తప్పుకున్నారు. మన ప్రయత్నంలో ప్రాథమిక విజయం మనదే.

రాజకీయ నాయకులకి తెలుసు –అవినీతి లేకుండా వాళ్లకి ఉనికి లేదని. ఈ దేశంలో ఇంతమంది నాయకులు –కేవలం దేశాన్ని ఉద్ధరించడానికే కంకణం కట్టుకుని కృషి చేస్తూంటే దేశం ఇలా ఎందుకు ఏడుస్తుంది? కేవలం దేశసేవకే రాజకీయాల్లోకి దిగే అసమర్థులెవరూ ఈ రోజుల్లో లేరు. కనుక అన్నా హజారే డిమాండ్ చేసే బిల్లుని చెడగొట్టే ప్రయత్నం ఒకపక్క చేస్తూ, ఒకవేళ బిల్లు చేసినా –మన పనులు చెడకుండా ఉండే




లొసుగులు సమృద్ధిగా ఉండేటట్టు చూసుకోవాలి. వీలైనంత వరకూ ఈ బిల్లు –మహిళా రిజర్వేషన్ బిల్లులాగ అటకెక్కించడానికి లేదా 2014 దాకా వాయిదా పడేటట్టు చూడడానికీ ప్రయత్నించాలి.

అన్నా ఉద్యమం మీద ప్రజలకి నమ్మకం సడలితే ఆయన మరో బాబా రాందేవ్ అవుతాడు. ఈ దేశంలో దేన్నయినా భ్రష్టు పట్టించాలంటే రెండు మూడు సాకులున్నాయి. ఇవి గొప్ప ప్రచార సాధనాలు. అవి మాయావతి, దిగ్విజయసింగ్, లల్లూ వంటి నాయకులకు కొట్టినపిండి.

1. ఇందులో ఆర్ఎస్ఎస్ హస్తం ఉంది.

2. నా ప్రత్యర్థులు నామీద పన్నుతున్న కుట్ర ఇది.

3. ఇదీ అదీ కాకపోతే –ఇందులో విదేశీ హస్తం ఉంది.

ఈ దేశంలో అవినీతిని అరికట్టడానికి దిక్కుమాలిన చట్టాలు బోలెడు ఉన్నాయి. ప్రభుత్వాలకి అరికట్టే మనసే లేదు. అరికడితే వారికి గతిలేదు. అరికడితే ఈ బోడి పదవులెందుకు? (ఏ చట్టం దయానిధి మారన్ అనే మంత్రిగారింట్లో 300 టెలిఫోన్ లైన్లను ప్రతిష్టించే అవినీతిని ఆపగలిగింది? ఎవరైనా గమనించారా? రాజ్‌కుమార్ అనే కన్నడ హీరోగారిని వీరప్పన్ అనే వీరుడు అప్పుడెప్పుడో పదేళ్లకిందట ఎత్తుకుపోయాడు. ఈ పదేళ్లలో వీరప్పన్ చచ్చిపోయాడు. రాజ్‌కుమార్ కూడా వెళ్లిపోయారు. నిన్ననే ఆ కేసు విచారణ ప్రారంభమయింది! ఇది ఈ దేశంలోని న్యాయానికి సంబంధించిన పెద్ద జోక్!)సరే. అసలు విషయానికి వస్తే –ఈ దేశంలో నిజాయితీపరుడికి ఒకే తోవ –రాజమార్గం. కాని అవినీతి పరుడికి ఎన్నో సందులు. చక్కని రాజమార్గములుండగ సందులు ఎందుకు వెదకాలి అన్నారు త్యాగరాజస్వామి. తిరువయ్యూర్‌లో పాటలు రాసుకునే పెద్దమనిషి పెద్దకల ఇది. ఢిల్లీలో వుంటే ఆయనకి ఆ అవసరం తెలిసొచ్చేది. అన్నా హజారేకి ఇంతవరకూ అర్థంకాని, ఇప్పుడిప్పుడే అర్థమవుతున్న, ముందు ముందు బాగా వంటబట్టే 'కనువిప్పు' ఒకటి ఉంది.

లోగడ ఆయన జిల్లా స్థాయిలోనో, నగర స్థాయిలోనో, మునిసిపాలిటీ స్థాయిలోనో –బెంచి క్లర్కునీ, పంచాయతీ ప్రెసిడెంటునీ, ఓ చిన్న సూపర్నెంటునీ నిలదీసి ఉద్యోగాల్లోంచి బర్తరఫ్ చేయించడం సులువు. మాలేగాంలో అన్నా మహా పర్వతం కావచ్చు. కాని ఢిల్లీలో 'అవినీతి'కి పట్టాభిషేకం చేసి నిలదొక్కుకున్న ఎవరెస్టు శిఖరాలున్నాయి. వాటిని కదపబోయిన వారి పునాదులు కదపడం వారికి వెన్నతో పెట్టిన విద్య. నిజాయితీ పరుడి చిత్తశుద్ధి అతని బలం కావచ్చు. కాని అతనిమీద బురదజల్లే మహానుభావులకి ఆయన మనసు గాయపరచడం తేలిక. అవినీతి పరుడి 'ఆత్మరక్షణ' ఆయుధాలు మరీ బలమైనవి. వెయ్యిమంది నిజాయితీ పరుల్ని ఊచకోత కోసే పదునైన ఆయుధాలు వారి పొదిలో ఉంటాయి. పాపం, అన్నా మౌనవ్రతంలో ఒక నిజాయితీపరుడి విసుగు ఉంది. కాని సుప్రీం కోర్టులో న్యాయవాదిని కొట్టిన ముష్కరత్వంలో, కేజ్రీవాల్ మీద చెప్పువిసిరిన కుసంస్కారంలో రాజకీయ నాయకుల తొలి విజయం ఉంది.

***(అక్టోబర్ 24,2011)***

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

# (October 31,2011) Mitrulu Avasarala మిత్రులు అవసరాల

అవసరాల కాస్త ఆలస్యంగా నా జీవితంలో ప్రవేశించారు. ఆయన రచనలూను. అంతవరకూ ఎక్కడో ప్రవాసంలో ఉంటూ కథలు రాసే రచయితగానే నాకు తెలుసు.

సరసమైన సరదా రచనల రచయిత అని నా మనస్సులోని భావన. అవసరాలని కలిశాక నా ఆలోచనలెన్నింటినో మార్చుకున్నాను. చుట్టూ ఉన్న అస్తవ్యస్త ప్రపంచంలోంచి చాలా రుగ్మతల్ని వడబోసి – వాటిలోంచి 'సరదా'ని పిండిన రచయిత. ఆయన ఇబ్బందులు నాకు తెలుసు. చుట్టూ ఉన్న ప్రపంచంలో ఒదగక తప్పని ఇరకాటాలూ తెలుసు. కానీ ప్రతి చాలా ఛాలెంజ్ నుంచి మొండిగా వెలుగు రేఖని చూడడం అలవాటు చేసుకున్న మనిషి.

చక్కని క్రమశిక్షణ, మర్యాదలు తెలిసిన మనిషి, నాకోసారి తన కథల పుస్తకం ఇవ్వాలన్నారు. నేను వస్తానన్నాను. "నా కథల పుస్తకం ఇవ్వడానికి మీరు రావడమేమిటి? నేనే మీ ఇంటికి వస్తాను. అప్పుడు మా ఇంటికి రండి" అని ఆటోలో వచ్చి నన్ను తీసుకెళ్ళారు.

ఏదయినా మనస్సుకి నచ్చిన పనయితే పసిపిల్లాడిలాగ పొంగిపోయి పండగ చేసే మనిషి. తన జీవితంలో 'రచన'ని అద్భుతమైన ఆటవిడుపుని చేసుకున్న మనిషి. ఆయన రచనల్లో సాంద్రత వయస్సుతోపాటు చిక్కనయింది.

ఆయనకి దేవుడూ, దెయ్యాల మీద నమ్మకం లేదు. నేను కేవలం పరమార్థాన్ని నమ్ముకున్న ఓ వైష్ణవుని కథ "సాయంకాలమైంది" నవల రాశాను. ఇండియా టు డే పత్రికకి సమీక్షని రాశారు అవసరాల. బహుశా అందులోంచి పరమార్థాన్ని మినహాయించి 'పలుకు'ని పట్టుకోవడం ఆయన కత్తి మీద చేసిన సాము అనుకుంటాను. నవ్వుకున్నాను. పైగా నాకు మిత్రులు. చాలా హృద్యంగా, పెద్దరికంతో రాశారు.

మా ఇద్దరికీ భరాగో (భమిడిపాటి రామగోపాలం)ని చూస్తే ఆశ్చర్యమూ, అబ్బురమూ. భరాగోకి ఉన్న అనర్థాలలో ఏ ఒక్కటి ఉన్నా మేం ఏ మాత్రం ఏమీ చెయ్యలేమనుకునేవాళ్ళం. ఆ కారణానికే – మాకు ఏ చిన్న అవసరం ఎదురయినా మా పక్కన భరాగో పెద్ద గీతలాగా కనిపించేవాడు.

తనకి నచ్చని విషయాల్ని కుండబద్దలు కొట్టేటట్టు చెప్పేవారు. నచ్చిన విషయమయితే పసివాడయిపోయేవారు. ఈ ఒక్క కారణానికే నా ఆత్మకథ చిత్తుప్రతిని ఆ దశలో ఆయనకి చదవడానికి ఇచ్చాను. మరో మిత్రులు డాక్టర్ పప్పు వేణుగోపాలరావు.

ఆ అవకాశం ఇచ్చినందుకే పొంగిపోయారు. 'గొల్లపూడి మారుతిరావు ఆత్మకథకు మొట్టమొదటి పాఠకుడు కావడం నా అదృష్టం' అంటూ ఆయనకి సరదా పుడితే కవిత్వం వేపు మళ్ళిపోతారు:




ఎరగని రంగం ఉందా?

జరగని సన్మానసీమ జగతిని ఉందా?

తిరగని దేశం ఉందా?

పరచిన ఈ అనుభవాల ప్రతిభకు జేజే – అన్నారు.

నేను 'వందేళ్ళ కథకు వందనాలు' ధారావాహిక తలపెట్టినప్పటి నుంచి ఆయనకి చెపుతూనే ఉన్నాను. వివరాలు విన్నకొద్దీ పొంగిపోయారు.

"చాలా బాగుందండీ. మరెవరూ చెయ్యలేరు" అంటూ నన్ను ప్రోత్సహిస్తూ వచ్చారు. తనకి నచ్చిన వంద కథల జాబితాను పంపిన మొదటి రచయిత అవసరాల.

తీరా విజయదశమి నాడు మొదటి కర్టెన్ రైజర్ ప్రసారమయినప్పుడు – నాకు వచ్చిన మొట్టమొదటి ఫోన్ అవసరాలదే. "మా ఆవిడని కూడా టీవీ ముందుకి లాక్కొచ్చి కూర్చోపెట్టాను" అంటూ పొంగిపోయారు.

నవంబరు 11 న నన్నెవరో సభకి విశాఖపట్నం ఆహ్వానించారు. వెళ్ళడానికి ప్రోత్సాహం ఈ ధారావాహికకి పెద్దల్ని రికార్డు చేయడమే. అయితే షూటింగ్ అడ్డొచ్చి – డిసెంబరుకి ప్రయాణం వాయిదా వేసుకున్నాను – శాశ్వతంగా అవసరాలను నష్టపోతానని తెలియక.

మొన్న – అయిదారు రోజులకిందట హైదరాబాదులో మల్లాది నరసింహ శాస్త్రిగారిని రికార్డు చేస్తున్నాను – వారి తండ్రిగారు మల్లాది రామకృష్ణ శాస్త్రిగారి గురించి. "అవసరాల రామకృష్ణారావుగారట. హైదరాబాదు ఆసుపత్రిలో ఉన్నారట. ఫోన్" అని మా అసిస్టెంటు ఇచ్చారు.

అవసరాలేమిటి? హైదరాబాదులో ఏమిటి? మొబైల్ లో నంబరు నొక్కి అంతలో మరో రికార్డింగుకి పరిగెత్తాను. ఇవాళ ఈ వార్త. అవసరాల ఆఖరి పలకరింత, ఆయన ప్రయత్నించి ఫోన్ చేసినా అందుకోలేకపోయాను.

కొన్ని జ్ఞాపకాల ఊలుదారాలు అతి సున్నితంగా ఉంటాయి. అయితే ఆ కారణానికే అవి మన్నికగా మనల్ని పెనవేస్తాయి. అవసరాల – మనస్సులోపలి పొరల్ని అల్లుకున్న మన్నికయిన ఊలుదారం.

*(అక్టోబర్ 31,2011)*




# (November 07,2011) Karnuni Parivedana కర్ణుని పరివేదన



ఆయన తల్లిదండ్రులెవరో పురాణాల్ని బాగా తెలిసినవారు. పుట్టుక గొప్పదయినా పెంపు తక్కువయిన కర్ణుడి పేరు కొడుక్కి పెట్టుకున్నారు. ఆయన దళితుడు. అయినా బాగా చదువుకుని న్యాయమూర్తి అయ్యారు. ప్రస్తుతం ఆయన తమిళనాడులో హైకోర్టు న్యాయమూర్తి.

శ్రీరామ అంటే బూతు మాటా అన్న సామెత ఉంది. అయితే కొన్ని సందర్భాలలో శ్రీరామ అంటే బూతుమాటే. కనీసం కొందరికి. హిరణ్య కశిపుడు తన కొడుకు 'నారాయణ' అంటే క్రోధంతో వొళ్లు మరిచిపోయాడు. ఇప్పటికీ శ్రీలంకలో రావణుడు పరిపాలనా దక్షుడయిన ప్రభువు వారికి. రాజీవ్ గాంధీ హంతకులు ఈ దేశంలో కొందరికయినా క్షమాపణకి అర్హులయిన అమాయకులు. దృష్టి వైవిధ్యాన్ని సూచించడానికే ఈ ఉదాహరణలు.

సాధారణంగా అందరూ గుర్తుంచుకోని విషయాలు కొందరిని అమితంగా బాధిస్తాయి. కారణం వారి ఆత్మ న్యూనతా భావం అని సరిపెట్టుకోడానికి వీలులేదు. కర్ణుడి గారి పరిస్థితి ప్రస్తుతం ఇదే. మొన్న ఆయన ఒక పెళ్లికి వెళ్ళారు. ఆయన పక్కన మరో సాటి న్యాయమూర్తి కూర్చున్నారు. ఈయన దళితుడు కాదు. కూర్చున్నవాడు తిన్నగా కూర్చోక కాలు మీద కాలు వేసుకుని – కుడికాలు పక్కనున్న కర్ణుడు గారికి తగిలేటట్టు కూర్చున్నాడు. ఇది సాటి న్యాయమూర్తులు– ఆడా మగా అంతా గమనించి నవ్వుకుంటున్నారు. ఇది అనుకోకుండా జరిగిన పనికాదు. కావాలనే చేశారు. కర్ణుడు గారు సరిపెట్టుకుని దూరంగా జరిగి కూర్చున్నారు.

మొన్నటికి మొన్న రిపబ్లిక డే రోజున మరో సాటి న్యాయమూర్తి– (ఈయనా దళితుడు కాదు)– తనని అవమానించాడు. ఎలాగ న్యాయమూర్తుల పేర్లు నిర్వాహకులు ఆయా కూర్చీలకు అంటించారు. ఫలానా న్యాయమూర్తి కావాలనే కర్ణుడిగారి చీటీని చించి, బాగా నలిపేసి తన పాదం కింద అంటించుకుని కాలు ఊపుతూ కూర్చున్నాడు. మిగతా వారు చూసి ఆనందిస్తున్నారు. అంటించుకున్న న్యాయమూర్తీ సంతోషిస్తున్నాడు. ఇలాంటి వివక్ష అన్యాయం, అక్రమం న్యాయంగా వీటిని తమ పెద్ద అయిన ప్రధాన న్యాయమూర్తికి వీరు ఫిర్యాదు చేయాలి. కాని కర్ణుడుగారు దళితుల జాతీయ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనలు కేవలం అనుకోకుండా జరిగినవి కావని, ఉద్దేశ్యపూర్వకంగా జరిపినవేనని నిరూపించడానికి కర్ణుడిగారి దగ్గర సాక్ష్యాలూ,చూసిన సాక్షులూ ఉన్నారు. రుజువులున్నాయి.

ఈ విషయాలను కర్ణుడుగారు ఒక పత్రికా సమావేశాన్ని ఏర్పాటు చేసి పాత్రికేయులకు వివరించారు. మీరిలా అపోహ పడ్డారేమోనని ఒక పత్రికా రచయిత అన్నప్పుడు కాదని నిరూపించే రుజువులు తన దగ్గర ఉన్నాయని కర్ణుడుగారు నొక్కి వక్కాణించారు. ఇది తేలికగా తీసుకునే విషయం కాదు. ఇక్కడ మరో విషయం చెప్పడం అనౌచిత్యం కాదు. ప్రేమించి పెళ్లి చేసుకున్న యువతీ, యువకులకు అభిప్రాయ బేధాలొస్తే వారి దృష్టి తమ పెళ్లి మీదకీ, తాము తీసుకున్న నిర్ణయం మీదకీ పోతుంది. తమ 'పెళ్లి'లోనే లోపం ఉందనుకుంటారు. పెద్దలు చేసిన పెళ్లికి మూలాధారం– సంప్రదాయం. పిల్లలు చేసుకున్న పెళ్లి బలమో లేదా బలహీనతో – వారి నిర్ణయం.




ఆ నిర్ణయం తప్పని వారికి ఎప్పుడనిపించినా ఆ పెళ్లికి ముప్పు తప్పదు.

నేను తాడి చెట్టుకీ తాత పిలకకీ ముడి వేస్తున్నాననిపించినా – ఈ రెండు సందర్భాలలోనూ చిన్న పోలిక ఉంది. పక్కన కూర్చున్న వ్యక్తి కాలు తగిలే సందర్భం ఎవరికీ కొత్త కాదు. తెలిసిన వెంటనే పక్క వ్యక్తి 'సారీ' అనడమూ, సర్దుకు కూర్చోవడమూ జరుగుతుంది. అక్కడితో ఆ సందర్భానికి తెర పడుతుంది.

అలాగే – సభలో ఒక కుర్చీకి అతికించిన చీటీ వూడి కిందపడడమూ, కాలికి అంటుకోవడం అసాధారణం కాదు. కాలికింద అంటుకున్న చీటీని ఆ వ్యక్తి గుర్తించకపోవడమూ అసాధారణం కాదు. ఆయన మరో మిత్రుడితో మాట్లాడుతూ నవ్వుకోవడానికీ ఈ చీటీకీ ఎటువంటి సంబంధమూ లేకపోవచ్చు. ఆ పక్కన కూర్చున్నది కర్ణుడుగారు కాకపోతే ఈ ఆలోచనలన్నీ సబబుగా కనిపిస్తాయి.

కాని కర్ణుడుగారికి అలా అనిపించలేదు. ఆయన ఆయా సంఘటనలకీ తన 'కులానికీ' సంబంధం ఉన్నదని భావించారు. అందుకు బోలెడన్ని రుజువులూ, కారణాలూ ఆయనకి ఉన్నాయి. దళితుల పట్ల అత్యాచారాలు– ఇంకా ఈ దేశంలో – ముఖ్యంగా ఉత్తర హిందూ దేశంలో యిప్పటికీ ముమ్మరంగా జరుగుతున్నాయి. అమెరికాలో 'రంగు' వివక్షలాంటిదిది.

అయితే మారుతున్న సామాజిక దృక్పథం, చట్టాలు, ఆయా వర్గాలకు ప్రభుత్వం ఇచ్చే మద్దతు– యివన్నీ – నచ్చకపోయినా సర్దుకుపోయేవారూ, తప్పనిసరిగా తలవొంచేవారూ– ఇప్పటికీ ఉన్నారు – నల్లవారిని – ఆ మాటకి వస్తే రంగుతక్కువ వారినందరినీ ఈసడించుకునే తత్వం ఇప్పటికీ అమెరికాలో, ఇంగ్లండు వంటి దేశాలలో కనిపిస్తుంది.

సామాజిక పరిణామంలో న్యాయమూర్తి స్థాయికి చేరగలిగిన ఒక చదువుకున్న దళితుడిలో ఈ న్యూనతా భావం – ఎంతో కొంత అభద్రతనీ, ఇంకా మనస్సులో తొలగిపోని వ్యత్యాసాన్నీ ప్రతిఫలిస్తుంది. దీనికి కారణం ఆయన దృక్పథం అనడానికి వీలులేదు. అలాంటి ఆలోచనలకు ఇంకా తావు కల్పిస్తున్న సమాజ ధోరణి .

వినడానికి, చూడడానికి అతి చిన్నవిగా కనిపించే సంఘటనలు – ఆలోచనలో సెన్సిటివ్‌గా భావించక తప్పని – ఇంకా మనస్సుని కలుక్కుమనిపించే స్థితిలో బాధిస్తున్న సమాజమూ ఉంది. బాధపడే మనుషులూ ఉన్నారు – అందుకు నిదర్శనం – కర్ణుడు.

*(నవంబర్ 07,2011)*

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

# (November 14,2011) Kadupu Chinchukunte కడుపు చించుకుంటే

చాలా సంవత్సరాల కిందట నేనో ఆస్తిని కొన్నాను. రిజిస్ట్రేషన్ చార్జీలు కట్టింది పోగా మరో 30 లక్షలు చెల్లించాల్సి ఉంది. రూలు ప్రకారం అది అనవసరం. అన్యాయం. కనుక కోర్టుకి వెళ్లి ఆ మొత్తాన్ని తగ్గించే ప్రయత్నం చెయ్యవచ్చన్నారు లాయరు. ఇందువల్ల మరో లాభం.

కేసు తేలేవరకూ డబ్బు చెల్లించనక్కరలేదు. ఈ వ్యవధిలో వడ్డీ పడదు. కోర్టులో కేసు వేశాను. 30 లక్షల బాకీ వుంచుతూ –ఒక ఆరు నెలలు చెల్లించడానికి గడువునిచ్చి ఆస్తిని రిజిస్టర్ చేశారు.

ఇది సివిల్ కేసు. మరో నెల తర్వాత ఒకాయన నా దగ్గరికి వచ్చాడు. ఈయన ఇలాంటి కేసుల్లో పండి ముదిరిన మధ్యవర్తి. గవర్నమెంటు ఉద్యోగే. ఈయన చిరునవ్వు నవ్వుతూ –ఈ సమస్యకి మూడు పరిష్కారాలు ఉన్నాయన్నాడు.

1. కేసు జరిగినంతకాలం జరగనిచ్చి –కోర్టు నిర్ణయం ప్రకారం మొత్తాన్ని చెల్లించడం. అది ఎవరైనా చేసే, చెయ్యాల్సిన పని.

2. ఈ కేసు నాలుగేళ్లు సాగాలా? అయిదేళ్లు సాగాలా? (ఈలోగా 30 లక్షలు కట్టే భారం ఉండదు కనుక)

3. అసలు శాశ్వతంగా ఈ సమస్యకి పరిష్కారం కావాలా? అంటే ఇక ఎప్పుడూ డబ్బు చెల్లించనక్కరలేదు.

నేను ఆశ్చర్యపోయాను. అదెలాసాధ్యం? ఉద్యోగి సర్వాంతర్యామిలాగ నవ్వాడు. అయ్యా, తమరు సెలవిస్తే ఆ ఫైలు ఆఫీసులోంచి పూర్తిగా మాయమయే ఏర్పాట్లు చేస్తాం. గుమాస్తాలకు చూసిందే గుర్తు. మేం గుర్తు లేకుండా చేస్తాం. దానికి 'ఖర్చు' అవుతుంది. నేను నిశ్చేష్టితుడినయాను.

మనకి చట్టాలున్నాయి. నిబంధనలున్నాయి. కాని వాటిని బుట్టదాఖలు చేసే కిటుకులూ ఉన్నాయి. డబ్బు ఖర్చు చేస్తే చట్టాల్ని తుంగలో తొక్కే మేధావులూ ప్రభుత్వంలోనే ఉన్నారు. సమాచార చట్టం ఉంది. దాని ప్రకారం ప్రభుత్వ విభాగాలలో ఏం జరుగుతుందో పూసగుచ్చినట్టు పౌరుడు తెలుసుకొనే అవకాశం ఉంది. కాని ఆ విభాగంలో ఫైలే గల్లంతయితే!

ఇప్పుడు రెండు గొప్ప ఉదాహరణలు. ఢిల్లీలో 6 కృష్ణమీనన్ మార్గ్ బంగళా ఒకప్పుడు జగ్జీవన్‌రామ్ నివాసం. ఆయన పోయాక ఆ బంగళాను వారమ్మాయి మీరా కుమార్‌కు కేటాయించారు. ఆమె అందులో ఉండనంది. అప్పుడు దాన్ని స్మారక మందిరమన్నారు. అయితే 2000 లో ఇలా బంగళాలను స్మారక మందిరాలుగా మార్చకూడదని మంత్రిమండలి తీర్మానించింది. అయినా ఇన్నేళ్లూ ఇది ఖాళీగానే ఉంది. ఎందుకని? ఇది అన్యాయమంటూ సుభాష్ చంద్ర అగర్వాల్ అనే ఆయన సమాచార చట్టం కింద వివరాలను ఇవ్వమన్నారు. అయితే ఆ బంగళాకు సంబంధించిన ఫైలు డిపార్టుమెంటులోంచి గల్లంతయింది!




మరోముచ్చట. దయానిధి మారన్ అనే టెలికాం మంత్రిగారు పదవిలోకి వచ్చాక 322 టెలిఫోన్ లైన్లతో ఇంట్లోనే ఒక టెలిఫోన్ ఎక్స్చేంజీని స్థాపించుకున్నారు. ఈ కథ ఈ మధ్యనే వీధినపడి సిబిఐ దర్యాప్తు ప్రారంభమయింది. ఈ నిర్వాకం అలనాడు బిఎస్ఎన్ఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ గా ఉన్న ఎమ్.పి.వేలుస్వామిగారి హయాంలో జరిగింది.

ప్రస్తుతం వేలుస్వామిగారు రిటైరయి సేలంలో ఉంటున్నారు. ఎప్పుడైతే దర్యాప్తు ప్రారంభమయిందో వేలుస్వామిగారు చెన్నై చేరుకున్నారు. వరస తప్పకుండా ఆఫీసుకి వెళ్తున్నారు. ఎందుకు? అధికారిగా ఉంటే ఫైలుని గల్లంతు చెయ్యడం తేలిక. ఇప్పుడు జాగ్రత్తగా కాగితం కాగితం బయటికి లాగి మాయం చేస్తున్నారు. ఇది సిబ్బంది కనిపెట్టారు. రేపు విచారణ జరిగితే సిబ్బంది ఈ కుంభకోణంలో ఇరుక్కుంటారు. తీరా ఈ ఘనకార్యం చేసేది ఇకప్పటి పెద్ద ఉద్యోగి. ఎలా? ఈ వ్యవహారం జాతీయ టెలికాం ఉద్యోగుల ఫెడరేషన్ చెవిలో వేశారు. ఈ మధ్య 200 మంది ఉద్యోగులు పరశువాక్కంలోని అధికారి ఆఫీసుముందు ఘెరావ్ చేశారు. వారి ఫిర్యాదు: రిటైరైన వేలుస్వామిగారు రోజూ ఆఫీసుకి వస్తున్నారు. రిటైరైయాక వారికేంపని? ప్రతిరోజూ చీఫ్ జనరల్ మేనేజరు కార్యాలయంలో కీలక ఫైళ్లని తిరగేస్తున్నారు. కొన్ని కీలక కాగితాలు మాయమౌతున్నాయి. ఇదీ వారి ఆరోపణ.

"నా అవసరాలకు వెళ్తున్నాను. రావద్దంటే మానేస్తాను" ఇదీ ఘనత వహించిన వేలుస్వామి స్పందన కీల్పాక్ పోలీస్ స్టేషన్‌లో పోలీసు ఇన్‌స్పెక్టర్ ముత్తుకుమార్ కేసు నమోదు చేశారు.

అయ్యా, కడుపు చించుకుంటే కాళ్లమీద పడుతుంది.

సమాచార చట్టాన్ని గంగలో కలిపే ప్రయత్నాలు ఈ మధ్య కేంద్రం ముమ్మరంగా చేస్తోంది. ఆ ప్రయత్నాన్ని చేపట్టి పూర్తిగా ఉద్యోగులు సాధించారని ఈపాటికే వారికి తెలిసి ఉండాలి. ఒకవేళ ఎవరైనా అమాయకంగా నిజాలు తవ్వబోతే వాళ్లప్రాణాలు తీసేప్రయత్నాలూ విజయవంతంగా సాగిపోతున్నాయి. మనకి బోలెడంతమంది వేలుస్వాములున్నారు. దయానిధులున్నారు.

ప్రస్తుతం సమాచార హక్కు కాగితం మీదే ఉంది. క్రమంగా ఆ కాగితాలు గల్లంతవుతున్నాయి.

*(నవంబర్ 14,2011)*



# (November 21, 2011) Devadutalaku Ahvanam దేవదూతలకు ఆహ్వానం

నేరం ఎప్పుడూ నిర్దయగా, కర్కశంగానే ఉంటుంది. అయితే జాలిగా, సానుభూతితో, కసితో పీకకోసే సందర్భాలూ, కథలూ ప్రపంచ సాహిత్యానికి దగ్గర తోవలు. గోవిందనిహలానీ 'ఆక్రోష్', కాళీపట్నం రామారావుగారి 'యజ్ఞం' ఇందుకు మచ్చుతునకలు. ఇవి మినహాయింపులు. మిగతా అన్ని సందర్భాల్లోనూ నేరం నేరమే. నేరానికి శిక్షకి రెండు పార్శ్వాలు. అలాంటి నేరం జరగకుండా 'శిక్ష' ఒక అంక్ష కావడం, చేసిన నేరస్థుడిని హింసించడం ద్వారా అలాంటి నేరం పునరుక్తి కాకుండా అరికట్టడం. ఇది ఆయా సమాజాలు సమష్టిగా ఏర్పరుచుకున్న వ్యవస్థలు. అదే న్యాయ వ్యవస్థ. మళ్లీ ఇందులో వ్యవస్థ తన విచక్షణతో –ఏర్పరిచిన వెసులుబాట్లు –కొన్ని మినహాయింపులూ, రాయితీలూ ఉన్నాయి. రూఢిగా 'అపరాధి' అని నిర్ధారణ అయే వరకూ శిక్ష వెయ్యకు. ఆడవారికీ, గర్భిణీ స్త్రీలకూ కొంత విచక్షణ చూపించు. సత్ప్రవర్తనకి శిక్షలో రాయితీ నేరస్థుడి మానసిక ప్రవర్తనకి ఉద్దీపన. ఇలాగ. యావజ్జీవ కారాగారశిక్షని 18 సంవత్సరాలకి కుదించారు. మళ్లీ సత్ప్రవర్తనకి ఇందులో మినహాయింపు ఉంది. ఇవన్నీ సదుద్దేశంతో, అర్హత గలవారికి అందేటట్టు చేయడం వ్యవస్థలో ఆరోగ్యకరమైన, ఆర్ద్రమయిన, మానవత్వపు విలువల పరిపుష్టికి నిదర్శనం. ఇంతవరకూ ఈ ఏర్పాట్లన్నీ వ్యవస్థని చూసి గర్వపడవలసిన విషయాలు. అయితే ఈ దేశపు ప్రధానిని దారుణంగా హత్యచేసి, అతనితో పాటు మరో 18 మంది నిరపరాధుల మారణహోమానికి కారణమైన నేరస్థులను న్యాయవ్యవస్థ విచారణ జరిపి, నిర్ధారించి మరణ శిక్ష విధించాక –పాలక వ్యవస్థ కారణంగా –శిక్ష అమలు జరగని నేపథ్యంలో వారిని నిరపరాధులుగా విడుదల చేయాలని ఓ పార్టీ నినాదం –చక్కని ఉద్యానవనంలో 'మెజారిటీ' అనే క్రూరమృగం విహారం వంటిది. గర్భవతి అని తెలిసీ నళినికీ కూడా ఉరిశిక్షని న్యాయస్థానం విధించాక –సోనియాగాంధీ అనే హతుడి భార్య క్షమాభిక్షని కోరడం సమాజ నియతిని కాదని ఓ వ్యవస్థ ఏర్పాటుకి అడ్డుకట్ట వేయడం. ఆ మాత్రపు విచక్షణ ఇన్ని విధాలుగా రాయితీలను కల్పించిన న్యాయవ్యవస్థ దృష్టిలోకి రాలేదనుకోవడం కంటే తెలివితక్కువతనం మరొకటి లేదు. తీరా వ్యవస్థ ఒక వ్యక్తి ప్రతిపాదనకి తలవొగ్గడం ఆనాటి మెజారిటీ రాజకీయపు పరిణామమే. పోనీ, ఇదీ ఈ జాతి దయాగుణానికి ప్రతీకగా గర్వపడదాం. బాధ్యత లేకుండా, స్నేహితులతో తైతక్కలాడడానికి బార్‌కి వచ్చి జెస్సికాలాల్‌ని కాల్చి చంపిన మనూశర్మ అనే రాక్షసుడు జైలుకి వెళ్ళకుండా తప్పించుకుని హాయిగా జీవించడం –ఈ వ్యవస్థ అసమర్థతకి చిహ్నం. కేవలం మాధ్యమాల ప్రమేయం కారణంగానే ఈ కేసుని తిరగదోడి ఆ దౌర్భాగ్యుడిని జైలుకి పంపడం న్యాయవ్యవస్థలో లొసుగుకి నిదర్శనం.

ఇంతవరకూ ఈ కథ వ్యవస్థలో న్యాయానికి పట్టిన దుర్గతికి, లేదా చెల్లుబాటు గలవారు వ్యవస్థని ఎంత హాస్యాస్పదం చేయగలరో నిరూపించే ఉదాహరణ. ఈ తర్వాతి కథ మరీ దారుణం. వాళ్లమ్మ అనారోగ్యానికని ఈ హంతకుడిపట్ల దయతలచి జైలునుంచి 'పెరోల్' ఇచ్చి తాత్కాలికంగా ఇంటికి వెళ్లే సౌకర్యాన్ని కల్పించింది న్యాయస్థానం. మంచిదే. అయితే ఆ తల్లి అనారోగ్యంతో కాక –క్రికెట్ ఆటని ప్రోత్సహించే కార్యక్రమాలలో పాల్గొంటూ టివి కెమెరాల ముందు దర్శన మిచ్చింది. ఈ హంతకుడు బారుల్లో విలాసంగా గడుపుతూ టివిలముందు దర్శనమిచ్చాడు. మళ్లీ జెస్సికాలాల్ సోదరి న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. మనూశర్మ మళ్లీ జైలుకి చేరాడు. ఇది పూర్వకథ ఇప్పుడు సదరు మనూశర్మగారు –తన తమ్ముడి పెళ్లికి హాజరుకావడానికి కోర్టుని ఆశ్రయించాడు. కల్లబొల్లి కబుర్లతో అబద్ధం చెప్పి

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

న్యాయస్థానాన్ని మోసం చేసిన ఈ హంతకుడికి మళ్లీ పెరోల్ లభించింది! ఏమైంది ఈ దేశంలో న్యాయానికి? ఎంతమంది హంతకులకి ఇలాంటి వెసులుబాటుని ఇస్తోంది ఈ న్యాయస్థానం? హంతకులు బారుల్లో తైతక్కలాడడానికీ, తమ్ముడి పెళ్లిళ్లూ, చెల్లెలు పిల్లల బారసాలలూ చూసే అవకాశం ప్రపంచంలో మరే వ్యవస్థలోనయినా జరుగుతోందా?

మరో అందమైన కథ. భారతి అనే అమ్మాయిని నితీష్ కటారా అనే యువకుడు ప్రేమించాడు. ఆ ప్రేమ వ్యవహారం తల్లిదండ్రులకి ఇష్టం లేదు. ఆమె డిపి యాదవ్ అనే ఓ నేర చరిత్రగల రాజకీయ నాయకుడి కూతురు. ఆమెని వారింప జూశారు. సాధ్యపడలేదు. నితీష్‌ని బెదిరించారు. చివరికి యాదవ్‌గారి తనయుడు సంతోష్‌కుమార్ నితీష్‌ని అతి దారుణంగా హత్య చేశాడు. తండ్రి గూండాయిజం, పలుకుబడి పెట్టుబడులుగా ఈ హంతకుడు స్వేచ్ఛగా తిరిగాడు. ఆ కుర్రాడి తల్లి నీలమ్ కటారా ఒంటరిగా పోరాటం సాగించి, కోర్టులు పట్టుకు తిరిగి న్యాయం కోసం పోరాటం సాగించింది. మాధ్యమాలు సహకరించాయి. తప్పనిసరిగా ఈ సంతోష్‌కుమార్ యాదవ్‌ను న్యాయస్థానం అరెస్టుచేసి, విచారణ జరిపి జైలుకి పంపింది. నేరస్థుడికి తగిన శాస్తి జరిగిందని దేశం సరిపెట్టుకున్న సందర్భమిది. తర్వాత ఏమయింది? నెలకి కనీసం అయిదుసార్లు చొప్పున -ఈ హంతకుడు తన తండ్రి పలుకుబడి పెట్టుబడిగా నాలుగు సంవత్సరాలలో 65 సార్లు అనారోగ్యం పేరుతో జైలునుంచి బయటపడి అయిదు నక్షత్రాల ఆసుపత్రిలో రాజభోగాలతో గడుపుతున్నాడు. మళ్లీ నీలమ్ కటారా గొంతు చించుకుంది. 'నేను ఒంటరిగా ఈ మాఫియాతో పోరాటం సాగించి అలసిపోయాను. ఈ వ్యవస్థకి మోక్షం లేదా?' అని ఈ తల్లి టివి కెమెరాల ముందు వాపోయింది.

అమెరికాలో ఇలాంటి నేరాలకి 80 సంవత్సరాలు, ఒక్కొక్కప్పుడు 100 సంవత్సరాలూ జైలు శిక్షలు వేస్తారు. అన్ని సంవత్సరాల నిందుతుడు బతికుంటాడా? అది ముఖ్యం కాదు. ఆ నేరం ఎంత ఘోరమయిందో శిక్ష సూచిస్తుంది. ముందు ముందు రాయితీల పర్వానికి ఇది అడ్డుకట్ట. జైలుకి వెళ్లిన నేరస్థులు జైళ్లనుంచి బయటికి వచ్చి న్యూయార్క్ వీధుల్లో, బారుల్లో స్వైరవిహారం చేసిన కథలు మనం వినలేదు. కేవలం మానవీయమైన కారణాలకి -మినహాయింపులు కల్పించిన అతి ఉదాత్తమైన న్యాయవ్యవస్థ లక్ష్యాన్ని ఈ అవకాశవాదులు, గూండాలు తమ పలుకుబడితో, డబ్బుతో, రాజకీయమైన పరపతితో భ్రష్టు పట్టిస్తున్న కథలు ఒక్క మన దేశానికే ప్రత్యేకం. మరణశిక్ష పడిన నేరస్థులను నిరపరాధులుగా విడుదల చేయాలని రాష్ట్రాల శాసనసభలు తీర్మానాలు చేయడం ఈ వ్యవస్థకే ప్రత్యేకం. పార్లమెంటు మీదే దాడి చేసిన కుట్రదారులకి సుప్రీం కోర్టు శిక్ష వేస్తే -రాష్ట్ర శాసనసభలో ప్రజలు ఎన్నుకున్న నాయకులు కుర్చీల్ని విరిచి, గుండెలు బాదుకునే 'మత' వైపరీత్యం ఈ దేశానికే ప్రత్యేకం. వ్యవస్థ నియతిని తమ పదవులూ, డబ్బూ నిలదీయగలదని -ఎంత గొప్ప న్యాయస్థానం నిర్ణయాన్నయినా వీధిన పెట్టగల శక్తిసామర్థ్యాలు తమకున్నాయని -ఓ నళిని, ఓ పెరారివాలన్, ఓ అఫ్జల్‌గురు, ఓ మనూ శర్మ, ఓ సంతోష్‌సింగ్‌ల తల్లిదండ్రులూ, పార్టీ నాయకులూ రహస్యంగా పండగ చేసుకుని న్యాయవ్యవస్థకి తొడగడానికి కొత్త గాజులు సిద్ధం చేయడం మనకి సూచనగా తెలుస్తోంది. నేరమూ, మోసమూ, బుకాయింపు, కోర్టుల కన్నుకప్పే ఈ హంతకుడికి పోలీసు శాఖ, న్యాయస్థానం మరోసారి పెరోల్ ఇవ్వడం ఇందుకు నిదర్శనం. ఈ దేశపు దౌర్భాగ్యస్థితికి -ఈ దేశపు న్యాయవ్యవస్థని 'నపుంశకం' చేయగలిగిన ఈ శక్తుల విజృంభణ కారణం. ఇలాంటి సందర్భాలలోనే నక్సలైట్లూ, మావోయిస్టులు వంటి అతివాదులు దేవదూతల్లాగ కనిపిస్తారు.

*(నవంబర్ 21,2011)*




# (November 28,2011) Nijam Vaddu–Abaddham Muddu నిజం వద్దు – అబద్ధం ముద్దు

ప్రపంచ ప్రఖ్యాత డచ్ చిత్రకారుడు రెంబ్రాంట్ ఒకమాట అన్నాడు: చిత్రాల్ని దగ్గరగా చూడకు. కంపుకొడతాయి –అని. చిత్రాల మాటేమోగాని ఈ మాట మనదేశంలో ప్రజా నాయకులకీ, డబ్బుని కూడవేసే చాలామంది పెద్దలకీ వర్తిస్తుంది.

ఉదాహరణకు ఒకప్పుడు పి.వి.నరసింహారావు మంత్రివర్గంలో టెలికాం మంత్రిగా ఉన్న సుఖ్‌రాంనే తీసుకోండి. ఆయన్ని మొన్నకాక మొన్న సుప్రీం కోర్టు నేరస్తుడని జైలుకి పంపింది కాని –ఈ 16 సంవత్సరాలూ ఆయన నాయకత్వంలో మనం ఆనందంగా గడిపామా లేదా? ఆయన్ని అయిదుసార్లు ఎమ్మెల్యేగా, మూడుసార్లు ఎం.పిగా ప్రజలు ఎన్నుకున్నారు. కాంగ్రెస్ 1996లో ఆయన్ని బహిష్కరించినా ఆయన హిమాచల్ వికాస్ కాంగ్రెస్ పార్టీని ఏర్పరుచుకుని కొత్త కుంపటి పెట్టారు. బి.జె.పి.లో చేరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి అయారు.

ఆ రోజుల్లో ఆయన పడక గదిలో మూడున్నర లక్షల రొక్కం సూట్ కేసుల్లో దొరికింది. అయ్యో, ఈ మాత్రానికే అయిదేళ్లు జైలుకి పంపాలా? మా వూళ్లో పంచాయతీ బోర్డు గుమాస్తా ఈ మాత్రం సొమ్ము సంపాదించగలడు అని తమకు అనిపించవచ్చు. కాని ఆనాటి మూడున్నర లక్షలు ఈనాటి డజన్ల కోట్లతో సమానమని తమరు గ్రహించాలి. కాగా ఈ 16 సంవత్సరాలలోనూ టెలికాం మంత్రులు సుఖ్‌రాం నుంచి రాజా వరకూ ఎంత అభివృద్ధిని సాధించారో మనకు అర్థమవుతుంది. ఇప్పటికీ తన 86వ యేట రాజాగారి సరసన తీహార్ జైల్లో ఉన్న సుఖ్‌రాం గారు బెయిల్ కోసం కోర్టుల్ని ఆశ్రయిస్తున్నారు.

మీరు గమనించాలి. నేను నేరాల గురించీ, నేర చరిత్రగల నాయకుల గురించీ మాట్లాడడం లేదు. ఇలాంటి నేరాలు రచ్చకెక్కడం వల్ల, కోర్టులు వీధిన పెట్టడం వల్ల 16 సంవత్సరాల పాటు పార్టీ నాయకులుగా, ఓ రాష్ట్ర ముఖ్యమంత్రిగా మన గౌరవాన్ని అందుకున్న వారి పరిస్థితిని ఆలోచించమంటున్నాను. ఇలాంటి నాయకునికా మనం ఈ రాష్ట్ర పాలనను అప్పగించాం. మంత్రిగా ఉంటూనే స్వాహా చేసిన ఈయన, ముఖ్యమంత్రిగా ఉంటూ ఎంత తిన్నాడో ఎవరికి ఎరుక? అని తమరు వాపోవచ్చు. నేను దాని గురించీ విచారించడం లేదు. ఈ నేరాల వల్ల మన కళ్లముందున్న మహోన్నత శిఖరం కూలిపోతోందని గమనించండి. చిత్రాల్ని దగ్గరగా చూడకూడదు. చూస్తే 'కంపే' మిగులుతుంది. ఇప్పుడు అసలు కథ. స్విస్ బంకుల్లో 700 మంది పెద్దల నల్లధనం అకౌంట్లు వున్నాయంటున్నారు. ఆ పేర్లు తెలిసినా ప్రభుత్వం మనకు చెప్పడం లేదని గింజుకుంటున్నారు. ఇదెంత ఉపకారమో వారికి అర్థం కావడం లేదని నా ఉద్దేశం.

ఈ 700 మందిలో మనం అనునిత్యం ఆరాధించే సినీ నటులు ఉండవచ్చు. మనం పేరు వింటేనే పీకలు కోసుకునే క్రికెట్ హీరోలు ఉండవచ్చు. సోనియా గాంధీ, రాజీవ్‌గాంధీ, శరద్‌పవార్ వంటి అభిమాన నాయకుల పేర్లు ఉండవచ్చు. మన ప్రియతమ మంత్రి రాజాగారి పేరూ ఉండవచ్చు. ఇంకా పారిశ్రామిక వేత్తలూ, నిజాయితీ గురించీ, నీతి గురించి మనకి అనునిత్యం బోధలు చేసే నీతిపరులుండవచ్చు. నిన్నటికి నిన్న ఎవరో దుర్మార్గుడు శరద్‌పవార్ చెంప పగలకొడితే చాలామంది అభిమానులు ధర్నా చేశారు. సుఖ్‌రాం జైలుకి వెళ్లినందుకు వారి నియోజకవర్గం 'మండీ'లో ఎందరో నిరసనలు చేశారు. ఈ స్విస్ ఖాతాలు వారి మనస్సుల్ని ఎంత గాయపరుస్తాయో ఊహించలేం.




ఇంకా మరోకొన్ని పేర్లు మనల్ని షాక్‌లో పడేసేవి ఉండవచ్చు. కొందరు డబ్బుని ప్రదర్శించరు. తలవొంచుకుని అనుభవిస్తారు. చాలా సంవత్సరాల కిందట విశాఖపట్నంలో ఒక బిచ్చగాడు ఉండేవాడు. బిచ్చమెత్తుకుంటున్న వాడిని నా చిన్నతనమంతా చూశాను. తీరా వాడు చచ్చిపోయాక కొన్నివేల రూపాయలు వాడిగోతాంలో దొరికాయి. తప్పు లేదు. సినీనటన, క్రికెట్ లాగే ముష్టివాడి వృత్తి. అందులో రాణించాడు. నలుగురూ ఇచ్చింది దాచుకున్నాడు. వాడికి పేదరికం దయనీయమైన స్థితికాదు. ఒక ముసుగు. ఉదారులయిన వితరణశీలురికి ఆ 'ముసుగు'ని గౌరవించడం పరలోకప్రాప్తికి తోవ.

ఏతావాతా –ఉదాహరణకి –కేవలం ఉదాహరణకి –స్విస్ బ్యాంకు అకౌంట్ దారుల్లో మనం దేవుడిలాగ కొలిచే సచిన్ టెండూల్కర్ పేరుందనుకోండి. మన మనసు ఎంత క్షోభిస్తుంది? 16 సంవత్సరాలు 'దేవుడు'లాగ దేశంలో చెల్లుబాటయిన సుఖ్‌రాం తీహార్‌లో రాజాగారి సరసన ఉన్నారంటే మనకెంత బాధ కలిగింది? అలాగే అమితాబ్ బచ్చన్ పేరుందనుకోండి. ఈ దేశంలో ఎంతమంది గుండెలు పగిలిపోతాయి? అందుకని కొన్ని నిజాలు మనకి తెలియకపోవడంలోనే సొగసు ఉంది. శ్రేయస్సు ఉంది. ఈ విషయం మన సోనియాకి తెలుసు. ప్రణబ్ ముఖర్జీకి తెలుసు. ఇంగ్లీషులో చెప్పనే చెప్పారు – Unheard melodies are sweeter అని. మొనాలిసా నవ్వులాగ, చిదంబర రహస్యం లాగ –స్విస్ బాంకుల్లో నల్లధనం ఖాతాదార్ల పేర్లు ఎప్పటికీ తెలియకుండానే ఉండిపోవాలి.

నిజం నిష్టూరంగా ఉంటుంది. ఒక్కొక్కప్పుడు గుండెల్ని పిండిచేస్తుంది. మనం మనస్సులో ప్రతిష్టించుకున్న దేవుళ్లని నేలమట్టం చేస్తుంది. నిజం కర్కశంగా ఉంటుంది. మన కలల్ని కాటువేస్తుంది. కంపుకొడుతుంది. మన కళ్లముందున్న పంచరంగుల స్వరూపాల్ని ధ్వంసం చేస్తుంది. మన అభిమానాన్ని వంచిస్తుంది. కనుక గవర్నమెంటు చెప్పే 'అబద్ధం'లో –అది నిజంగా అబద్ధమైనా మన శ్రేయస్సు ఉన్నదని గమనించాలి. మనకి మరో సుఖ్‌రాంలు వద్దు. స్విస్ బ్యాంకుల్లో వివరాలు తెలియని బాంకు అకౌంట్లే ముద్దు.

*(నవంబర్ 28, 2011)*

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

# (December 05,2011) Oka Edupu Katha ఒక 'ఏడుపు ' కథ

ప్రజాస్వామిక వ్యవస్థ బలం నాయకత్వం. ఒకనాటి నాయకత్వం ఆ నిజాన్ని నిరూపించింది. జవహర్‌లాల్ నెహ్రూ, వల్లభాయ్ పటేల్, మౌలానా అజాద్, గోవింద వల్లభ్‌పంత్, టంగుటూరి ప్రకాశం, భోగరాజు పట్టాభి సీతారామయ్య –యిలాగ. వీళ్లకి మద్దతుగా బ్రిటిష్ పాలన ఇచ్చిపోయిన మరొక గొప్ప వ్యవస్థ దన్నుగా నిలిచింది. అది సివిల్ సర్వీస్. ఒకనాటి జె.పి.ఎల్.గ్విన్, హెచ్.వి.ఆర్.అయ్యంగార్, కె.నట్వర్‌సింగ్, యశ్వంత్‌సిన్హా ఈ వ్యవస్థకి స్థాలీపులాక న్యాయంగా ఉదాహరణలు.

'మెజారిటీ' పెట్టుబడిగా ప్రజాస్వామిక వ్యవస్థ ఏనాడైతే దిగజారిందో పాలన రూపు రేఖలు మారిపోయాయి. ఆనాడు సామర్థ్యానికి మెజారిటీ దన్నుగా నిలిచింది. ఈనాడు మెజారిటీయే పదవికి దగ్గర తోవ అయింది. ఆ రోజుల్లో 'పదవి' కేవలం బాధ్యత. అలవోకగా తమ పదవులకి రాజీనామాలిచ్చిన లాల్ బహదూర్ వంటి నాయకులు ఈ నిజాన్ని నిరూపిస్తారు. ఇప్పుడు పదవులే లక్ష్యం. పదవులు అధికారానికి దగ్గర తోవ. డి.పి.యాదవ్, గాలిసోదరులు, యెద్యూరప్పలూ –మరెందరో ఇందుకు సాక్షులు. 'మెజారిటీ'కి మతం, కులం, డబ్బు, గూండాయిజం, ప్రాంతీయవాదం, ఇంకా కుటుంబ తత్వం –యివన్నీ సాధనాలయాయి. పైగా ఇవన్నీ తమ హక్కులుగా రెచ్చిపోవడం ఈనాటి గొప్పతనం, గొప్ప ఆయుధం.

రాజీవ్‌గాంధీని చంపిన శివరాసన్ ఒక అమర వీరుడుగా ఊరేగింపులు, అఫ్జల్‌గురు నిరపరాధి అంటూ అసెంబ్లీలలో రెచ్చిపోయిన మతవాదులు, తమిళనాడులో కొడుకులు, కూతుళ్లూ, మేనల్లుళ్లూ –పదవుల్ని పంచుకున్న ఓ ముసలి నాయకత్వం –ఇవన్నీ ఈనాటి ధోరణులకు మచ్చుతునకలు.

ఈ ధోరణులకు గొంతు విప్పే తొలి రోజుల్లో కూడా –ఇంకా ఇంకా ఈ వ్యవస్థకి, ఈ దేశ పాలనకి గొడుగుపట్టే పటిష్టమైన శ్రేణి ఉండేది. అది మళ్లీ ఐఏఎస్‌ల శ్రేణి.

ఆనాటి నాయకుల వెర్రితలల్ని తట్టుకుంటూనే పాలనని సజావుగా నడిపిన దక్షులయిన ఐఎఎస్‌లతో నాకు ప్రత్యక్ష పరిచయాలున్నాయి. బి.కె.రావు, వి.పి.రామారావు, నరేంద్ర లూథర్, బి.పి.ఆర్.విఠల్, సి.ఎస్.రావు ఇవి నమూనా ఉదాహరణలు. తన పదవి బలం, పదవి లక్ష్యం ఎరిగి, రాజకీయ వ్యవస్థని ఆసేతు హిమాచలం గడగడలాడించిన ఒక క్రమశిక్షణతో ఎన్నికలను నిర్వహించిన ఐఎఎస్ అధికారి టి.ఎన్.శేషన్‌ని ఈ తరం ఇప్పటికీ మరిచిపోదు. అంతకుముందూ, ఆ తర్వాతా ఆ పదవి గురించి కానీ, ఆ బాధ్యత గురించి కానీ మనం వినలేదు. ఇప్పుడిప్పుడు నాయకత్వమే డబ్బు యావ, పదవి యావలో పడిపోతున్న తరుణంలో వాళ్లకు తాళం వేసే శ్రేణులుగా ఐఎఎస్ మిగులుతోంది. ఇది అందర్నీ ఒకతాటిని కట్టే విమర్శ కాదు. ఇప్పుడు మనం వింటున్న అవినీతులూ –వాటిలో ఈనాటి ఐఎఎస్‌ల వాటాలూ –తల్లి రంకు తెలిసినప్పుడు కొడుకు మనస్సు ఛిద్రమయినట్టు మాతరానికి అనిపిస్తుంది. ఇంతకంటే క్రూరమైన ఉదాహరణ చెప్పలేను. కులం వెనుక కుత్సితాలకు పాల్పడిన ఐఎఎస్‌లు నాకు తెలుసు. డబ్బుకోసం పదవిని తాకట్టుపెట్టిన ఆఫీసర్ల బాగోతాలను మనం ప్రతిరోజూ

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

పేపర్లలో చూస్తున్నాం. గనుల కుంభకోణంలో 68.5 హెక్టార్ల భూమిని ఓబుళాపురంలో కట్టబెట్టిన ఓ మహిళా ఐఎఎస్ అధికారి ఏడుస్తూ జైలుకెళ్లిన బాగోతం మనం చూశాం. ఈ సంఘటన ఈ రాష్ట్రంలో చరిత్ర –మొదటి ఐఎఎస్ మహిళ జైలుకి వెళ్లడం. అంతకుముందే గనుల డైరెక్టర్ బి.వి.రాజగోపాల్ జైలుకి తరలారు. ఈ మధ్య ప్రభుత్వం నిర్వహించిన సభలో పాల్గొన్నాను. అన్ని విషయాలనూ ఆకళించుకునే కీలక స్థానంలో ఉన్న ఓ చిన్న ఉద్యోగి శ్రీలక్ష్మి అహంకారాన్ని, తన అనుయాయుల పట్ల నిరంకుశ ప్రవర్తననీ గురించీ చెప్పాడు. నేను చెప్పమనలేదు.

కంచే చేనుమేసిన సందర్భమిది. తన సామర్థ్యం, ఔదార్యం, ప్రజాహితానికి తన చిత్తశుద్ధి కారణంగా ప్రజలలో తలమానికంగా నిలిచిన ప్రతిభని 'మెజారిటీ'గా ఆనాటి రాజకీయ మేధావులు రాజ్యాంగంలో గుర్తులు పెట్టారు. కాని ఇవేవీ అక్కరలేని 'మొండి', దుర్మార్గపు మెజారిటీ ఇప్పుడు కొలబద్దగా నిలిచింది. ఇప్పుడు పదవుల్లోకి వచ్చిన నాయకులు 'అవినీతి'కి తలవొంచుకోవడం ఎప్పుడో మానేశారు. తాము నిర్దోషులమన్న బుకాయింపుని ఆయుధం చేసుకున్నారు.

శ్రీలక్ష్మి మంత్రి సబితకి తన పాపంలో వాటాను పంచారు. సబిత చేసిన పని సబవుకాకపోతే, తప్పయితే –ఎత్తి చూపాల్సిన ఓ గొప్ప సివిల్ సర్వీస్ అధికారి –అరెస్టయాక ఈ విషయాన్ని సాకుగా చెప్పడం –ఆఫీసర్లలో ఎంత రాజీతత్వం,ఎంత తలవొంచే తత్వం చోటుచేసుకున్నదో అర్థమయి –నీరసమూ, నిర్వేదమూ కలుగుతుంది. శ్రీలక్ష్మి, రాజగోపాల్ ఈ దేశానికి వెన్నెముకగా నిలిచే చరిత్రగల ఈ శ్రేణి ఎంత భ్రష్టుపట్టిందో చెప్తున్నారు. ఐఎఎస్‌ల ఏడుపు నేనెన్నడూ చూడలేదు. కన్నీరు స్త్రీ అబలత్వానికి చిహ్నంగా శలవు తీసుకుని చాలాకాలమైంది. ఉదాహరణ: ఇందిరాగాంధీ, జయలలిత, మాయావతి, మమతా బెనర్జీ, మార్గరెట్ థాచర్, గోల్డా మేయర్. కాగా కన్నీరు అవినీతికి చిహ్నం. బలహీనతకు పెట్టుబడి. నిజాయితీ ఎన్నడూ కన్నీరు పెట్టదు. ఉదాహరణ: కిరణ్ బేడీ, మదర్ థెరిస్సా ఎందరో దు:ఖార్తులను అక్కున చేర్చుకుంది. కాని ఆమె కన్నుల్లో ఎప్పుడూ కన్నీరు చూడలేదు. కరుణ వర్షిస్తుంది.

*(డిసెంబర్ 5, 2011)*



# (December 12,2011) Swecha స్వేచ్ఛ

'స్వేచ్ఛ' అన్నది చాలా దుర్మార్గమైన విషయం. వివరించడానికి వీలులేనిదీను. ఎంత స్వేచ్ఛ? దేనికన్న స్వేచ్ఛ? ఎంతవరకూ స్వేచ్ఛ? ఎందుకు స్వేచ్ఛ –యిలా బోలెడన్ని మీమాంసలు.

ప్రజాస్వామ్యంలో మరో దుర్మార్గం ఉంది. దాని పేరు స్వేచ్ఛ. ఎవరికి వారు ఎవరి కిష్టమయింది, ఎవరికి సాధ్యమయింది చేసుకోవచ్చును. ఎంతవరకు? మిన్ను విరిగి మీదపడే వరకూనా? మూతిపళ్లు రాలే వరకూనా? మీదపడే దురవస్థల్ని ఎలా అరికట్టాలో తెలీక గింజుకునే వరకూనా?

రాజకీయ నాయకుడు మాట్లాడితే –దాని అర్థం –అతని పదవి మేరకు, పార్టీ మేరకు, పాలన మేరకు, ఆ పార్టీ పరపతి మేరకు మారిపోతుంది. ఇది ప్రజాస్వామ్యంలో మరో దుర్మార్గం. "మీరంతా మంచిగా ఉండాలి బాబూ!" అని కాంగ్రెస్ నాయకుడు అన్నాడనుకోండి. "మా మంచిని మీరేం చెప్పనక్కరలేదు. ముందు మీ చిదంబరం మంచినీ, ఎస్.ఎం.కృష్ణ మంచినీ, సురేష్ కల్మాడీ మంచినీ చూసుకోండి" అని స్పందన వినిపిస్తుంది. బి.జె.పి. నాయకుడు అన్నాడనుకోండి. "ముందు మీ నరేంద్ర మోడీ జరిపించిన హత్యలూ, యెద్యూరప్ప అవినీతి సంగతి చూసుకోండి" అంటే తీరిపోతుంది.

బి.జె.పి. కోణంలో రాముని ప్రసక్తి మత ఛాందసుల ఆకతాయితనం. కాంగ్రెస్ కోణంలో రాముడి ప్రసక్తి వాచాలత్వం. కమ్యూనిస్టులకి ఆ గొడవ లేదు. మరో పార్టీల వాళ్లకి రామునితో ప్రమేయం లేదు.

దేశంలో అవినీతి గురించి మాట్లాడిన అన్నా హజారే మీదా, ఆయన అనుయాయుల మీదా అన్ని వేపులనుంచీ తలో రాయి పడింది. ఓ లాయర్ గారిని సుప్రీం కోర్టు ఆవరణలోనే చావగొట్టారు. ఒకావిడమీద అవినీతి కేసు బనాయించారు. మరొకాయన్ని గవర్నమెంటు ఉద్యోగం ముగ్గులోకి లాగారు. ఆయన ఆశించిన మంచిని అందరూ మరిచిపోయి –చెప్పే వ్యక్తిని భ్రష్టు పట్టించేదాకా ఆయా వర్గాలు నిద్రపోలేదు. 'కలిసి ఉండండి బాబూ' అని సత్యసాయి బాబాగారంటే హైదరాబాద్‌లో తిట్టారు. 'మమ్మల్ని విడిపోనియ్యండి బాబూ' అని హైదరాబాద్‌లో అంటే విశాఖలో రాళ్లేశారు. అఫ్జల్‌గురుని ఉరితీయడం న్యాయం అని కోర్టు ఆదేశిస్తే కాశ్మీర్‌లో కాలుదువ్వారు. రాజీవ్‌గాంధీ హంతకుల్ని శిక్షించడం సబబు అంటే తమిళనాడులో కత్తులు దూశారు.

అభిప్రాయాలకీ, దురభిప్రాయాలకీ, నమ్మకాలకీ, అపనమ్మకాలకీ, నీతికీ, ధర్మానికీ, నేరాలకీ, రంకుకీ, బొంకుకీ, అసభ్యానికీ, అవినీతికీ అన్నిటికీ పార్టీల, పదవుల, మంత్రుల, ప్రాంతాల వారి వారి ప్రయోజనాల, లక్ష్యాల, ఆదర్శాల ముసుగులున్నాయి.

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ
కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

ఆ మధ్య టీవీల్లో బొత్తిగా బొద్దుదని పిల్లలు బొత్తిగా వాళ్లకి అర్థంకాని పాటలకి శృంగార నృత్యాలు చేయడం, పెద్దలు వాటిని చూస్తూ మురిసిపోవడం చూశాను. కొందరు పెద్దలు బాధపడడమూ, ఈసడించుకోవడమూ విన్నాను. ఈ మధ్య అలాంటివి తారసపడలేదు. పిల్లల మీద క్రూరత్వం పనికిరాదు అన్న చట్టం వల్ల ఈ రకం కార్యక్రమాలు నిలిచిపోయాయని ఒకాయన చెప్పారు. ఎంత బాగుంది? అనిపించింది. పది రాగాల్ని గుర్తుపట్టే ఓ బిడ్డ ప్రతిభ, పది పద్యాల్ని చదివే ఓ పాప ధారణ, పది విషయాల గురించి అనర్గళంగా మాట్లాడగల ఓ పసివాడి ప్రతిభ ముచ్చటగా ఉంటాయి.

అయితే మీడియాకు స్వేచ్ఛ ఉంది. సినిమాలకు స్వేచ్ఛ ఉంది. 'డర్టీ సినిమా'లు తీయడం వారి హక్కు. ఈ దేశంలో పదవులకి స్వేచ్ఛ ఉంది. అవినీతికి స్వేచ్ఛ ఉంది. మన ఆర్థికమంత్రి చిదంబరంగారి అవినీతి గురించి ప్రజా ఉద్యమం రాదేం? బయటపడేవరకూ అది వ్యక్తి స్వేచ్ఛ. ఆ తరువాతే అవినీతి. అప్పటికి సుఖ్‌రాంగారి లాగ ఏ పదహారేళ్లో గడిచిపోతాయి. అప్పుడు వృద్ధాప్యం ఆదుకుంటుంది.

నేను కంప్యూటర్ వ్యసనపరుడిని. అది లేనిదే బ్రతకలేనంత అలవాటు. అందులో వెర్రితలలు, అనవసరంగా ఊసుపోని, ఆకతాయి, అర్థంలేని కువాదాలు, సెక్స్ వ్యవహారాలు –ఒకటేమిటి? విశృంఖలత్వం కనిపిస్తుంది. వ్యాపారాన్ని మాత్రమే లక్ష్యంగా పెట్టుకున్న అమెరికన్ గూగుల్ దీన్ని స్వేచ్ఛ అనవచ్చు. 'స్వేచ్ఛ' సాకుగా చెల్లే మన దేశం ఇందుకు భుజాలు ఎగరవేయవచ్చు. కాని చైనా గూగుల్ మీద కత్తికట్టింది. గూగుల్ తలవొంచింది. ఈ మధ్య టీవీలో ప్రతి ప్రోగ్రాం కింద ఒక ప్రకటన కనిపిస్తోంది. 'ఈ కార్యక్రమంలో ఏమైనా అభ్యంతరాలుంటే ఫలానా వారికి తెలియజేయండి' అని. ఒక్కరూ ఆ పని చేసి వుంటారనుకోను. మనది స్వేచ్ఛను అనుభవించే దేశం. అలాంటి ఫలానా నిజాయితీపరులు మనకి అనవసరం. ఇలాంటి విశృంఖలత్వం మంచిది కాదని ఈ మధ్య ఓ కాంగ్రెస్ మంత్రి కపిల్ సిబల్ అన్నారు. దురదృష్టం. ఆయన కాంగ్రెస్‌వాడు. పైగా మంత్రి. ఆయన మాటకు విలువ పోయింది. ఆ మాటకొస్తే ఈ దేశంలో అన్నా హజారేకే దిక్కులేదు. మన దేశంలో పత్రికా స్వేచ్ఛ మాధ్యమం హక్కు. ఇలా మాట్లాడడంలో ఏదైనా దురుద్ధేశం ఉన్నదేమో! లేకపోతే కాంగ్రెస్ వారెందుకు మాట్లాడతారు? ఉన్నా కాదనే ఆ కీర్తి వారికెందుకు దక్కాలి? ఇది ప్రస్థుతం నిజమే అయినా ఇప్పుడు తలవొంచితే రేపు మననెత్తిన ఎక్కుతారేమో! మా ఇంట్లో మేం 'అశుద్ధం' పోగుచేసుకుంటాం. మీకది అభ్యంతరంగా కనిపించవచ్చు. కాని మాకది అమృతభాండం. దీన్నే మేం 'స్వేచ్ఛ అంటాం. అంటూ చాలామంది మేధావులయిన మాధ్యమాల ప్రతినిధులు స్పందించారు.

ఎవరూ ఈ ఇంటర్నెట్ వికారాల గురించి స్పందించలేదు. ఈ దేశంలో –ఆ మాటకొస్తే ఏ దేశంలోనయినా –ఒక్క 'మతమే' ఆ పనిని నిర్దుష్టంగా చెయ్యగలిగింది. ఇస్లాం. గత ఇరవై యేళ్ళుగా కాశ్మీర్‌లో సినిమాలు నడవడం లేదు. ఈ మాధ్యమాల స్వేచ్ఛావాదులేమయారు? ఆఫ్ఘనిస్థాన్‌లో భామియన్ బుద్ధుడు లేడు. చెన్నై నగరంలో అన్ని ఇళ్లనూ పడగొట్టి, మేం మా ఆవరణలోనే నిర్మించుకున్న విఘ్నేశ్వరుడి మందిరాన్ని కూల్చి రోడ్డుల్ని విస్తరించిన ప్రభుత్వం –శాంథోమ్‌లో చర్చిముందు రోడ్డుని విస్తరించలేకపోయింది. ఎందుకు? అది మతానికి సంబంధించిన విషయం. మన రాముడు డెమొక్రాట్. ఆయన మీద అందరూ రాళ్లేయవచ్చు. దానికో పేరుంది. దాని పేరు స్వేచ్ఛ.

*(డిసెంబర్ 12, 2011)*




# (December 19,2011) Mulla Periyar Bhagotam 'ముల్ల' పెరియార్ భాగోతం

చెన్నైలో మాయింటికి ఎదురుగా ఓ ముసలాయన ఉండేవాడు. మా యింటి ఆవరణలో గన్నేరు, మందార పువ్వులు పూసేవి. ఉదయమే వచ్చి ఆ పువ్వులు కోసుకునేవాడు. ఎప్పుడైనా –మేం నిద్రలేవడం ఆలశ్యమయి, వీధి గేటు తీయడంలో జాప్యం జరిగితే కోపం తెచ్చుకునేవాడు –గేటు మూసేస్తారేమని. ఇల్లు మాది. పువ్వులు మావి. ఆయన మా ఇంటికి వచ్చి మా పువ్వులు కోసుకుంటున్నాడు. పెద్దాయన కదా అని మేం సరిపెట్టుకునేవాళ్లం. అయినా అదేదో తన హక్కులాగ కసురుకునేవాడు. పైగా "మీ ఆంధ్రా వాళ్లు ఎప్పుడూ ఇంతే. మాదేశం వచ్చి మమ్మల్ని దోచుకుంటున్నారు" అనేవాడు మా ముఖం మీదే. ఇదో విచిత్రమైన బుకాయింపు. మా ఇంటికి వచ్చి మా వస్తువుని తీసుకెళ్తూ మమ్మల్ని తిట్టడంలో అనౌచిత్యం ఏ కోశానా అతని మునస్సులో కదిలేదికాదు. మేమే తెల్లబోయి –ఈ విసుగుదలలో దురన్యాయం ఆయనకి తట్టలేదా అని ఆశ్చర్యపోయేవాళ్లం. కాని ఆయనకి ఏనాడూ అలా అనిపించలేదు. కారణం –ఇల్లు మాదయినా, పువ్వులు మా యింట్లో పూసినా –దేశం తమిళ దేశం. ఆయన తమిళుడు. అక్కడ పూసిన ఏదైనా వారిని అనుభవించనియ్యక పోవడం దోపిడీ అవుతుంది. ఇదీ ఆయన లాజిక్.

స్థూలంగా ముల్లై పెరియార్ డామ్ కథ ఇది. ఎప్పుడో 150 సంవత్సరాల కిందట బ్రిటిష్‌వారి హయాంలో అరేబియా సముద్రంలో కలిసిపోతున్న పెరియార్ నదిని దారి మళ్లించి తూర్పు వేపు తిప్పడం ద్వారా ఇప్పటి తమిళ దేశంలో ఉన్న వేలాది ఎకరాలకు నీరు దక్కుతుందని గ్రహించారు. చాలా కారణాలకి అది వెంటనే జరగలేదు. 116 సంవత్సరాల కిందట కేరళలో ఇద్దుకీ జిల్లాలో టెక్కడి కొండల మధ్య డామ్‌ని నిర్మించారు.

ఇందువల్ల పెద్ద ఉపకారం –తమిళనాడులో తేని, మధురై, శివగంగ,రామనాధపురం జిల్లాల రైతులకి. డామ్ కేరళలో ఉంది. వినియోగం తమిళనాడుకి. ఉపయోగం వీరిది కనుక ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వం డామ్ రక్షణ, నిర్వహణ బాధ్యతల్ని ఆనాటి తిరువాన్కూర్ మహారాజుకి ఒక అగ్రిమెంటు ద్వారా అప్పగించింది. ఇది 999 సంవత్సరాల ఒప్పందం. ఆ రోజుల్లో కేరళ తమిళనాడు అంటూ ప్రత్యేకంగా రాష్ట్రాలు లేవు. అంతా సంయుక్త మద్రాసు రాష్ట్రం. తర్వాత రాష్ట్రాలు ఏర్పడ్డాయి. డామ్ కేరళలోకి పోయింది. వినియోగం తమిళనాడుదయింది. ఇది మీ ఇంట్లో మా కుక్కపిల్లని సాకడం లాంటిది. కుక్కపిల్లంటే మాకు మోజు. బాధలు మీవి. ముద్దు మాది. దాని నిర్వహణ ఖర్చుల విషయంలో, చెల్లించే పన్నుల విషయంలో లావాదేవీలు జరుగుతున్నాయి. ఆ రోజుల్లో ఇంజనీర్లు అప్పటికి తెలిసిన పద్ధతుల్లో చెక్కసున్నం, రాయితో నిర్మించారు. పాతబడిన కారణంగా డామ్ పగుళ్లు చూపింది. సమస్యలు వస్తున్నాయి. ఎప్పటికప్పుడు రిపేర్లు జరుగుతున్నాయి. పైగా ఆ ప్రాంతం భూకంపాలకు ఆలవాలమయిన చోటు. 1988లో జూన్ 7న భూకంపం వచ్చింది. ఇందుకు కారణం ఈ డామ్, కొండల మధ్య నీటి వత్తిడి కారణం కావచ్చునన్న ఆలోచనలున్నాయి. 1979లో మోర్వీ డామ్ బద్దలయి 25 వేల మంది చచ్చిపోయిన పీడకలని ఎవరూ మరిచిపోలేదు. ఇదంతా ప్రజల భయానికి నేపథ్యం. డామ్ దెబ్బతింటుది కనుక ఆ రోజుల్లో నీటి మట్టం 142.2 అడుగుల నుంచి 136 అడుగులకి తగ్గించక తప్పలేదు. అయితే అందువల్ల 1960 –2005 మధ్య 40 వేల కోట్ల పంట నష్టం వచ్చిందని తమిళనాడు అంటోంది. బాబూ, ఈ డామ్ కూలితే కోట్లాదిమంది చచ్చిపోతారు. కొచ్చిన్ నగరమే మునిగిపోతుంది. వేరేగా కొత్త డామ్ కడతాం –అంటుంది కేరళ ప్రభుత్వం. మా వనరులు చెడిపోతాయి –అంటుంది తమిళనాడు ప్రభుత్వం. ఈ గొడవ సుప్రీం కోర్టులో మురుగుతోంది.




ఇప్పుడు మరో ఉపద్రవం వచ్చిపడింది. ఈ మధ్య 3–డి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ –ఇండియా సంయుక్త నిర్మాణంగా సోహన్ రాయ్ అనే ఆయన 'డామ్ 999' అనే చిత్రాన్ని నిర్మించాడు. 1975 చైనాలో బాంక్వియో డామ్ కూలి రెండున్నర లక్షలమంది చావుకి కారణమైన దుర్ఘటన దీనికి మాతృక. ఇది టవరింగ్ ఇన్ఫెర్నో,పొసైడెన్ అడ్వంచెర్, డాంటేస్ పీక్ లాగ ఒక కల్పిత గాథ. ఎంతో ఉత్కర్ష కలిగేటట్టు విధ్వంసాన్ని భయానకంగా, కళ్లకు కట్టేటట్టు చిత్రించాడు. సెన్సార్ బోర్డ్ దీనికి అనుమతినిచ్చింది. ఈ సినిమాని ఇంకా ఎవరూ చూడలేదు. నలుగురికీ తెలిసిందల్లా 999 అన్న సూచన మాత్రమే. అంటే ముల్ల పెరియార్ డామ్ ఒప్పందం. అది చాలు ఇదిగో పులి అంటే అదిగో తోక అనడానికి. తమిళులలో గొప్ప ఐకమత్యం ఉంది. తమకి సంబంధించిన ఏ సమస్య వచ్చినా అన్ని పార్టీలూ ఏకమయిపోతాయి. ఇది ప్రాంతీయ దురభిమానం కల్పించిన గొప్ప సుగుణం. మొన్న రాజీవ్ గాంధీ హంతకుల్ని విడిచిపెట్టాలని కరుణానిధిగారూ, వారి పార్టీ అంది. తద్వారా వారికి పరపతి పెరిగితే? జయలలితగారు వెనక్కి తగ్గలేదు. ఏకంగా శాసనసభే హంతకులను ఉరితీయకూడదని తీర్మానం చేసింది!

ప్రతిపక్షం స్థాయిని కూడా పోగొట్టుకున్న డి.ఎం.కె. కేరళ మీద కత్తులు దూసింది. ప్రజల సానుభూతికి ఇది దగ్గర తోవ. డామ్ మాట దేవుడెరుగు. ఇప్పుడీ ఉద్యమం వల్ల ప్రతిపక్షం మార్కులు కొట్టేస్తే! మేడమ్‌గారూ కత్తులు దూశారు. రాష్ట్రంలో డిఎంకె, డిఎండికె, రెండు కమ్యూనిస్టు పార్టీలూ, ఎంఎంకె, ఆర్‌పిఐ –అన్ని పార్టీలూ ఏకమయాయి. ఇది అద్భుతమైన ఐకమత్యం. ప్రాంతీయ దురభిమానం ప్రజలలో పరపతికి దగ్గర తోవ అని నమ్మిన రాజకీయాలూ, వారి నమ్మకాన్ని నిజం చేసే ప్రజలూ ఈ అరాచకానికి పెట్టుబడి. అలనాడు –ఇలాంటి హిందీ వ్యతిరేక ఉద్యమమే ప్రజల ఆశీర్వాదాన్ని ద్రవిడ పార్టీలకిచ్చింది. ఇప్పటికీ ద్రవిడ పార్టీలే రాజ్యమేలుతున్నాయి. ఇది చరిత్ర. త్వరలో ఎన్నికలు కేరళలోనూ రాబోతున్నాయి. డామ్ కూలుతుందో లేదో దేవుడి కెరుక. ఇప్పుడు తమిళనాడుని ఎదిరించకపోతే తమ ఆబోరు దక్కదు. పైగా పాపులారిటీకి ఇది దగ్గర తోవ. నా బాధ ఇది కాదు. మొన్నటికి మొన్న మన అన్నగారు –ఎన్టీరామారావుగారు –తనని పెంచి పెద్ద చేసిన రాష్ట్రానికి కృతజ్ఞతగా ఉదారంగా తెలుగుగంగని తమిళ రాష్ట్రానికి సమర్పించారు. 116 సంవత్సరాల క్రితం బ్రిటిష్ ప్రభుత్వమూ అలాంటి పనేచేసింది. రేపు –అంటే మరో పాతిక సంవత్సరాలకి మన పరిస్థితీ కేరళ తంతులోనే ఉంటుందని! డామ్ కూలితే కోట్లాదిమందికి ప్రాణ నష్టమని కేరళ భయం. తమకి వనరులు దెబ్బతింటాయని తమిళనాడు బాధ. కేరళలో కాంగ్రెస్ ప్రభుత్వం. తమిళనాడులో కాంగ్రెసేతర ప్రభుత్వం. మనదేశంలో ఎప్పుడూ మైనారిటీదలే పై చెయ్యి. మాయావతి, మమతా బెనర్జీ, జయలలిత –కేంద్రాన్ని ముక్కుపిండి తమ ఆటని చెల్లించుకోవడమే ఇందుకు నిదర్శనం. కేంద్రం, సుప్రీం కోర్టూ, నిపుణుల సంఘాలూ జుత్తులు పీక్కొంటున్నాయి. ఎవరు ఏం చేసినా మా ఎదురింటాయనదే అంతిమ విజయం –నాకు తెలుసు.

*(డిసెంబర్ 19, 2011)*

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

# (December 26,2011) Vyakti Vyavastha వ్యక్తి – వ్యవస్థ

చాలా కాలంగా చాలామంది రాజకీయ నాయకుల మనస్సుల్లో ఉన్న భావమే నాకూ ఉండేది. సమాజంలో ఎంత అవినీతి పేరుకున్నా, దాని నిర్మూలన ఎంత అవసరమయినా–దేశంలో ఓ వ్యక్తి చేసే ఉద్యమమో, చెప్పే నినాదమో దాన్ని నిర్ణయించాలా? 543మంది సభ్యులున్న ప్రజా ప్రతినిధుల సభకు ఆ దక్షత లేదా? ఓ వ్యక్తి చేసే ఉద్యమం పాలక వ్యవస్థని బ్లాక్ మెయిల్ చెయ్యడం సబబా? యిలాంటి ఆలోచనలకు నా మనస్సు కూడా ఓటు వేసింది.

అయితే రాజకీయ నాయకులే యిలాంటి మాటలంటున్నారని మనం గమనించాలి – మీరూ నేనూ కాదు. మీరూ నేనూ ఏకీభవించే రీతిగా, మనకూ సబబనిపించే రీతిగా 'రాజకీయ నాయకులు' యీ మాటలంటున్నారు. ఇందులో రాజకీయమైన మెలిక ఉంది. అన్నా హజారే అవినీతి పరుడన్నా, కిరణ్ బేడీ డబ్బు స్వాహా చేసిందన్నా, కేజ్రీవాల్ గవర్నమెంటు ఉద్యోగాన్ని దుర్వినియోగం చేశాడన్నా– ఆ విధంగా ఓ వ్యక్తి ధ్వజం ఎత్తిన 'అవినీతి' మీద కాక, ఆ వ్యక్తి మీద బురద జల్లే పనికి మన మద్దతు చేకూరుతుంది.

ఈ దేశంలో జరపాల్సిన అన్ని సహేతుకమైన మార్పులకీ రాజకీయమైన ప్రయోజనాలకు భంగం కలిగితే ఏ మాత్రం జరగవన్న నిజాన్ని గత 64 సంవత్సరాలుగా మనం చూస్తున్నాం. స్త్రీలను నెత్తిన పెట్టుకుని పూజించాలని లల్లూగారు బుంగమూతి పెట్టుకుని భావిస్తారు. వంటింట్లో ఉన్న వారి భార్యని ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చోపెట్టి వెనుక నుంచి వారే సారథ్యం చేస్తారు. మరి పార్లమెంటులో మహిళల ప్రాతినిధ్యం బిల్లుకి మద్దతు పలకరేం? ఆడవాళ్లను అడ్డం పెట్టుకుని తమ సారధ్యం సాగే నేపథ్యంలో 'మహిళ'లకు సమాన ప్రతిపత్తి అనే నినాదం వరకూ గొడవ లేదు. కాని పూర్తిగా వారి చేతికే కళ్లెం యివ్వాలంటే కుదరదు. ఇది 64 సంవత్సరాలలో నిరూపణ అయిన సత్యం. సరే. ఈ అవినీతి నిర్మూలనకు లోక్‌పాల్ బిల్లును యూపిఏ ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టింది. మంచిదే. అందులో లోటుపాట్లున్నాయని అన్నా హజారే వర్గం అంటోంది. చర్చించాల్సిందే. కాని నిన్న ఏం జరిగింది? 'అవినీతి' మాట పక్కన పారేసి– లోక్‌పాల్ కమిటీలో వెనుకబడిన వారికీ, మైనారిటీలకూ ప్రాతినిధ్యం కావాలని అంతా విరుచుకుపడ్డారు. ఇప్పటికే అన్ని రంగాలలో 27 శాతం రిజర్వేషన్ ఉన్నది. అందులో మళ్లీd రిజర్వేషన్ చెల్లదని తీర్పు. తీరా 8మంది సభ్యులున్న కమిటీలో ఇందరికి రిజర్వేషన్ ఎలా సాధ్యం? మన దేశంలో నలుగురైదుగురు రాష్ట్రపతులూ, ఉప రాష్ట్రపతులూ, ముఖ్యమంత్రులూ, గవర్నర్లూ, కేంద్ర మంత్రులూ, ప్రధాన ఎన్నికల అధికారులూ – యీ రిజర్వేషన్ల ప్రసక్తి లేకుండానే పదవుల్లో ఉన్నారు. మతాతీత, వర్గాతీత వ్యవస్థకి ఇంతకన్న నిదర్శనం ఏం కావాలి? ఎవరో నిన్న టీవీ ప్రోగ్రాంలో అంటున్నారు. వీరంతా కోరినట్టు– రిజర్వేషన్లు కల్పిస్తే 8 మంది సభ్యుల కమిటీలో .38శాతం రిజర్వేషన్ ఇవ్వాలట! ఎలా? సమాజంలో అవినీతిని నిర్మూలించే గొప్ప ఆయుధం కదా లోక్‌పాల్ చట్టం? ఎక్కువ అన్యాయం వెనుకబడిన వారికీ, మైనారిటీలకూ జరుగుతోంది కదా? కనుక అవినీతిని నిర్మూలించే కమిటీని బలపర్చడానికి బదులు– యింకా ఏర్పడకుండానే ఆ కమిటీ నిర్వహణ మీద అపనమ్మకం వ్యక్తం చెయ్యడం కదా ఈ పని? అసలు 'అవినీతి' గొడవ మరిచిపోయి, రిజర్వేషన్ల గొడవతో నిన్నటి పార్లమెంటులో నాయకుల వీరంగం దొడ్డితోవన ఈ లోక్‌పాల్ బిల్లును అటకెక్కించే కుట్రగా అర్థమౌతోంది.




ఇప్పుడు నాకు నమ్మకం కుదిరింది. ఏదైనా సామాజికమైన మంచిపని జరగాలంటే – అది రాజకీయ నాయకుల వల్ల జరగదు. ఒక 'నీతిపరుడి' ఉద్యమం వల్ల మాత్రమే జరుగుతుందని, ఇందుకు నిన్నటి లిబియా, ఈజిప్టు, మొన్నటి అన్నా హజారే ఉద్యమం యిందుకు నిదర్శనం.

రాజకీయ నాయకులే, పార్లమెంటే న్యాయంగా ఈ పని చెయ్యాలి. అర్హత, దక్షత ఆ సభదే. కానీ నాయకుల నిర్వాకం నిన్న చూశాం కదా?

అలనాడు ఒక్క మహాత్మాగాంధీ అహింసాయుతమైన ఉద్యమమే ఈ దేశానికి స్వాతంత్ర్యాన్ని తెచ్చి పెట్టింది. కానీ రాజకీయ నాయకత్వం ఏం చేసింది? ఈ దేశాన్ని మూడుముక్కలు చేసింది. లక్షలాదిమంది చావుకి కారణమయింది. ఇప్పటికీ ఆ పీడకల నుంచి ఈ దేశం తేరుకోలేదు. ప్రపంచ చరిత్రలో మంచికీ, చెడుకీ వెనుక ఒకే ఒక వ్యక్తి ప్రమేయమే కనిపిస్తుంది. హిట్లర్, స్టాలిన్, నెహ్రూ, నాజర్, మండేలా. నిజాయితీకీ, నిరంకుశత్వానికీ వ్యక్తి ఆదర్శమే పెట్టుబడి. స్వలాభం చూసుకునే ప్రతినిదుల వ్యవస్థ కప్పల తక్కిడె. ఏకాభిప్రాయానికి ఆస్కారమే ఉండదు. ఈ దేశంలో హిందూ దేశంలో 'దేవుడి' విషయంలోనే ఏకాభిప్రాయం లేదు! ఒకరికి రాముడు, మరొకరికి శివుడు, మరొకరికి శక్తి, ఇంకొకరికి బాబా, ఇంకా మరిడమ్మ, నూకాలమ్మ, కరుమారియమ్మ, కంకాణమ్మ–మీ యిష్టం. సామూహిక విశ్వాసం వెర్రితలలు వేస్తుంది. సామూహిక చైతన్యం ఏకీకృతమైన కృషి ద్వారానే రూపుదిద్దుకుంటుంది. అన్నార్తుడికి అన్నం పెట్టడానికి 'మెజారిటీ' మద్దతు అక్కర్లేదు. పేద వారి ఆకలి తీర్చడానికి బిల్లు పెట్టమనండి. వెయ్యి రకాలైన అభిప్రాయాలు, అభ్యంతరాలు తలెత్తుతాయి. అందరికీ ఉపయోగపడే మంచి ఒక ఉద్యమం. అది వ్యక్తి ద్వారానే సాధ్యం. ఉదాహరణ: వివేకానంద, జీసస్, మహాత్ముడు, నెల్సన్ మండేలా, మార్టిన్ లూథర్‌కింగ్. బ్రిటిష్ పార్లమెంటు కాదు, అమెరికా సెనేటు కాదు, ఇండియా పార్లమెంటు కాదు. జెరూసలేం ప్రజాసంఘం కాదు. వ్యవస్థ 'మెజారిటీ' వలలో చిక్కుకున్న స్వప్రయోజనాల కూటమి. వ్యక్తి స్వప్రయోజనాలకు విడాకులిచ్చిన ఉద్యమం. అతను సబర్మతిలో ఉంటాడు. మాలేగాంలో ఉంటాడు. బేలూర్‌లో ఉంటాడు. జెరూసలేంలో ఉంటాడు. పార్లమెంటుల్లో కాదు. నాకింకా ఒక వ్యక్తి పాలక వ్యవస్థని నిలదీయడం మీద అపనమ్మకం ఉంది. కానీ ఈ దేశానికి మరో గతిలేదు. అది ఈ దేశపు నాయకుల నిర్వాకం.

***(డిసెంబర్ 26, 2011)***